Damage Book

UNIVERSAL
LIBRARY
OU_204369
UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82 Accession No. T382

R17K

Author రామిరెడ్డి, దువ్వూరి.

Title కవి కోకిల గ్రంథావళి.

This book should be returned on or before the date last marked below

[illegible]ల గ్రంథావళి

3: నాటకములు.

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
292, ఎస్ప్లనేడ్, మద్రాసు.

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి.

వెల
౧—౦—౦.

ప్రభాత ముద్రణాలయము,
నెల్లూరు.

కృతజ్ఞత

బాల్యంబుననె కావ్యవనవీథి విహరించి
కవికోకిలాలాప గతులు మెచ్చి;
సౌందర్యభావనాశబలిత చిత్తుఁడై
స్వర్గతుల్య మొనర్చె స్వభవనమును;
కలిమికి సహజమౌ గర్వంబువిడి మిత్ర
బృందమ్మ్యాత్మీయతక నెక్కుఁ గలిగె;
అర్థికి గౌరవహాని దోఁపింపని
దానశిల్పములోని తత్త్వమెఱిఁగె;

మాటలకుఁ జేఁతలకు మాఱుపాటులేమి
వఱలె నీయందు రేబాలవంశచంద్ర
యనుచు నెల్లరుఁ బొగడంగ నలరినావు
రమ్యగుణమూర్తి శ్రీసుబ్బరామిరెడ్డి!

శక్తికిఁ గావ్యకళా సం
సక్తికి మొగదారులైన మనవంటి నృపుల్
ఇత్తఱి నరుదేయైనను
బొత్తిగ విడిపోవు మనలఁ బూర్వాభిరుచుల్.

కొండవీటి రాజ్యేందిర క్రుంకిపోయె
నకట! దురదృష్టవశమున, నైననేమి?
నేఁడు సిరిగల ప్రతి రెడ్డివీడు కూడ
పండితులపాలిటికి " పిల్లకొండవీడు. "

"జనకుని స్మృత్యర్థము నే
ననుకొంటిని నీదుకృతుల నచ్చొత్తింపన్
అనుమానమేల? నీవా
నన వోయీ" యన్నతీరు "లా" ననిపించెన్.

నీ రసికత, నీమైత్రియు,
నీరమ్యకళానుభూతి నిరతము శిల్ప
ప్రేరకమై నవకవితో
ద్ధారకమై పెంపు చెందుతన్ ప్రియమిత్రా!

నేను నీవును సకలంబు నిశ్చయముగఁ
గాలవాహిని నొకనాఁడు గలయఁగలము;
కాని, రమ్యమైన యపూర్వ కావ్యసృష్టి
అమరతం గూర్చుఁ గర్తకు నాశ్రితునకు!

సిరికిందగిన వదాన్యత,
పరువము, లలితాభిరుచుల బలిసిన భావ
స్ఫురణము, భోగప్రీతియు
విరిసెను నీబ్రతుకుఁ దీవ విరులటు మిత్రా.

ధనముండుటె పరిపాటియె;
ధనమే సర్వంబుగాదు; ధనముండియు స
ద్వినియోగబుద్ధి గలిగిన
మనుజునిభాగ్యంబె లోకమాన్యతఁ గాంచున్.

రమయు వాణియుఁ బక్షపాతమువహించి
కూర్చి రర్థంబు విద్యయుఁ గొదవలేక;
అట్టియొద్దిక యందఱ కబ్బదోయి,
జీవితార్థంబు నిరుకేలఁ జిక్కఁబట్టు!

విన్నపము

ఇంతవఱకు నేను రచించిన నాటకములు రచనాకాల క్రమానుసారముగ ఈ సంపుటమున సమకూర్పఁబడినవి. చిత్రగుప్త సంవత్సరాది సంచికలో ప్రకటింపబడిన "కాంగ్రెస్ వాలా" అను ఏకాంక నాటకముగూడ ఇందు పునర్ముద్రణము గావింపఁబడినది.

మోపూరు నివాసులును కళోపాసకులును కవితా రసజ్ఞులును నాకు మిత్రులును అగు

శ్రీయుత రేబాల సుబ్బరామిరెడ్డిగారు

ఒకనాఁడు ప్రస్తావ వశమున నిట్లనిరి:

"నీగ్రంథములు చెల్లా చెదరుగ నున్నవి. మాసపత్రికలలో ప్రకటింపబడిన కొన్ని కావ్యములు గ్రంథరూపమున వెలువడనే లేదు. తుదకు నీపుస్తకములు ఎచ్చట దొరకునోయను సంగతికూడ చాలమందికి తెలియదు. నీకృతులన్నియు ఒకే సంపుటముగ వచ్చెత్తించిన బాగుగనుండును. నీ విష్టపడుదువేని నేనందుకు వలసిన యేర్పాటు కావించెదను."

శ్రీయుతులు రేబాల సుబ్బరామిరెడ్డిగారు,

కీ. శే రేబాల సుబ్బారెడ్డిగారు.

సుబ్బరామిరెడ్డిగారి కవితా ప్రియత్వము, ఔదార్యము నన్ను ముగ్ధుని గావించినవి. అర్థింపఁబడియు కవులకు సహాయము చేయు కవితాపోషకులు అరుదైన ఈకాలమున సుబ్బరామిరెడ్డిగారి ఈయయాచిత సాహాయ్యము ప్రశంసా పాత్రమని వేఱుగ చెప్పనక్కఱలేదు. నేను వారికెంతయు కృతజ్ఞుఁడను.

సుబ్బరామిరెడ్డిగారి జనకులు

కీ. శే. రేబాల సుబ్బారెడ్డిగారి స్మృత్యర్థము

ఈ కవికోకిల గ్రంథావళి యచ్చొత్తింపఁబడినది.

నేను నెల్లూరిలోనుండి అచ్చుప్రూపులు స్వయముగ దిద్దికొన వీలులేకయున్నందున నామిత్రులును, మృదుమధుర కవితారచయితలునగు గోనుగుంట పున్నయ్యగారును, చిరకాలమిత్రులును "హాలిక" లాంఛన విఖ్యాతులును ప్రఖ్యాత ముద్రణాలయాధికారులును అగు మరుపూరు కోదండరామ రెడ్డిగారును ప్రూపులుదిద్ది శ్రద్ధతో మిత్రకార్యము నెరవేర్చిరి. వారిసాహాయ్యమునకు నేనెంతయు కృతజ్ఞుడను.

నెల్లూరు,
30—5—1936

దువ్వూరి రామిరెడ్డి.

శుద్ధిపత్రము.

సీతావనవాసము

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
3	8	క్ష్వ్యావేశమున్నక్షత్ర	క్ష్వ్యావేశమున్నక్షత్ర
5	5	రాక్షసులకు	రాక్షసకుల
10	9	కింశుకముబూత	కింశుకముపూత
10	12	పిశాళి	పిసాళి
21	1	నిషురమైన	నిష్ఠురమైన
25	12	జారణ	జాఱణ
27	6	మహాప్రభో	మహాప్రభూ,
35	4	మించటకు	మించిటకు
58	2	సహోదమునిగ	సహోదరినిగ
,,	4	వీరనాయకులాలా,	వీరనాయకులారా,
63	2	సంపర్గ	సంసర్గ
89	6	కొచుండినట్లు	కొనుచుండినట్లు
,,	23	వీక్షిం	వీక్షించి
92	3	నీముదు	నీముద్దు
,,	18	ముద్దుకూ	ముద్దుకూన
94	16	నాముదు	నాముద్దు
101	22	వినరై	వినరైరి.
103	21	యశ్బమేధ	యశ్వమేధ
104	5	యగుట	యగునఁట!

కుంభరాణా

129	3	ర్వారాంగ	ర్వాంగార
132	16	ఔంక:	అర్చ:
136	15	బిచ్చకత్తెచు.	బిచ్చకత్తెను
142	12	ప్రాణవల్లభుఁడవు.	ప్రాణవల్లభుఁడవు గాను.
,,	14	భూయిష్టపుయి	భూయిష్ఠమయి
147	10	గారవంబు	గావరంబు
156	11	ఇచట;	ఇచట
179	15	అపాయకములే!	అపాయకరములే
187	8	కబరారని	కబర్దారని
196	19	మామంత్రి	మీమంత్రి
199	6	మాకుగల	మాకుల
200	2	మమ్ము	మిమ్ము
,,	22	యాధీనము	యధీనము
201	24	చిహ్నమునకు	చిహ్నమును
210	10	నెడసినట్లు	నెడసినట్టి

మాధవవిజయము

224	8	పిన్నయొవఁడు	పిన్నయొకఁడు
227	4	గుఱ్ఱవు	గుఱ్ఱపు
,,	15	తృణమై	తృణమైన
228	3	యిల్లటము	ఇల్లటము
230	21	ఎగుతాళి	ఎగతాళి ప
233	2	కూజాపైని	మేజాపైని
,,	18	శ్రమిూచునట్లు	శమించునట్లు

247	12	తెలియును	తెలియవలయును.
263	21	యీయింట	మీయింట
271	4	నీతాపనీరము	నీవాపనీరము
273	21	కెన్నగఁడు	కెన్నఁడు
,,	22	నాశేల	నాకేల
282	10	ఆత్మనాశనమైన	ఆత్మనాశకమైన

కాంగ్రేస్‌వాలా

312	13	బంగళాలాగే	బంగళాల్లాగే
312	21	కూసుర్కోండిమి.	కూర్చోండి.
331	14	నదాని	సవాని
333	1	మతి	జట్కాబండిని పిలువుమతి.
333	1	జట్కావాళ్ళను	నర: జట్కావాళ్ళను

సీతావనవాసము.

ప్రథమ ముద్రణము 1921

సీతావనవాసము

నాంది

శ్రీవైదేహియుఁ బుత్త్రికుల్ కుశలవుల్
సేవింప, సౌమిత్రి భ
క్త్యావేశమ్మునఁ ఛత్త్రమెత్త, నిరుచా
యన్ నిల్చి వీచోపులన్
వైవంగా లవణారియున్ భరతుఁడున్
భద్రాసనాసీనుఁడై
యీవిశ్వంబును నేలు రాముఁడిడు మీ
కిష్టాయురారోగ్యముల్!

ప్రథమాంకము

ప్రథమ స్థలము: లంక

[శూర్పణఖ ప్రవేశము.]

శూర్ప: ఆహా! కాలవైషమ్యము! దానవేశ్వరుఁడు పేరోలగం బుండు సభామంటపమున సాలెపురువులు గూళు లల్లుచున్నవి. సకల సామంత మహీకాంతుల కైవారములకు మాఱు గుడ్లగూబల కర్ణకఠోరములగు నిరావములు వినవచ్చుచున్నవి. ఔరా, రాజధాని దుస్థితి!

సుర సిద్ధ సాధ్య కిన్నర యక్ష గంధర్వ
రాజులకును డాయరాని లంక!
పన్నగాశనపక్ష పరిభవ సంపాది
యంభోధి పరిఖయై యలరు లంక!
మేరుకోదండు దుర్వార శౌర్యంబైనఁ
గరగించు వీరులఁ గన్న లంక!
అభ్రంకషోత్తుంగ హర్మ్యగోపుర వైభ
వముల నాకము సిగ్గుపఱచు లంక!

ప్రళయ రుద్రోగ్ర చండ విభ్రాజ తేజుఁ
డైన దశకంఠునకు రాజధాని లంక!
నేఁటి కెట్లాయె—నక్కటా! నేలమట్ట
మాయె దుష్టదైవము మాకు చామయాట.

ఔరా! రాక్షసులకు వినాశము! సురేంద్రుని పరాభవించిన మేఘనాదుండు పడసె. అవార్య శౌర్యబలసాహసుండు కుంభకర్ణుండు కాల వశంవదుఁడయ్యె. మాల్యవదాది రాక్షసవీరనాయకులు శరతల్పము లలంకరించిరి. చతుర్దశభువన విద్రావణుండు రావణుండు పరాభూత భుజవీర్యుండై రణక్రోడశాయి యయ్యె.

కైలాసేశ్వరు వెండికొండ వడఁకంగాఁ జేత నూఁగించి, ది
క్పాలశ్రేణికి నాజ్ఞవెట్టి, మునులం గారించి, నైలింప క
న్యాళిం దెచ్చి నవగ్రహంబులను గారాగారమం దుంచి శౌ
ర్యాలంబంబుగ రాజ్యమేలిన సురేంద్రారాతియుం గూలెఁగా!

వీరవతంసులకు విరోధి సైన్యంబులఁ జీల్చి చెండాడి విజయలక్ష్మిని వరించుటయో లేక యాత్మోచిత మరణంబునొంది స్వర్గభోగలాలసు లగుటయో ధర్మముగాని, రాక్షసయోధులకు ఇంతటి యధఃపతనము తగునా!

మరణము నైజమెల్లర, కమానుష దోర్బల సాహసాంకు లా
సుర నికరంబు, లట్టికి శూరులు వోయెడి త్రోవలెన్న గా
ని, రణమునన్ నరాశనుల నిశ్చల యోధవతంసులట్లు వా
నరులు నరుల్ జయించిరన నా కుడయించెడి లజ్జవెల్లుగన్.

దండకాటవి రాముఁడు నా ముక్కు చెవులు గోయింపఁ గినిసి రావణునిం బురికొల్పి సీతఁ జెఱఁబెట్టించితిననియుఁ దన్మూలంబున రాక్షస కుల వినాశం బయ్యెననియు దైత్యాంగనలు నన్ను దూఱుచుందురు. ఆ యంగ వైకల్య కథావిధాన మొకవంకయు అసురకులవినాశ సంతాపవహ్ని శిఖ లొకవంకయు నా చిత్తము దరికొల్పుచున్నది. దైత్యకుల క్షయమునకు నేనా హేతుభూతురాలను? — కాను; కాను; ముమ్మాటికిం గాను. సురారికుల కలంకుఁడు ప్రతిపక్షభూషణుఁడు స్వపక్షదూషణుఁడు ఆవిభీషణుఁడే కారకుఁడు ఆ రాక్షసాధముఁడే నిజరాజ్య రహస్యంబులఁ బరుల కెఱింగించి కులాధఃపాతంబునకుఁ దోడ్పడియె. ఓరీ విభీషణా, నీయొక్కని యవివేకంబున దైతేయసముదాయమున కంతటికి నాపద వాటిల్లెఁగదా. నీ మాహాత్మ్యమునఁ గదా లంకాపురలక్ష్మి భగ్నావశేషగోపురమిషంబునఁ జేతులు బారచాఁపి రణనిహత భర్తృకా విలాపంబుల వాపోవుచున్నది. ఛీ! ఆ దైత్యకులాంగారుని నామమేల స్మరించితిని? అట్టి పంద పవిత్రమగు మాకులమున జన్మించి వంశ పారంపర్యాగత గౌరవంబు నేల నేలపాలొనరించె?

అరిపాదంబులు పట్టి దాసుఁడయి, దైత్యవ్రాతముం బోరిలోఁ
బరిమార్పించి, సహోదరాదులమృతిన్ భాగ్యంబుగా నెంచు ము
ష్కరుఁడై నేఁడు విభీషణాసురుఁడు లంకారాజ్య మేలంగ సి
గ్గఱి యిచ్చో నివసింపఁగావలెనె యింక న్నీచపుం గూటికిన్?

వనంబునఁ గందమూలఫలాదులు లేవా యీపాడుపొట్ట నించికొనుటకు? ఆఁడుదాన నయ్యు రాక్షసకులంబున దశకంఠునకు సోదరినై జనియింప లేదా? [ఉలిక్కిపడి యాకసమువంకఁ జూచి] ఆహా! రణనిహతులైన దైతేయవీరులు నాకన్నులకుఁ బొడకట్టుచున్నారు. పోటుగంటులనుండి దొరంగు ఒక్కొక రక్తధారమును ఒక్కొక నాలుకగ ప్రతిహింసా పరాయణత్వ

ము నుపదేశించుచున్నది.

మేఘనాదాది మహావీరులారా, నా ప్రతిజ్ఞ వినుఁడు:

మీరల్ రాక్షస వీరయోధులు బలామేయ ప్రభావైక దు
ర్వారుల్ శూరులు నే నరాంగనకునై స్వర్గం బధిష్ఠించి యు
న్నారో, భూధరణీ కుమారి యవమానం బొంది శోకార్తయై
ఘోరారణ్యములం దనాథయయి యుగ్రంబొందఁ గల్పించెదన్.

[ఆశ్చర్యముతో] ఏమిది! వారెంతలో అదృశ్యులైరి! ఇదియేమి మనోభ్రాంతియా? స్వప్నమా? లేక సత్యమైయుండునా? నన్నుఁ బ్రతిహింసకుఁ బురికొల్పుటకై పితృలోకవాసులు నాకు దర్శన మిచ్చియుందురు కాఁబోలు!

రాముని మోసగించి తనచేతనే సీతను గాంతారముల ద్రోయించి ఆ నృపతి గోడుగోడని దుఃఖింప నేను పకపక నగ నిలింప లోకవాసులగు మా బంధుసందోహము 'వహవా! శూర్పణఖా!' యని నన్నభినందించునప్పుడు గదా నాజన్మము కృతార్థమగుట! నేఁడే నే నయోధ్యకుం బోయి పూర్వాలోచిత కల్పనాక్రమంబున సమయమువేచి పగతీర్చుకొనియెద !

[నిష్క్రమించును.]

ద్వితీయ స్థలము: వనము.

[సీత, ఊర్మిళ విహరించుచుందురు.]

సీత: గృహారామ పరిసరము అతిక్రమించి నిసర్గ రమణీయమగు నీ వనోపాంత దేశమునకు వచ్చితిమి.

ఊర్మి: అక్కా, చాల అలసితివని మున్నే హెచ్చరించితినిగద.

కడప దిగలేని నిర్భర గర్భవతివి,
చారు సుమకోమలవు, ప్రయాసమున కోర్వ,
వెంత చెప్పిన వినక వనాంతరమున
కింత దవ్వుల నడువంగ నిగురుబోఁడి ?

సీత: వనాలోకన కుతూహలము నన్నింతదూర మెలయించినది.

ఊర్మి: అత్తగారీసాహసము వినిన—

సీత: ఏమీ?

ఊర్మి: మనల నిద్దఱను గోపింతురు.

సీత: ఆత్మవినోదార్థము ఇందుల విహరించుచుంటిమి.

ఊర్మి: అట్లయిన గమనాయాసము లేదా ?

సీత: ఇపుడిపుడు దోఁచుచున్నది.

ఊర్మి: ఇఁక మరలుదమా ?

సీత: ఇంచుక సేపు వెన్నెల తాలతిన్నెపై విశ్రమించి యంతఃపురమున కేఁగుదము. చెల్లెలా, మార్గపరిశ్రాంతము లగు నాయవయవముల కీ మందమారుత సుఖాశ్లేష మమృత లేపనమువలె నున్నది.

జిలిబిలి కమ్మఁదేనియల చిత్తడిఁ జాలుచుఁ, బుప్పొడిన్ వనీ
తలముల రాల్చుచుం, గుసుమ తల్పములం బొరలాడుచున్, ధునీ
సలిల తరంగ డోలికల సంతత మూఁగుచు, శీతలంపుఁ గాఁ
గిళుల మదంగకంబుల సుఖింపఁగఁ జేయు మరుత్కిశోరముల్.

ఊర్మిళా, గృహారామములకన్న ఈవనాంతరములు రమణీయములుగ నున్నవి.

చాలుగ మార్గపార్శ్వ తరుశాఖలఁ బుష్పిత వన్యవల్లులు
య్యాలల పోలికం గదలియాడ, మయూరము లెక్కి కూయుచుం
గేళిఁ జరించుచుండి తొణికింపగఁ దీవలనుండి క్రొంబువుల్
రాలిన నేలయంత నవరత్నమయంబుగఁ గాంతు లీనెడున్.

ఊర్మి: అక్కా, పదునాలుగేఁడులు దండకారణ్యమున నివసించిన నీకు కృత్రిమారామ వాటికలింపుగొలుపునా? అచ్చటి నిర్ఝరములు, అచ్చటి శకుంత సంతానములు, అచ్చటి వివిధమృగవిహార సందర్శనములు ఇచ్చట లభించునా ?

సీత: చెల్లెలా, దండకారణ్యమన్నంతనే నాయొడలెల్ల గగురెత్తుచున్నది.

దండకారణ్య వాసంబు దలఁచినంత
హర్ష శోకానుభవము పెల్లగ్గలించు;
వనవిహారము, తాపస జనుల మైత్రి,
రాక్షస విరోధమట మాకుఁ బ్రాప్తమాట.

ఊర్మి: అక్కా, గడచినది గదా యారణ్యవృత్తాంతము.

సీత: అయినను అందనుభవించిన సుఖదుఃఖావస్థలు మఱపునకు వచ్చునవియా? జనస్థానమునఁ బదునాలుగు వేల కంమురథముల రక్కసులతో నసహాయ శూరుఁడయి పోరి, వారినుక్కడంచిన ఆర్యపుత్రుల శౌర్యమూర్తి నేఁడు దర్శించినటులఁ బొడకట్టుచున్నది.

ఖరదూషణాది దైత్యో
త్కరముల నుకుమాడి, రుధిరధారలు దొరఁగన్
శరజ క్షతములఁ గాంతుఁడు
వఱలెను కింశుకము బూతపట్టిన యటులన్.

ఊర్మి: అక్కా, శూర్పణఖా పరిభవానంతరము గదా ఈ సమరము జరిగినది.

సీత: అవునవును! ఆ దానవి కడుమాయలమారి పిశాచి జంత.

'నిను మ్రింగెద' నని యసురాం
గన బాహువు లప్పళించి ఘన ఘోషమునన్
నను దరియరాఁగ నగ్రజు
పనుపున నీప్రియుఁడు దానిఁ బరిభవ పఱిచెన్.

ఊర్మి: ఆ రక్కసికి మంచి శాంతి పూజయే జరగినది.

సీత: ఊర్మిళా, యా దైత్యాంగనయే గదా నాయపహృతికి మూలము!

ఊర్మి: [ఆశ్చర్యవిషాదములతో] ఏమీ! దాని యకార్యమా యది యంతయు?

సీత: చెల్లెలా, కాలము గానియపుడు అమృతముగూడ విషమగు

యుండును. ఆ బంగారుజింక యెంతపని చేసినది?

కనకమయమైన హరిణంబు గఱికబయలఁ
గ్రోళ్లుదాఁటుచుఁ గొమ్ముల గీటుకొనుచుఁ
జక్కిచిక్కక యల్లంతఁ జేరి బెదరి
చూచు మురిపెంబు చిత్తంబు సొచ్చివిడదు.

అయ్యో! ఆర్యపుత్రా, యింతవఱకే నీసందర్శనము. సన్యాసివేష మున—హా! యింక నుడువఁజాలను, పవిత్రచరిత్రుఁడగు లక్ష్మణకుమారుని నిర్హేతుకముగఁ దూలనాడిన ఫలము తత్క్షణమే యనుభవించితిని.

ఊర్మి: అక్కా, యెందుకీ కర్ణకఠోరవృత్తాంతము? [స్వగతము] నేనేల దండకారణ్య వృత్తాంతము నెత్తితిని?

సీత: నన్నారక్కసుని బారినుండి రక్షించుటకు నిజప్రాణ పరిత్యాగము గావించిన మహాత్ముఁడు పక్షిరాజు జటాయువు నా తలఁపునకు వచ్చుచున్నాఁడు.

సురరిపుబాణపాతములసుక్కియు నెత్తురుగ్రక్కియున్ మహో
ద్ధుర గరుదంచలానిల విధూత విమానునొనర్చి రావణున్
ఖర నఖరాగ్రకుంచికలఁ గండలు దొల్చుచు నెట్టకేలకున్
దురమునఁ గూలె దుష్టవిధి దోడ్పడమిన్ ఖగవర్యుఁ డక్కటా!

ఇదే యాశాభంగపరమావధి! ఇదే దండకారణ్యదర్శనము! ప్రాణేశ్వరా, రక్షింపుము! రక్షింపుము! [మూర్ఛిల్లును]

ఊర్మి: [దుఃఖముతో] అయ్యో! యింక నేనేమి సేయుదును? అక్కా, అక్కా.

[రాముఁడు ప్రవేశించును.]

రాము: [స్వగతము] ఎవతెదో స్త్రీకంఠస్వనముగ నున్నదీ దీనాలాపము?

ఊర్మిళ: ఓహో! బావగారిప్పటికే వచ్చుచున్నారు. అక్కా, యూరడిల్లు మూరడిల్లుము.

రాము: [దగ్గఱ] ఇది యేమి యూర్మిళా, మీ యక్క మూర్ఛిల్లి యున్నది? భయకారణమేమి యుఁ గలుగదు గదా?

ఊర్మి: అరణ్య నివాసవిషయము స్మరించి మూర్ఛిల్లినది.

రాము: ఓసి చేలా! [కరస్పర్శగావించి] ప్రేయసీ, యూరడిల్లుము. గడచిపోయినది లెమ్ము వనవాసవిషయము.

సీత: [మెల్లగఁ గనులువిప్పి] ప్రాణవల్లభా, రక్షింపఁబడితిని.

రాము: భ్రాంతి నుండియా?

సీత: ఏమీ దండకగాదా యిది?

రాము: నీ మృదుల హృదయము నడుగుము.

సీత: [స్వగతము] స్వప్నమునందువలె వనస్థాంతరము పొందితిని. [ప్రకాశముగ] ఆర్యపుత్రుఁడు విహారమునకై యిప్పటికే విచ్చేయ నేల?

రాము: [చిఱునవ్వుతో] నేనడుగఁ దలఁచిన ప్రశ్నను నీవే యడిగితివా? మఱి యెక్కడ విహరింతును? ధర్మాసనము వీడి యంతఃపురంబున కేఁగితిని; అయ్యది ప్రియావిశూన్యమగుట హృదయాహ్లాద వస్తువు నన్వేషించుచు నింతదూరము వచ్చితిని.

సీత. అరణ్యావాసముతప్పినను అభ్యాసము వాసనా రూపముగ నున్నది కాఁబోలు!

రాము: [చిఱునవ్వుతో] కావుననే గర్భాలసవయ్యు వనముల వినోదించుటు.

సీత: [సిగ్గుతో] ఆర్యపుత్త్రునకే ఋణపడితిని.

ఊర్మి: అక్కా, సంధ్యాపూజకుఁ గుసుమములు కోసికొనివచ్చెదను. [పువ్వులబుట్టతో నిష్క్రమించును.]

సీత: [స్వగతము] నామనోభీష్టము నెఱింగింతునా ?

రాము. ప్రేయసీ, యేమొ తలపోయుచున్న ట్లున్నావు.

సీత: ఏమియు లేదు.

రాము: జానకీ, నీవు నా బహిఃప్రాణమవుగదా, మనకిద్దఱకు నన్యోన్య మెఱుంగరాని రహస్యము లుండునా?

సీత: రహస్యముగాదు. నాకొక యభిలాషగలదు. భాగీరథీ పరిసరాటవుల నివసించు తాపస కన్యకల స్నేహానుబంధము నన్నీడ్చుచున్నది.

రాము: ఇందుకా యింత శంకించుచుంటివి?

సీత: ప్రాణవల్లభా, మునికన్యకలతోఁ బ్రొద్దుపుచ్చుచుండిన యా దినములు నేనెట్లు మఱతును?

గిరిసాను స్రుత నిర్ఝరితటములం గ్రీడింపగాఁ బోయి, సాం
ధ్య రమారంజిత పశ్చిమాశఁ గల చిత్రంబుల్ విలోకించుచున్,
సరసాలాపము లాడికొంచు ఋషికన్యల్ నేను సంతోష ని
ర్భరచిత్తంబులఁ బుచ్చినట్టి దినముల్ భావంబుఁ బ్రేరించెడిన్.

రాము: కాంతా, నిండుపున్నమనాఁటి రేయి నీవును ఆరణ్య బాలికలు గూడి యాడుచుండ—

సీత: చాలుచాలు ఆర్యపుత్త్రుని వినోదము!

రాము: గాంగ పరిసర వల్లీ కుడుంగములను
దాపసాంగన లీవును దాఁగియాడ

నెవరెఱుంగక పొదరింట నేను పొంచి
సింహగర్జల మిమ్ము వంచింపలేదె ?

సీత: ముగ్ధములైన తాపసకన్యకల బెదరుచూపులు ఆర్యపుత్రున కామెతలైనవి కాఁబోలు.

రాము: సీతా, యీ దినములు మఱచినను మఱపురావు.

సీత: ప్రాణవల్లభా, ఆ వనప్రదేశములు మఱొకమాఱు దర్శించి వత్తము.

రాము: అటులనే పోవుదము లెమ్ము.

సీత: [స్వగతము] ధన్యను.

రాము: ఇఁక నంతఃపురమున కేఁగుదము.

పశ్చిమాద్రికి డీకొని పగులవాఱి
యరుణుఁడను నావ సాంధ్య రాగాబ్ధియందు
నల్లనల్లన మునుఁగంగ నా యుదంత
మవనిఁ దెలుపంగ ననఁ బక్షు లఱచి పఱచు.

సీత: ఊర్మిళా.

ఊర్మి: ఇదిగో! వచ్చుచున్నాను.

[అందఱు నిష్క్రమింతురు.]

ద్వితీయాంకము

ప్రథమ స్థలము: సభామంటపము.

[రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు, వసిష్ఠమహర్షియు ఆసీనులై యుందురు.]

వసి: రామచంద్రా, ఋశ్యశృంగమహర్షి యజ్ఞదీక్ష వహించి మనకు నాహ్వానపత్రిక నంపియున్నాఁడు.

రాము: విషయము వినిపింపుఁడు.

వసి: జానకి ఆపన్నసత్వ; దూరప్రయాణాయాసమున కోర్వఁజాలదు. రామచంద్రుఁడు సీతావినోదార్థ మచ్చటనే నిలుచుఁగాక; కౌసల్యాది మహాదేవులును, లక్ష్మణ భరత శత్రుఘ్నులును, వసిష్ఠాది ఋషీశ్వరులును, దక్షిణ బంధుమిత్రులును దర్శనార్థము విచ్చేయఁ బ్రార్థితులు.

రాము: మునీంద్రా, మాబావగారి సీతాపక్షపాతము వలన యజ్ఞసందర్శన కుతూహలమునుండి తొలఁగింపఁ బడితిని. మునిపుంగవు లెల్లను యాగమంటపము నలంకరించి ఋశ్యశృంగమహర్షిని గృతకృత్యుని గావింపుఁడు.

వసి: వత్సా, సవనమున్నఁ దాపసులకుఁ బండువుగదా.

రాము: భరతా, ప్రయాణసన్నాహము లొనరింపుము.

భర: ఆజ్ఞానువర్తిని.

[భరతుఁడు నిష్క్రమించును.]

[మునులు ప్రవేశింతురు.]

మునులు: త్రైలోక్యభద్రా రామభద్రా, దీనశరణ్యా, రక్షింపుము, రక్షింపుము!

రాము: మునీంద్రులారా, స్వాగతము!

లక్ష్మ: ఋషిపుంగవులారా, యభివాదనములు.

శత్రు: తాపసులారా, వందనములు.

వసి: రామరాజ్యమునఁ గుశలమేగదా తాపసోత్తములకు?

మునులు: ఇవిగో! మా కుశల నిదర్శనములు. [వస్తువులుంతురు.]

శత్రు: [నిరూపించి] భగ్నకమండలములే యివి!

లక్ష్మ: ఇవి త్రుటితాక్షమాలికలు; ఇవి వల్కలాజిన ఖండములు—ఋషీశ్వరులారా, ఏల యీ తాపసవస్తు ప్రదర్శనము?

ముని: [కోపముతో] రక్షోదుష్కార్య భగ్నావశేష తాపస వస్తు ప్రదర్శన మనిన సార్థకముగ నుండును.

రాము: ఏమి యీవిపరీతము?

వసి: రామరాజ్యమునఁగూడ రాక్షస బాధయా?

లక్ష్మ: రాక్షసుల గర్వమింకను శేషించియున్నదా?

రాము: మునీంద్రులారా, యీ యాసనములపైఁ గూర్చుండుఁడు.

1- ముని: రాజా, మాకేల యీ యాసనములు?

2- ముని: రామచంద్రా, మేమిప్పుడే గోడ కుర్చీలుగూర్చుండి ఊగివచ్చితిమి.

3- ముని: మహారాజా, మా గడ్డముల పీచుత్రాళ్ళతో గుదియఁ గట్టఁబడి రేయుంబవలు కదలమెదలలేక కుంచితాంగులమయి, పుణ్యవశమున విడిపింపఁ బడిన మాకు నిలుచుండుటయే సౌఖ్యము.

రాము: అయ్యో! యెంతకష్టము!

శత్రు: ఔరా! రాక్షసాధముల దుష్కార్యము లెల్లు మేర మీ.

ఱుచున్నవి?

రాము: మునీశ్వరులారా, మిమ్ముఁ జీకాకుపఱిచిన రాక్షసాధముఁ డెవఁడు?

1- ముని: మహారాజా, యా రాక్షసుని పేరు దలఁచినంతనే యా దురాత్ముని భయంకరస్వరూపము మాకుఁ బ్రత్యక్షమగుచున్నది.

వసి: పాపము! రాక్షసభీతు లీ ఋషీశ్వరులు.

2- ముని:

హిమవత్పర్వత సానుభాగమున గౌరీశుం దపోనిష్ఠ మో
దము నొందించి, విరోధి వీర నికర ధ్వంసోగ్రమౌ శూల రా
జము నార్జించి, తదాది తాపసుల నాశంబే వ్రతంబట్లు దు
ర్గముఁడై యా లవణాసురుండు వనులన్ దర్పించి వర్తించెడిన్.

రాము: ఓహో! శంకర వరప్రసాద గర్వితుఁ డా లవణుఁడు?

లక్ష్మ: శునక పుచ్ఛముఁ బట్టుకొని మహాసముద్రము నీఁదఁ గడఁగుటయా?

4- ముని: [స్వగతము] లవణుఁడు శంకర వరప్రసాద దుర్వారుఁ డని వెనుదీయునా రామచంద్రుఁడు?

శత్రు: ఆ దుష్టరాక్షసుఁడు అర్ధనారీశ్వర వరప్రసాద మాత్రము ననే యింత గర్వింప వలయునా?

సీతాదేవి స్వయంవరంబున నృపశ్రేష్ఠుండు మాయన్న డా
చేతంబట్టిన శైవకార్ముకము విచ్ఛిన్నంబుగాఁ గూలదే!
భీతిం జెందుదుమే త్రిశూల మనినన్? వేయేల? భూతేశ్వరున్
మాతోఁ బోరుకుఁ దెచ్చిన న్విడతునే మాంసాశనవ్రాతమున్.

1- ముని: రాజకుమారా, ఆత్మోచితశూరాలాపము లాడితివి.

2- ముని: మేము రక్షింపఁబడితిమి.

3- ముని: దీనరక్షామణీ, వర్ధిల్లుము.

రాము: మునులారా, భయపడవలదు.

4- ముని: [మునులవంకఁదిరిగి] తాపసులారా, మహారాజు అభయప్రదానముచేసెను. ఇఁక భయపడకుఁడు.

వసి: ధర్మము గౌరవింపఁబడినది.

2- ముని: మహాప్రభూ రామభద్రా, ఆదుష్టరాక్షసుఁడు బ్రతికియుండువఱకు మా నిత్యనైమిత్తిక కృత్యములు కొనసాగవు.

1- ముని: దీనశరణ్యా, మా యాపద లేమని విన్నవింతుము?

సవన యూపస్తంభ నివహంబు రోకళ్ళ
కని పెల్లగింప మాటాడరాదు;
యాగభాగంబుల నర్పింపుఁ డనికోర
నీకున్న యమపురి కేఁగవలయు;
పీచుగడ్డంబులు పెఱికి త్రాళులుపేన
వలెనన్న నెదిరింప వలనుపడదు;
తపసి కన్నెలఁబట్టి దయమాలి చెఱఁబెట్టఁ
గనులు కాయలుగాయఁ గాంచవలయు;
రాక్షసుల దుండగంబులు రాజసభలఁ
దెలుపునట్టివె? యటుఁజూడ వలయుఁగాని,
రామభద్రుఁ డార్యావర్త రాజ్యమేలఁ
దాపసుల కిట్టి దుర్గతి దాపరించె.

వసి: హరి హరి! యెంతటి మాట వినవలసె.

రాము: పాపము శాంతించుఁగాక!

2- ముని: మహారాజా, ఆ లవణాసురుని విజృంభణ మటుండనిచ్చి మానవ మాంసాభిలాషులగు ఆ దానవసైనికుల యపలాప ప్రలాపంబులు విని విని మాచెవులు కాయలు గాచినవి.

లవణుం డీ భువనత్రయీశ్వరుఁ,డిఁ కేలాపలుక్క? లింకొక్క మా
నవనాథుం బతియించు వాకొనిన మీనాల్కల్ దెగంగోసి నె
త్తురి వెదల్ చల్లెద మూరకాకులకు, నేరో మిమ్ము రక్షించు ధ
ర్మవిదుల్ దెండన నాశ్రయించితిమి రామా, మౌనికల్పద్రుమా.

వసి: దానవసంహారమునకై యవతరించిన ధర్మస్వరూపునకు విధి గదా తాపస రక్షణము.

లక్ష్మ: మునీంద్రా, యీరపిచ్చుకపై బ్రహ్మాస్త్రము ప్రయోగింప వలయునా? ఆ యల్పరాక్షసుని వధించుటకు దశకంఠసంహారకుఁ డేఁగవలయునా?

సుగంధి- ఒక్కరుండఁ జాలనే మహోగ్రవహ్ని కీలలం
గ్రిక్కు బాణ సంచయంబు గాడనేసి వాని పే
రక్కఁజీల్చి నెత్తురెండ లంతటన్ విదల్పఁగన్
దక్క వారలేల యొక్క దానవున్ వధింపఁగన్.?

ముని: లక్ష్మణకుమారా, భళి! భళి! ఇంద్రజిత్సంహారకునకుఁ దగినవే యీ వీరవాక్యములు!

శత్రు: అన్నా, నిజపరితాపము నేల యుజ్జగించుకొందువు? కుక్క

మ గొట్ట బచ్చెనకోల కావయునా?

కాయల్గడ్డలు మెక్కు బక్కరుసులం గారించు దైతేయులన్
మాయింపన్ యశమానె?నీవలుగంగా మాయావియా యింద్రజి
త్తో, యుద్ధంబునం గుంభకర్ణ ముఖ దైత్యోత్తంసులో వార! లే
లాయీపూనికి?లక్ష్మణా,యసురంగూల్పన్ నన్నుంబుత్తెంచుమా

రాము: వత్సా శత్రుఘ్నా, నీపలుకులు ముద్దులొలుకుచున్నవి. నీవే యాలవణాసురుని వధియింపం బోయెదవులెమ్ము.

శత్రు: ప్రసాదము.

మునులు: మహాప్రభూ, మాగుండెలు కుదుటం బడినవి.

రాము: తాపసులారా, యింక మీ మునిపల్లెకుం బొండు.

1-ముని: శ్రీరామచంద్ర, నీవే
యీ రాజ్యము నేలవయ్య యీతి రహితమై
ధారాళ సౌఖ్యములు చే
కూఱంగ జనులెల్ల సతముం గుతుకము నొందన్!

[యవనిక జారును.]

తృతీయాంకము

విష్కంభము: హజారపు ముంగిలి.

[భద్రుఁడు ప్రవేశించును.]

భద్రు: గూఢచర్య మెంత నిష్ఠురమైన యుద్యోగము! అప్రియమైనను సత్యమే పలుకవలయును. భూపతులు చారనేత్రులుగదా! ఏమి సేయుదును? ఎంతకాలము తెలుపక యూరకుందును? విశ్వసనీయుఁడ నని గదా మహారాజు నన్నీ కార్యమున నియోగించెను? ఎన్నిమారులో పలుక యత్నించియు నాలుక యాడమి నూరకుంటిని; నేఁ జెప్పక దాఁచినను మఱి యేచారుఁడైనఁ దెలుపవచ్చును. కుండనుమూయ మూఁకుడు గలదుగాని, లోకమును మూయ మూఁకుడు గలదా?

కటకటా! యిట్టి యుద్యోగమునకా యింతకాలము జీవించియుంటిని? ఆత్మహత్యగావించుకొని యీరహస్యము దాఁచియుంతునా? [ఆలోచించి] ఎంతి వెఱ్ఱివాఁడను. నే హత్యగావించుకొనిన మహారాజు విశ్వసనీయుఁడగు వృద్ధచారుని గోల్పోవుటగాక మఱి యేమి లభించును? కోమలస్వభావయగు జనకరాజకుమారి యీ యపవాదము విన్న బ్రతికి యుండఁగలదా?

ఆహా! లోకమెంత యవివేక పూరితము!

అగ్నికీలలఁ బరిశుద్ధ యైనతల్లిఁ,
బంక్తిరథునకుఁ గోడలిఁ, బరమసాధ్వి,
రాఘవుని పత్నిఁ, సద్గుణ రత్నఖనిని
దూఱిరీలోకులు కళంక దూషితనుగ.

[మందారిక ప్రవేశించును.]

మందా: [స్వగతము] అంతఃపురమున నమ్మకమైన దాసిగనుండుట కన్న బావిలోపడి చచ్చుటమేలు. ఏపనికైనను మందారికయే పోయి రావలయును. ఆ పురోహితుఁడు ఎక్కడ బ్రాహ్మణార్థము చేయుచున్నాఁడో యెట్లు కనుగొందును? వాఁడుగో! భద్రుఁడు, దివాణము దిక్కునకే వచ్చుచున్నాఁడు. అతని నడిగినఁ దెలియును. ఈ ముసలిభద్రుఁడు అంతఃపురమున తానొక్కఁడే విశ్వాసపాత్రుఁడని గర్వపడుచుండును. అతని కొకింత శివమెక్కించిపోయెదను. [మందారిక తొలఁగి తొలఁగిపోవుచుండును.]

భద్రుఁడు: ఎవరక్కడ?

మందా: [పలుకదు.]

భద్రు: ఎవరది? మందారికా, ఏమిపలుకవు?

మందా: ఏమియాపదగలిగినది, ప్రాణముపోయేటట్లరుస్తున్నావు?

భద్రు: ఓసి తొత్తుకూఁతురా, ఏమితొలఁగితొలఁగిపోవుచున్నావు?

మందా: నీవంటి నవకోటిమన్మథాకారుని రాచుకొని పోవలయునా? [పోవుచుండును.]

భద్రు: మాటలలోనే దాఁటిపోవుచున్నావె! ఇటురమ్మా. నీయొడిలో నేమిదాచుకొని పోవుచున్నావు. ఏమైన దొంగిలించవు గదా?

మందా: నీపనికి నీవుపొమ్మా. తక్కినపనితో నీకేమిసంబంధము? దివాణమంతయు నీ మొగముపై నడచుచున్నదా?

భద్రు: ఒసే దానిసకూతురా, మహారాజంతవాఁడు నన్ను పల్లెత్తు మాటయనరు. నీవా నన్ను తిరస్కరించుదానవు? రామభద్రుని శైశవము మునుండి నేను సేవకుఁడను సుమా.

మందా: అబ్బా! అయోధ్యారాజ్యమును రక్షించితివి నీవుపచ్చిన రాజకుటుంబము పుట్టిమునుగును. [పోవ ప్రయత్నించును.]

భద్రు: ఓసీ మాయలాడీ. [చేయిపట్టుకొని యొడిసి తడవును]

మందా: [చిఱునవ్వుతో] భద్రా, మనకిరువురికి పాణిగ్రహణమా?

భద్రు: ఛీ! ఛీ! గయ్యాళి. [చేయివదలును]

మందా: నీ రసికత్వము తెలిసిందిగాని, పురోహితుని యెక్కడనైన చూచినావా?

భద్రు: ఎందుకు?

మందా: నిన్నటిరాత్రి నాలుగోజామున దేవిగారు దుస్స్వప్నము గన్నారఁట. అందుకై శాంతిపూజ చేయించవలసిందని ఆజ్ఞ అయింది.

భద్రు: [ఆశ్చర్యముతో] దుస్స్వప్నమా! ఔరా! దుర్భిక్షమునకు ముందు ధూమకేతువు.

మందా: [స్వగతము] ఈ ముసలి భద్రునకు ప్రీతిదియు అమిత ముఖ్యముగ దోఁచుచుండును.

భద్రు: మందారికా, పురోహితుఁ డెక్కడనున్నాఁడో నాకుఁ దెలియదు

మందా: ఈ వానకా ఇన్ని ఢమఢములు? [నిష్క్రమించును.]

భద్రు: ఇఁక నాలసింపఁదగదు. సేవకు లస్వతంత్రులుగదా.

[యవనిక.]

ప్రథమ స్థలము: విశ్రాంతిభవనము.

[రాముఁ డాసీనుఁడై యుండఁగాఁ దెఱయెత్తఁబడును]

రాము: ఓరి, యెవఁడురా అక్కడ ?

ద్వారపాలకుఁడు: మహాప్రభో, దాసుఁడను.

రాము: ఓరీ, రాజ్యకార్యవిముక్తులమైన మా కించుక సేపు లోకవ్యవహార వినోదము గావింపవలయునని భద్రునకు మామాటగఁ దెలియఁజేయుము.

ద్వార: ఏలినవారియాజ్ఞ. [నిష్క్రమించును]

భద్రు: రామభద్రా, జయము జయము !

రాము: భద్రా, విశేషము లేవియైనఁ గలవా?

భద్రు: [నవ్వుచు] ఒక గొప్ప విశేషముగలదు. పాపదేవతమాత్రము మిమ్మెప్పుడు వేయినోళ్ళ దూషించుచుండును.

సకల భోగభాగ్య సౌఖ్యములకుఁ బుణ్య
కార్యములకు నునికి గలదు రామ
రాజ్యమందు, నాకు రవయేనిఁ దలదాఁప
నీడ లేదటంచు నిత్య మగలు

రాము: [చిఱునవ్వుతో] ఓయీ, నీ ప్రియోక్తులు చాలింపుము లోకు లే మనుకొనుచున్నారు?

భద్రు: దేవర పవిత్రచారిత్రము లోకమున కాదర్శప్రాయ మైనది.

రాముఁడు లోకరక్షకుఁ, డరాతిభయంకరుఁ డుగ్రదైత్యదో
స్స్థేమహారుండు, దుష్టజన శిక్షకుఁ, డార్యజనావనుండు, స

త్యామల నీతికోవిదుఁ, డహంకృతిదూరుఁ డటంచు సజ్జన
స్తోమము లాడుకోఁగఁ బరితోషముతో వినుచుందు నెప్పుడున్.

రాము: భద్రా, యివి కేవలము స్తుతివాక్యములు. లోపములేవి వాకొనరా లోకులు?

భద్రు: [స్వగతము] హా! మందభాగ్యుఁడను ఏమి తెల్పుదును?

రాము: ఓయీ, యేలపలుకక యూరకున్నావు?

భద్రు: [స్వగతము] ఇఁకఁ జెప్పకతప్పదు. [చెప్పఁబోయి యూరకుండును.]

రాము: సంశయించెదవు! [స్వగతము] ఈతనికేలొకో దుఃఖావేశము గల్గినది. పలుకఁజాలక స్తంభితుఁడై యున్నాఁడు.

తను వృద్ధత ఘర్మ్మంబుగఁ
గనుఁగొనలను బాష్పవారి కణములు జారన్
మఱి పెదవులు చలియింపఁగ
మనమునఁ గల వసటఁ దెలుపుమాదిరిఁ దోఁచున్.

[ప్రకాశముగ] ఓయీ, లోకుల కేమి యవాంతగము వాటిల్లదు గదా?

భద్రు: [నిట్టూర్పుతో] అట్టిలోకుల కేల యవాంతరము గలుగును?

రాము: [ఆతురతో] ఎట్టిలోకులకు?

భద్రు: బుద్ధిహీనులైన పురజను లాడెడు
పలుకు లెపుడు నమ్మ వలనుపడదు

రాము: [ఆతురతో] వారు లేమనుకొనుచున్నారు?

భద్రు: అగ్నిశుద్ధియైన యమలచిత్తకుఁ దప్పు
లంటఁగట్ట జంక, రఘుకు వడరు.

రాము: [ఉద్వేగముతో] హా! యేమి వినుచుంటిని. భద్రా, యేమంటివి? జానకిని నిందించిరా లోకులు?

భద్రు: జానపదులు నీరుదెచ్చుకొను బావికడ నొకపల్లెత యేమేమో యపవాదములు పలుకుచుండెను. నే నెట్లు చెప్పఁగలను?

రాము. భద్రా, యాళుకు పడవలదు.

భద్రు: రావణుఁ డెత్తుకొనిపోయి తనయింట నుంచుకొనిన సీతను మరల రాముఁడు పరిగ్రహించెను; కౌసల్యాదేవి యింటఁబెట్టికొనుటకు సందేహింప లేదు. కౌసల్యయే నేనైన కోడలి నిప్పుడే యిల్లు వెడలించి యుందునని యేమేమో యసంబద్ధము లాడుచుండెను.

రాము: ఔరా! మందభాగ్యుఁడనగు నన్ను గుఱించి సాధ్వీమతల్లి యగు కౌసల్యా దేవికింగూడ నిందాపాదనమా! అకటా! వంచింపఁబడితిని. శైత్యమునకై శ్రీఖండతరువు నాశ్లేషించితిఁగాని, కోటర నిలీనయగు విషభుంజగిని గాంచనైతి. ఛీ! దుష్టహృదయమా, వహ్ని పరిశుద్ధయైన సీతను సైతము సంశయించుచున్నావా?

భద్రు: రామభద్రా, యవివేకుల యాడికోలు పాటింపఁదగదు.

రాము: ఓయీ, సత్యముపలికితివి.

ఏ లలితాంగి సచ్చరిత మెల్లజగంబులఁ బాపవల్లికా
మూల ఖనిత్రమై భువనపూజ్యమునై నుతికెక్కె, నట్టి నా
పాలిటి భాగ్యలక్ష్మి యపవాదభరంబునఁ గ్రుంగునట్లు కాం
తాళముతోడ లోకు లనఁ దాలిమిపొందునె చిత్త మిత్తఱిన్?

ఓ నిర్విచారప్రపంచమా, నీకుఁ గాలావధి యయ్యెఁ గాఁబోలు

అనల పరిశుద్ధమైన పూతాత్మసీతఁ
దూలనాడిరి లోకులు దురితమతులు,
అగ్నిశిఖతోడ సయ్యాట లాడఁబోవు
శలభము లెఱుంగునే ప్రాణసంకటంబు?

భద్రు: [స్వగతము] అయ్యో! యేమి యుత్పాతము లుప్పతిల్లనున్నవో! [ప్రకాశముగ] మహాప్రభో, శాంతిల్లుము. దేవరయే కోపించిన నింకఁ బ్రపంచమున కెవ్వనిపాదతలము శరణ్యము! ఆకాశమే కూలిపడిన నెత్తి పట్టువార లెవ్వరు?

రాము: [స్వగతము] కోపావేశమున సత్య మతిక్రమింపనుంటిని. [ప్రకాశముగ] భద్రా, సీత రావణాపహృతయైనదనుట సత్యము, లంకలో నివసించుటయు యథార్థమె. ఇఁక లోకులేమి యన్యాయమాడిరి?

భద్రు: ఇంతవఱకు నిజమాడిరి.

రాము: అవును. లోకము పాపశంకి.

భద్రు: ఇక్ష్వాకువంశము అపవాదాతీతము గదా.

రాము: [స్వగతము] హృదయమా, నీకార్య మెట్లు నిర్వర్తించెదవు? ప్రియాంగనాశ్లేషసౌఖ్యము నపేక్షించి చిరకాలాగతమగు రఘువంశకీర్తి కళంకితము సేయుదువా? సద్యశమును రక్షించుటకయి యర్ధాంగినైనఁ బరిత్యజించెదవా? కఠినచిత్తమా, యేమి యుపదేశించుచున్నావు?

పెండ్లివేళఁ గాలిబొటనవ్రేలి నొక్కి-
కంకణమనోజ్ఞమగు సీత కరము గొన్న
ప్రియము విడనాడి నేఁడు గర్భిణిని సాధ్విఁ
గీర్తికొఱకు వనంబున గెంట మనెదె?

[ప్రకాశముగ] భద్రా, నీవుపోయి లక్ష్మణుని నిటకు రమ్మనుము.

భద్రు: ఏలినవారిచిత్తము. [నిష్క్రమించును.]

రాము: ఈయపవాదమును లక్ష్మణునకె ట్లెఱింగింతును?

[లక్ష్మణుఁడు ప్రవేశించును]

లక్ష్మ: [స్వగతము] అన్నగారేమొ దీనవదనులై విచారించుచు న్నారు. [ప్రకాశముగ] అన్నా, లక్ష్మణుడు మ్రొక్కుచున్నాఁడు.

రాము: వత్సా లక్ష్మణా, రాముని జీవితము శూన్యమైనది. ఇఁక నీ వసుంధరా భారమును నీవ వహియింపుము. అందుకై నాకొక ప్రత్యుపకారము సేయుము.

లక్ష్మ: [ఆశ్చర్యముతో] ఏమి యీ వింత !

రాము: లక్ష్మణా,

ఈ కరవాలము గైకొని,
నాకంఠముఁ ద్రుంచుమీ—

లక్ష్మ: అమంగళము శాంతించుఁగాక !

రాము: క్షణంబును రాముం
డీకష్ట లోకజీవన
శోకము సహియింపలేఁడు క్షుభితాత్ముండై.

లక్ష్మ: అన్నా, అకాండముగ నీ మనమేల యింత భ్రాంతిల్లినది? ఏమి యాపద సంభవించదుగదా. నీ కఠోరవాక్యములు నాహృదయపుటము భేదించుచున్నవి. కాంతావియోగమునందైన నింతటి నిర్వేదముఁ బొంది యెఱుఁగవు.

రాము: లక్ష్మణా, సీతావిరహము రామునిది మాత్రమె. కీర్తివియోగము ఇక్ష్వాకువంశ మంతటిది.

చిరకాలార్జితమైన గౌరవ యశఃశ్రీ నేఁడు లోకాపవా
ద రజఃపంక కళంకితంబయి చెడెం; దమ్ముండ, యింకేల యీ
ధరణీరాజ్యము? పూజ్యవంశగరిమన్ దైన్యాంబుధిన్ ముంచితిన్;
నరనాథుల్ ననుగాంచి నవ్వరె? యయో! నాకేల యీ ప్రాణముల్?

లక్ష్మ: అన్నా, నీపలుకులు వింతఁగొలుపుచున్నవి. ఇక్ష్వాకువంశమా అపవాదపంకిల మగుట? ఆశ్చర్యము!

నిప్పునకుఁ జెదలు పట్టునె ?
కప్పుర సిర మొలయునే వికారపుఁ దావిం ?
దప్పులు గలుగునె రఘుకుల
మొప్పును దేజంబు దొరఁగ నో రఘువీరా.

నీ మనం బిటుల శోకసంతప్తమగునటుల నపరాధ మొనర్చిన వారెవ్వరు ?

రాము: రావణాపహృతయయి పునర్గృహీతయగు సీత.

లక్ష్మ: [నిర్విణ్ణుఁడయి] కటకటా ! యేల యిట్టి సంశయోక్తులాడెదరు ?

రాము: సంశయోక్తులు లోకులవి.

లక్ష్మ: [కోపముతో] ఏమీ ?—లోకులు దూషించిరా పతివ్రతా శిరోమణిని ?

తెలియరో ! ధారుణీతనయ, తెంపరిమూకల యాడికోలకున్
వెలుపటి సత్యతేజమని, వీరలవారల పోల్కిఁ గండ క్రొ

వ్వోలయఁ బవిత్రివర్తనను నొప్పని కారులుపేర్మినట్టి లో
కులను నుపేక్ష సేఁత మనకు న్నరపాలురకైన ధర్మమే?

అన్నా, లోకులు మందబుద్ధులు; గతానుగతికులు; సత్యాసత్య వివేక
శూన్యులు.

రామ: అవును; అగుదురు.

లక్ష్మ: అట్లయిన వారి యపలాపప్రలాపములా మనకుఁ బ్రమా
ణములు?

జను లపవాదముల్ పలుకఁ జాలుదురంచుఁ దలంచి, లంకలో
ననల విశుద్ధయై యాటకు నిలాత్మజ మీఁ రడుగంగ నెమ్మనం
బున నళుకింతలేక నగుమోమునఁ జొచ్చె హుతాశనార్చులన్
జనకజ నిష్కళంకయని సన్నుతియింప నిలింపసంతతుల్.

రాము: వత్సా, నాకన్నులను నేనే విశ్వసింపక పోవుదునా?

నమ్మెడివాఁడఁ గాను లలనామణి జానకి సంశయింప న్యా
యమ్మని, యైన లోకులు నయమ్మెడఁబాసి వివేకశూన్యులై
యిమ్మలినాపవాద ముదయింపఁగఁ జేసిరి! దూఱువాప నిం
ద్యమ్మొ యధర్మమో విధియొతమ్ముఁడ, నీవెతలంపు మీఁయెడన్

లక్ష్మ: ఇంక మూఢాత్ములే ధర్మపాత్రులా?

రాము: లక్ష్మణా,

మూఢచిత్తులైన, బుద్ధిమంతులైన నైనఁ
బ్రజల రంజనంబు పాలనంబు;

సత్యబాహ్యమైన, సమ్మతిగానున్న
వారి ననుసరింప వలయు నృపతి.

లోకు లభినందింపని రాజ్యపాలనము నిరర్థకము.

సన్నైన సీతనైనను,
నిన్నైనను రాజ్యమైన నేవిడతును లో
కోన్నత కులకీర్తికి నా
పన్నత వాటిల్లెనేనిఁ బలుకు లిఁకేలా ?

వత్సా, యేల వితర్కము? కార్యము నిశ్చయింపఁబడినది.

లక్ష్మ: [ఆతురముతో] ఎటులు?

రామ: ఇటుఁగమ్మ. [మెల్లగా] సీతను ఋష్యాశ్రమున వదలి రావలయు.

లక్ష్మ: [చకితుఁడై] అకటా! యేమివింటిని? కానలకుఁ బంపుటయా? అన్నా, చిత్తచాంచల్యమునఁ బలుకవుగదా?

రామ:
నిండుచూలాలి జానకి నెనరులేక
కాననంబుల కంపింపఁ గడఁగు వీని
కెక్కడిది చిత్తచాంచల్య? మేటికరుణ?
యేన క్రూరుండఁ బల్కితి నిట్టిమాట.

లక్ష్మ: అన్నా, అతి కఠోరశాసనము.

రామ: లోకమును సంతోషపెట్టవలయు.

లక్ష్మ: లోకమున సజ్జనులు లేరా?

రాము: తమ్ముఁడా, సజ్జనుల కత్తిపోటులకన్నను దుర్జనుల నాలుక పోటు లతి క్రూరములు.

లక్ష్మ: అన్నా, అపూర్వ మీ ఘోరశిక్ష.

రాము: ఇక్ష్వాకువంశకీర్తి దిగంతవిశ్రాంతము. ఈయపవాదము తూలరాశింబడిన యగ్నికణమువలె సకలదిక్కులకు వ్యాపించును.

లక్ష్మ: మీకు ధర్మము నుపదేశించునంతటి కోవిదుఁడనా?

రాము: ఉపదేశించియు నిరుపయోగము.

లక్ష్మ: [స్వగతము] అయ్యో! యిఁక నే నేమి సేయుదును? [ప్రకాశముగ] అన్నా, దేవి ఆపన్నసత్వ,

రాము: ఈక్రూరాత్మని చిత్తము పాషాణసదృశము.

లక్ష్మ: వెనుక చింతించియు— [అర్ధోక్తియందె]

రాము: లక్ష్మణా, కర్మఫలానుభవ మెవ్వరికిందప్పదు. కార్యము నిశ్చితము. ఆజ్ఞను పాలింపుము.

లక్ష్మ: [స్వగతము] వినయముచే నిరుత్తరుఁడనైతి [ప్రకాశము] మీయిష్టానుసారము ప్రవర్తించెదను.

రాము: దండకారణ్య నివాసినులగు తాపసబాలికల దర్శింప సీత యభిలషించినది. నేఁడే ప్రయాణము సాగింపవలయు.

లక్ష్మ: [దుఃఖముతో] అన్నా! మఱియొక్క మాట—

రాము: లక్ష్మణా. యిఁక మాటాడిన నాయాన గలదు. అగ్రజుని పనుపు సేయుము. పొమ్ము.

లక్ష్మ: [స్వగతము] ఎఱిఁగి యెఱిఁగి నేనీ ఘోరకృత్య మెట్లొనరింతును? హా! పాపపుదైవమా నీకెంత నెనరులేక పోయె. [నిష్క్రమించును.]

రాము: [దుఃఖముతో] ఔరా! యెంతటి కాఠిన్య మారోపించుకొన్నను శోకభారమున నాచిత్తము క్రుంగుచునే యున్నది. పత్నీవిరక్తుఁడ నగుటయే గాక యనుజ తిరస్కారియుం గావలసె.

జానకి లేక రామునికి నునికిగలదా? కఠిన హృదయమా, నీకార్యము నిర్వర్తించితివి. ఇఁక రాముని సంసార మసారమైనది.

హా! వనవాసప్రియసఖీ జానకీ, నిన్నుఁ గానలకంపి నేనెట్లు బ్రతికి యుందును? పదునాలుగేడులు ఘోరకాంతారముల నివసించియు నీవు నన్నుఁ గూడియుండుటఁగదా యాపదలెల్ల సౌఖ్యములుగను. అరణ్యమే యయోధ్యగను జూపట్టినది. నీవు దైత్యాపహృతవైనప్పుడు గదా నాకు యథార్థమైన యరణ్య నివాసము.

ప్రాణప్రియా, యీక్రూరాత్ముని యుపభోగ్య హారవల్లికయని గ్రహించితివి; విషవ్యాళమై కఱచనున్నాఁడు.

దేహమునుండి హృదయమ్ముఁ దీసివైవ
హృదయ దేహమ్ము లెడమాట బ్రతుకఁ గలవె?
నాదు నర్ధాంగి సీత ననాదరమునఁ
గాన కంప మాయిద్దఱి గతులిఁకేమొ!

జానకియందు లోకమేగాదు అపరాధి; ఈకారుణ్య రహితుఁడు రాముఁడుకూడ!

ప్రియుఁ డటంచును, సౌందర్యమయుఁడటంచు,
ధీరుఁడనుచును, త్రైలోక్య వీరుఁడనుచు
నెవని నమ్మి కరాంబుజ మిచ్చినావొ
ఆ కులాంతకుఁడే కానకంపు నిన్ను.

సీతా, మదేకజీవితా, నేను జీవించియు నీవనాథవైతివా? [దుఃఖించును.]

[యవనిక జాఱును.]

ద్వితీయస్థలము: సీతపడకటిల్లు

[సీత నిద్రించుచుండును; రాముఁడు ప్రవేశించును.]

రాము. అకటా! కఠోరచిత్తమా, నీవేల మెత్తందన మూనితివి? వర్షోపల యుగ్రరాత్రమున నీయంతఃపురమునకుఁ గొనితెచ్చితివి! నీయందను రాగ మిసుమంతయైనఁ గలదా? అట్లయిన లక్ష్మణుని మృదుమధురములగు అనునయాలాపములు నీ వజ్ర సదృశమగు కవచము నేల భేదింపలేక పోవును?

జననంబాది నిశాత శస్త్ర విదళచ్ఛత్రూత్తమాంగ స్రవ
ద్ఘన రక్త ప్రవాహముం జేతులను సంక్షాళించు నీ రామభ
ద్రుని చిత్తంబవు! నీకు నెక్కడిది కారుణ్యంబు? గాకున్నఁ గా
ననముం జేర్పఁగ నియ్యకొందువె సతిన్ సంపూర్ణ గర్భాలసన్?

ఇదే జానకీ శయనాగారము. ఈమందిర మనుదిన పరిచితమయ్యు మనోలౌల్యమువలన నూతన నివేశమువలె నగపడుచున్నది.

అంతఃపురమంతయుఁ బ్రశాంతమై నిద్రానిబద్ధమై నిశ్చలమై యలరారుచున్నది. అచ్చటచ్చట మధుపానమత్తలై నిదురించు పరిచారికల యుచ్ఛ్వాస నిశ్వాసముల యలుకుడుదప్ప నొక్కచీమయైనను నిశాప్రశాంతమునకు భంగము గావింపదు. లోకమంతయు నిద్రానందపరవశమై యున్నను రాముఁడు మాత్రము శోకాకులుఁడై దొంగవలె ప్రసుప్తయగు సీతాలతాంగి శయనాగారముఁ జొచ్చుచున్నాఁడు.

[పరిచారిక కలవరించును.]

ఏమది? పరిచారిక లెవ్వరైన మేల్కనిరా? కాదు. ఎవతెయో కల

వరించినది. నా జీవితేశ్వరి యెక్కడ నిద్రించుచున్నది? ఆ— అదిగో! హంస తూలికా తల్పమున—

కన్నుల సత్తపఃఫలము కాయము నొందెనో! యంబుదంబులం
జెన్నొలికించు మించటకుఁ జేరెనో! కల్పలతా కుడుంగ మం
దున్న అపూలపాన్పుపయిఁ దూఁగు నిలింపలతాంగి యేమొ! కా
దిన్ననబోణి నాదు హృదయేశ్వరి జానకియే నిజంబుగన్!

ఆహా? యేమి యీ యమాయిక వదనబింబమునఁ దాండవించు లావణ్యము!

అలకాక్రాంత లలాటసీమను గవాక్షాయాత చంద్రాంశుమా
లలు కర్పూరపు నిగ్గులం జిలుకఁ దల్పంబందు నిద్రించు నీ
లలనారత్నము సీత, యొదవ శిలా లావణ్య సారంబు ప్రో
జ్జ్వల కాంతాకృతి నొందెనో యనఁగ నాభావంబు రంజించెడిన్!

కరచరణాద్యవయవ శోభితమగు నాహృదయమే యిది. [ముద్దిడఁబోయి వారించుకొని] ఛీ! నే నెవ్వఁడ నీ నారీమణి నంటుటకు?

రాముఁడను గానో? నిద్రించు రామ సీత
గాదో? నేనేల ముద్దిడరాదో?

నన్ను నేనే శూన్యుఁడనుగఁ దలంచుకొనుచున్నాను. ఏమి యిది స్వప్నమా?

కంటి

నకట! దారుణసత్యంబు; నవనిజాత
రామ హృదయంబుగాదింక, రమణి యెవతొ?

మదేకజీవితా, సీతా, గృహేందిరా, హృదయేశ్వరీ, అని మధురము
గ సంబోధించు నా నాలుక నేఁటి కిట్టి కఠినాలాపము లాడవలసెఁగదా!

ఏకన్య పాణి నందీయ శతానందుఁ
డంగంబు పులకింప నందికొంటి;
ఏ వనబోణి నే నేఁగుదెంచఁగఁ దాను
ఘోరాటవులకుఁ న న్గూడివచ్చె;
ఏ సాధ్వి దను జాపహృతయయ్యు నేక వే
ణీవ్రతంబున సతీనియతి గడపె;
ఏ మోహనాంగిని నెడఁబాయ నాకు లో
కము శూన్యమగునట్టి విమలహృదయ;
అంబుజేక్షణ, రాకా శశాంక వదన,
యజన భూజాత, ప్రఖ్యాతవిఖ్యాత సీత
పాపకర్ముని కీర్తి నాఁ బాసిపోవు;
రామభద్రున కింక దుర్భరము బ్రతుకు!

జానకీ, నాహృదయమును దొంగిలించుకొని పోవుదువా? ఈ రాము
నకు హృదయ మొకటికలదా? కలిగిన బంగారుబొమ్మను, ఈ ముద్దుల
మూటను వన్యమృగములకు బలియీయ యెంచునా? కాంతామణీ, ఈలోక
మున నిన్నుఁ గాంచుటకిదియే కడసారియా? ఆశా కుసుమంబున కీ సందర్శన

మే వృంతచ్యుతియా?

లలనామణీ, నిరపరాధిని వగు నిన్నుఁగాన పాలుసేయనున్న ఈ కఠి వాత్మని మీ యిలువేల్పులైనఁ గోపింపరేల? పితృలోకవాసులగు నో రఘు కులేశ్వరులారా! నన్నేల మీరు శపింపరు? నిలింపులారా, మీ సమక్షమునఁ గదా సీత యగ్నిపరిశుద్ధయైనది, అట్టి మిమ్ములనైన, గౌరవింపక కులకాంతను అడవులకు వెడలించు ఈ నిర్దయుని ఏల సహించుచున్నారు. ప్రకృతీ, నీ వేల తామసించితివి?

నిర్భర ప్రళయాబ్ద గర్భసంభూతమై
　　కులిశోత్కరంబు నన్గూల్పదేమొ!
ఝుంఝూనిలోద్వేల సాగర కల్లోల
　　ములు పొంగిపొరలి నన్ముంప వేము!
పెటపెటార్భటితోడఁ బెటిలి యీ కుతలంబు
　　అతలంబునకు నన్ను నడపదేమొ!
క్షణకాలభగ్నమై స్తంభావలంబంబు
　　సౌధంబు గూలి నం జదుపదేమొ!
రాముఁడే లేకయున్న నీరాజవదన
యఖిల సౌఖ్యాభిరామయై యలరకున్నె?
శోక ఘూర్ణితమయ్యును సొక్కఁగాని
యెంత కఠినంబొ పగుల దీ హృదయమకట!

సీత: [నిదురలో] ఆర్యపుత్రా, నన్ను మఱచితివా?

రాము: సీత మేల్కానినదా? [చూచి] కాదు కాదు. కలవరించు

చున్నది. ఆహా! ప్రణయోత్కర్షము. ఈ లతాంగి నిద్రయందైనను నన్నే తలపోయుచున్నది.

హృదయేశ్వరీ, క్రూరసర్పము అమృతమయఫలంబు నంటురీతి ఈ నిర్దయుఁడు కడసారి ముద్దుగొనుచున్నాఁడు.

సీత: [మేల్కానఁబోవును.]

రాము: జానకి మేల్కొనుచున్నది. ఇఁక నిటనుండఁదగదు. వీడి పోవఁ గాళ్ళురాకయున్నవి. ప్రేయసీ, యిదే కడసారి సందర్శనము.

[నిష్క్రమించును.]

సీత: [మేల్కాని] ఆర్యపుత్రుని కంఠస్వనమువలె నెద్దియో అవ్యక్తగంభీరధ్వని నాకు వినఁబడినట్లు తోఁచినది. [కలయంజూచి] ఇచ్చట ఎవ్వరును లేరు. కలగని మేల్కాంటినిగాఁబోలు! కనుఱెప్పలు నిద్రామాంద్యమునఁ గూరికొని పోవుచున్నవి. [నిద్రించును.]

[యవనిక జారును.]

చతుర్థాంకము

విష్కంభము.

[మధురిక అటుతర్వాత ఒక నిమిషమునకు మందారిక ప్రవేశింతురు.]

మధురిక: ఇదిగో! అంతఃపురపరిచారిక వస్తూవున్నది. దీని నడిగిన సమాచారమంతా తెలియును. ఒసే మందారికా, తలవంచుకొని యెక్కడికే బిరబిర పోతున్నావు ?

మందా: ఓహో! మధురికా.

మధు: నీవు రాణిగారితోగూడా మునికన్నెల చూడడానికి పోలేదా?

మందా: ఆ—నాపని పోయినట్లే వుంది.

మధు: ఏమే గొంతుకు వురివేసుకో బొయ్యేదానివలె మాట్లాడు తున్నావు? అంతఃపురంలో నీకేమైనా చీవాట్లు తగిలినవా ?

మందా: కాదే పిచ్చిదానా, మహారాజుగారివొల్లు జబ్బుసంగతి నీకు తెలియలేదా?

మధు: ఏమో చూచాయగా విన్నాను. ఇప్పుడేమైన నెమ్మదిగా వున్నదా ?

మందా: మధురికా, యేలినవారికి జ్వరతమందము గలిగిందని రాజవైద్యులు చెప్పుకొనుచుండగా నేను రహస్యముగ విన్నాను; దేవిగారిని గురించి యేమేమొ కలువరిస్తున్నాడఁట మహారాజు! రాజకులమంతా

హాల్లకల్లోలంగా వుంది.

మధు: అయ్యో పాపము! యీసంగతి రాణిగారికి తెలిసివుంటే మునికన్నెల చూడడానికి పొయ్యేవుండదు.

మందా: దేవిగారు బయలుదేరిన వెనకనే ప్రభువుగారికి జన్ని పట్టినదంట.

మధు: అయ్యో! నీవొక్క మారైనా దరిశింపలేదా యేలినవారిని.

మందా: వైద్యగుల వుత్తరవులేనిదే రాజబంధుగులు గూడ అక్కడికి పోగూడదని భద్రుడు చెప్పినాడు.

[నేపథ్యమున]

ఒసే మందారికా, నీవింకా యిక్కడనే పెత్తనము చేయుచున్నావా ?

మందా: వాడుగో! భద్రుడు అరుస్తున్నాడు. తొందరగా పోవలెను. ఆ ముసిలి కట్టెతో నా కత్తికోటరికమైనది. [పోబోవును]

మధు: మందారికా, యిప్పెక్కడికి పోతున్నావు ?

మందా: నవగ్రహదానా లియ్యడానికి కొట్టిడీనుండి నవధాన్యాలు తెమ్మని పురోహితుడు పంపించితే పోతున్నాను.

మధు: సరేపొమ్మ, సాయింత్రం అక్కడికి వస్తాను.

[ఇరువురు నిష్క్రమింతురు]

ప్రథమస్థలము: అడవి.

[సీత చెట్టుమొదట నిద్రించుచుండును—
లక్ష్మణుఁడు ప్రక్కన నిలుచుండి యుండును]

లక్ష్మ: వాఁడుగో! శుక్రభగవానుఁ డుదయింపనున్నాఁడు. [ఆలకించి] ఆహా! శకుంతసంతానముల కిలకిల నినాదములు సమీరసమ్మిళితములై వీనులకు విందొనరించుచున్నవి!

అనిలోచ్చాలిత పర్ణ మర్మర రవవ్యాప్తిన్ సుఖస్వప్న బం
ధనము ల్వాయఁగ నుల్కి లేచి ఖగసంతానంబు నీడంబులన్
ఘనరావంబొనరింప యామవతి యాజ్ఞం గాలముం దెల్పఁగో
యని చాటించెడు కాలమాపకుని కంఠారావమో నాఁదగున్.

[సీతంగని] ఔరా! మానవుల కెంతటికష్టములైనను అనుభవించుకొనుట లేది సాధారణమగుచుండును. లేకయున్న అంతఃపురనివాసయోగ్యయగు ఈ సుకుమారి యెక్కడ? ఘోరమృగభయంకరమయి కఠినశిలాకంటక భూయిష్ఠమగు ఈ కాంతారతలమున నిదురించుట యెక్కడ?

లవలీపల్లవ కోమలంబులగు నీలావణ్యవత్యంగముల్
దవులం గావలసెం గఠోరధరణీ తల్పంబునన్; రామ బా
హువు దిండై సుఖనిద్రనొందఁదగు నీ యోషిల్లలామంబు దా
రువుఖండం బుపధానముం జలిపి గూర్కుం బూవుముండ్లంబలెన్

మానవజీవితము సుఖదుఃఖ పరిపూరితమయ్యును గర్మఫలాను భవ

మందు వ్యత్యాసము గనుపట్టుచుండును. అకటా! మా కుటుంబమంతయు నెడతెగని శోకదవానలంబున మ్రగ్గుటకే జన్మించెనా? ఒక్కరి నొసటనైన మంచి వ్రాఁతవ్రాయఁడా ఆ విధాత?

వనవాసంబుగతించె, దానవుల దుర్వ్యాపారముల్మాసె, భా
మిని చేకూఱె, ధరాధిరాజ్యవిభవామేయానుభావంబునన్
మనమింపార సుఖంబులొందు చెటులో మాకాలముం బుచ్చునో
నని యోచింప నిటాయెఁ; జిత్రము లహో!యా దైవనిర్దేశముల్!

తల్లీ విదేహరాజనందనీ, ఘోరదవానల జ్వాలలు తరుకోటరమున కంటుకొనుచుండ నేమియుందెలియక సుఖనిద్రా పరవశయైయున్న శారికా కుమారివలె శయనించియున్నావా?

రామచంద్రా, యిట్టి ముగ్ధహృదయను ఇట్టి లోకపావనచరిత్రను నీవెట్లు విడనాడ సాహసించితివి! ఎంత వేడికొన్నను వినవైతివే! అకటా! యీ పాపకార్యమొనరింప అగ్రజుఁడు నన్నే నియోగింపవలయునా?

పదునాలుగేండ్లు వనముల
నొదవిన కష్టముల కోర్చి యున్నాఁడు దయా
స్పదచిత్తుఁడు గాఁడని యా
సదయుఁడు నన్నీ యఘంబు సలుపఁబనిచెనో!

కాకున్న నిట్టి నింద్యోద్యోగమున నన్నేల నియమించును? కులిశాఘాత ప్రాయమగు రామసందేశము నీ కుసుమకోమల కర్ణేంద్రియమునకు
ఎట్లు తెలిపింప? యూరకుందును? ఒకవంక నలంఘ్యమగు నగ్రజునియాజ్ఞ—
వే ఱొకవంక మృదులమగు మానుషస్వభావము — నా యంతరాత్మను

పీడించుచున్నవి.

సీత: [మేల్కాంచి] మందారికా,—[కలయఁజూచి] ఓహో! అంతఃపుర మనుకొంటిని. వత్సా, యరుణోదయ మయినట్లున్నది.

వనవృక్షచ్ఛదసంచయాంతరములన్ వ్యాపించిసూర్యాంశు కాం
చనకాంతుల్ పరికీర్ణ నిష్కముల యోజన్ నేల బింబింప భా
నుని భీతిం దిమిరంబు తారకల సందోహంబుతో వచ్చి కా
ననపాదంబుల నాశ్రయించె నన నానందంబు సంధించెడిన్.

లక్ష్మణా

లక్ష్మ: [ఆలోచించుచుఁ బలుకఁడు.]

సీత: [స్వగతము] నిన్నసాయంకాలమున నేఁ బిలిచినను దెలిసికొనక లక్ష్మణుఁ డేదియో యోచించుచుండెను. ఇప్పుడు సైతము అన్యాయత్తచిత్తుఁడై చింతించుచున్నాఁడు. [ప్రకాశముగ] అన్నా, లక్ష్మణా.

లక్ష్మ: అమ్మా, యేమంటివి?

సీత: నిన్నటినుండియు నీవేలొకో దీర్ఘచింతానిమగ్నుఁడవై యున్నాఁడవు. నీ మోముమీఁద దైన్య మొలుకుచున్నది.

లక్ష్మ: విశేష మేమియు లేదు. ఈ వనమనోహరత్వమును దలపోయుచుంటిని.

సీత: [స్వగతము] అదియేమొ నామనమున నూహింపరానిసంశయము వొడముచున్నది. [ప్రకాశముగ] లక్ష్మణా, నిన్నటిదినమున మనము గంగానదిని తరియించితిమి గదా, ఇఁక ఋష్యాశ్రమముల కెంతదూరము మేఁగవలయును? వత్సా చూచితివా ఆ లేటికొదమను,

లక్ష్మ: ఎక్కడ?

సీత: [నిరూపించి]

ఆశ్రమకురంగ మల్లదే! యఱుతఁబూల
మాల వ్రేలాడ సెలయేళ్ళ కూలములను
గప్పురము లట్లు నురుగులు గాఱుచుండ
మిసిమి పచ్చిక జొంపంబు మేయుఁ గనుము!

లక్ష్మ: అమ్మా, ఈవన సౌభాగ్యము దిలకించుకొలఁది యీప్రాంతములు తాపస నిలయములుగఁ దోఁచుచున్నవి.

వనహోమోద్గత ధూమధూమ్రములు పర్ణంబుల్ ధరాజంబులన్
బువుగుత్తుల్ మునిబాలికాపచితముల్ పూజార్థ, మిక్కాననో
సవనాజ్యామల సౌరభంబులొలుకున్ సర్వంబు; వేయేల? మా
ని వరుల్ కాఁపురముండు చిహ్నములు రాణించున్ విశేషంబుగన్

సీత: వత్సా, మనము పోవలసిన తపోవన మెంతదూరముననున్నది?

లక్ష్మ: ఈ భాగీరథీ పరిసరారణ్యముననే కొంత దవ్వేఁగవలయు.

సీత: అటులైన నేనిఁక నడవఁజాలను. ప్రొద్దుటినుండియు నేదో మనోవికారము ననుఁ గలఁచుచున్నది. రాత్రియంతయు నిదుర పట్టియుఁ బట్టకయుండుటవలన అవయవముల బడలిక యింకను దీఱను. అదియుంగాక సూర్యతాపము హెచ్చుచున్నది. కొంతసేపీ శీతల తరుచ్ఛాయల సేదదీర్చికొని మెల్లఁగఁ బోవుదము.

లక్ష్మ: అటులనే విశ్రమింపుము. దప్పిగొనియున్న—[అర్థోక్తియందె.]

సీత: లక్ష్మణా, నాకేమియుం బనిలేదు. ఈమనోహరారణ్యవాటి కఁ గాంచినంతనే నామన మానందపులకితమైనది. ఆహా! నాజీవితకాలమంతయు నిచ్చోటనే గడపఁగలిగిన—

లక్ష్మ: [స్వగతము] హాతవిధీ, ముందుగనే పలికించుచున్నావా?

సీత:

సరసఫలావనమ్ర తరుజాలము తియ్యని పండ్లనిచ్చు; ని
ర్ఝరములు నిర్మలాంబులిడుఁ; జల్లనినీడలొసంగుఁ బూఁబొదల్;
మరుతము పుష్పసౌరభ సమంచితమై గమనప్రయాస ని
ష్ఠురతఁదొలంచు; మృత్యువిటఁ జొప్పడినం బ్రియమౌను లక్ష్మణా!

ఆహా! ముందటిజన్మమున నేనేమి నోములునోచి ఆర్యపుత్రునివంటి యనుకూలపతిని గాంచితినో గదా. ఆ సరసుఁడు నామనోభీష్టమును అనుసరింపకున్న నాకీ ప్రకృతి రామణీయకము దర్శించుభాగ్య మబ్బియుండునా?

లక్ష్మ: [స్వగతము] అయ్యో! అమాయికా! [కన్నీరునించును]

సీత: [చకితయై] అన్నా లక్ష్మణా, నీవేల కన్నీరునించుచున్నావు? నిన్నటినుండియు నీ చర్యలన్నియు శంకావహములుగ నున్నవి. ఊరక నిట్టూర్చుచుందువు. ఆలోచించుచుందువు. దీనవదనుఁడవై నేలచూచుచు నీలోన నీవే మాటాడికొందువు. హృదయము నొగిలించు శోకభారము నీమోమునఁ దొలకాడుచున్నట్లున్నది. వత్సా, అందఱకు సేమమే గదా. నీవేల పలుకవు?

ప్రేమమయుండు నావిభుఁడు, వీరకులాభరణుండు, సద్గుణ
స్తోముఁడు, శౌర్యధాముఁడు యశోధవళీకృత దిక్తలుండు, స

త్త్యాములవర్తనుండు, కరుణామృత సాగరుఁ డా యయోధ్యలో
నేమియు నాపదంబొరయకే సుఖమొందుచు నున్నవాఁడొకో?

లక్ష్మ: అన్నగారు సుఖముగనే యున్నారు.

సీత: లక్ష్మణా. నామనమునఁ దెలుపనలవిగాని యనుమాన ముప్పతిల్లుచున్నది. నేను వనములకు వెడలునప్పుడు రాజకార్యలంపటుఁడయి హృదయేశ్వరుఁడు నన్ను వీడ్కొలుపఁడాయె. అన్నా, శత్రుఘ్నుని సమరయాత్రలో నేమియు అమంగళము వినవుగదా! సవనదర్శనార్థమేఁగిన భరతకుమారుఁడును గురుజనులు కుశలముగ నున్నారా?

లక్ష్మ: పూజ్యురాలా, అందఱకుం గుశలమే.

సీత: లక్ష్మణా, మీయన్న జనరంజకముగఁ బాలించుటలేదా?

లక్ష్మ: అమ్మా, లోకుల సంతోషపెట్టఁ దన యర్ధాంగినైనఁగాన పాలుసేయ సాహసించు కీర్తికాముఁడు ధరాతలమెల్ల శాసింప నిఁక జనరంజకత వేఱ చెప్పవలయునా?

సీత: అట్లైన నీహృదయాందోళనమున కేమి కారణము?

పరమసౌఖ్యములను భార్యను విడనాడి
యన్న ననుసరించి యటవికేఁగు
నప్పుడైన నిట్టి యార్తితోఁ గుందవు
చింతఁబొంద నేల చెప్పుమన్న.

లక్ష్మ: [కన్నీటితో] తల్లీ లోకపావనీ,

ఏమని దెల్పుదుఁ రఘుకులేశ్వరునాజ్ఞ— [నిట్టూర్చును.]

సీత: [చకితయై] ఆజ్ఞయేమి — ఏల విలంబించెదవు?

లక్ష్మ:— ... శతారపాతమై

నీ మనముం గలంచదె! అనింద్యచరిత్రఁ బతివ్రతామణిన్
గోమలచిత్త నిన్నుఁగొని ఘోరమృగాకుల భీకరాటవిన్
రాముఁడె వీడఁబాపెననఁ, బ్రాణము లింకెటు చిక్కఁబట్టెదో.

సీత: [దిగాలుపడి] వత్సా, వత్సా లక్ష్మణా, ఏమంటివి? ఆర్య పుత్రుఁడే నన్నుఁ గానలో విడువఁబంచెననియా?... నిజముగనా? — ఆ— ఆ [మూర్ఛిల్లును.]

లక్ష్మ: అకటా! యెంతకష్ట మెంత కష్టము! రామమయ జీవిత మూర్ఛిల్లినది.— తల్లీ, యూఁడిల్లుము.

సీత: [సగములేచి] లక్ష్మణా, ఆర్యపుత్రునియెడ నేనేమి యప రాధ మొనరించితిని.

తడిగుడ్డఁ జుట్టి చల్లఁగ
మెడఁగోసెడు కఠినహృదయు మేలనిపించెన్
నడుకాన నన్ను గెంటఁగ
దొడరిన కౌసల్యసుతుఁడు; దుర్భాగ మకటా!

అయ్యో! నేనెంత పాపాత్మురాలను? నామనోనాయకుని నిష్కారణముగ నిందించుచున్నాను. అన్నా, నీవేమిపరాకున వింటివో గాని, క్షణకాలమైన నన్ను విడనాడి జీవింప నేరని ప్రణయసముద్రుఁడు నామనోహరుఁడు ఇట్టి ఘోరకార్యమున కియ్యకొనునా?

ననుగాంచి నిమిషమైనను నొక్కయుగమని
పలుమాఱుఁదిలకించు ప్రణయమహిమ;
ప్రణయకోపమున నవ్వలి మొగం బయ్యును
మునుదానె మాటాడు మోహగరిమ;
నామనంబెఱిఁగి మన్ననగ లాలించుటే
జన్మఫలంబను జాణతనము;
అగ్నిసాక్షిగఁ బెండ్లియాడిన ననుఁబ్రేమఁ
దలఁపున కెలయించు ధర్మసక్తి;

నవ్వులాటలకైనను నన్నుఁజేరి
మేలమాడంగనోపని మెత్తఁదనము
నేఁడు వమ్మయిపో విడనాడినాఁడె?
మన్మనోహరుఁ, డిదియేటి మాట వత్స!

లక్ష్మణా, ఆర్యపుత్రుఁ డేమనెనో ఆపలుకుల నే వినిపింపుము.

లక్ష్మ: [స్వగతము] అయ్యో! యీసాధ్వీమణి యెంతముద్దరాలు! [ప్రకాశముగ] తల్లీ, చెప్పెదను.

జానకి మన్మనఃపదము సాధుజన స్తవనీయశీల ము
గ్ధానన...

సీత: [స్వగతము] హృదయమా, యింతకే సంతసింపకుము.

లక్ష్మ:...ఏలొకో కుజనులాడిరి నిందలు దుర్మదాంధులై

సీత: ఏమీ? లోకాపవాద దూషితనా?

లక్ష్మ:

మానిని నింక నేలికొన మానితమా రఘువంశకీర్తికిన్
న్యూనతగల్గుఁగాన నెగులొందక కానన వీడుమీ సతిన్.

సీత: ఆహా! మేఘాడంబరములేని వజ్రపాతము! లక్ష్మణా, అయోధ్యలో సజ్జనులు లేరా ఇది తగదని బోధించుటకు? నీతికోవిదులగు తాపసోత్తములు కఱవయిరా? నాహృదయేశ్వరుని మనము సత్యాసత్య వివేకశూన్యమైనదా? మున్నటిప్రేమ యంతయుఁ గపటనాటకమా?

హృదయకూలంకషంబుగఁ బొదలి పొంగి
పొరలు ప్రణయ ప్రవాహంపుఁ దరఁగలైన
సరసవీక్షల సేకంబు సలుపు ప్రియుఁడె
యటవులకు నన్నుఁబంపుట యద్భుతంబు!

లక్ష్మ: కరుణాసముద్రుఁడు కఠినచిత్తుఁడగుట దైవ దుర్విపాకము గాక మఱి యేమనవచ్చును?

సీత: కుమారా, ఆర్యపుత్రుఁడు తనకన్నులనే విశ్వసింపఁడా? తన మనమునే సంశయించునా? నా పాతివ్రత్యము ననుమానించెనా?

జనముల్ నోటికివచ్చినట్లు పలుకన్ శంకింప రెవ్వారినిన్
మనుజాధీశ్వరుఁ డట్టి వాక్యముల సమ్మానించి, చూలాలి కాం
తను నిశ్చింతగఁ గానకంపఁ దగునే? ధర్మంబె? యీ న్యాయముల్
మనకై పుట్టెనె లక్ష్మణా? యిదియు సన్మార్గంబె మీబోంట్లకున్?

లక్ష్మ: తల్లీ, లోకపావనీ, నీపాతివ్రత్యమును రామచంద్రుఁడు

శంకింపలేదు. ఇఁక శంకింపఁబోఁడు. అవివేకు లాడుకొను నపవాదములవలన రఘువంశకీర్తి కళంకితమౌనోయని వెఱచి తనహృదయమును బెతికి వైచిన టుల నిన్ను విడనాడెను.

సీత: [దుఃఖముతో] లక్ష్మణా, యిఁక నెప్పుడైన ప్రాణవల్లభుని దర్శించు నవసర మబ్బునా?

లక్ష్మ: [స్వగతము] ఈతల్లిని ఇట్టి యవస్థలో వీడి నేనెట్లు పోఁగలను?

సీత: జీవితేశ్వరా, ఇఁకనైన దిగంత కీర్తి విస్తారుఁడవుగమ్మ. నాకిఁక మరణమే శరణ్యము.

లక్ష్మ: [స్వగతము] అయ్యో! ఆత్మహత్య గావించుకొనునా? [ప్రకాశముగ] అమ్మా, నిలుకడమీఁదనైనఁ బ్రజలకు నిజము దెలియకుండునా?

సీత: మందభాగ్యనగు నాకుఁగూడ నిట్టి యాశావలంబనమా!

లక్ష్మ: [స్వగతము] కాఠిన్యమా, నామనము నావేశింపుము. [ప్రకాశముగ]

దురితుఁడ బంధువిరక్తుఁడఁ
గరుణారహితుండఁ గ్రూరకర్ముఁడను ము
ష్కరత వనంబున నిన్విడి
పఱతెంచఁగ నున్న కటికవాఁడను దల్లీ.

సీత: వత్సా, ఆత్మనిందవలదు. సార్వభౌముని శాసనము ఎల్లఱకు నలంఘనీయము. నీకు మార్గము మంగళకరమగుఁగాక!

లక్ష్మ: [స్వగతము]

ప్రణయపాశంబు లెట్టివో బలిమిబట్టి
లాగినను త్రెవ్విపోవక సాగుచుండు,
లలిత బిసనాళ ఖండంబులను దెమల్ప
నడుమ సాఁగెడు సూత్రకాండములు వోలె!

[ప్రకాశముగ] అమ్మా, యేమి సెలవిచ్చి పంపెదవు?

సీత: లక్ష్మణా, నేఁ జెప్పిపంపున దేమున్నది?

అపవాదదూషిత యైన కాంతను బాసి
పతికీర్తిఁ బొందుట భావ్య మనుము;
కౌసల్యయాదిగాఁ గలుగు నత్తల కేను
గడుభక్తితో మ్రొక్కు లిడితి ననుముఁ;
తోడికోడండ్ర నాతోడి నేస్తము నెంచి
కడసారి సేమంబు నడిగె ననుము;
చెలికత్తియలు నన్నుఁ బలుమాఱుఁ దలపోసి
యుమ్మలింప నిరుపయోగ మనుము;
ప్రజల నిఁకమీఁద మోదంబుఁ బడయుఁడనుము;
పతిని నెడఁబాసి యిఁక సీత బ్రదుక దనుముఁ;
జన్మజన్మంబులకు రామ సార్వభౌముఁ
బరమపావను భర్తగాఁ బడతు ననుము.

లక్ష్మ: అమ్మా, యీ ప్రాణఘాతుకుని మన్నింపుము. [నమస్కరించును.]

సీత: అన్నా, విచారింపక పయనము గమ్ము.

లక్ష్మ: తల్లీ, వనదేవతలు నీకుఁ బ్రసన్న లగుదురుగాక!

వనదేవతలారా, రా
మునిపత్నిని నొంటి వీడి పోయెడివాఁడన్
వనమృగ బాధలఁ బొందక
జనకజ రక్షింపుఁడమ్మ సౌఖ్యములిడుచున్.

[కొన్ని యడుగు లిడి- స్వగతము] పాదము లసమ్మతముగ ముందడుగిడు చున్నను మనసేమొ వెనుకకే మరలుచున్నది. [నిష్క్రమించును]

సీత: [లక్ష్మణుఁడేఁగు దెసఁ జూచుచు] నాజీవిత శేషమువలె లక్ష్మణుఁ డేఁగుచున్నాఁడు! నాకు లోకమంతయు నంధకారమలీమసమై తోఁచుచున్నది. అయ్యో! ఈనిర్జరారణ్యమున దిక్కులేనిదాననైతిని. ఇంతటి తిరస్కారము సంభవించునని కలలోనైనఁ దలఁచి యెఱుఁగను. హృదయేశ్వరా, కుసుమకోమలమైన నీచిత్తమేల వజ్రసదృశమైనది? కాని కాలమునకుఁ దారహారము విషవ్యాళమై కఱచెనన్న సామెత నేఁడు యాథార్థమైనది.

నవకోటి మన్మథాకారా, దీనమందారా, హృదయేశ్వరా, యెన్ని కష్టము లనుభవించుచున్నను నీ త్రిజగన్మోహన స్వరూపము క్షణమైన మఱచి యుండఁగల నా?

మఱవంగవచ్చునే శరదిందు బింబంబుఁ
బరిహసించు చిన్నారి మోముతీరు?
మఱవంగవచ్చునే మాణిక్య కుండలో
జ్జ్వలకోమల కపోల విలసనంబు?

మఱవంగవచ్చునే యరవింద దళ సుంద
రంబై చెలంగు నేత్రద్వయంబు?
మఱవంగవచ్చునే మకరంద రస బిందు
తుందిలంబైన ముద్దుల యెలుంగు?
నయనపర్వముసేయు నానాథుమూర్తి
నింక నీజన్మమునఁగాంచ నెట్టులబ్బు?
ప్రణయవృంతంబు విడిపోవ వాడకున్నె
జీవ నవపుష్ప మూర్పుల తావి దొలఁగి.

(ప్రాణవల్లభా, త్వదేకాలంబను నన్నిటులఁ గానపాలొనరింప నీకు న్యాయమా? మనోహరా, ప్రాణవల్లభా, యింక నాగతియేమి? [చెట్టు కొమ్మపట్టుకొని దుఃఖించును]

[యవనికజాఱును.]

ద్వితీయ స్థలము: అడవి.

[వాల్మీకి, మాండవ్యుఁడు మాటలాడుచుండఁగా
తెఱ యెత్తఁబడును.]

వాల్మీ: మాండవ్యా, నీవు చూచితినని చెప్పిన సాధ్వి యెచ్చట యున్నది?

మాండ: ఇచ్చోటనే మూర్ఛిల్లి పడి యుండినది. ఇపు డెచ్చటికో పోయియుండును.

వాల్మీ: ఈవనమం దెయ్యెడనో వృక్షచ్ఛాయల విశ్రమించియుండునేమొ చూతము రమ్ము.

[నిష్క్రమింతురు.]

[తెఱయెత్తఁగా సీత తరుమూలమునఁ గూర్చుండియుండును.]

సీత: చిత్తమా, యూరక యేల యంతరాళసౌధములు నిర్మించెదవు? మున్ను లంకలో నశోకవనమున నివసించుచున్నప్పుడు నామనోనాయకుఁడు దానవ పతిని వధియించి నన్ను మరలఁ గొంపోవునను పేరాసతో మేన నసువుల్ భరించితిగాని, యట్టి యాశావలంబము నేఁడు లేదుగదా.

[వాల్మీకి, మాండవ్యుఁడు ప్రవేశింతురు]

వాల్మీ: [స్వగతము] ఈకుమారియా! [ముక్కుపై వ్రేలిడికొని] అహా! అంతయుఁ దెలిసె. [ప్రకాశముగ] రామపత్ని.

సీత: [ఉలిక్కిపడి లేచి—స్వగతము] ఎవరో మునీశ్వరులు! నన్నెట్లు గుర్తించిరి? [ప్రకాశముగ] మహాత్ములారా, వందనములు.

వాల్మీ: దీర్ఘ సుమంగలీ భవ!

సీత: [స్వగతము] శీఘ్రమే మరణించునట్లు దీవింపరుగదా.

వాల్మీ: బిడ్డా, యోగదృష్టిప్రభావమువలన నంతయుం దెలిసికొంటిని. కర్మవశంబున సత్యవంతులకైన నిక్కట్టులు గలుగుచుండును. సంసార సాగరమున మునిఁగినవారలు సుఖదుఃఖ తరంగ తాడితులు గాకుందురా?

సీత: మునీంద్రా, నిరపరాధులును శిక్షార్హు లగుదురా?

వాల్మీ: అమ్మా, నీ వమాయికవు. నిరపాయకరజీవనము సల్పుచు నరణ్యమున నివ్వరుల నేరికొని తిని బ్రతుకు శకుంత సంతానములు సైతము వ్యాధుని యంపకోలకు గురియగుట లేదా?

సీత: మహాత్మా, లోకు లవివేకులైనను ఆర్యపుత్రుఁడుగూడ వారి నే యనుసరింపఁ వలయునా?

వాల్మీ: అమ్మా, ఇది రాజకీయరహస్యము. రాజునకుఁ బ్రజ ప్రాణాధారము. ప్రజలు విద్వేషించి తిరుగఁబడిన సామ్రాజ్యమైనను బునాదిలోనికిఁ గూలిపోవును. కుమారీ, కాలదుర్విపాకమునకు లోఁబడనివారెవ్వరు?

అనిలాలోల జలప్రవాహ చలితంబై శుష్కపర్ణావళుల్
వెనుకన్ముందుకుఁ బోవురీతి జనుల్ విశ్వంబునం గాలవా
హిని నోలాడుచు నస్వతంత్రులయి యేయేవేళ నేదేది గాం
చనగున్ దానిఁ బరిగ్రహించి తుదకుం జాలింత్రు సంసారముల్

సాధ్వీ, ఆరణ్యకుల్యాపరిసరమున మా యాశ్రమ మున్నది. అచ్చట మునిబాలికలు నీకు సహచారిణులై యుపచరింతురు,—మాండవ్యా.

మాండ: స్వామీ.

వాల్మీ: నీవు శీఘ్రముగఁబోయి పరిపక్వ ఫలములు గోసికొని యాశ్రమమునకు రమ్ము.

మాండ: చిత్తము. [నిష్క్రమించును.]

వాల్మీ: బిడ్డా, శంకింపవలదు. మీతండ్రి జనకరాజేంద్రుఁడు మా కత్యంత ప్రియమిత్రుఁడుగ నుండెను. మాయాశ్రమము నీ పుట్టినిల్లుగఁ దలఁచుకొనుము. శీఘ్రకాలమున నీవు విరమాత వయ్యెదవు.

సీత: [కన్నీటితో] మునీంద్రా, నాపరిభవమును మాజనకుఁడెఱుంగక మున్నె తపోవనవాసి యయ్యెను. లేకుండిన నాకొఱ కెట్లు పరితపించి యుండునో!

వాల్మీ: కుమారీ, విచారింపకుము. నీ వాపన్నసత్త్వవు. మార్గాయాసమున బడలియున్నదానవు. అరణ్యసహజమగు నాతిథ్యముంగొని విశ్రమింతువు రమ్మా.

సీత: [స్వగతము] తాపసులు నిర్హేతుక వాత్సల్యవంతులు! [ప్రకాశముగ] మహాత్మా, నే నేమహర్షిచేఁ గరుణింపఁ బడితిని?

వాల్మీ: వత్సా, నన్ను వాల్మీకి యందురు.

సీత: [స్వగతము] ఈపవిత్రనామమును మున్నే వినియుంటిని. [ప్రకాశముగ] తాపసోత్తమా, యీ దిక్కులేనిదానిని రక్షించితిరి.

వాల్మీ: బిడ్డా, అందఱను రక్షించుటకు సకలాంతర్యామి భగవంతుఁ డొకఁడు గలఁడు. పోదము రమ్మా, కాలవిలంబనంబునఁ దపోంతరాయము గలుగును.

సీత. మీ చరణముల ననుసరించుచున్నాను.

[స్వగతము] దరియు దాపులేక తరఁగ లుల్లోలించు
జలధి మధ్య నావ సడలి క్రుంక
మునుఁగనున్న నావికునికిఁ జెక్కవిధానఁ
బ్రాప్తమయ్యెఁ దాపసాశ్రయంబు.

[నిష్క్రమించును.]

పంచమాంకము.

ప్రథమ స్థలము : అయోధ్య.

[శూర్పణఖ ప్రవేశించును.]

శూర్ప: మాన్యులోనరింపనేరని మహితకార్య
మొక్క యల్పుఁడె యొడఁగూర్చు నొక్కవేళ;
రావణేంద్రజిదాది వీరప్రముఖులు
సలుపఁజాలని పని నాకు శక్యమయ్యె!

నే నాటిన యుక్తికల్పలతాబీజ మంకురించి, తీవలల్లుకొని, పూలు పూచి ఫలించినది. నా కల్పనాచాతుర్యము పరమావధి నొందినది. పల్లెత వేసము దాల్చి భద్రుఁడు వినునట్లు సీతను అపనిందలాడితిని. ఆముదుసలిగొడ్డు గంభీరముగఁ దలయూఁచుచుం బోయెను. ఒక్కగడియలో సీతాపవాదము వాడవాడల మాఱుమ్రోగునటుల అమ్మలక్కలా నీటికివచ్చు బావులకడను పణ్యవీథులందును రచ్చకొట్టములదగ్గరను వివాదములు పెంచుచుంటిని. రామరాజ్యముపై ప్రజలకును మునీశ్వరులకును ద్వేషబుద్ధి జనియించునటుల లవణాసురుని ప్రేరించి తపోవనములు ధ్వంసముగావించితిని.

అహో! నేఁటికి నా కపటనాటకము ముగిసినది. రామచంద్రుఁడు సీత నడవులకు వెడలించి తాను నేఁడు విరహావిహ్వలుఁడై శోకసాగరమునఁ బారము గానక ప్రాణసంశయావస్థలో నున్నాఁడు. గర్భమంథరయగు సీతను ఒక్కపెట్టునఁ జంపిన నేమి లాభముగలదు? అడవులలోఁ బడరాని యిడుముల గుడిపించి క్రమక్రమముగ శోకానలంబున మాడ్చినఁగదా నా

కసిదీఱును. [వికటహాస మొనరించి] ఆహా! నేఁడుగదా నేను దశకంఠునకు సహోదరునిగ వన్నెకెక్కుట! నేఁడుగదా పితృలోకవాసులగు మా బంధుమిత్రులు పరితృప్తులగుట! [ఆకాశము వంకఁగాంచి] దశకంఠా, మేఘనాధా, కుంభకర్ణాది రాక్షస వీరనాయకులాలా,

సీతారామ విషాదబాష్ప సలిలాసేకంబు గావించి మీ
చేతంబుల్ రగిలించు శోకదహనార్చి న్నేఁడు చల్లార్చితిం;
బ్రీతిఁ రాక్షస విక్రమోచిత సుఖశ్రేయంబుల బొంది చిం
తా తాపం బెడలించి శాంతిగొనుఁడీ నాకంబున న్నిచ్చలుఁ.

నేఁటికి నా గుండె బరువు తీఱినది. ఇదిగో! నాదీక్షాకంకణము విచ్చుచున్నాను. సంతోషరసపూరము నాహృదయతటముల నొరసికొని ప్రవహించుచున్నది. వేగమ పోయి యీయుదంతము యుద్ధనిహతభ్రాతృకలగు దైత్యాంగనల కెఱింగించి వారి చిత్తము లించుక చల్లఁబఱిచెదను.

[నిష్క్రమించును.]

ద్వితీయ స్థలము : అంతర్భవనము.

[రామ భరత వసిష్ఠులు కూర్చుండి యుందురు]

రాము: తమ్ముఁడా, నేనెంత కరుణాశూన్యుఁడను?

చేతులారంగఁ బెంచి చేఁజేతఁ బూవ
నున్న మల్లికఁ బెకలించు తెన్నుగాఁగఁ
ప్రాణములకన్న మిన్నయై పరగు ప్రియను
ఘోరకాంతారములఁద్రోసి కూళనైతి.

భర: అన్నా, నీవే యిటులఁ జింతించుచున్న మాబోంట్లగతి యేమి?

వసి: వత్సా రామచంద్రా, సర్వమెఱింగిన నీవే యిటుల నడు కానఁ బడుచున్నావు.

రాము: అంతపుణ్యము నా కలవడునా?

వసి: గంధ సింధురము పంకనిమగ్నమైన దాని నుద్ధరించు వార లెవ్వరు? నీశోకమును దిగమ్రింగి తమ్ములను బుజ్జగించ వలసినవాఁడవు గదా.

రాము: మునీంద్రా, జానకిని దిగమ్రింగినవాఁడను, శోకమును దిగ మ్రింగలేనా? కొండలు మ్రింగువానికి గండశిల లొక లెక్కయా?

భర: అన్నా, నీపరితాపమునకు మేరయే దొరకకున్నది. మాచాల్ప ధైర్యముగూడ ప్రవాహ సంఘర్షణమున సైకతబంధమువలె కరఁగిపోవుచున్నది

వసి: భరతా, యుమ్మలింపకుము, మీయన్న నూరడింపుము. చింతింప నేమి లాభముగలదు?

శోకదహనార్చు లుజ్జ్వలించుటయె తప్ప,
బాష్ప బిందువులెడలేక పడుట దప్ప,
గాంచువారల మనములఁ గలత దప్ప
నేల శోకింప? నుపయోగ మేమిగలదు?

రాము: తమ్ముఁడా, లక్ష్మణుఁడు వచ్చెనో లేదో కనుగొనిరమ్ము.

భర: వచ్చిన మీదర్శనము చేయకుండునా?

రాము: ఏమో, అయినను చూచిరమ్ము.

భర: [స్వగతము] ధీరహృదయుఁడగు రామచంద్రుఁడే ప్రియా విరహ చంచలుఁడయి యిట్లు కుందుచున్నాఁడఁట! ఇఁక సామాన్య మానవుల విషయము చెప్పవలయునా?

[నిష్క్రమించును.]

రాము: తాపసోత్తమా, ఉంఛవృత్తితో జీవించు నీచుని నిర్బాధ్యత కుఁగూడ నే నసూయ పడవలసిన వాఁడనైతిని.

వసి: వత్సా, యట్లన వలదు. ఉన్నతవృక్షములకుగాక ఝంఝూ మారుత సంఘర్షణ మల్ప కుటజంబులకుఁ గల్గునా? బాధ్యత వహించు పురుష పుంగవుల కెల్లరకు స్తుతినిందలు సుఖదుఃఖములు అనివార్యములు.

రాము: [విననియట్లు] అయ్యో! ఆమోహన స్వరూపమును నేనెట్లు మఱవఁగలను?

కలగని నిద్ర లేవ నటఁ గాంచినదెల్ల మనంబులోపలన్
గలకగ ఖండఖండములుగా వలఁగాంచిన దృశ్యమట్టులం
దొలఁగి తొలంగకె వెనుకఁ దోఁచెడిరీతి ధరాకుమారి యు
జ్జ్వలమగు సుస్వరూప మెదఁ బాయక పాసియుఁ బాయకుండెడున్

[భరతుఁడు ప్రవేశించును.]

భర: అన్నా, లక్ష్మణుఁ డింకను రాలేదు.

రాము: ఏల రాఁడు? ఇంతలో వచ్చియుండును. మరలఁబోయి కను గొనిరమ్ము.

భర: [స్వగతము] అకటా! నిశ్చలమైన రాముని చిత్తమెంత చాపల్యము వహించినది?

[నిష్క్రమించును.]

రాము: వసిష్ఠమునీంద్రా, మీరు దివ్యదృష్టివంతులుగదా మా జానకి యేమైనదో చెప్పఁగలరా?

ఎంత వెఱ్ఱివాఁడను? ఏమైయుండును?

అకట! కంటక భూయిష్ఠమైన కాన,
గర్భభరమునఁ బార్శ్వభాగములు క్రుంగ
నడుగు నామడగా నల్ల నడుగులిడుచు
నడవిమృగముల కాహార మయ్యెయుండు!

మాతల్లి కౌసల్య 'వత్సా, నా ముద్దులకోడ లెక్కడ'యని యడిగిన వనమృగములకు బలిపెట్టితి నమ్మాయని చెప్పుదునా? [దుఃఖించును]

వసి: రామచంద్రా, మిన్నులువడ్డచోటు పోవుకొలఁది నిరంతము గఁ బోవుచుండును. దుఃఖసాగర మీఁదుకొలఁది నిరవధికమై దోఁచుచుండును. ఏప్రజల రంజమునకై ప్రియాంగనను విడనాడితివో, రాజ్యకార్యముల నారయుమి, ఆలోకులకే కష్టము వాటిల్లును. వత్సా, నీవు విధిజ్ఞుఁడవు. శోకింపక ధీరుఁడవుగమ్ము.

రాము: తాపసోత్తమా, దుఃఖ మెంత యడఁచికొన్నను నీటిబుగ్గవలె నిరంతరముగఁ జెల్లుబుకుచున్నది.

విరహా సంతాపమెట్టిదో నిరయగహ్వ
రంబు వెడలెడి ధూమపరంపర లటు
లేచి హృదయాంతరాళ మలీమసముగఁ
గడలుకొను బుద్ధిసూర్యుండు కప్పువడఁగ.

[భరతుఁడు లక్ష్మణుఁడు ప్రవేశింతురు.]

రాము: [ఆతురతతో] అన్నా లక్ష్మణా, నాజానకి నేమిచేసితివి?

[కాఁగిలించుకొనును]

లక్ష్మ: కఠినాత్ముఁడను, మీయాజ్ఞ నిర్వర్తించి వచ్చితిని.

రాము: హా! మదేకజీవితా, సీతా. [క్రుంగిపోవును]

[యవనికజాఱును]

షష్ఠాంకము

ప్రథమ స్థలము: అడవి.

[వాల్మీకి కృష్ణాజి నాసీనుఁడై యుండును]

వాల్మీ: సర్వకాల సర్వావస్థలయందుఁ దపోనందనిలీనమైన నా చిత్తము కుటుంబవాగురుల దవుల్కొనది. ఆహా! సంసర్గదోషము! కుశలవుల నెత్తి పెంచుకతమునఁ, దపోదగ్ధరసమగు నాహృదయముగూడ సాంసారిక ప్రేమకుఁ దావలమైనది. ఇఁక సామాన్యుల విషయము చెప్పవలయునా?

లోకేశ్వరా, నిదాఘసంతాపమున శుష్కించిన వన లతలవోలె యెన్నఁడో జీర్ణించిన సంసారవాసనలఁ బునరుజ్జీవింపనెంచి యిట్టి చిత్రమగు లీలనొకటి గల్పించితివా? అఘటనా ఘటన చాతురీసమంచితా, కుశలవుల నా పోషణమునందుంచి యొక బాధ్యతను గలిగించితివి. నన్నెప్పుడు బాధ్యతావిముక్తుని గావించెదవు? కుశలవులకు యథావిధిగ ఉపనయనము గావించితిని. క్షత్రియోచితవిద్యలయందు నిపుణులఁగాంచితిని. వీరకుమారులిఁకఁ బర్ణశాలలఁ గష్టములకుఁ బాల్పడఁదగరు. నవఖండ సామ్రాజ్యధురంధర తుముండగు రామభద్రుని పుత్రులెక్కడ—ఆకలములు దిని, అడవులఁ దపోనిష్ఠలఁ గాలముగడపు మాబోంట్ల కుటీరములెక్కడ?

ఆ జనకరాజకుమారి, పుత్రికులమూలమున నింతకాలము బ్రతికియున్నది. లేకున్న నెప్పుడో ప్రాణపరిత్యాగము గావించికొనియుండును.

[నేపథ్యమున]

వాల్మీకిమునీంద్రా, మృత్యుంజయ తీర్థసేవాతత్పరులగు ఋషీశ్వరులు

వేచియున్నారు.

వాల్మీ: ఇదిగో! వచ్చుచున్నాను.

[నిష్క్రమించును]

ద్వితీయ స్థలము: అడవి.

[మునిబాలురు ప్రవేశింతురు]

మాండవ్యుడు: కుశలవు లింతలో నెట్లుపోయిరి ?

సానందుడు: అయ్యయ్యో—

మాండ: సానందా, యేమేమి?

సానం: వారుగో! కుశలవులు. కొదమను లాగివైచి తల్లిసింగమును పాలు పిసుకుచున్నారు.

మాండ: అబ్బబ్బో! చచ్చిరి, చచ్చిరి. సింహము తిరిగిచూచి పండ్లికిలించుచున్నది.— అబ్బా, బిడ్డలుగారురా వీళ్ళు పిట్టపిడుగులు.

సానం: వీరువచ్చిన మనపైకివచ్చును. మాండవ్యా, మనము ఆశ్రమమునకు వెళ్ళుదముగమ్మ.

[కుశలవులు ప్రవేశింతురు.]

లవు: [సింగపుగొదమను ముద్దుపెట్టుకొనుచు] బుజ్జమ్మా, మన మాడుకొందాము. నీకు తియ్యనిపండ్లు కోసిపెట్టెదను.

కుశు: [పెద్దసింగపు జూలుపట్టుకొని] సింహమా, పరుగెత్తుము. నీపై స్వారిచేసి చూచెదను.

మునిబాలురు: [భయపడుదురు.]

లవు: సానందా, యీబుజ్జమ్మను తీసికొని మేముగూడ ఆశ్రమానికి వచ్చెదము.

సానం: మీరు నమ్మనదిగాక మమ్ములనుగూడ చంపుటకా ?

మాండ: సానందా, నాకు భయమెత్తుచున్నది. మనము వీరికన్న ముందుగ పరుగెత్తుదము.

కుశు: మాండవ్యా, భయపడకండి. ఇవి పసిపాపలవంటివి. మనల నేమిచేయవు.

లవు: [నవ్వుచు సింగపుఁగొదమను మునిబాలురపై విసరుచు] ఇదిగో! సింగపుకూన, వదలిపెట్టిన మిమ్ము కఱచి చంపును.

మునిబాలురు: అయ్యో! చచ్చితిమి — చచ్చితిమి.

లవు: అబ్బా! యెంత మహిమావంతులుగా నున్నారు! చచ్చి మరల బ్రతికినారు.

సానం: లవా, మీగుండగములు తల్లితోఁ జెప్పి మిమ్ములఁ గొట్టించెదము.

లవు: ఏమీ కొట్టించెదరా ?— [సింగపుఁగొదమను చంకఁ బెట్టుకొని సానందుని దగ్గఱకుఁ బోవును]

సానం: [వెనుకకుఁ దగ్గుచు] అయ్యో! అక్కడనే యుండుము. నన్ను సింగపుఁగొదమచేఁ గఱిపింపకుము. బ్రాహ్మణహత్యా పాతకము చుట్టుకొనును.

కుశు: [స్వగతము] మునిబాలకు లెంత వెఱచినారు!

మాండ: లవా, యొకసింహముండినట్లు మఱియొకసింహ ముండదు సుమా. నీయురిపెము గిరిపెము వెళ్ళివచ్చును.

లవు: [చిఱునవ్వుతో] అవునవును! ఉండవు; కొన్ని ఆఁడువి, కొన్ని మొగవి; కొన్ని చిన్నవి; కొన్ని పెద్దవి.

మాండ. మేము మాట్లాడిన మీకు ఎగతాళిగనున్నది.

కుశు: తమ్ముఁడా, వీరు ధైర్యవంతులు. వీరితో చర్లాటము లాడఁ బోకుము.

లవు: [ఒదుగుచు] సానందా, యీ సింగముబారినుండి మమ్ము రక్షింపుము.

సానం: ఏమీ మమ్మెత్తిపొడిచెదరా? మేము పిఱికివార మనుకొంటిరా? మా తల్లిదండ్రులు నిగ్రహానుగ్రహ శక్తిమంతులు—శాపప్రయోగ దక్షులు!

కుశు: ఊ—ఊ! మాకు భయమెత్తుచున్నది. చీమలపుట్ట మాడు దాగుకొంటాము.

లవు: [నవ్వుచు] మా తాత ముత్తాలుగూడ రాజ్యాలేలిన ప్రజ్ఞావంతులే!

మాండ: సానందా, నీవిఁక మాటాడక రమ్ము; అడవిమేఁకల పాలు త్రావి వీరికి పొగరుపట్టియున్నది. వాల్మీకిపాదులవారి యాశ్రమమునకుఁ బోయి మనపయి సొస్తులేకుండ వీరితల్లితోఁ జెప్పుదము.

సానం: అవును. పోదము పద.

[నిష్క్రమింతురు.]

లవు: అన్నా, తల్లిసింగమును తరుమగొట్టుము. ఈ చిన్నికూనను ఆశ్రమమునకుఁ దీసికొనిపోయి నివ్వరియన్నము పెట్టి సాకుదము.

కుశు: పాపము! ఆకొదమను విడిచిపెట్టుము. దానితల్లి యూఁకకే నీతట్టు చూచుచున్నది. మనతల్లిదగ్గఱనుండి మనలను బలవంతముగ వేఱుపఱిచిన మనకును అమ్మకును ఎంతకష్టముగ నుండును.

లవు: అన్నా, మృగాలకుఁ గూడా అంతేనా?

కుశు: అవునవును.

లవు: అట్లయిన వదలిపెట్టెదను. [కూనను ముద్దుపెట్టుకొనుచు]

వాబుజ్జికూనా, నీవుపోయి నీతల్లి పాలు త్రాగుము. [వదలిపెట్టును.]

కుశు: మునిబాలకులు మనలను వదలిపెట్టి పరుగెత్తిరి చూచితివా?

లవు: అన్నా, వారుతల్లితో యేమేమొ చాడీలు చెప్పెదురు. మనముకూడ వెళ్లుదము రమ్మ.

కుశు: అవును! కదలుము.

[నిష్క్రమింతురు.]

తృతీయ స్థలము: వాల్మీకి ఆశ్రమము.

[సీత అరతిబండపైఁ గూర్చుండియుండును.]

సీత: అకటా! బిడ్డలారా, యీమందభాగ్యరాలి కడుపున నేల పుట్టితిరి? రఘుకులాలంకారుని యంకపీఠమునఁ గూర్చుండి ముద్దులొసఁగు భాగ్యమునకుఁ దొలంగి యీనట్టడవులఁ దాపసబాలురతోఁ గ్రుమ్మరునట్లు విధి మీ నొసట వ్రాసెనా?

జలధి పరీత భూవలయ శాసనకర్తకుఁ బుత్రులయ్యు ము
ద్దులసుతులెట్టి సౌఖ్యపరితోషము లొందక మౌనియాశ్రమం
బుల ఫలమూలము ల్గుడిచి భూషణముల్ కయిసేఁతలేక ప
ట్టలజినముల్ ధరించి యకటా! సమిధల్ గొని తెచ్చుటాయెనే?

అంధకారమయమైన యాకాశమున నక్షత్రద్వయమువలె బాలకుల సుందర వదనారవిందములు నాకుఁ గొంతయానందము గలిగించుచున్నవి. మొలబఁట్టి దుఃఖమున మోకాలిబంటి సంతోషమనునది యిట్టిదే కాఁబోలు.

[మాండవ్యుఁడు, సానందుఁడు ప్రవేశింతురు.]

సానం: అమ్మా.

సీత: నాయనా, యేమి?

సానం: మీ కుశలవులను గట్టుదిట్టము సేయకున్నఁ బ్రాణాపాయము గలుగును.

సీత: సానందా, యేల యిట్లు పలుకుచున్నావు? వా రేమిచేసిరి?

సానం: కొదమను లాగ్గైచి తల్లిసింగమును పాలు పితుకుచుండిరి. మేము అది యేమిపనియన్న మాపైకి సింహకిశోరమును విసరి భయపెట్టిరి. నే నబద్ధమాడిన ఈ మాండవ్యుని అడుగుము.

మాండ: ఇంకేమి యబద్ధమున్నది.

సీత: అయ్యో! వారికిఁ గ్రూరమృగములతో నేమి చెలగాటము? వాల్మీకినాయనగారితోఁ జెప్పి కుశలవులకుఁ దగు శిక్ష చేయించెదను. మీరుపొండు.

మాండ: అమ్మా, అడవిమృగములన్న లవునకుఁ గొంచెముగూడ భయములేదు. మాబోఁటివాండ్లమే భయపడుచుందుము.

[నేపథ్యమున]

అన్నా, నావిల్లుగూడ కొమ్మకుఁ దగిలించుము.

సానం: అమ్మా, మే మిఁక వెళ్ళెదము; లవుని కంఠస్వరమువలె నున్నది. మమ్ముఁ జూచిన సింగపుకూనను ఉసిగొల్పుదురు.

[నిష్క్రమింతురు]

సీత: కురంగములతోడఁ బంచాననకిశోరములఁ బెంచినను వాని స్వభావ మేల మానును?

మొగిలి పుట్టంగ ముందును బుట్టినటులఁ
గుశలవులతోడ శౌర్యంబు గూడఁబుట్టె;
నార్యతాపస సాహచర్యమున నైన
క్షాత్రగుణముల కళుకళు సమసిపోదు.

[లవుఁడు ప్రవేశించును]

లవు: అమ్మా, నేను సింగపుబుజ్జమ్మను ఆశ్రమానికి తెచ్చేదనంటే అన్నయ్య వద్దన్నాఁడు.

సీత: [కౌఁగిలించుకొని] అయ్యో! నా ముద్దుకూనా, క్రూరమృగములతోడ మీకేమి చెలగాటము? అవి యొకప్పుడు మిమ్ముఁగఱచినను గఱవవచ్చును.

లవు: [నవ్వుచు] మాచేతిలో లేవా కఱకుబాణాలు?

సీత: నాయనా! యింకమీఁద మీ గట్టిసాహసకార్యము లాచరింపకుఁడు. మందభాగ్యులకు నమృతముగూడ విషమగుచుండును.

లవు: అమ్మా, వాల్మీకితాతగారు చెప్పే రామాయణము నీవు వినలేదా? అందు కథానాయకుఁ డగు రాముఁడు చిన్ననాఁడే తాటకను మారీచసుబాహులను చంపినాఁడఁట! ఆయన క్షత్రియుఁడఁట! అమ్మా క్షత్రియులందరు చిన్నతనమందే యుద్ధము నేర్చుకొంటారా?

సీత: నాయనా, మునిబాలురకు మీకేల యీ విచారము.

లవు: అమ్మా, వాల్మీకితాతగారు మాకు చిన్నప్పుడే బాణప్రయోగము శిక్షించినారుగదా! నేను క్షత్రియుఁడ నయ్యేదను. అమ్మా, అన్నయ్యకూడా అవుతాఁడుగదా.

సీత: [లవుని జవిరియెత్తుకొని] నా కన్నతండ్రీ, అట్లే అగుదురులెమ్మా.

[నేపథ్యమున]

తమ్ముఁడా, రమ్ము రమ్ము.

లవు: [కౌఁగిలి విడిపించుకొని] అన్నయ్య యెందుకో పిలుచుచున్నాఁడు.

[నిష్క్రమించును.]

సీత: అక్కటా! నాముద్దుకొమరులు ఈ యజ్ఞాతవాసకష్టము లెన్ని దినము లనుభవింతురు? ఈబిడ్డల ముద్దుమాటలు వినిన ఆర్యపుత్రుఁ డెట్లు సంతసించియుండునో గదా?

జనకుఁడు గని మోదింపని
తనయుల మృదుభాషణములు ధైర్యోద్ధతులున్
దనరియు వ్యర్థంబులు ని
ర్జనవనమునఁ బూచియున్న ప్రసవము లటులన్.

[యవనిక జాఱును.]

చతుర్థ స్థలము: అడవి.

[యజ్ఞదత్తుఁడు ప్రవేశించును]

యజ్ఞ: సవనమన్న సంబరమునఁ గష్టముల గుర్తెఱుంగక యీయుద్యోగమున కొప్పుకొంటిని. నడచినడచి నాపాదములు పుండ్లయినవి. ఏపుట్టలోనో యేపొదలోనో గుక్కిరి మిక్కిరి మనకుండ ముక్కుపట్టుకొని యెన్నఁడో ప్రాణముపోయిన పీనుఁగులవలె బిఱ్ఱబిగిసికొని కూర్చుండియున్న వగ్గుతాపసుల

యిక్కాలు నేనెట్లు కనుగొందును? ఆ జడదారులు రాకున్న అశ్వమేధము చక్కఁగ నెరవేరదఁట! మేములేమా అయిదారువేదములు చదువుకొన్న మహా బ్రాహ్మణులము. అయిననేమి? శంఖమునుండి జాఱిననీళ్ళ తీర్థమగును.

ఇప్పుడు నలుదెసలకుఁ బలుమార్గములు పోవుచున్నవి. ఏదారిని పోయిన నే యరణ్యము సొచ్చి యేక్రూరమృగములవాతఁ బడుదునో అను భయమున నాగుండెలు దేవతార్చనగంటవలె గడగడ గొట్టుకొనుచున్నవి. అయ్యో, నేను తిరిగి దారపుత్రులఁ గాంచు భాగ్యముండునా? ఎట్లయిన నగుగాక! ఇట్టితఱి ధైర్యసాహసము లవలంబించి రెండవ పరశురాముఁడ నయ్యెదను. [నలుదెసలు పరికించి] ఈమార్గము వెడల్పుగను చక్కఁగనున్నది. అపాయము జరుగునెడల నిరాటంకముగఁ బరుగెత్తుటకుఁ దగియున్నది. [కొంతనడచి] అయ్యో సింహము! సింహము! చచ్చితిని చచ్చితిని. వేదాధ్యయనపరుఁడను, బ్రాహ్మణుఁడను, రక్షింపుడు. రక్షింపుడు!

[లవుఁడు విల్లుభుజమునఁ తగిలించుకొని పూలబుట్టతో వచ్చును]

లవు: ఎక్కడ ఎక్కడ సింహము? [విల్లుచేతికందుకొనును]

యజ్ఞ: [గద్గదస్వనముతో] నాయనా, అదిగో సింహము. నిన్ను దైవము సమయమునకే పంపినాఁడు.

లవు: [విల్లెక్కు పెట్టి] ఓయి ఛాందసుఁడా! నాచేత మునిహత్య గావింపనెంచితివా?

యజ్ఞ: అబ్బాయీ, కాదుకాదు. అదిగో! సింహము పొదమాటున; గాలికి జూలెగురుచున్నది చూడు.

లవు: చూచి చెప్పెదను.

యజ్ఞ: నేనిక్కడ నుందును.

లవు: [చూడఁబోవును]

యజ్ఞ: మునికుమారా జాగ్రత, జాగ్రత.

లవు: చూచితివా. యీాయన సునందుల తాత!

యజ్ఞ: అబ్బో! నిజముతెలియక యెంతభయపడినాను. వీరు ప్రతి అమావాస్యకు క్షౌరము చేయించుకొన్న నాకింత భీతిగలిగియుండదుగదా. [స్వగతము] ఈ మునిపేరు పట్టిలోనున్నదా? [చూచి] ఉన్నది. [ప్రకాశముగ] ఆర్యా, సునంద మునీంద్రా.

లవు: బ్రాహ్మణుఁడా, సమయము తెలిసికొనక హెచ్చరింపకుము. సునందుల తాతగారు సమాధిలో నున్నారు.

యజ్ఞ: అబ్బా! మునిశాపము తప్పించుకొంటిని. నాయనా, వాల్మీకి మునీంద్రుల యాశ్రమము చూపించెదవా ?

లవు: మీరెవ్వరు? ఎందుకు మాతాతగారి ఆశ్రమానికి వచ్చినారు?

యజ్ఞ: మునికుమారా, నేను సద్బ్రాహ్మణుఁడను. ఈమకరకుండలములు నాశాస్త్రపాండిత్యమును నాకన్న ముందు హెచ్చరింపలేదా? చతుర్దశ వేదసారమును ఈడబ్బాలోవైచి పెట్టుచుందును. [ముక్కుపొడి డబ్బా తీసి చిటికె పొడిపెట్టి] అనఁగా వేదములెల్ల నాకు కరతలామలకములు.

లవు: అయ్యా, మీరు వాల్మీకితాతగారికి గురువులుగా నుండఁదగిన వారు. మాతాతగారికి నాలుగువేదములు మాత్రమే తెలియును.

యజ్ఞ: అటులనా—[నవ్వును]

లవు: అవునుగాని, మీపేరేమి ?

యజ్ఞ: నాపేరా ? యజ్ఞదత్తుఁడు.

లవు: మీరిచ్చటి కేల వచ్చినారు?

యజ్ఞ: సకలసామంత మహీకాంత మణి కిరీట ప్రభా రంజిత పాద పద్ముఁడగు ఇక్ష్వాకువంశ ప్రదీపకుఁడు రామచంద్ర నరేంద్రుఁడు అశ్వమేధము నొనరింప నున్నాఁడు. ఆ యజ్ఞదర్శనార్థము మునీశ్వరుల నాహ్వానింప నేను నియోగింపఁబడితిని.

లవు: రామచంద్రనరేంద్రుఁడా! [ఆలోచించి] ఏమీ రామాయణా

కథానాయకుఁడా?

యజ్ఞ: [ఆశ్చర్యముతో] రామాయణ మేమిటి?

లవు: మీకు తెలియదా?

యజ్ఞ: అయ్యో! తెలియదే.

లవు: నిజముగనా?

యజ్ఞ: ఏమీ మాబోంట్లె మహాబ్రాహ్మణు లబద్ధములాడుదురా?

లవు: వాల్మీకితాతగారు రఘువంశీయుఁడైన రాముని చరిత్రమును ఛందోబద్ధముగా రచించిరి. ఆరాముఁడేనా మీ రామచంద్ర నరేంద్రుఁడు?

యజ్ఞ: అట్లేయున్నది. ఏమిచిత్రము! వేదములందుఁ గాక ఛందస్సు మఱియొక చోటఁ బుట్టెనా?

లవు: అవును; మాతాతగారి అప్రయత్నవాక్యానందము.

యజ్ఞ: ఎట్లు?

లవు: ఒకనాఁడు ప్రొద్దుపొడుపున వాల్మీకితాతగారు శిష్యులతోఁ గూడ గంగానదికి స్నానమునకుఁ బోవుచుండ దారిలో నొకచెట్టుకొమ్మపై నొక క్రౌంచమిథునము ముద్దులాడుకొనుచుండెనఁట. అంతలో నొకబోయ యొకపిట్టను కఱకుటమ్మున నేలఁగూల్చెను. పాపము! రెండవపిట్ట దానిని గాంచి కరుణముగ వాపోవుచుండ తాతగారు వీక్షించి ఆబోయవానిని శపించిరి.

యజ్ఞ: తర్వాత?

లవు: ఆశాపము అనుష్టుప్ శ్లోకరూపమున వెలువడినది. ఈచిత్రమునకు శిష్యులును తాతగారును ఆశ్చర్యపడుచుండు సమయమున బ్రహ్మదేవుఁడు ప్రత్యక్షమయి రఘురాముని చరిత్రమును శ్లోకరూపమున రచియింపుమని ఆదేశించెను.

యజ్ఞ: [స్వగతము] ఆహా! యీకథను వినుకొలఁది వింత వొడముచున్నది! [ప్రకాశముగ] నాయనా? నీవెవ్వరిబిడ్డవు, మీ తండ్రిపేరేమి?

లవు: ఏమో నాకుఁ దెలియదు.

యజ్ఞ: [స్వగతము] ఆహా! ఈకుమారుఁడు రాజకుటుంబమునఁ బుట్టవలసినవాఁడు. [ప్రకాశముగ] నాయనా? వాల్మీకిమునీంద్రుల యాశ్రమము చూపించెదవా?

లవు: వాల్మీకితాతగారు కుటీరమున లేరు. మృత్యుంజయ తీర్థమునకు శిష్యులతోఁ గూడ పోయియున్నారు.

యజ్ఞ: ఏమి నే బయలుదేరిన లగ్నమహాత్మ్యము! అగస్త్యమహర్షి యాశ్రమమునకు ఏతట్టు పోవలయును?

లవు: రమ్ము. దారి చూపించిపోయెదను.

యజ్ఞ: నాయనా, దీర్ఘాయుష్మంతుఁడవుగమ్ము.

[నిష్క్రమింతురు.]

సంపమస్థలము: అడవి.

[కుశలవులు సమిధలకట్టలతో ప్రవేశింతురు]

కుశు: తమ్ముఁడా, నీవేరిన సమిధ లివేనా?

లవు: అన్నా, నేను పుల్లలు ఏరునప్పుడు కాలిలో ముల్లు విఱిగి నొప్పిచేసినది. అందువలన కొద్దిగ నేరితిని.

కుశు: ముల్లు తీసికొంటివా?

లవు: తీసితిని; ఇంకను కొంచెము నొప్పిగానున్నది.

కుశు: కుటీరమునకుఁ బోదము రమ్ము; గారనూనె పూసిన నొప్పితగ్గును.

లవు: ఇప్పుడే ఆశ్రమమునకు నడువలేను. కొంతసేపీ చెట్లనీడ కూర్చుండి పోవుదము.

కుశు: అట్లే కూర్చుండెదము. [ఇరువురు కూర్చుందురు]

కుశు: [ఆలోచనోన్ముఖుఁడై స్వగతము] మాతల్లియేలొకో యడపరానిశోకముచే నెల్లప్పుడుఁ గ్రాగుచుండినటులఁ గన్పట్టును? ఇతర మునికన్యలవలె పువ్వులు ముడువదు; గారనూనెపరుమట లేక తలవెండ్రుకలు జడగట్టికొనిపోయెను. నీరింకిన వాడిపోవు తమ్మితూఁటివలె మాయమ్మ యెందువల్లనో క్రమక్రమముగ దిగఁ గరఁగుచున్నది ?

లవు: అన్నా యేమి తలపోయుచున్నావు?

కుశు: తమ్ముఁడా, అమ్మ యుమ్మలికము నీవెప్పుడైన కనిపెట్టితివా?

లవు: ఉమ్మలిక మెందుకు ?

కుశు: మనయమ్మ యెప్పుడెప్పుడు శోకమునఁ గుములుచుండును. నిన్నసాయంకాలమున నే నాశ్రమమునకుఁ బోవుసరికి నొంట్రిగఁ గూర్చుండి కన్నీరు నించుచుండెను. నేను వచ్చుటఁ గాంచి గన్నీరద్దుకొని నన్ను ముద్దిడికొనియెను. శోకకారణ మడిగిన ముద్దులు గురిపించి నామాట పులిమిపుచ్చెను.

లవు: అన్నా, మునికన్యలేమైన అమ్మను కష్టపెట్టినారు కాఁబోలు.

కుశు: అటుగాదు; వారు మనతల్లిని ఎంతో యాదరమున నుపచరించుచుండెదరు.

లవు: అన్నా, మన మాశ్రమమునకరిగి అమ్మను నిజ మడుగుదము.

కుశు: లవా, నాకొకసందేహము గలుగుచున్నది; మన మెవ్వరము? మనమేల యీయరణ్యమున నున్నాము?

లవు: అన్నా, అంతిమాత్రము తెలియదా? వాల్మీకి తాతను అమ్మ, నాయనా, యని పిలుచుచుండును. మనతల్లి తాతకూఁతురుగదా?

కుశు: అట్లయిన మన తండ్రియెవరు? ఒక్కనాఁడైన మనము ఆయనను చూచియెఱుఁగము.

లవు: [దీనముగ] అన్నా, మనకుఁ దెలియని పిన్ననాఁటనే మర

ణించెఁ గాఁబోలు!

కుశు: కాదు, కాదు; మనతల్లి మంగళసూత్రముధరించియున్నది.

లవు: [కొంత సేపూరకుండి] అన్నా తెలిసినది, తెలిసినది. మన తండ్రి యెచ్చటనో తపస్సు చేయుచుండవలయును.

కుశు: నాకేమియుఁ దోఁపకున్నది. మనకును ఇచ్చటి మునిబాలురకును చాలభేదము గనుపట్టుచున్నది. వాల్మీకితాతగారు తక్కిన తాపస కుమారులకు శిక్షింపని బాణప్రయోగము మనకుమాత్రమె యేల నేర్పించిరి?

లవు: మనలను క్షత్రియులను జేయుటకు.

కుశు: లవా, నీసమాధానము నాకు నచ్చలేదు. ఇందేదో కొంత దాపఱికమున్నది. ఎట్లైన పాటుపట్టి ఈరహస్యము తెలియంగవలయును.

లవు: అవునవును; మనమిద్దఱు పేచ్చి అన్నము దినకుండిన అమ్మ యీరహస్యము చెప్పకమానదు.

[నేపథ్యమున]

ప్రళయకాలాబ్ధి కల్లోలపటలి రేఁగి
పృథివిఁ గబళింపవచ్చునాఁ బృథులసైన్య
మటవిఁ గాల్మొట్ట భీతిల్లి యాశ్రమముల
కొక్కపెట్టునఁ బర్వె మృగోత్కరంబు.

[కుశలవులు లేచి]

లవు: ఏమీ సైన్యమా?

కుశు: ఆహా! తాతగారు చెప్పినట్లే అయినది. "నేనాశ్రమమున లేనిసమయమున రాక్షసులువచ్చి యజ్ఞవేదికలు పెళ్ళగింతురు. మునిపల్లె కొల్లగొట్టుదురు; జాగరూకులై యుండుఁడ"ని హెచ్చరించిపోయిరి. లవా,

ప్రమాదము వాటిల్లినది. [ఇరువురు విల్లెక్కు పెట్టుదురు.]

[నేపథ్యమున]

ఆహా? వింతమృగము! వింతమృగము!

[మాండవ్యుఁడు ప్రవేశించును]

మాండ: ఆహా! వింతమృగము! వింతమృగము!

లవు: మాండవ్యా, ఏమి మృగము?

కుశు: ఆశ్రమముతట్టుకు రక్కసి బలగములు వచ్చినవా?

మాండ: [భయముతో] అయ్యో! కుశా, నన్నుఁగాపాడుము.

కుశు: భీతిల్లకుము; రాక్షసులు నీకెదురుపడిరా?

మాండ: లేదు.

కుశు: అట్లయిన సైన్యములేమి?

మాండ. [స్వగతము] దిగులుతీఱినది. [ప్రకాశముగ] అరణ్యమార్గమున ధూళీపటలము ఆకాశమున కెగయుచున్నది. ఒక వింతమృగము బంగారు మొగము పట్టి తళతళమెఱయునట్లు పరుగెత్తుచున్నది.

లవు: మాండవ్యా, అదేమి మృగము?

మాండ: మృగతాపసులు దానిని యజ్ఞాశ్వమని చెప్పుచున్నారు.

కుశు: అశ్వములు వాహనములని రామాయణకథయందు విందుము.

లవు: అవునవును.

మాండ:

మత్తకోకిల—కాంచమింతకు నెట్టివింతమృగంబు నెప్పుడు నీవనిన్
మించుపోలిక సంచలించును మేదిని న్నడయాడెడుం;
బొంచిపట్టఁగఁ బోనఁ దాఁకును బోదపచ్చిక మేసెడిం;
గుంచెతోఁకయుఁ గుచ్చుజూలును గొప్పడెక్కలు చెన్నగున్.

లవు: అన్నా, మనము పోయిచూతము.

కుశు: మాండవ్యా, ఆ గుఱ్ఱ మెచ్చటనున్నది?

మాండ: కళ్యాణ సరోవరప్రాంతమునఁ బచ్చికబయల మేయుచున్నది.

లవు: పోవుదమురండు.

[అందఱు నిష్క్రమింతురు.]

[తెఱయెత్తఁబడును. గుఱ్ఱము కనఁబడును.]

కుశు: ఆహా! ఈవారువమెంత తీరుగానున్నది!

మాండ: [దూరమునుండి] కుశా, యొంటిగ దగ్గఱకుఁబోకుము. అది కఱచునేమొ.

లవు: ఈగుఱ్ఱముపై స్వారిచేసిన నెట్లుండునో? [డగ్గఱి] అన్నా, అదిగో బంగారు పట్టు మోమున వ్రేలాడుచున్నది.

కుశు: [మొగముపట్టు తీసికొనిచూచి] దీనిపై రత్నాక్షరములుగూడ మెఱయుచున్నవి.

మాండ: [స్వగతము] గుఱ్ఱమునకు కఱచుస్వభావము లేదుకాఁబోలు! [మెల్లగ డగ్గఱును]

కుశు: [ముఖపట్టము పరికించి]

పదితలల రావణాసురు
మెదిపిన శ్రీరాముఁ డశ్వమేధము సేయన్
వదలెను హయమును; వీరుల్
పొదలినఁ గట్టుండు; లేక, మోడ్పుఁడు కరముల్.

ఏమేమీ? శ్రీరాముఁ డశ్వమేధ మొనరింపనున్నాఁడఁట! అతనికన్న

వీరులున్న వారువమును బట్టవలయునఁట !

లవు: లేకున్న ? —

కుశు: చేతులు జోడింపవలయునఁట ! ఏమి యీకండకావరము. దశకంఠు నంతటి వీరుని సంహరించితినను గర్వము కాఁబోలు ! లోకములోని వీరమాతలు గొడ్డువోయిరా ?

లవు: అన్నా, రాముఁ డసహాయశూరుఁడై దశకంఠుని వధియించెనా ? భ్రాతృద్రోహియగు విభీషణుఁడు, కోఁతులు, కొండముచ్చులు, ఎలుఁగుబంట్లు లేకున్న రామచంద్రుఁ డేమయ్యెడునో యెవ్వరెఱుఁగుదురు ? ఆశూరత్వమునకా యీ యశ్వమేధము ?

కుశు: మనమీ సవనాశ్వమును కట్టివైచెదము.

లవు: అవునవును; వాల్మీకితాతగారు పక్షపాతముతో వర్ణించిన శ్రీరాముని శూరత్వ మేపాటిదో కనుఁగొందము.

మాండ: అబ్బో ! మీరు మునిపల్లెకంతటికి అగ్ని రగిలింప నున్నారా ? మునిబాలు రెక్కడ ? సార్వభౌము నెదుర్కొను టెక్కడ ?

కుశు: తమ్ముఁడా, నా సమిధలుగూడ నీవు పట్టుకొనిపొమ్ము. ఈయశ్వమును నేను దీసికొనివచ్చెదను ! [తీసికొనును]

లవు: అన్నా, యీ గుఱ్ఱముపై నే నెక్కుదునా ?

కుశు: లవా, యజ్ఞాయశ్వము పవిత్రమయినది.

లవు: అట్లయిన వలదు లెమ్ము.

మాండ: [స్వగతము] మునిపల్లెకేదో మహా ప్రళయము సంభవింపనున్నది.

[యవనిక జాఱును]

సప్తమాంకము

ప్రథమస్థలము: అడవి.

[లక్ష్మణుఁడు ప్రవేశించును]

లక్ష్మ: దుఃఖగర్భితములగు పండ్రెండువత్సరములు గడచినప్పటికిని రామపత్నిని విడనాడిన యీ కాంతారస్థలముల దర్శింప, సీతాపరిత్యాగ సంతాపము నేఁటిదివలె నాహృదయతటము లొరసికొనుచుఁ బ్రవృద్ధ మగుచున్నది.

ధరణిజా పదన్యాస పూతంబులైన
యటవులించుక మార్పుతో నైనఁ గాంచ
నయ్యెఁగాని సీతాకార మాత్మఁ దక్క
దృశ్యలోకంబు నను నెందుఁ దేజరిలదు.

సీతావిరహితమైన యాశ్వమేధము దుఃఖకరమైనను దన్మూలమున ఆర్యాపునర్దర్శనము లభించునేమో యను కొండంత యాసతో వచ్చితిని. నా యాస నిదరిమేల్కాంచినవాని స్వప్నమువలె అదృశ్యమయ్యెను. [కొంత నడచి] అకటా! నేనెంత ప్రాణఘాతుకుఁడను. అగ్రజుని యాజ్ఞగావించి మరణపర్యంతము వేధించు హృదయశల్యము దెచ్చికొంటిని.

రామసందేశ మేఁ జెల్పఁ గోమలాంగి
జానకీదేవి ప్రాణవిహీన యగుచు

వజ్రపాతంబునం గూలు వల్లివోలె
మూర్ఛవోయిన తరుకాండ మూల మిదిగో!

ఈప్రదేశము నేఁటికిని గుర్తింప సాధ్యమగుచున్నది.

జనకరాజేంద్ర పుత్రికోష్ణల విషాద
బాష్పవారి ప్రవాహంబు పాటిపాటి
పచ్చపూరియు నిచ్చోటఁ బట్ట దకట!
పృథ్విశోకాగ్ని పరితప్త హృదయమునఁగ.

[నేపథ్యమున కలకలము.]

[ఆలకించి] ఏమి యీ కలకలము?

[సేనానాయకుఁడు ప్రవేశించును]

సేనా: జయము జయము యువరాజునకు! యజ్ఞాశ్వము బంధింపఁబడినది.

లక్ష్మ: [ఆశ్చర్యముతో] ఎవరు బంధించిరి?

సేనా: ఎవఁడో ఋషికుమారుఁడు.

లక్ష్మ: [ఆశ్చర్యముతో] ఋషికుమారుఁడా?—తెలియక కట్టియుండును. సవనాశ్వమని చెప్పి విడిపించుఁడు.

సేనా: మహాప్రభూ, సర్వవిధముల బోధించితిమి. నయ భయములఁ జెప్పితిమి. ఎంత బ్రతిమాలినను వినక ఆతాపస వటువు ముష్కరపుఁబట్టు పట్టియున్నాఁడు. మేము జేకరించిన సగకుసేయక యెల్లిదమాడుచు శింజినీ టంకారము గావించుచున్నాఁడు.

లక్ష్మ: ఏమివింత!

కార్ముకం బేడ యడవులఁ గాయగరుబు
పండ్లు గుడిచెడి జడదారి వటువు వేడ?
బ్రహ్మకులమున రెండవ పరశురాముఁ
డవతరించెనె కేసరి హరిణి కటులు!

సేనా: యువరాజా, యాతఁడు సామాన్యతాపసబాలకుఁడు గాఁడు.

సౌందర్యశౌర్యముల్ సమభాగములు గాఁగఁ
 బంచికొన్నవో దేహ భావములను!
మునిబాలకత్వంబు భుజబల విక్రమం
 బైకమత్యముతోడ నలరునవియొ!
అంగుళీ కిసలంబు లతుల శరాసనం
 బవిరత స్నేహంబు నాసగొనెనొ!
శైశవంబును ధైర్య సాహసోద్ధతు లన్న
 దమ్ముల యట్లుండఁ దలఁచెనొక్కొ!
కాక యన్యోన్యదూరత్వ కలనమొలఁగు
గుణములెల్లను నొకచోటఁ గూడి తాప
సార్భకాకారము సమాశ్రయంబుగొనునె?
యిట్టిచిత్రంబు సృష్టిలో నెందుఁగనము.

లక్ష్మ: సేనానీ, ఆ తాపసవటువును జూచుటకు నామనమువ్వి

కూయుచున్నది. అచ్చోటికి దారితీయుము.

సేనా: ఇదిగో యిటు.

[నిష్క్రమింతురు.]

ద్వితీయ స్థలము: వనము.

[కుశుఁడు ప్రవేశించును; గుఱ్ఱము కట్టఁబడియుండును.]

కుశ: ఈ ఋషీశ్వరు లెంత భీరులు? తాపసులు సవనాశ్వమును బట్టఁగూడదఁట!

బలము శౌర్యంబు గల్గిన భార్గవుండు
మునివరుఁడు గాక తక్కువే? జనక తర్ప
ణంబునకు రాజకుల శోణితంబు జీవ
నదిగఁ బాఱింపలేదె యనంతధాత్రి?

చతురంభోధి పరీత భూవలయమున అయోధ్యాధీశుని యజ్ఞాశ్వమును బట్టు వీరపుంగవుఁ డొక్కఁడైన లేఁడఁట!

[లక్ష్మణుఁడు, సేనాని ప్రవేశింతురు]

సేనా: ఇదిగో! సవనాశ్వము. అతఁడే తాపసబాలకుఁడు.

లక్ష్మ: [స్వగతము] ఆహా! సేనాని వర్ణించినంతకన్న ఈయర్భకుఁడు వేయిమడుంగు లెక్కుడుగఁ బ్రకాశించుచున్నాఁడు! [ప్రకాశముగ]

సేనానీ, సైన్య తుములమువలన మునీశ్వరుల తపస్సులకు భంగము కలుగకుండు నటు లరసికొనుము, సేనల సిద్ధపఱచి ప్రతిక్షణము నాయాజ్ఞకు వేచి యుండుము.

సేనా: దేవర యాజ్ఞాపించినట్లే. [నిష్క్రమించును.]

లక్ష్మి: [డగ్గఱి] బాలకా, ఆశ్రమ లతలను గొఱికివైచెనని యశ్వమును గట్టియుంచితివా?

కుశు: [చిఱునవ్వుతో] కాదుకాదు; ముఖపట్టమును దీసివైచుటకు.

లక్ష్మి: ఇది సవనాశ్వము సుమా!

కుశు: కాదని యెవరనిరి?

లక్ష్మి: అట్లయిన నీవేల కట్టితివి? ఆటలాడుటకుం దగిన లక్కబొమ్మ యనుకొంటివా దీనిని?

కుశు. కట్టినది లక్కబొమ్మయనికాదు. పదితలల రక్కసుని దునుమాడిన రాముని కెన్ని తలలుగలవో కనుఁగొనుటకు.

లక్ష్మి: [కోపముతో] ఏమీ? పరిహాస మాడుచున్నావా?

కుశు: పరిహాసమో, చంద్రహాసమో మీకే తెలియవలయు.

లక్ష్మి: మునికుమారా, తెలియక నిప్పుతో చెలగాటమాడుచున్నావు.

కుశు: నీటితో నిప్పునకేమి చెలగాటము?

లక్ష్మి: [స్వగతము] ఈ సౌందర్యరాశియగు ముద్దుకుమారుఁ డెవ్వని బిడ్డయో! మునితనయుని కిట్టి వాక్పటుత్వము, ఇట్టి సాహస మలవడి యుండునా? [ప్రకాశముగ] బాలకా, యీ వారువమును గట్టినవారు మాతోఁ బోరవలయును. నీవెవ్వరి కుమారుఁడవు?

కుశు: యుద్ధమునకుఁ బూర్వము సంబంధబాంధవ్యము నెఱపుట మీ యాచారము కాఁబోలు!

లక్ష్మి: [స్వగతము] ఈ ముద్దుకుమారునిఁ గాంచినంతనే నిర్హేతుకముగ నా యంతరంగము వాత్సల్య తరంగిత మగుచున్నది!

పల్లజడల్ మృగాజినము బాహువులం గురివెంద పేరు లు
త్ఫుల్ల ముఖారవిందమును బొల్పుగఁ దాపస బాలకత్వముం
వెల్లడిసేయు; దోర్బలము, పీవరవక్షము, నిర్భయత్వముం,
సల్లలితాంగ సౌష్ఠవము క్షత్రియబాలున కట్టు లొప్పెడుం.

[ప్రకాశము] కుమారా, చండశాసనుఁడగు రామచంద్రుని ప్రతిజ్ఞ అన్యథా పరిణమింపదు. నిన్ను గాంచినంతఁ జిదిమినఁ బాలుచిందు నీబుగ్గలను ముద్దిడికొన మనసు పుట్టుచున్నదిగాని, నిశాత శరపరంపరల నీసుకుమారశరీరము నొగిలించుటకు నాహృదయ మియ్యకొనకున్నది.

కుశు: రాజా, చక్కని రాజనీతిజ్ఞుఁడవుగాని, నీ యలీకవాత్సల్యము మమ్ము మోసగింపఁజాలదు.

లక్ష్మ: ఓయీ వటుఁడా, నీ శ్రేయస్సునకుఁగా నుడివినదంతయు మా యోటమిగఁ దలంచితివా?—కుమారా, నీ జననీజనకు లెవ్వరు ?

కుశు: ఎదిరి తలిదండ్రుల నెఱుఁగకయున్న శరములు పాఱవు కాఁబోలు!

లక్ష్మ: [స్వగతము] ఏమి యీబాలుని పట్టుదల? ఈతనిమోము గాంచినంతనె జానకీదేవి పోలికలు గుప్పున మనమున కెగదట్టుచున్నవి. ఆస యెంతచెడ్డది! అసాధ్యమునుగూడ సాధ్యమటుల నూహింపఁజేయును? [ప్రకాశముగ] బాలకా, నీకు సంగరమొనరింప నిచ్ఛగలదా ? నామాట వినుము. నీ ముష్కరపుఁ బట్టుదల నీ ముప్పునకే కారణమగును. ఇట్టి ముద్దు కుమారుని గోల్పోయిన తల్లిదండ్రుల శోకమునకుఁ బారముండునా ? నీకుఁ దల్లిదండ్రు లున్న వారికి నీ వీ బాలిశోద్యమమును దెలిపిరమ్ము. నా యీ కడసారి సదుపదేశమును గమనింపుము.

కుశు: రాజా, క్షత్రియవీరులు ఉపదేశవాక్యములఁ బ్రయోగించియా విజయము నొందుట !

లక్ష్మి: [స్వగతము] వినవిన నీబాలకుని చతురోక్తు లసహ్యము లగుచున్నవి. [ప్రకాశముగ] ఓయీ, నీవెవ్వని సవనాశ్వమును బంధించితివో యా లోకైక వీరుని క్రోధాగ్ని శిఖలయం దేల శలభమువలె మ్రగ్గెదవు? ఆరామచంద్ర నరేంద్రుని యతిలోకశూరత్వము నీవుఁ దెలియక యింతటి సాహసకార్య మొనరించితివి గాఁబోలుఁ?

కౌశికయజ్ఞంబుఁ గావంగ నేఁగుచో
మార్గాన్న తాటక మదమడంచె;
కుశు: ఆఁడుదానిని బట్టి యణఁచి కూయఁగఁ జంప
నదియె శూరత్వమం చనఁగ వలెనె?
లక్ష్మి: క్రతువాటి శోణిత క్రవ్యముల్ చల్లు మా
రీచ సుబాహుల పీచమడఁచె;
కుశు: పండ్లు గడ్డలుమెక్కు బక్కతపసుల నేచు
పిరికి దైత్యులఁగూల్చ వీరుఁడగునె?
లక్ష్మి: ధరణీసుతా స్వయంవరమున గిరిశేశు
బలువిల్లు డాకేలఁ బట్టివిఱిచె;
కుశు: చిరకాలముంటఁ బుచ్చినవిల్లు విఱిచిన
దానికే చంకలు తట్టవలెనె?
లక్ష్మి: అతుల విక్రమశాలి వానరేశు సుతువాలి
నొక్కబాణంబున నుక్కడంచె;
కుశు: ఇరువురు పోరాడునెడఁ బొంచి యొక్కని
మఱుఁగుగాఁ దెగటార్చ మానుషంబె?

లక్ష్మ: [స్వగతము] రామునిచరిత్ర మీ బాలున కెట్లు దెలి యును?

కుశు: ఓయీ, రాజా, యేలయిట్లు వందివలెఁ బొగడుచున్నావు? రాముని శూరత్వము మాకు దెలియదా?

కోఁతి కొండముచ్చు లెలుఁగుగొడ్డ చేత
జలధి గట్టించినార లాశ్చర్యముగను!
వన్యమృగములఁ బాలించువారు మీరు
మీ పరాక్రమోద్ధతికింక మేరగలదె?

లక్ష్మ: ఓయీ!

కుశు: రాజకుమారా, స్తుతిపాఠమునఁ గొంతమఱచితివి. మీ రాముఁడు కాకిపైఁగూడ నస్త్రప్రయోగము గావింపలేదా?

లక్ష్మ: [కోపముతో] ఓరి జ్ఞానలవ దుర్విదగ్ధా, యెంతతాళుకొన్నను నీ యవినీతిని వీడకున్నావు? రామచంద్ర నరేంద్రునిఁ దూలనాడిన నీ గర్వ మిపుడే యడంచెదను. రమ్ము—నీశరాసనము సజ్యము గావింపుము.

కుశు: రాజా, యిప్పుడు క్షత్రియుఁడవైతివి. తపోవన శాంతికి భంగముగావింపవలదు. ఆ మరుప్రదేశమునకు నడువుము.

[నిష్క్రమింతురు]

తృతీయ స్థలము: వాల్మీకి కుటీరము.

[సీత ఆసీనయైయుండును.]

సీత: సూర్యభగవానుఁడు నభోమధ్యగతుఁడై వేడిసెకల నుమియు చున్నాఁడు. నా ముద్దుకొమరు లేలొకో యింతవఱకుఁ గుటీరమునకు రారు. అయ్యో ! యేమి నా కుడికన్నదరుచున్నది?

[మాండవ్యుఁడు ప్రవేశించును]

మాండ: అమ్మా, అమ్మా. ఆరణ్యకా— [దుఃఖించును]

సీత: నాయనా, మాండవ్యా, యెందుకు దుఃఖించుచున్నావు? కుశలవు లెక్కడనున్నారు ?

మాండ: అమ్మా, యేమిచెప్పుదును? ఇంకను గుశలవులా? [దుఃఖించును.]

సీత: [తత్తరముతో లేచి] ఏమీ? కుశలవులేమైరి? నా రిపు డెక్కడ నున్నారు ? వచ్చుచున్నారా ? ఒక్కమాట చెప్పుము.

మాండ: అయ్యో! నా నాలుక యాడకున్నది.

సీత: నా ముద్దుబిడ్డలకేమైన నాపద సంభవించెనా? మాండవ్యా, యేల విలంపించెదవు ?

మాండ: ఎక్కడివో పాపసైన్యములు కళ్యాణసరస్సుప్రాంతముల విడిసినవి. వారి సవనాశ్వమును కుశుఁడు కట్టివైచెను. సేనాధిపతి వచ్చునను భీతితో నేను దూరమున దాఁగియుంటిని. అంతలో సేనాని వచ్చెను.

సీత: తర్వాత ?

మాండ: తిర్వాత కుశుఁడును సేనానాయకుఁడును ఏమేమొ వివా

దములు సలుపుచుండిరి. ఆమాటలు నాకు స్పష్టముగ వినఁబడలేదు.

సీత: మాండవ్యా, కుశలవుల కేమియాపద గలుగదు గదా? ఒక్క క్షణముసేపు విలంబన మొక్కయుగముగఁ దోఁచుచున్నది.

మాండ: అమ్మా, వారిరువురి వాదముల నూహింప, సేనాధిపతి యశ్వమును విడువుమనియుఁ గుశుఁడు విడువననియుఁ అన్యోన్యము తర్కించుకొంచుండినట్లు కనుపట్టినది.

సీత: [నిట్టూర్పుతో] అయ్యో! బాలుఁడెక్కడ, యజ్ఞాశ్వమును బట్టుటెక్కడ? ఇంత నేరమి దగునా? మాండవ్యా, కుశుఁడు అశ్వమును విడువలేదా?

మాండ: ప్రాణములైన వదలి పెట్టునేమోగాని, వారువమును మాత్రము విడువఁడు.

సీత: అయ్యో! నీవైన బుద్ధి సెప్పవా?

మాండ: నే సమీపమున నుండినఁగదా—

సీత: తరువాత?

మాండ: సేనానియును గుశుఁడును మరుప్రదేశమున కరిగిరి.

సీత: వారచ్చటఁ బోరుసల్పిరా?

మాండ: వేఱు చెప్పవలయునా?

సీత: అకటా! యెంతప్రమాద మెంతప్రమాదము!

పోరులను నారతేరిన వీరు లేడ?
బాణ విన్యాస మెఱుఁగని బాలు రేడ?
శౌర్యసాహస సాధ్యంబు సమర మేడ?
యిన్ని తలపోసి శంకించు హృదయ మకట!

మాండ: అమ్మా, శంకింపవలదు, కుశుని సంగర కళాకౌశలము వీక్షిం

సేనాధిపతి విస్మితచిత్తుఁడై ప్రతీకార సంధానజడుఁడై యూరకుండెను.

సీత: మాండవ్యా, లవకుమారుఁడు దగ్గఱలేఁడా ?

మాండ: అమ్మా, ఆతఁడు సమిధలను మోసికొని కుటీరమునకు వచ్చుచుండెను.

సీత: అట్లయినఁ గుశుఁ డొంటరిగ యుద్ధము చేయున్నాఁడా ?

మాండ: అయిననేమి ? అగ్నికణ మొక్కటి చాలదా కొండంత తూలరాశిని బుగ్గిసేయుటకు ?

తేనెతెట్టెను జెలరేపఁ దేనెటీఁగ
గములు వెడలెడిచందానఁ గాండపటలి
కుశ శరాసన ముక్తమై గుములుకొనుచు
దిక్కులీనిన యట్టులఁ దేజరిల్లె.

సీత: బళీ ! కుశకుమారా, జనకున కనురూపుఁడవైన పుత్త్రుఁడ వైతివి. మాండవ్యా, తరువాత తరువాత ?

మాండ:

రూపంబెత్తిన శౌర్యమట్టుల మహారుద్రాకృతిన్ సంగర
వ్యాపారోన్ముఖుఁడై కుశుండు ప్రదరవ్రాతంబుసంధింపఁగాఁ
జాపం బుర్వికి జాఱ సైన్యపతి మూర్ఛాపీత చేతస్కుఁడై
భూపర్యంక శయానుఁడయ్యె వనభూముల్ పట్ట స్వాపీకినుల్.

సీత: ఆహా ! వీరమాత నైతివను నానందంబున నా యొడలెల్లఁ బులకరించుచున్నది. ముద్దుకుమారా, మొన్నటిదనుక నాయొడిలో నాడుకొనుచుంటివే! యింతటి సమరకళాకౌశల మెప్పు డలవఱచుకొంటివోయి ?

జనకుఁడు నీపరాక్రమము, శౌర్యము, బాహుబలంబు, సంగరం
బునఁ జరియించు నేర్పు, శరముల్ పఱపించెడి తీరు గాంచినన్
గనులఁ బ్రమోదబాష్పములు కాల్వలుగట్టఁగఁ గౌఁగిలింపఁడే
తనయుఁడ రమ్మటంచని? సుతా, సుకృతంబటు లుండఁబోలదే!

మాండ: అమ్మా, అంతటఁ గుశుఁడు విజయకుతూహలియై సవనాశ్వము ముఖమున మెఱయుచున్న బంగారు పట్టను లాగికొని కుటీరమునకుఁ దరలుట కుద్యుక్తుఁ డయ్యెను.

సీత: [స్వగతము] నాయనా, ముఖపట్టమును విజయాంకముగఁ గైకొంటివా? [ప్రకాశముగ] అంతట?

మాండ: అంతట సింహనాదములొనరించుచుఁ జెల్లాచెదరైన సైన్యములు నొక్కమొనకుఁ దలపడి కుశుని చుట్టుముట్టినవి. ఇంతలో మూర్ఛితుఁడగు సేనాని తెప్పరిలి లేచి సేనలఁ బురికొల్పుచుండెను.

సీత: [నివ్వెఱపాటుతో] అయ్యో! నాయనా, యింకెక్కడి కుశుఁడు? ఒక్కబాలుని ఇంతసైన్యము పొదువుట వీరనీతియా?

మాండ: అమ్మా, అంతట కుశుని యవస్థ చలిచీమలకుఁ జిక్కిన యురగకిశోరమువలె నైనది. [దుఃఖించును]

సీత: [దుఃఖముతో] నన్ను వంచించితివి. వంచించితివి. ఇంతదనుక కుమారుని శౌర్యవినోదమున మైమఱపించి యతర్కితముగ సత్యమును బ్రత్యక్షము గావించితివి. నాముద్దుకుమారా, రఘువంశకరీరమా, నాభాగ్యసర్వస్వమా, అసహాయుఁడవై రణరంగమునఁ గూలితివా!

శరముల పోటుగంటుల నజస్రము నెత్తురు లూటకాల్వలై
తొరఁగి శరీరముం దడుప దుర్భరవేదన కోర్వలేక యె

తెలుఁగునఁ బల్లటిల్లి రణదేశమునఁ శయనించితో! మనం
బెరియఁగ నన్నుఁ దమ్ముని నిఁ కెంతగ లోఁదలపోసి కుందితో

అయ్యో ! కుశకుమారా, నాకన్నులవెన్నెలా, నన్నును నీముద్దు తమ్ముని విడనాడి పోయితివా ? వాల్మీకినాయన వచ్చి, 'కుశుఁడేడి' యన్న నేనేమి చెప్పుదును తండ్రీ? ప్రియ తనూజా, నన్నుఁగూడ నీతోఁడఁ గొని పొమ్ము. [మూర్ఛిల్లును]

మాండ: అమ్మా, యూరకడిల్లుము. నేఁబోయి లవుని దీసికొని వచ్చెదను. [నిష్క్రమించును]

సీత: [తెప్పిరిలి] నాయనా కుశ కుమారా, ఒక్క నిమిషంబున లోకమెల్ల వెలిఁగించి మఱునిమిషఁబున నస్తమించు నుల్కవలె నయినదా నీ బ్రతుకు? వాల్మీకి నాయనగారుండిన సత్తపఃప్రభావమునఁ బునర్జీవిని గావించియుండు నేమోగదా ! అకటా ! నాబోఁటి దురదృష్టవతికి నంతటి భాగ్యమబ్బునా ? నాముద్దుకూనా, పండ్రెండువత్సరములకే నీకు శతాయుష్యము సంపూర్ణమైనదా?

పూర్ణిమా చంద్రుని బురుఁణించు నీమోము
కళలెల్లఁ దఱిగెనే కన్నతండ్రి !
కల్వఱేకులుఁబోలు కన్నులు జిగిమాసి
మూఁతలు వడియెనే ముద్దుకూ !
సువిశాల ఫలకంబు సొంపుమీఱు నురంబు
శోణితం బొలికెనే సుందరాంగ !
ఆజానులంబమై యలరు దోర్యుగళంబు
బలము దొలంగెనే కలికి పట్టి !

ఆశంకు నెల్ల నాలంబమైన నీవు
సంగర క్రోడశాయివై సమసినావె !
యిట్టి ప్రత్యక్షసత్యంబు నెఱింగియుండి
పగులదేమొ నాహృదయమ్ము బ్రద్దలగుచు.

అయ్యో ! నాముద్దుబిడ్డా, నన్ను నట్టడవులపాలుచేసి పోయితివా?

[లవుఁడును మాండవ్యుఁడును ప్రవేశింతురు]

నాయనా, నీ ముద్దులయన్నను గోల్పోయితిమి.

[లవుని కౌఁగిలించుకొని దుఃఖించును.]

లవు: అమ్మా, యేడువక చెప్పుము గుఱ్ఱమేమైన అన్నను కబళించెనా ?

సీత: అయ్యో ! నాయనా, యది యజ్ఞాశ్వమఁట గదా.

లవు: అయిననేమి ?

మాండ: అయిన నేమియా ? అదియే ప్రాణాంతకమైనది.

సీత: అశ్వరక్షకులు కుశునితోఁ బోరాడిరఁట.

లవు: ఏమీ ? అన్నను నొప్పించిరా ?

మాండ: నొప్పించుటయా ! కంఠగతప్రాణునిఁ జేసి రనుము. ఎవరైన నంతపాగరు లేదు. అందులో తాపసార్భకు డెట్లుండవలయును ?

సీత: మాండవ్య, ఇది నీతిబోధలకుఁ దరుణమా ?

లవు: ఏమంటివి ? —కంఠగతప్రాణునిఁ జేసిరనియా ?

ఉన్నారా కుశునొంచువీరులు నృపవ్యూహంబునం దెచ్చటన్ ?
విన్నామే పులిపిల్ల ముట్టి మృగముల్ పీడించి చెండాడుటల్ ?

గన్నా మే యిటువంటివింత? యయిసం గానిందు; నేఁబోయి మా
యన్నం దెత్తు రిపు ప్రభేదన చణ వ్యాపారపారీణతన్.

మాండవ్యా, న న్నా కదనరంగమునకుఁ గొనిపొమ్ము.

మాండ: [స్వగతము] అయ్యో! నాకే రావలయునా యీమహా విపత్తు? మునుఁగఁబోయి మొసలికిఁ జిక్కితిని. ఒక్క శిలీముఖము తప్పిదారి నాపైఁబడినఁ బ్రాణముల నూటికొనకమానదు. [ప్రకాశముగ] లవా, యిట్టి కార్యముల బాల్యచాపలము ఆపదలకు మూలమగును.

సీత: నాముద్దుకూనా, నీకేల యీదుర్బుద్ధి? తారతమ్య మెఱుంగక పోరిన కుశకుమారుని గతి యేమైనది?

చంద్రబింబమ్ము జలద సంఛన్నమయ్యెఁ;
గాఱుచీఁకటి నల్లడఁ గ్రమ్ముకొనియెఁ;
దారకలు మాసి యొక్కటే తార నిలిచె;
నదియు నుఱిఁగిన గతియేమి యయ్యె నాకు ?

లవు: అమ్మా, రోషాగ్నిజ్వాలల నానెత్తురు తుకతుక యుడుకు చున్నది. ప్రతిహింసావేశము నన్నుఁ బెరరేఁపుచున్నది. నన్ను వదలుము.

సీత: నాయనా, నీయుష్కురత చాలింపుము. కడసారి నాముద్దు కొమరుని మృతకళేబరమునైనఁ గాంచుటకు నన్నుఁగొనిపొమ్ము.

లవు: తల్లీ, నీవు విచారింపవలదు. అన్న సర్వతోముఖ బాణ ప్రయోగదక్షుఁడు. ఆతఁడు మరణించియుండుట కల్ల. అన్న మూర్ఛిల్లియుండిన భీతిల్లి ఈమాండవ్యుఁడు పరుగెత్తియుండును.

మాండ: నీవుమాత్రము భీతిల్లకుందువా? అప్పటికిని ధైర్యవంతుఁడను గావున దూరమునుండియైన నంతయుఁ దెలిసికొని వచ్చితిని.

లవు: అమ్మా, కాలవిలంబన మగుచున్నది. నన్నుఁబోనిమ్మా.

[కౌఁగిలి విడిపించుకొనును.]

సీత: నాయనా, నా మాటవినరా.

నాదుముద్దుకూన, నాకన్ను వెన్నెలా,
నాదు భాగ్యరాశి, నాకుమార,
పుత్రశోకవహ్నిఁ బొగిలింప నెంచితే ?
రార కన్నతండ్రి, రణమువలదు.

లవు: అమ్మా. యీకూళలకు అన్నయ్యను నప్పగించి నన్ను సుఖముండు మనియెదవా ?

అన్నను నొంచినట్టి యభిమాతిబలంబులు చెట్టుపుట్టలన్
వెన్నడి మున్నడింబఱప భీషణసంగరమందు మబ్బులోఁ
జెన్నగు మించునా మెఱసి చిందఱవందఱచేసి శౌర్యమ
భ్యున్నతి నొందఁ దెచ్చెద సహోదరు నీవు ముదంబుఁబొందఁగన్

సీత: మాండవ్యా, యిఁక నేనేమిసేయుదును? ఈలవుఁడు నామాట సరకు సేయకున్నాఁడు?

మాండ: అమ్మా, నీవు బ్రతిమాలినను విననివానికి నా సదుపదేశము చెవిని దూరునా?

లవు: తల్లి నీవైన వాల్మీకి తాతయైనఁ
దాపసేశ్వరులైన విధాతయైన
అన్న యవమానమునకు రోషాగ్నిరగులు
నన్ను నిలుపంగ లేరని నమ్ముమమ్మ.

అమ్మా, యిటకుఁ బోయివచ్చెదను. మాండవ్యా, రమ్ము.

మాండ: పోదము పద.

[ఇరువురు నిష్క్రమింతురు.]

సీత: [చేతులుజోడించి] అయ్యో! జగదీశ్వరా, యీ ముద్దుకుమారు నైన రక్షింపవా?

సూర్యచంద్రులార, సురలార, మునులార,
కన్నతండ్రులార గావరయ్య;
యిలను నెల్ల నేలు నిక్ష్వాకు భూపాలు
ముద్దుపట్టి నాదు ముద్దుపట్టి.

[యవనిక జారును.]

చతుర్థ స్థలము: అడవి.

[కుశుఁడు మూర్ఛిల్లియుండును; లక్ష్మణుఁడు ప్రక్కన నిలఁబడి యుండును.]

లక్ష్మ: కటకటా! నేనెంత యకార్యమొనరించితిని? రోషావేశమున నీబుషికుమారుని, ఈ శూరబాలకుని, ఈ సౌందర్యరాశిని నా కఱకు టమ్ముల కెఱ గావించితిని!

సగముపూచిన యెఱ్ఱలొద్దుగపురెమ్మ
గాలితాఁకున నేలను గూలినట్లు
దూపుగంటుల నెత్తురు దొరఁగుచుండ
ధరణి యొడిలోనఁబవళించెఁ దపసి సుతుఁడు.

ఆహా! నా యవివేకమునకు నాకే లజ్జ వొడముచున్నది! ఋషి కుమారుని దునుమాడినందుకు అన్న కోపింపక మానఁడు. ఈ కుమారుని దురవస్థఁ గాంచినఁ దాపస దంపతులు నన్ను శపింపక మన్నింతురా ?

ఉత్సాహ. చిగురుటాకు జొంపమందుఁ జిచ్చువెట్టి యవ్వలన్
వగలఁబొగలు మ్రాఁకునటుల బాలకున్ మనోహరున్
విగతజీవుఁగా నొనర్చి వీరలోకమందు నే
నగడు గుడుతునంచుఁ జిత్తమారటంబు నొందెడిన్.

ఆహా! యీతాపసబాలకునిపై నకారణవాత్సల్యము నాకేల గలుగుచున్నది? ఇది తపోవన మహత్త్వమా యేమి ?

అతి చెగటారిన యంగకుఁ
బరగదు మోదంబునాదు భావమునందున్
బరమ సుహృన్మరణంబనఁ
గర ముమ్మలికంబు నన్నుఁ గళవళపెట్టున్.

ఆహా! బాలకుని యవయవములు మెల్లమెల్లగఁ గదలుచున్నవి శరాఘాతముల నీకుమారుఁడు మైమఱచి పడియుండెనేగాని, దైవవశమున మరణింపఁడాయె. ఈ వీర కిశోరమును మా శిబిరమునకుఁ గొనిపోయి ప్రాణ

చికిత్సగావించి, యన్నకు ఉపాయనముగ అయోధ్యకుఁ బంపెదను.

[కుశుని నెత్తి భుజముపై వైచికొనును.]

[లవుఁడు ప్రవేశించును.]

లవు: [స్వగతము] ఓహో! యీ రాజకుమారుఁడు అన్న నెత్తుకొని వెడలుచున్నాఁడు. [ప్రకాశము] ఓయీ, నిలుము, నిలుము. నీ దొంగతనము సాఁగుననుకొంటివా?

నేను మాయన్న వెంబడి లేనియపుడు
లెక్కయిడరాని సైనికు లొక్కమొగిని
పుట్టతేనెకు నీఁగలు మూఁగినటుల
ముట్టడించి వధించియుఁ బోవువారె?

లక్ష్మ: [కుశుని నేలపైఁ బరుండఁబెట్టి స్వగతము] ఔరా! యీ బాలకు డెవ్వఁడు? ఈమూర్ఛితుని ప్రతిబింబమో యనునట్లున్నాఁడు! వీరిరువురు కవలైయుందురా?

లవు: ఓయీ, శూరమ్మన్యుఁడా, మీ రాచవారి శూరత్వ మిట్టిదియే నా? ఒక్క బాలకుని అందఱు సైనికులుపొదివి తెగటార్చుటయే గాక అతని మృతకళేబరము సైతము దొంగిలించుకొని పోవుచున్నావా?

ఓయీ, ఆకళేబరమును విజయోపాయనముగఁ దలంచుము. అన్యోన్య జిగీషువులమగు మనలో నెవరు గెలిచినను ఆ పారితోషకమును గైకొందము.

లక్ష్మ: బాలకా, నీవీ ఋషికుమారునకు సోదరుఁడవా?

లవు: నీకు నకాలమృత్యువును.

లక్ష్మ: అంతగమెఱుంగక బాల్యచాపలమున మాఱ్కొనిన యీ బాలునిగతి యేమైనదో చూతును.

లవు: [శింజినీ టంకారముసేయుచు] ఇఁక నీగతి యేమి కానున్నదో తెలిసికొనుము.

కుశు: [మెల్లగఁ గనువిచ్చి] తమ్ముఁడా, నాకుఁ దోడ్పడవైతివా? మరణశయ్యయందైన నొక్కమాఱు కౌఁగిలించుకొని నన్ను వీరస్వర్గమునకు వీడ్కొల్పవా?

లవు: [విల్లుక్రిందవైచి] ఆహా! మాభాగ్యవశమున అన్న బ్రతికి యున్నాఁడు. [దగ్గఱకుఁబోయి మోకాలిపై వంగి] అన్నా, నిన్ను దురాత్ములు నొప్పించిరా? నన్నేల ముందుగఁ బంపివైచితివి?

కుశు: తమ్ముఁడా, నేనిపు డెక్కడ నున్నాను?

లవు: రణరంగమున.

కుశు: ఇంకను రాజకుమారుఁడు బ్రతికియున్నాఁడా!

లవు: వీఁడుగో! యజ్ఞపశువువలె బంధనమునకు సిద్ధముగ నున్నాఁడు.

కుశు: [చేతిపై సగములేచి] ఏఁడీ?

లక్ష్మ. [స్వగతము] ఔరా! ఏమి యీకుమారుని క్షాత్రము!

శరఘాతంబుల వేదనన్ సొలయుచున్ శార్దూలపోతంబు న
త్తురులొల్కంగ సగంబునిక్కి మృగయుం దుండాడ నూంకించెనా
శరవిద్ధాంగుఁడు బాలకుం డురు రుషా సంతప్తచిత్తంబునం
బరఁగున్; బాపురె! వీరమోహన రణప్రావీణ్యరూపంబునన్.

కుశు: లవా, నావింటి నిటు లందియిమ్ము. [లవుఁడు అందియిచ్చును] [స్వగతము] ఔరా! నాకరము శరాసన భారమునైన నోర్వకున్నది. [వింటిని

దిగవిడచును]

లవు: [శింజినీ టంకారము సేయును.]

[వాల్మీకి ప్రవేశించును]

వాల్మీ: ఆహా ! శాంతికిఁ దావలమైన తపోవన మేలొకో ఆర్ద్ర శోణితపిశితంబులఁ గళంకితమైనది.

లవు: రాజకుమారా, నీప్రాణములఁ గాచికొమ్ము.

మాజనని సర్వలోకసమ్మాన్యవృత్త
పూతచారిత్ర వీరప్రసూతయేని
తాత వాల్మీకి సత్తపో ధన్యుఁడేని

వాల్మీ: ఎవరు నన్నుఁ జేర్కొనుచున్నారు ?

లవు: అస్త్రమియ్యదె,

వాల్మీకి: ఆహా ! ప్రమాదము. విడువక యాఁగుమాఁగు.

లక్ష్మ: మునిచంద్రమా, లక్ష్మణుఁడు మ్రొక్కుచున్నాఁడు.

వాల్మీ: కుమారా, వర్ధిల్లుము!

కుశు: [స్వగతము] లక్ష్మణుఁడా యీతఁడు ?

లవు: తాతా, [వాల్మీకిని కౌఁగిలించుకొని] యీ దురాత్ముని సేనలు అన్నను ముట్టడించి మూర్ఛిల్లఁజేసినవి. అన్నను బ్రతికింపుము.

కుశు: తాతా, నన్ను శీఘ్రముగ వీరస్వర్గమునకు వీడ్కొల్పుము. ఈ శరాఘాత వేదన దుర్భరమగుచున్నది.

వాల్మీ: [స్వగతము] ఆహా ! దైవఘటనాచిత్రము ! [ప్రకాశముగ] నాయనా, యూరడిల్లుము. నీవు వజ్రకాయుఁడవు కాఁగలవు.

లక్ష్మ: [స్వగతము] ఏమీ వాల్మీకిమునీంద్రుల మనుమలా యీ వీరకుమారులు? ఆజన్మ బ్రహ్మచారికిఁ గుటుంబము కలదా ?

వాల్మీకి: [కుశునిఁ జేరవంగి] నాయనా కుశా, [ఒడలునిమురుచు] నీ శరాఘాతములన్నియు నిర్బాధకము లయ్యెడిని లెమ్ము.

లక్ష్మ: [స్వగతము] ఆహా ! తపోధనుల మహాత్మ్యము !

కుశు: తాతా, సమయమునకువచ్చి నన్ను రక్షించితివి.

లవు: అన్నా, వేదన శమియించినదా ?

కుశు: లవా, తాతగారి తపఃప్రభావ మమోఘముగదా ?

> చేతితోఁదీసివైచిన రీతిగాఁగఁ
> దూపుగంటుల వేదన తొలఁగిపోయెఁ;
> బూర్వ దోర్బల ముత్సాహమును జెలంగెఁ;
> దగుదు నేనింక వైరి మర్దనము సలుప.

వాల్మీ: కుమారా, యీ పట్టుదలవదలుము. మాననీయులయెడ నపరాధ మొనరించితివి.

కుశు: [స్వగతము] ఆహా! యేమి వాల్మీకితాతగారి పక్షపాతము.

వాల్మీ: లక్ష్మణా, గొప్పప్రమాదము వాటిల్లినది. లోకవిఖ్యాత వీరులగు మీర లీబాలురతోఁ బోరాడుట ధర్మమా?

లవు: [స్వగతము] ఇంద్రజిత్సంహారకుఁ డగు లక్ష్మణుఁడా యీతఁడు?

లక్ష్మ: మునికులతిలకా, మన్నింపవలయు. ఈకుమారకుల మనోహరస్వరూపములు నాహృదయమునఁ గరుణావేల్లితమును గావింపఁ బోరుట కిష్టపడక సవనాశ్వమును వదలుఁడని యెంత బ్రతిమాలుకొన్నను వీరు వినరైరి. నాప్రయత్నము సాఁగమి రఘుకులేశ్వరు ప్రతిజ్ఞ నెఱవేర్చుటకై అనిష్టము

తోనైనఁ గదనము సలుపవలసి వచ్చెను.

లవు: [స్వగతము] వాల్మీకి తాతగారు రాకుండిన నింతవఱకే ప్రతిజ్ఞ నెఱవేర్చి యుండుదుము కాఁబోలు!

వాల్మీ: నాయనా, గతమునకుఁ జింతించిన లాభము లేదు. ఈ తపోవనము ప్రవేశించి మా కతిథివై తివి.

లక్ష్మ: మహాప్రసాదము.

లవు: [కుశుని వంక తిరిగి] అన్నా, మనల నొప్పించిన దురాత్మునకు ఆతిథ్యమొసఁగ వలయునా?

కుశు: లవా, తాతగారు ఆశ్రమధర్మములకు వెలియౌదురా?

వాల్మీ: కుమారులారా, ఆశ్రమమునకుఁ బోదముఁ గదా; అతిథి సత్కారధన్యుల మగుదము. [స్వగతము] దైవవశమున నేను సమయమునకుఁ దీర్ఘయాత్రనుండి మరలి రాకున్న నెంత ప్రమాదము వాటిల్లియుండునో!

[అందఱు నిష్క్రమింతురు]

పంచమ స్థలము: వాల్మీకి ఆశ్రమము.

[వాల్మీకియు సీతయు సంభాషించు చుందురు.]

వాల్మీ: కుమారీ, ఈవిషయము చక్కఁగ నాలోచింపుము. ప్రజలింతకు మున్నే తమ యవివేకమును దెలిసికొని పశ్చాత్తాప పడుచుందురు. పుత్రవతిని నిన్ను రామచంద్రుఁడు కన్నులఁ గప్పికొని స్వీకరించును.

నేలనాలుగు చెఱగులు నేలఁజాలు
వీరవీరులు కుశలవుల్ వెలఁదిమిన్న,
అట్టికొమరుల సౌఖ్యంబు నరసియైనఁ
గాంతు సన్నిధిఁ గాలంబుఁ గడపుమమ్మ.

సీత: నాయనా, సర్వమెఱింగిన మీరే యిట్లాడుచున్న నిఁక నే నేమిపలుకఁగలను? ఆర్యపుత్రునకు నాకన్నను కుమారులకన్నను కీర్తియే గదా యాదరణీయము.

వాల్మీ: కుమారీ, నిన్ను మరలఁ బరిగ్రహించుటవలన రామచంద్రుఁడపకీర్తివంతుఁడౌనని యెంచెదవా ?

సీత: ప్రజ లట్లు తలంతురు.

వాల్మీ: అమ్మా, లక్ష్మణునివలన నంతయు నెఱింగితిని. నిన్ను వనములకుఁ బంపినందులకు జనులు రామచంద్రుని తొందరపాటును దూలనాడుచున్నారఁట!

సీత: ఆహా! యేమి లోకుల చిత్తచాంచల్యము!

నోటి కడ్డమూఁకయు లేక మాటలాడి
సత్యము నసత్యమెఱుఁగరు జడహృదయులు;
గాలివీచిన యట్లెల్లఁ గదలియాడు
కేతనాంచల మటు వారి చేత మలరు.

వాల్మీ: జానకీ, జనసామాన్యము కర్ణధారిలేని నావవలె ముందు వెనుకకుఁ దుళ్ళింతలాడుచు అనేకవిధములఁ బోవుచుండును.

సీత: నాయనా, యశ్వమేధ మొనరింప సమకట్టిన యార్యపుత్రుఁడు నూతనముగ సహధర్మచారిణిని బరిగ్రహించి యుండునుగదా!

వాల్మీ: బిడ్డా, రామచంద్రుఁడు ఏకపత్నీవ్రతుఁడని యెఱుంగవా?

సీత: అట్లయిన సహధర్మచారిణి లేక యజ్ఞదీక్ష యెట్లు వహించును?

వాల్మీ: నీ ప్రతిబింబమగు స్వర్ణమయవిగ్రహమె సహధర్మచారిణి యాగుట!

సీత: [ఆశ్చర్యముతో] ఏమీ యీవింత! ఆర్యపుత్రుఁ డెంతటి కైనఁ దగియున్నాఁడు.

వాల్మీ: శాస్త్రసమ్మతమని యెందఱో ధర్మవేత్తలగు తాపసు లుపదేశించినను ద్వితీయ పరిగ్రహమున కియ్యకొనక నీప్రతికృతిగఁ గాంచన విగ్రహమును నిర్మింపించి రఘుకులేశ్వరుఁడు దీక్షాకంకణము ధరియించెనఁట!

సీత: [స్వగతము] ఆర్యపుత్రుని యేకపత్నీవ్రత మెల్లకాలము వర్ధిల్లుఁగాక!

వాల్మీ: అమ్మా, రామచంద్రుఁడు నిన్ను విడనాడియుండువఱకు స్వస్థచిత్తుఁడు కాఁజాలఁడు.

నిండుచూలాలి విడనాడ నేర్చెఁగాని
విరహతాపంబు రాముఁడు వీడలేఁడు;
పవలు రేయును నిన్నెంచి పనవిపనవి
పాండురోగి విధంబునఁ బాలిపోవు.

సీత: [స్వగతము] ఆర్యపుత్రునకు వినోదహేతువైన ఆ కనకవిగ్రహమునకన్న సంతాపకారిణి నగు నేనే దురదృష్టవతిని.

[కుశలవులు ప్రవేశింతురు.]

కుశ: తాతా, మాపాఠముల నొప్పగించుకొనుము. మేము పూజా

పుష్పములు గోయఁ బోవలయును.

వాల్మీ: నాయనలారా, పొరము లటుండనిండు. అయోధ్యాపతి యొనరించు అశ్వమేధమునకు మన మాహ్వానింపఁబడితిమి. మనమందఱము నేఁడే రాజధానికిఁ బ్రయాణము కావలయును.

లవు: తాతా, అమ్మ కూడానా ?

వాల్మీ: అవును ?

కుశు: తాతా, అట్లయిన మేము రామాయణకథానాయకునిఁ బ్రత్యక్షముగఁ జూడఁగలమా ?

వాల్మీ: నిస్సంశయముగఁ జూడఁగలరు.

సీత: [స్వగతము] ఆర్యపుత్రుఁడు తమతండ్రి యని తెలిసిన ఈ కుమారకు లెట్లు సంతసించువారో గదా !

లవు: తాతా, అలక్ష్మణుఁడేమైన మాపై లేనిపోని తంటాలు చెప్పునేమొ ?

వాల్మీ: నన్ననుసరించు మీకు నేలాటిభయముండదు లెమ్ము.

లవు: అన్నా, రమ్ము. చక్కఁగ ఉతికియారవైచిన వల్కలములు ధరియించుకొని సిద్ధముగ నుందము.

[కుశలవులు నిష్క్రమింతురు.]

వాల్మీ: కుమారీ, తాపస సువాసినుల యాశీర్వాదములు వడసిరమ్ము.

సీత: అటులనే పోయివచ్చెదను.

[నిష్క్రమించును.]

వాల్మీ: నే నిన్నిదినములుఁ దలపోయుచుండిన కార్యము అతర్కితముగ అశ్వమేధ సందర్శనమూలమున సిద్ధింప నున్నది. ఇఁకనైన రామభద్రుఁడు దారాపుత్రవంతుఁడై సుఖియించుఁగాక !

[నిష్క్రమించును.]

అష్టమాంకము

ప్రథమ స్థలము: యాగమంటపము

[రామ లక్ష్మణ భరత శతృఘ్నులును, రాజులును, మునులును, ప్రజలును కూర్చుండియుందురు]

రాము: [స్వగతము] అకటా! సర్వాంగనిర్వాణదాయిని యగు నా జానకిని మోసగించి యడవులకు వెడలించి కృత్రిమమగు కనకవిగ్రహముతోడ నే నీ యాగమంటపము నలంకరింప వలయునా? ఈ సాహసము సీతాబహిష్కారమునకన్న హృదయభేదక మగుచున్నది.

వసి: రామభద్రా, కంకణము ధరియించికొమ్ము.

రాము: [చేయి చాచును. వసిష్ఠుడు కంకణము కట్టుచుండును.]

అవనిజాత రాముని బహిఃప్రాణ మనుచు
నెల్ల రనుకొను సత్యంబు కల్లయయ్యె;
నట్లుగాకున్న జానకి నడవి కంపి
పాపి రాముండు నింకను బ్రతికియున్నె?

వసి: రామచంద్రా, హుతాశనున కంజలి ఘటియించి హోమకుండము రగుల్పుము.

రాము: [ఉల్క చేతఁబట్టుకొని కుండము త్రిప్పించి రగిలించుచు] [స్వగతము] సీతా విరహితమైన ఈ యశ్వమేధము నే నెట్లొనర్తును?

నాదు గృహలక్ష్మి, యర్ధాంగి, నా మనో ల
తాంత మకరంద బిందువు చెంతనుండ
నెన్నొ జన్మంబు లొనరించి యున్న నాకు
ధర్మపత్ని యయ్యె నిటఁ గాంచనపుబొమ్మ.

లక్ష్మ: [స్వగతము] శోకాకులితచిత్తుఁడగు మాయన్న యజ్ఞవిధుల సాంతముగ నొనరింపఁ గలఁడా ?

రామ: [స్వగతము] జానకీ, నీకై యొనర్చిన అనన్యసాధ్యములగు సాహసకార్యములు నేఁడు నిష్ప్రయోజనము లాయెఁగదా!

నీవు లేకుండిన నిస్తుల బలశాలి
వాలిఁ జెండాడుట వమ్ముగాదె ?
నీవు లేకుండినఁ బావని జృంభించి
వనధి దాఁటుటయు నిష్ఫలముగాదె ?
నీవు లేకుండిన నిఖిల వానర సేన
యబ్ధిగట్టుట వ్యర్థ మానుగాదె ?
నీవు లేకుండిన నిర్ణిద్ర రణవీరు
రావణుఁ జంపుట రవ్వగాదె ?

స్వార్థపరత నిన్ను సాధుచరిత్రను
జేతులారఁ గానఁ జేరఁద్రోసి,
వెఱ్ఱిపట్టినటుల వెకలినై చింతింతు
గడచినట్టి దుష్ట కార్యమునకు.

[వాల్మీకి కుశలవులు ప్రవేశింతురు]

వాల్మీ: రామభద్రా, మంగళ మగుఁగాక!

రాము: మునీంద్రా, భవదాగమమునఁ గృతార్థుఁడ నైతిని.

మునులు: తథాస్తు. తథాస్తు,

రాము: [స్వగతము] లక్ష్మణుఁ డెఱింగించిన సౌందర్యమూర్తు లీ యిరువురు వటువులై యుందురా?

[సభలో గుజగుజలు]

రాము: మునీంద్రా, యీ తాపస వటువు లెవ్వరి కుమారులు ?

వాల్మీ: వీరొక వనవాసిని బిడ్డలు.

లవు: [జనాంతికము] అన్నా, యీ యజమానుఁడేనా రామాయణ కథానాయకుఁడు ?

కుశు: అట్లే తోఁచుచున్నాఁడు. తమ్ముఁడా, యీ శాంతస్వరూపుని దర్శించినంతఁ దల్లినిగాంచినంత యనురాగ ముప్పతిల్లుచున్నది !

లవు: అన్నా, వాల్మీకితాత సత్యమే వర్ణించెను.

రాము: మునీంద్రా, ఆ వనవాసిని యెవ్వతె ?

వాల్మీ: ఎవ్వతెనో యొకగర్భిణి వనముల నిస్సహాయయై పరితపించుచుండ, నే నాశ్రమమునకుఁ దీసికొనిపోయి కుమారి నిర్విశేషముగఁ బోషించుచుంటిని.

రాము: తాపసోత్తమా, యీనిర్హేతుకవాత్సల్యము మీ దివ్యచిత్తమున కనురూపమైనది.— తరువాత?

వాల్మీ: కొన్నిదినముల కా సీమంతిని యీకవ బిడ్డలను బ్రసవించెను.

రాము: [స్వగతము] ఆహా ! యీ సుందరకుమారులఁ గాంచిన

ప్పటినుండి నామనము పరిపరివిధములఁ బోవుచున్నది ! అదియేలొకో వీరి ముఖమండలముల వైదేహి పోలికలు పొడకట్టుచున్నవి. నాభ్రాంతియే యిట్లు తోఁపించుచున్నదా ?

[ప్రకాశముగ] కుమారులారా, యిటురండు.

వాల్మీ: [స్వగతము] వాత్సల్యబీజమా, యంకురింపుము.

కుశలవులు: [అనుజ్ఞకై వాల్మీకితట్టు చూతురు.]

వాల్మీ: నాయనలారా, భయపడకుఁడు రామభద్రుఁడు సర్వప్రజలకు జనకప్రాయుఁడు.

కుశలవులు: [రాముని వద్దికిపోదురు.]

రాము: [ఇరువురను రెండుచేతులఁ జేరదీసికొని, స్వగతము]

ఆహా ! యేమి యీ యాశ్చర్యము !

ఈ మనోహరాంగు లీ ముగ్ధకోమరులు
నన్ను నంటినంత నన్ను తాఁగి
జనకజాత హస్త సంస్పర్శమట్టులఁ
గాయమెల్ల నమృత కలితమయ్యె.

కుశు: [స్వగతము] ఏమి, యీ మహాత్ముని తాపసాదరణము?

లవు: [స్వగతము] తండ్రి కౌఁగిలి నెఱుఁగని నాశరీరము ఈ మహారాజు కౌఁగిట సుఖించుచున్నది.

రాము. కుమారులారా, మీ నామధేయము లేమి ?

లవు: మహారాజా, యీయన కుశుఁడు.

కుశు: రాజచంద్రా, యీతఁడు లవుఁడు.

రాము: [స్వగతము] ఎంత కఠోరసంబోధనములు!

వసి: వత్సా, యిఁక యజ్ఞవిధుల గమనింపుము.

వాల్మీ: నాయనలారా, మీ రిఁకరండు.

కుశలవులు: [కౌఁగిలి వదల్చుకొని వాల్మీకి దగ్గఱకు వత్తురు.]

రాము: [స్వగతము] ఆహా! కౌఁగిలి వదల్చుకొనిపోవు నీబాల కుల నాచిత్తముగూడ ననుసరించుచున్నది. ఆగర్భవతియే సీత యై యుండిన ఈ ముద్దుకొమరులే నా బిడ్డలైయుండిన—ఆశా, యీ మందభాగ్యుని యందు నీయూహలన్నియు నిరర్థకములు.

[శూర్పణఖ నీడ్చుకొని విభీషణుఁడు ప్రవేశించును.]

విభీ: ఓసి కులపాంసనీ, చండి, యోసి జంత,
నాకు సోదరివై పుట్టినావె నీవు?
కత్తికోఁకోఁకకు కండగాఁ గాయమెల్లఁ
దఱిగివైచినఁ బోనె పాతకము కుటిల?

లక్ష్మ: దానవేశ్వరా, యాగమంటపముననా స్త్రీహత్య?

రాము: విభీషణా, ఏమి యీ దౌర్జన్యము?

విభీ: రఘుకులేశ్వరా, యీ మాయలమారిజంతను ఇప్పుడే శిరచ్ఛేదన మొనరించుట కాజ్ఞ యొసఁగవలయు. ఈ శూర్పణఖయే నిరపరాధిని యగు జానకీదేవి బహిష్కారమునకు మూలము. ఈ రక్కసి యొనరించిన కుట్రలన్నియు నాకుఁ దెలియవచ్చినవి.

రాము: [ఆశ్చర్యముతో] ఏమేమి?

లక్ష్మ: [స్వగతము] ఇది యేమివింత!

రాము: విభీషణా, యీశూర్పణఖ యేమిచేసినది?

విభీ: ఈ క్రూరచారిత్రయే తన దుష్టకృత్యమును దెలిసికొనుఁగాక.

[సభలో గుజగుజలు]

శూర్ప: దీనరక్షామణీ, ఆపద్బాంధవా, రామచంద్రా యాఁడు దరయు లాలింపుము. అనాథవత్సలా, ఈపాపాత్మను రక్షింపుము. నాతప్పు క్షమియింపుము. నన్ను బ్రతుకనిమ్ము.

భరతు: [స్వగతము] ఈరహస్యము పూర్వమే తెలిసియుండిన జానకీదేవి యడవులకుఁ బంపఁబడి యుండదుగదా.

విభీ: ఓసీ మాయలమారి, నీబొంకు లింకఁ జాలింపుము. సీతాపవాదకళంకము నీహృదయ రక్తపూరమునఁ గడిగివేయవలయును.

శత్రు: [స్వగతము] శూర్పణఖ కుట్రయా యింతటికిం గారణము!

శూర్ప: దీనబాంధవా, రామభద్రా, యీదీనురాలికి నభయప్రదాన మొసంగి రక్షింపుము.

ప్రాణవల్లభఁ జీకాకు పఱచినట్టి
కాకదైత్యుని నైతముఁ గాచినావు;
అఖిలలోక శరణ్యుండ వైన నిన్నుఁ
బ్రాణదానంబు వేఁడెద రామభద్ర.

లక్ష్మ: అన్నా, యీమాయావినియందు నెనరూనఁదగదు.

రాము: దానవీ, నీవెట్లు సీతాపవాదమునకు మూలమవైతివి ?

శూర్ప: మహారాజా, యథార్థము చెప్పుచున్నాను. నన్ను రక్షించినను శిక్షించినను మీ కరుణయే.

రాము: చెప్పుము.

శూర్ప: రాక్షసవినాశన ప్రతీకారమొనరింపఁ గోరి జానకీదేవిని నిల్లైన నడవులఁ గష్టపెట్టనెంచి అయోధ్యఁ జేరితిని. మాఱువేసంబునఁ జరిం

చుచు జనసమ్మర్దములగు ప్రదేశముల ఏమేమొ యపవాదములు వ్యాపింపఁ జేసితిని. రామభద్రా, రక్షింపుము. రక్షింపుము.

ప్రజలు: జానకీదేవి నిష్కలంక—సీతాదేవి సాధ్వీచరిత్ర—

రాము: [స్వగతము] ఓసీ క్రూరరాక్షసీ, నీపగ తీర్చుకొంటివా?

విభీ: మహారాజా, ఈకపటచారిణిని దెగటార్చుటకు ఆజ్ఞవెట్టుము.

శత్రు: అన్నా, ఈ రాక్షసి కరుణార్హ గాదు.

నిండుచూలాలి వైదేహి నిష్ఠురంపుఁ
గష్టములకుఁ గారణమైన దుష్టురాలిఁ
గటకు కటవాలమునఁ జీల్చి కండలెల్లఁ
గాకులకు గ్రద్దలకు వైవఁ గౌతుకంబు.

రాము: తమ్ముఁడా, దీక్షాకంకణపూతమైన నాహస్తము అపరాధిని రక్తమంటైన మునుఁజాలను. ఈ కుటిలచరిత్రను హింసించినను నాప్రాణవల్లభ మరల బ్రతికివచ్చునా? శూర్పణఖా, వెడలిపొమ్ము. పాప పరిహారము గావించుకొనుము.

శూర్ప: రఘుకులేశ్వరా, నీయనంతకారుణ్యము వర్ధిల్లుగాక! దారపుత్రవంతుఁడవై సుఖింపుము.

రాము: [స్వగతము] జానకి జీవించియున్నఁగదా—

ఋషులు: రామభద్రా, నీయతిలోక దయాళుత్వము ప్రశంసనీయము.

విభీ: శూర్పణఖా, రామచంద్రుని యాజ్ఞలేమి నీవు వధింపఁబడక బ్రతికితివి. ఇఁక లంకయందడుగిడిన నా కరవాలము నీప్రాణముల నూట్రికొనును. పొమ్ము. నీపాపాత్మ తరియించునటుల నెక్కడనైన వనమందుఁ దప మాచరింపుము.

శూర్ప: [స్వగతము] పులివాతఁబడిన జింకపిల్ల జాటిపడినటుల ఈ

విభీషణుని చేతినుండి తప్పించుకొంటిని. ఇఁక నెక్కడికైనఁబోయి నా జీవితశేషమును గడపెద.

[నిష్క్రమించును]

వాల్మీ: [లేచి నిలుచుండి] ఋషీశ్వరులారా, సకల దేశాధీశ్వరులారా, ప్రజలారా, పవిత్రచారిత్రయగు జానకీదేవి శూర్పణఖ మూలమున నడవులకు వెడలింపఁబడుట మీరెల్ల రెఱుంగుదురుగదా! నిండుచూలా లఁ—కోమలశరీర—రాజకుమారి నిస్సహాయయై యెట్లు కాలముగడపుచున్నదో యెవ రెఱుంగుదురు ?

రాము: మునీంద్రా, హృదయ మర్మభేదకమగు నీవిషయము నేల తలపించుచున్నారు ?

వాల్మీ: ఆసాధ్వీమణి కష్టపరంపరలు విన్నఁ గఠోరచిత్తులైనఁ గంటఁ దడివెట్టుకొందురా ? ఇఁకఁ గరుణార్ద్రహృదయులగు మీమాటఁ జెప్పవలయునా ?

ప్రజలు: వాల్మీకిమునీంద్రా, మహారాజ్ఞి దురవస్థఁ దలఁచినంతనే మాగుండె లవియుచున్నవి.

వాల్మీ: అవునవును; అయోధ్యావాసులు సజ్జనులని నాకుఁ దెలియును. సీత యన్ననో కదలమెదలలేని గర్భవతి. వనమా ఘోరమృగాకులము. ప్రాణములు పిడికిటఁబట్టుకొని ఆ యబల యెంతకాలము జీవించియుండును?

ప్రజలు: కష్టము! కష్టము!

మునులు: సీత సుఖించుఁగాక!

రాము: [స్వగతము] అయ్యో! యీమునీంద్రుని పల్కులు వ్రీలుచున్న నా హృదయమునకు శల్య సంచలనములవలె నున్నవి.

వాల్మీ: శూర్పణఖ తనదుష్కార్య మొప్పుకొనినవెనుక సభాస్థులలో నెవ్వరైన సీతాదేవి బహిష్కారయోగ్యయని చెప్పఁగలరా?

ప్రజలు: మునీంద్రా, సీతాదేవి మాకుఁ గన్నతల్లివంటిది. జానకీదేవి పావనచరిత్ర—పతివ్రతామణి. దేవీబహిష్కారము ప్రమాదజనితము; ప్రమాదజనితము.

రాము: [స్వగతము] ఈప్రజ లేగాలికి ఆ నాపయెత్తు స్వభావము గలవారు.

వాల్మీ: సభ్యులారా, సీతాదేవి దైవవశమున బ్రతికియుండినఁ బున గ్రహణ యోగ్యయగునా?

ప్రజలు: నిస్సంశయముగ— ఈయశ్వమేధమున మహారాజునకు సీతాదేవియే సహధర్మచారిణి గావలయును.

రాము: ఇది యెట్లు సంభవించును?

వాల్మీ: వత్సా! దైవఘటన కసాధ్యముఁగలదా?

రాము: [ఆతురతతో] ఆర్యా, అట్టియిన మాహృదయేశ్వరి బ్రతికి యున్నదా?

వాల్మీ: కుమారా, జానకి బ్రతికియున్నది.

[ప్రజలలో సంతోషసూచకసంభాషణాలు, గుజగుజలు]

రాము: ఏమి వినుచున్నాను! ఇది స్వప్నము గాదు గదా!

ప్రజలు: మహారాజా, మామనములు చల్లఁబడునటుల సీతాదేవిని పరిగ్రహించి సుఖింపుము.

వాల్మీ: రాఘవా, నీకుఁ గుమారులుగూడఁ గలరు.

లక్ష్మ: [స్వగతము] నాయూహ యథార్థమై యుండునా?

రాము: అహా! యిదియేమో మాయనాటకముగ నున్నది. మునీంద్రా, యిదియంతయు నసంబద్ధము. నాకెక్కడిజానకి? యెక్కడి కొమరులు? సీతకును నాకును బంధించెండు వత్సరములు దుర్భేద్యకుడ్యమువలె యెడఁబాటు గావించినవి. ఇది యంతయు స్వప్నము—మృగతృష్ణాప్రాయ

ము—ఇంద్రజాలము—ఈమందభాగ్యునికి భార్యలేదు, బిడ్డలులేరు, సోదరులులేరు, బంధువులులేరు, ఎవ్వరునులేరు. రామునకు లోకమంతయు శూన్యము; అంధకార మలీమసము; నరక సదృశము.

వాల్మీ: అమ్మా, జానకీ,

[జానకి, తాపసపురంధ్రి, ప్రవేశింతురు;
కుశలవులు ఆమెనుచూచి ప్రక్కకు వత్తురు]

రాము: [ఆశ్చర్య దుఃఖములతో] జానకియా?— ఏకవేణీధారిణి— కృశాంగి— ఆ— నాజానకి బ్రతికియున్నది!

[రాముఁడు పీఠముపైనుండి లేచును. కుశలవులు ఆశ్చర్యముతో చూచుచుందురు. రాముఁడు సీతను దగ్గఱకు తీసికొని] ప్రాణప్రియా, నా స్వార్థపరత్వమును క్షమియింపుము. నాయపరాధమును నీ కృపాకటాక్ష వీక్షణములఁ గప్పుపుచ్చుము. నా జీవితశేషమును నీ యభీష్టపాలనమునకై వినియోగించి యపరాధ విముక్తుఁడ నయ్యెదను.

నాముద్దు బిడ్డలారా, కుశలవులారా, రండు నాయుత్సంగము నలంకరింపుఁడు. నన్నానందవార్ధి నోలలాడింపుఁడు. మీతల్లి నట్లు నట్టడవులఁ గష్ట పెట్టితినని కోపింపకుఁడు.

కుశు: [స్వగతము] ఇదియేమి, మహారాజి ట్లనుచున్నాఁడు?

లవు: [స్వగతము] మేము రామాయణకథానాయకుని బిడ్డలమా?

[సభలో గుజగుజలు]

రాము: నాయనలారా, రండు. నన్నుఁ గౌగిలించుకొనుఁడు.

లవు: [స్వగతము] ఇంతవఱకుఁ దాపసబాలకుల మనుకొనుచుంటిమి!

సీత: ప్రాణవల్లభా, యీదీనురాలి యపరాధములను మన్నింపుము.
[పాదములమీఁద వ్రాలును.]

రాము: [లేవనెత్తి] హృదయేశ్వరీ, నిరపరాధిని వని తెలిసియుఁ, గీర్తిలోభమున, మిష వెట్టి నిన్నుఁ గానలకంపిన యీ పాపిరాముఁడు నిన్ను క్షమియించుట కెవ్వఁడు? నీ యతి లోకపాతివ్రత్యము నీయనన్యసాధ్యమైన క్షమ మావంశము నుద్ధరించినది. మఱొక్కమాఱీలోకమును నా కానందమయముగ నొనరింపుము. [స్వగతము] ఆహా ! మానవుని సుఖదుఃఖావస్థల భ్రమణము !

ఐంద్రజాలికుఁ డాత్మ మోహనపుఁ గుంచె
విసరినంతనె మాఱెడి విషయమటుల
నాకు నిరయంబుగాఁదోఁచు నాదు బ్రతుకు
స్వర్గ సన్నిభమయ్యె నీక్షణమునందు!

[ప్రకాశముగ] మునిసత్తమా, నా కృతజ్ఞత యెట్లుదెలిపికొనుటకుఁ దోఁపకున్నది. నన్నింకొకమాఱు సపత్నీకుని గావించితిరి.

వాల్మీ: వత్సా, కష్టసుఖములు లోకమునకు సహజములు; అనివార్యములు. గడచినది మఱచిపొమ్ము. వర్తమానము ననుభవింపుము. భవిష్యత్తును దృష్టిపథమున నుంచుకొనుము.

ఋషులు: రఘుకులేశ్వరా, జానకీసహితుఁడవై యశ్వమేధము నొనరింపుము. దార పుత్రవంతుఁడవై గార్హస్థ్యసౌఖ్యముల ననుభవింతువు గాక!

ప్రజలు: తల్లీ లోకమాత, అజ్ఞానుల యపరాధముల మన్నించి మమ్ము మీబిడ్డలవలె రక్షింపుఁడు.

ఋషులు: స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం,
న్యాయేన మార్గేణ మహీంమహీశాః,
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం,
లోకాః సమస్తాః సుఖినో భవంతు!

[యవనిక జారును.]

భరతవాక్యం.

నెలముమ్మారులు వర్షముల్ గురియుతన్
నీరంధ్రమేఘాళి స
స్య లతావృక్షచయంబు సత్ఫలయుతంబై
క్షామముల్ వాపుతం
గలుగుంగాత స్వరాజ్యమెల్ల ప్రజకుం!
గళ్యాణముల్ సౌఖ్యముల్
వెలయుంగావుత స్వర్గమందు బలె నీ
విశ్వంభరన్ నిత్యమున్!

కుంభరాణా.

[మీరాబాయి]

కుంభరాణా

[మీరాబాయి]

నాంది.

శ్రీ రాధాసతి నేలినట్లు కరుణా
చిత్తంబునన్ దుఃఖ దు
ర్వారాంగ పరీక్షఁ దప్తయగు
మీరాబాయి చేపట్టి లో
కారాధ్యుండుగ నొప్పు మాధవుఁడు
మమ్మజ్ఞాన సంక్షుబ్ధ సం
సారంభోనిధిఁ గర్ణధారుఁడయి
మోక్షద్వీపముం జేర్చుతన్ !

స్థలము ౧ : ఉపయపురము.

[శ్రీ కృష్ణాలయాంతర్భాగము. అంతయు కొంచెము చీఁకటిగనుండును. ద్వారముచుట్టును వెలుఁగుచుండిన చిన్న ప్రమిదలు కొలఁదిపాటి వెలుతురి నొసఁగుచుండును. తెఱ యెత్తఁబడఁగనే అలంకృతమైన కృష్ణవిగ్రహము, తీర్థపాత్రాది సన్నిధి సామగ్రి, పూజించుచున్న అర్చకుఁడు, దర్శనార్థము వచ్చిన యిద్దరు యాత్రికులు అగపడుదురు. అర్చకుఁడు అర్చనానంతరము కర్పూరహారతి యెత్తును. యాత్రికు లిద్దఱుకూడ పాడుదురు]

మొదటి యాత్రికుఁడు: ఆహా! ఏమి యీదేవాలయ ప్రభావము! లోన అడుగు పెట్టినంతనే యేదో అనిర్వాచ్యమగు ఆనందము, శాంతి నా చిత్తము నావరించుచున్నవి.

రెండవ యాత్రికుఁడు: వేసవి యెండలఁ దిరిగి తిరిగి సొమ్మసిల్లు బాటసారికి శీతల తరుచ్ఛాయ సుఖమొసఁగునట్లు, సంసారపీడా జర్జరిత చిత్తుఁడైన మానవునకు ఈ కృష్ణమందిరము శాంతిదాయకమగుచున్నది.

మొ. యాత్రి: అవునవును. ఒక్క క్షణములో నెంత మార్పు గలిగినది!

రెం. యాత్రి: ఇచ్చట పవిత్ర వాతావరణము నిగూఢమైయున్న మానవుని దివ్యప్రకృతిని పైకి కుబికించుచున్నది. [విగ్రహము తట్టుతిరిగి] నందనందనా, మరల నీదర్శనభాగ్యము లభింపఁజేయుము.

[ఇరువురు యాత్రికులు నిష్క్రమింతురు.]

అర్చకుడు: పూజల పసేగాని ఒక్క పూక కూడ పడడములేదు తీర్థపాత్రలో.

[వెంకయ్య సుబ్బయ్య అను ఇద్దఱు యాత్రికులు ప్రవేశింతురు.]

సుబ్బయ్య: [దేవాలయ స్తంభములు తక్కిన విశేషములు చూచు చుండును.]

వెంకయ్య: ఓయ్, శనిపిశాశమా, యిట్టనూడు దేవుణ్ణి. బుద్ది, బుద్ధి. [చెంపలు వేసికొని] మనకా యిcటికాడి కూంతలే వస్తాయి దేవళాల్లో కూడాను. దేవుణ్ణి శేవించు.

సుబ్బ: ఆ-శేవించాంగా మఱి. దూరాపుకొండలు నునుప న్నారు పెద్దోళ్ళు. ఈసంబరానికా మఱి నన్ను గోదారినుండి ఏంశేటో శెప్పి యింతదూరం లాక్కొచ్చావు? ఇంతదూరం వచ్చాంగా యెంత పెద్ద గాలిగోప్పరం వుంటుందోఅని ఆశపడ్డాను. శ్రీరంగం దేవళంలో నూరో వంతుకూడా లేదు. దాని తస్సాదియ ఆస్తంబాలకేశి చూస్తే తలగుడ్డ కింద పడ్డాది. యెంకయ్యా, యీశిత్తరం చూశావా? ఇంత జగప్రెళయంగా తిరుణాళ్ళ జరుగుతుంటె ఒక్క జంత్రరిజంతరిపెట్టె కూడాలేదు. ఒక్క రంకలరాట్నమైనాలేదు. అదేంనూశావు, ఒక్క సుట్టపొవ్వాకు అంగడికూడా లేదు.

వెంక: ఆ, బేష్, మాబాగాశెప్పావురా సుబ్బన్నా! ఎంత పెద్దగాలిగోప్పరం వుంటేపే అంత పెద్ద మహత్తెం గల్ల దేవుడుంటాడాయేం? ఇక్కడ మహత్తెమంతా ఆమీరాబాయమ్మగారిదే. అందుకోసమే దేశ దేశాలనుంచి జనం తేరుమోకు తీశినమల్లె వస్తుంటారు. ఒక్కసారి ఆతల్లి పాటువింటే మనజన్మం తరిస్తుందంట. ఆమె యీ పట్నమేలే రాణాగారి పట్టపుదేవంటారు.

సుబ్బ: ఆలాగా ? పట్టపుదేవిని మనము సూస్తే యింకా బతకడం కూడానా?

వెంక: ఆ బక్తురాలికి రాణి వాసంలేదు.

సుబ్బ: అందరూ సూశేటట్లు పెళ్ళాన్ని యీదులు తిప్పేరాజు యేంరాజోసి తోసిరాజు !

అర్చకుడు: [చేతులుతట్టి] ఓయ్, పండ్లూ ఫలాలు బేడా పాతిక యేదైనా తెస్తే సన్నిధిలో సమర్పించండి. తీర్థం శటకోపం తీసుకోండి.

సుబ్బ: ఒకమూల కడుపు కాలుతుంటే శిత్తం శివుడిమీద నిలుస్తుందా యేవిటి ?

వెంక: మీరాబాయమ్మ యెప్పుడు ఇక్కడికి వస్తాదండి ?

అర్చ: ఆమె యిప్పుడు రాదు. మీరు తెచ్చిన నైవేద్యం తృణం ఫణం యీతట్టలో పడవేయండి.

[హారతిపళ్ళెము చూపించును.]

సుబ్బ: [వెంకయ్యతో రహస్యముగ] ఇక్కడిది ఇక్కడ్నే రంగరిస్తాం. [ప్రకాశముగ] అంతా దేవుడి సొత్తేగదండి. పళ్ళు ఫలాలు ఇక్కడినే పెట్టండి.

వెంక: ఒకఅణారూక పెట్టు.

సుబ్బయ్య: కాటికాన్నైనా తప్పినా తప్పుతుందిగాని, అర్చకుడి కట్నంమాత్రం తప్పేది కనాకష్టం. [కుచ్చె కొంగుముడివిప్పుచు] ఇంట్లో డబ్బు స్మరణా, ఊరులో డబ్బుస్మరణా, దేవళంలోకూడా డబ్బు స్మరణేనా సామీ ?

అర్చ: [కర్పూరము వెలిగించి హారతి త్రిప్పుచు] ఏడ్చినట్లే వుంది మీ స్మరణా, మీభక్తి! యాత్రవచ్చినప్పుడైనా పదిపాతికలు ఖర్చు చేయరాదూ ? [ఈలాటి మంత్రములతో హారతియిచ్చి, ఒక తులసిదళం ప్రసాదముగా యిచ్చును.]

సుబ్బ: కాశంత ఆ పళ్ళుఫలాలు పెసాదం పెట్టండి సోమీ.

అర్చ: కొనుక్కొని తినండి. వెళ్ళండి. వచ్చేవాళ్ళకు కూడ అడ్డము. [అని అదలించును.]

సుబ్బ: అణారూక శేతులోపడేదాకా కాస్త అట్టా యిట్టావుండి అది శేతులో పడ్డపాట తన్నబోతాడు! ఈడి తసాన్నదీయ మావూళ్ళోనైకాక పోయె నే.

వెంక: నోరుమూసుకో. అపచారం. [సుబ్బయ్యను లాగుకొని పోవును.]

[పూర్వసువాసినియగు వైష్ణవియు నొక బాలుఁడును
పూజాద్రవ్యములతోఁ బ్రవేశింతురు]

వైష్ణవి: [అర్చకుని చేతి తబుకులో పూజాద్రవ్యములు పెట్టును]

అర్చ: అష్టోత్తరమా, సహస్రనామమా?

వైష్ణ: సహస్రనామమె చెయ్యండి.

అర్చ: అష్టోత్తరానికి అర్ధరూపాయ, సహస్రనామానికి ఒక రూపాయ.

వైష్ణ: అట్లయితే అష్టోత్తరమే జరిపించండి.

అర్చ: అర్ధరూపాయ యిట్లా పడవేయండి.

వైష్ణ: [గుడ్డకొంగు విప్పుచు] జరిపించండి. ఇస్తున్నాను.

అర్చ: మీ యజమానుడి పేరేమి?

వైష్ణ: ఒరే, బాబు.

బాలు: ఏమవ్వా?

వైష్ణ: మీ తాత పేరట చెప్పరా.

బాలు: వరదాచార్లు.

వైష్ణ: కాదురా.

బాలు: రంగాచార్లు.

వైష్ణ: కాదురా, నీకు తెలియదూ?

బాలు: [కోపముతో] కుంకాచార్లు, వెంకాచార్లు.

వైష్ణ: ఛీ! వెధవి. [అర్చకుడికట్టు తిరిగి] అది గాదండి, సీతా అమ్మవారి మరదిపేరు ఏమిటండి?

అర్చ: భరతుడు.

వైష్ణ: ఇంకో కాయనండి.

అర్చ: శత్రుఘ్నుడు, లక్ష్మణుడు.

వైష్ణ: ఆ, నిలవండి ఆరెండో ఆయనండి.

అర్చ: లక్ష్మణాచార్యులా! అబ్బా? ఏంచెప్పినావుగదమ్మా [అర్చన మొదలుపెట్టి పదినామములు చదివి అగ్రరూపాయను కొఱకు చూచుచు] ఈ యుగములో విచ్చేటట్టుగా వుండలేదే ఆకొంగనూటు!

వైష్ణ: ఇదుగోనండి [జేడకూక తబుకులో వేయును. జేడను చూచి అసంతృప్తుడయి అర్చనచేయుట ముగించి కర్పూర హారతి యిచ్చి, తీర్థమిచ్చును.]

బిచ్చగాడు: అయ్యా, రెండుకళ్ళూ లేనివాణ్ణి, ఒక్క కాణీ దై చెయ్యండి తండ్రులారా.

బాలు: [హాస్యముగ] అవ్వా, నీదగ్గర వుండిన చెల్లని జేడఓళ్ళ ఏమిచేశావు?

వైష్ణ: ఎందుకురా?

బాలు: అదుగో! ఆ గుడ్డివాడికి వేశి చిల్లరతీసుకొంటాము.

వైష్ణ: అయ్యో, నేను అర్చకుడి తబుకులో వేసి తీర్థం తీసుకొన్నా గదరా.

బాలు: అయితే పోనీలే అవ్వా, మంచిపనే చేశావు.

[ఇద్దఱు నిష్క్రమింతురు.]

[హిందూ యాత్రికుల వేషముధరించిన తాన్‌సేను
ఇస్మాయిల్ ప్రవేశింతురు]

తాన్‌సేన్: అహా, యేమి యీ చిత్రము! గర్భగుడి చీకటిలో మిణుకుమిణుకు మని నక్షత్రములవలె వెలుఁగుచున్న ఈ దీపములు మూల ప్రకృతిలో మెఱయుచున్న జీవాత్మలో యనునట్లున్నవి! ఈ యగరు దూపము, ఈ కర్పూర సౌరభ్యము, ఇవి యన్నియుంజూడ మన మెదో యొక దివ్యప్రపంచమున సంచరించుచున్న ట్లున్నది మన శ్రమకు మించిన ప్రతిఫల మబ్బినది.

ఇస్మాయిల్: తాన్‌సేన్ జీ——

తాన్: జాగ్రత——

యిస్మా: మఱచితిని. గురూజీ, ఇచ్చట ప్రాణరహితములగు శిలలు కూడ పవిత్రము లైనవో యనునట్లు భయ భక్తులను పురి గొల్పు చున్నవి. మీరాబాయి గాన మాధుర్యముచే మెత్తపడి, భక్తుల యడుగు రాపిళ్ళకు అఱుగు వాఱిన ఈ శిలా ఫలకములు గూడ మానవ కారుణ్యము నకు పాత్రములగు చున్నవి.

తాన్: నేను హిందూ దేవాలయము లోనికి ప్రవేశించుట కిది యే మొదటితూరి. ఇట్టి యానందము నే నెప్పుడును అనుభవించియుండ లేదు. మనము పునీతుల మైతిమి. మనజన్మము సార్థక మైనది.

అర్చ: [తీర్థపు గిన్నెలోని రూకలను ఎంచుకొనుచు] దమ్మిడి యాగాణి, అణా, ... ఒక వెండిరూకైన వేసిన పాపాత్ముడు లేడు. లేక లేక ఒక బేడరూక పడితే అదికూడా చెల్లనిదే! వీళ్ళభక్తి యిట్లా బద్దలవుతుంది.
[డబ్బులు తీసి రొండిన దోఁపుకొనును.]

[కొందఱు యాత్రికులు ప్రవేశింతురు. దూరమున మీరాబాయి గానము వినఁబడును. కలకలముమాని యాత్రికులందఱు వినుచుందురు.]

తాత: ఆ యవ్యక్త మధురగాన ప్రవాహమెక్కడనుండి?
యాత్రికులు: అదిగో! మీరాబాయి, మీరాబాయి.
[యాత్రికులలో కలకలము]

[మీరాబాయి పాడుచు ప్రవేశించును. సుశీల, వాసంతిక ఇంకకొందఱు స్త్రీపురుషులు పూజాద్రవ్యములతో ప్రవేశింతురు. దేవాలయములోనుండిన యాత్రికులు మీరాబాయికి సాష్టాంగ నమస్కారములొనరింతురు.]

అర్చ: [స్వగతము] ఈయమ్మవల్ల మాబ్రతుకుఁదెరువు పాడయిపోతున్నది.

మీరా: అన్నలారా, లెండు, లెండు. నాకు మీరేల మ్రొక్కెదరు? ఈతుచ్ఛురాలి నేల ప్రశంశించెదరు? నేనుదాసురాలను, ఈకృష్ణమందిరమున నూడిగము చేయుదానను. బిచ్చకత్తెను. యాచించు బిచ్చగాండ్రకు ఏమిప్రయోజనముకలదు? మనల నందఱను రక్షించుటకు కంకణము గట్టుకొన్న ఈ శ్రీకృష్ణపరమాత్మను—ఈ రాధావల్లభుని—ఈభక్తవత్సలుని—ఈయనంత కళ్యాణగుణ పరిపూర్ణుని—ఈ సౌందర్యరాశిని మనమందఱమును చేరి ప్రార్థించెదము.

[కొందఱు యాత్రికులు అర్చకుని చేతికి పూజాద్రవ్యముల నియ్యఁబోవుదురు.]

మీరా: వలదు, వలదు. మీరుతెచ్చిన పూజాద్రవ్యం ఈలీలావిగ్రహుని పాదముల కడనుంచుఁడు. జన్మమెత్తిన ప్రతిమానవుఁడును దేవుని పూజించుట కర్హుఁడు. అందఱము సృష్టికర్తయెదుట సమానులము. మధ్యవర్తితో నవసరములేదు.

[అందఱును అట్లేచేయుదురు.]

అర్చ: [కోపము దిగమ్రింగుచు] మీరు సొంతగా పూజించుకొంటే పూజించుకొన్నారుగాని, మాభాగం కొబ్బరిచిప్పలు పండ్లు ఫలాలు తృణం ఫణం ఈబుట్టలో పడవేయండి. [బుట్టచూపును.]

[కొందఱు అట్లుచేయుదురు.]

మీరా: [భక్తిపారవశ్యమున పాడును.]

[అందఱును ఆనందపరవశు లగుదురు. అర్చకునకుగూడ భక్తి గలిగి మీరాబాయికి నమస్కరించును.]

మీరా: హే కృష్ణా, భక్తజనహృత్పద్మాసనాసీనా.

[ధ్యాన నిమగ్నయగును; సుశీల ఆమెను పడనీయక పట్టుకొనియుండును.]

తాన్: మిత్రమా, నేనిఁక గాయకసార్వభౌముఁడనుగాను. నాగర్వము నేలఁగలిసినది. నాగాన నైపుణ్యము తృణప్రాయమైనది. మీరాబాయి బ్రతికియున్నంతవఱకు లోకమున మఱియెవ్వరును గాయకసార్వభౌములు లేరు. ఆహా! అక్బరుచక్రవర్తియే ఈభక్తురాలి గానము విన్న—

ఇస్మా: చక్రవర్తి బిచ్చగాఁడగును. కృష్ణమందిరమె వాసగృహమగును.

[మీరాబాయి మెల్లగా కన్నులెత్తిపాడుచు కదలును; అర్చకుఁడు తప్ప అందఱును ఆమెననుసరింతురు.]

[తెఱజాఱును.]

స్థలము ౨ : ఢిల్లీ

[అగ్బరుపాదుషా విశ్రాంతి మందిరము; చిన్న మేజాపై హుక్కా పెట్టబడియుండును. తెర యెత్తునప్పటికి అగ్బరు తాన్‌సేనులు సంభాషించు వైఖరిలో నుందురు.]

తాన్: ప్రభూ, మీ కోరిక అపాయకరము. మఱల నాలోచింపుడు.

అగ్బరు: అపాయము మొగలాయి చక్రవర్తులకు క్రొత్తది కాదు; అనుక్షణ పరిచితము.

తాన్: అయినను ఇది సాహసకార్యముగాదా?

అగ్బ: నే నెఱుంగుదును. కుంభరాణా మనకు ప్రబల విరోధి. రహస్యముగ ఆతని రాజ్యమున ప్రవేశించుట సాహసకార్యమె. అయినను, ఆభక్తురాలి దర్శనము అవశ్య కర్తవ్యము. తాన్‌సేన్, ఆమెపాట నిన్ను కూడ ఆనంద పులకితుని గావించినదా?

తాన్: నన్నే కాదు. ఆ దావీదు నేడు జీవించియుండి ఆభక్తురాలి గానమువిన్న ఆనంద పరవశుడై యొడలు మఱచును. స్వర్గములోని కొసరు నిర్ఝరము ఆమె కంఠమునుండి ప్రవహించును. ఆదివ్యగాన ప్రవాహమున నేనును నా చిన్న పానపాత్రిక నింపుకొంటిని.

అగ్బ: ఏమి?

తాన్: నేను ఆమెపాటలు కొన్ని నేర్చుకొంటిని.

అగ్బ: [సంతోషముతో] అటులనా, ఏదీ ఒక్కపాట పాడుము. నా హృదయమును ఆనంద వీచికల నుయ్యాల లూపుము.

తాన్: ఆ సుధా ప్రవాహమెక్కడ? ఈ యుప్పునీటి కాలువ యెక్కడ?

అక్బ: ఆ పాటలు విన కుతూహలము వొడముచున్నది.

తాన్: [పాడును]

అక్బ: ఆహా, ఏమి యీ పాటసొంపు! ఈగీతము ఆమె సౌందర్యముకడ మాధుర్యము నెరవు తీసికొనెనా యేమి?

తాన్: ప్రభూ, వ్రతోపవాస కృశాంగి యగుటచే ఆమె సౌందర్యము ప్రాజ్యము; దివ్యము. శ్రీకృష్ణ ధ్యానపరాయణయై తన్మయత్వమున ఒడలు మఱచి వ్రాలినది. మజ్నూనుకూడ లైలా కొఱకు అంతటి వేదన అనుభవించియుండఁడు. షిరీనుకొఱకు భృగుపాత మొనరించిన ఫర్హాదు నైత మట్టి నిర్మల ప్రేమ నెఱిఁగియుండఁడు. 'అనల్ హక్' అని చాటించిన మాన్సూరుకూడ అంతటి ఆత్మ పరమాత్మల నైక్యము రుచిచూచి యుండఁడు. ఆ సతీతిలకము హిందూసూఫీ-

హర్షపులకిత దేహయై హా! ముకుంద,
కృష్ణ, కృష్ణా యటంచు సంకీర్తనంబు
సలుపుచునె ధ్యానమగ్నయై సన్నుతాంగి
దివ్య శోభా పరిధియందుఁ దేజరిల్లె!

అక్బ: తాన్‌సేన్, నా వాంఛా ప్రదీపమును వెలిగించితివి; ఉత్కంఠ ప్రేరించితివి. నిర్దయుఁడవై మఱల నార్పఁబోకుము. నాజీవితమంతయు రాజ్యసంపాదనమునందె వ్యయమగుచున్నది. ఒక్క నిమిషమైన శాంతిలేదు. ఈ తృష్ణకు దరిదాపుగలదా?

ఒకరాష్ట్రము గైకొనవే
ఱొక రాజ్యము నాచి కొనఁగ నుల్లముగోరున్;
సకలైశ్వర్యము లొనరియు
నికఁ జాలునటన్న తృప్తి యిల లేదుగదా!

తాన్: మా బోంటి దరివేసులకు తృప్తి యుచితము గాని, తమ వంటి చక్రవర్తులకు పరాక్రమమే యశస్కరము.

అగ్బ: తాన్‌సేన్, చక్రవర్తులు గూడ మర్త్యులే సుమా.

ఏరీ యా బహారాముగోరి, ఖుసురూ? ఎందేఁగె నౌషీరవాన్?
ఏరీ రుస్తుముజాలు, తాయి? యెపుడో యెచ్చోటనో ధూళియై
పోరే, వారి సమాధులైనఁ గలవే? భోగాను భోగత్వమే
సారంబో, పరతత్త్వమొకండు గలదో సత్యంబుగా సృష్టిలోన్?

నే నెవ్వఁడను? ఏలజన్మించితిని? ఏల మరణించుచున్నాను? ఈ జనన మరణముల రహస్యమేమి? ఈ ప్రశ్నలు చిరంతనములయ్యును నిరంతరములుగ నగపడుచున్నవి. దైవదృష్టియందు అందఱును సమానులమే కదా? అట్లయిన లోకములోని ఈ విపర్యాసమునకు కారణమేమి? కొందఱు రాజులు, కొందఱు రైతులు, కొందఱు సంపన్నులు. కొందఱు దరిద్రులు. కొందఱు సుఖితులు, కొందఱు దుఃఖితులు! ఈరహస్యమును ఆ భక్తురాలు భేదింపఁగలదు. ఆమె ఐంద్రజాలిక స్పర్శచే ఈ రహస్యము దాఁచిన మంజూషపు మూఁత విడిపోవును. మనము రేపే తరలవలయును.

తాన్: నావలనఁ గదా మీకీ తలఁపు గలిగినది! ఇప్పటికే మౌలానాలు, షేకులు మిమ్ము ద్వేషించుచున్నారు. మీ హైందవ పక్షపాతమును నిందించుచున్నారు. ఇంతకును నేను కారకుఁడనని నామరణమున కెదురుచూచుచున్నారు.

అగ్బ: తాన్‌సేన్, వారు జగదేకసత్యము నెఱుంగరు. జ్ఞానమున కన్న వారికి స్వపక్షాభిమానము మిక్కుటము. జ్ఞానమునకు జాతిమతభేదములులేవు. గులాబిపూవు ఎవరిచేతనుండినను అదేవాసన గొట్టుచుండును.

తాన్: నిజము చెప్పితిరి.

హైందవ తురుష్క పారసీ పఠాణులనును
వీరువారననేల? యీ విశ్వమునకు
దేవుఁ డొకఁడను సత్యంబుఁ దెలియలేక
మతము పేరటఁ బోరాట మొందు జనము.

అగ్బ: మీరాబాయి జ్ఞానప్రదీప మీ మాయాంధకారమును దొలఁగింపఁగలదు.

తాన్: మహమ్మదీయుల కంటఁ బడిన కులకాంతలు రాణీవాసమునకు తగరని రాజపుత్రుల మతము. అందులోఁ గుంభరాణా మిక్కిలి యభిమానవంతుఁడు.

అగ్బ: మనయుద్దేశము దుష్టముగాదు. ఆమె హృదయ హోమకుండమునుండి జ్ఞానవిస్ఫులింగ మొక్కటియైన వెలికితికి మన మనఃపథముల జ్యోతిర్మయము చేయవచ్చును.

తాన్: మీచిత్తము. వజీరు లీయుద్యమమున కియ్యకొందురా?

అగ్బ: ఇది మన యిరువురిని దాఁటి పోని రహస్యము.

తాన్: మీ ప్రయాణమునకు కారణము ?

అగ్బ: ఆ సంగతి నాకు వదలుము. మనము హిందూ యాత్రికులమయ్యెదము. వలసిన యేర్పాటులు గూఢముగ కావింపుము.

తాన్: మాటాడఁ జాలను.

అగ్బ: సంశయింపకుము. దైవము మనకు తోడ్పడును.

తాన్: అట్లె యగుఁగాక ! సెలవు. [నిష్క్రమించును.]

అగ్బ: నా జీవిత కావ్యమునందు క్రొత్తయధ్యాయము ప్రారంభమైనది. [హుక్కా త్రాగుచు ఆలోచించుచుండును.]

[తెరజారును]

స్థలము 3 ఉదయపురము.

[ఉద్యానవనము. ఒక సరోవరము, అందు చేపలుతినుచున్న కొంగయు అగపడును. కుంభరాణా పరాయత్తచిత్తుఁడై ఒకపూవును వాసన చూచుచు చలువఱాతిబండపయి కూర్చుండియుండును.]

రాణా: నానాఁటికి మాయంతఃపురము నే నడుగిడుటకు యోగ్యముగాని సన్న్యాసిని మఠమగుచున్నది. అచ్చట పూర్వమునవలె హృదయరంజన మొనరించుటకొక్క చిఱునవ్వుగాని, ఒక్క ప్రేమావలోకనముగాని, తుదకొక్క తియ్యని మాటగాని కఱవయ్యెను. నా ప్రాణేశ్వరి క్రమక్రమముగ నాచేతినుండి జాఱిపోవుచున్నది. ఆపాడు మఠ మేనాఁడు మాయింట నడుగు వెట్టినదో ఆనాఁటినుండియు మా యిరువురి యనురాగ బంధములు సడలిపోయినవి. ఆ విరాగిణి హృదయమున నాకిప్పుడించుకయైన చోటులేదు. [నిట్టూర్చి] నేఁడు నేను కేవలము భర్తను, ప్రాణవల్లభుఁడను. పుష్పాడి రస్తావలె కనుపడుచుండిన మా జీవిత మార్గము నేఁడు కంటకశిలాభూయిష్ఠమయి అసహ్యమయి ఘోరమయి పొడకట్టుచున్నది— నాసంసారమసారమయి నరకప్రాయమైనది.

[మీరాబాయి, సుశీల పువ్వుల బుట్టతో ప్రవేశింతురు]

మీరా: నాథుఁడిచ్చటనే యున్నాఁడు. సుశీలా, మనమా వంకకు పోయి పూవులు కోసికొందము. పూజా సమయము కావచ్చినది.

[ఇరువురును రాణాకు కొంచెము దూరమునఁ బోవుచుందురు.]

రాణా: నన్నుచూచి యేల నగలుచున్నారు? ఈ ప్రాకృతుని గాలిసోఁకిన పంచమహాపాతకములు మిమ్ముంటుకొను ననియా?

మీరా: అయ్యో! నాయపరాధమును మన్నింపుఁడు. మీరేదో యాలోచనలో మునిఁగియున్నటుల తోఁచినది. మాసందడి మీ యవధానమునకు అంతరాయము కావచ్చునను తలంపుతో తొలఁగిపోయితిమి.

రాణా: [విషపు చిఱునవ్వుతో] అనుకూలవతివి!

మీరా: నా సదుద్దేశము నేల యనుమానించుచున్నారు? ఎప్పుడైన మీకనిష్ట మాచరించితినా? నాసతీత్వమున కేమైన లోపమువాటిల్లెనా?

రాణా: మీరా, ఆయుపచారవాక్యముల నటుండనిమ్ము. సతులు నిరంతర వ్రతోపవాస కృశాంగులే కారు, కేవలము విధినియమబద్ధ సంబంధలే కారు; పతుల హృదయము లాకర్షించు సమ్మోహన మంత్రాధి దేవతలు గను, మృదుమధుర స్వభావలుగ నుండవలయును. పరస్పర హృదయైక్యములేని వైవాహిక బంధము నీరసము—సంతాపకరము—హత్యాకరము. కృశాంగీ, కడచిన యేడెనిమిది సంవత్సరములు వేఱు. మున్నటి లావణ్యవతి వేనా నీవు?

కాటుక జిగి పూఁత కాఱుచీఁకటి గ్రమ్మ
నీ కన్నుఁదమ్ముల నీటుఁదొలఁగె;
హృదయభేదక చింత లేనియు నడఁగించు
చిఱునవ్వు విడిమోము చిన్నవోయె;
కనుల కానందంబు గలిగించు నీరూప
సౌందర్య మేడకో జాఱిపోయె;
ఎప్పుడైన విశ్లేష మెఱుఁగని చిత్తంబు
ప్రణయ శ్మశానమై రాజఁదొడఁగె;

నవ్వులాటలు సరసాలు నాఁడె ముగిసె;
నీ సమేలమేనియు స్మరయణీమయ్యె;
అనుదినంబును నెడఁబాటె యధికమయ్యె,
నిఁక సతీపతి సంబంధమేమి యగునో!

మీరా: సుశీలా, చూచితివా నాథుఁడెంత తప్పదలఁచుచున్నాఁడో? వేషముపైని యభిమానమును నాపైని ప్రేమయని పొరపడినాఁడు.

సుశీల: [మీరాతట్టు తిరిగి] అంతేగదమ్మా మఱి. [రాజుతట్టుతిరిగి] అట్లుగాదు లేవమ్మా [స్వగతము] ఎటుచెప్పినా చావె.

రాణా: మీరా, నీకిపుడటులనే తోఁచును లెమ్మా. హృదయము తోడ నంతయు మాఱును.—చేటికా, నీవిఁక వెడలిపొమ్మా.

సుశీల: [వారికి కనఁబడకుండ మాఱి త్రిప్పుకొనుచు నిష్క్రమించును.]

రాణా: [మీరాబాయి భుజముపట్టుకొని] నీవేల యీ పిచ్చివేషము వేసికొని నా కన్నులను దూషించుచున్నావు? నా సంతోషము భగ్నము చేయుటకు నీవు కంకణము కట్టుకొంటివా?

మీరా: నాథా, యెవరెవరి వేషములు వారివారి చిత్తసంస్కార స్వభావాదుల కనురూపముగనుండును. నాకీ వేసముపై ప్రీతిగలదు.

రాణా: నాప్రీతియు తలఁపవలదా?

మీరా: నాస్వభావమునకు విరుద్ధముగ నేనెట్లు నడచుకొనఁగలను? ఆ కపటనాటకమువలన మీకెట్టి ప్రీతిగలుగును?

రాణా: అన్యోన్య భావానుసరణము కపటనాటకముగాదు. అదియె గార్హస్థ్య జీవితమునకు పునాది.

మీరా: నేను ధర్మబాహ్యనని మీ యుద్దేశ్యమా?

రాణా: నీమతావేశము, అలౌకిక విషయచింతనము, నిరభిమానము,

శుష్క వైరాగ్యము సామాన్య గృహస్థ ధర్మములకు భంగము గలిగించు చున్నది.

మీరా: [దీనముగ] అయ్యో! అందుకు నేనేమిసేయుదును? నా మనస్సు నాస్వాధీనము కాకయున్నది. కన్నులు మూసినను తెఱచినను శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహము నాయెదుట నిలిచినట్లు గోచరించును. ఒక్కనిమిషమా రాధావల్లభుఁడు నాకన్నులకుఁ గట్టకున్న లోకమే మునిఁగిపోయినట్లు అంతయు శూన్యముగ నగపడును. నిమిషమొక్క యుగముగ విశ్లేషదుఃఖ మనుభవింతును. ఇట్టి జీవితము నాకు స్వాభావికమైనది. ఇందు మీకేమి విపరీతము తోఁచుచున్నది?

రాణా: అందు విపరీతము కానిదేమున్నది? [స్వగతము] ఇంతదనుక యీ కాంతను తనదారిని తన్నేఁగనిచ్చినందులకు నేనే నింద్యుఁడను. అయినను పూర్వస్మృతిని కొంత కలిగించి చూచెదను. [ప్రకాశముగ] ప్రేయసీ, యటుచూడుము. ఆసుందర సరోవర ప్రాంతమును మఱచితివా ?

మీరా: లేదు.

రాణా: తామరపాకువెంబడి నిలుచుండి యాకొంగ చేయుచుండిన యుగ్ర పూరణ తపస్సును చూడుము:

ధ్యాన నిర్మగ్నమైనిల్చి యా బకంబు
కాలు దవిలిన చేపలఁ గఱచితినును,
కపట వైరాగ్యనటనల ఘనతచూపి
గుడ్డిలోకులఁ వంచించు గురుని పగిది.

మీరా: నాథా, నిశ్చింతముగ జీవితమును వ్యర్థముసేయుచున్న యాభేడిస తుచ్ఛపాటును దిలకింపుఁడు.

కాయ మనపాయ మని యెంచి కాలమెల్ల
మిట్టిపాటులఁ బుచ్చెదు మీనరాజ,
విధి యదృశ్యహస్తము వెనువెంట నంటి
కడకు నిను మృత్యుపదముల కడకు గొంటు.

రాణా: [స్వగతము] ఇంతవఱకు నాయుద్దేశమె తనయుద్దేశముగ నుండినది. ఇప్పుడు భిన్నము. ఇదియంతయు దుర్మతముయొక్క వైపరీత్యము [ప్రకాశముగ] అవునుగాని, మీరా, యీపాలరాతిబండ జ్ఞప్తియున్నదా?

మీరా. పూర్వము మనకు విశ్రాంతిపీఠము.

రాణా: పూర్వము!—అవునవును పూర్వము! మఱియొకమాఱిచ్చట కూర్చుండి మున్నటి వినోదములను ఆప్రణయ సఖ్యమును కొంచెము సేపు కలగనియెదము వచ్చెదవా? ఆస్మృతి మందపవనుని సుఖోచ్ఛ్వాసమువలె నాయొడలు పులకరింపఁజేయుచున్నది.

మీరా: కలయని తెలిసియు దానిపై నింతమక్కువ యేల?

రాణా: [విసుగుతో] నీయీపిచ్చి ప్రశ్నలే నన్ను మాటిమాటికి హతాశుని చేయుచున్నవి. నీకేదో చిత్తచాంచల్యము కలిగియుండవలయు. రమణీయస్వప్నము ఆనందదాయకము కాదా?

మీరా: ఆ యానంద మెంతకాలము? కలగనినంతకాలమె. మన మేల నిరంతర దివ్యానంద మనుభవించుటకు యత్నింపఁగూడదు?

రాణా: [ఆసతో] ఆ యానంద మెట్టిది?

మీరా: అమృతానందము; శ్రీకృష్ణలీలాధ్యాన పారవశ్యము.

రాణా: [లాఘవముగ నవ్వి] ఓసీ పిచ్చిదాన, నీమాటలు నాదుఃఖమునందు కూడ నవ్వుపుట్టించుచున్నవి. నామనస్సు తేలికయైన యగరు ధూపమనుకొంటివా గాలిలో నెగిరిపోవుటకు? ఊహామాత్రమైన పాలసము

ద్రిమును నమ్మి చేతిలోని పాయసపు పాత్రను జారవిడుచు మూఢుడుం డునా ? దారిద్య్రచింతా పీడితుల నూరడించుటకొఱకు, పరలోకముమీఁది యాసతో నిహలోక దుఃఖము సహించుటకొఱకు, అవివేకులను భయపెట్టి ధర్మబద్ధులను జేయుటకొఱకు పౌరాణికులు స్వర్గనరకములను కల్పించిరి. పరలోకమునకు ద్వారపాలకులు గురువులఁట ! వారికి లంచమిచ్చినవారికి పరమపదము! నిరసించినవారికి నరకము కాఁబోలు! ఎంత యవివేకము?

మీరా: [దీనముగ] అయ్యో! యేల యీ పరలోకదూషణము, గురునిరసనము ? అహంకారచిత్తు లెఱుఁగఁజాలని తత్త్వరహస్యము లెన్ని లేవు ?

కండ నెత్తురు ప్రాయంపుఁ గారవంబు
కనుల కెగఁదట్టఁ దత్త్వంబు గానఁబడదు;
పాలనా దండశక్తి నశ్వరమటన్న
పిడుగువంటి సత్యంబును వినెద వెపుడొ.

రాణా: మీరా, నీ నిరసన స్వభావము నాకు కోపము గొల్పినను నీయజ్ఞానమునకు మాత్రము నాకు జాలికలుగుచున్నది. ఆఁడువారబలలు దుర్బలచిత్తలు. వివేకమునకన్న భావోద్రేకము మిక్కుటము. కావుననే మత విక్రేతలగు కపటగురువులు మిమ్ములను దేలికగ లోపఱచుకొని వంచింతురు. పాక్షికమతావలంబకులే లోకమునకు ఉపద్రవకారులు, స్వయమారోపితమైనవారి పవిత్రత అన్యులకు ఏవము పుట్టించును; వారి దుర్ణయములు దురాచారములు మతాచ్ఛాదనముతో లోకుల మోసగించుచున్నవి. మీరా, నీమతోన్మాదము నీకు పరలోకము నిచ్చునో లేదో తెలియదు గాని, సంతోషముగను నిశ్చింతముగను గడచిపోవుచుండిన మన గార్హస్థ్య జీవితమును మాత్రము భగ్నముచేసినది.

తెమ్మెర వీవఁ గఁపిలెడి దీపము మానవ జీవితంబు; సౌ
ఖ్యమ్ములు భోగముల్ గుడుపనౌను దదంతరమందుఁ; జావు స
త్య; మ్మని రూష్యసంశయపదంబు పరంబును నమ్మియేల భో
గ్యమ్మగు యౌవనాసవము నానక చిందెదవో విరక్తవై.

మీరా: [స్వగతము] ఓవిశ్వనాటక ప్రణేతా, నీవురచించిన యీ సంసార విషాదాంత నాటకమును అభినయింపించుటకు మమ్మునిరువుర నొక్క సూత్రమున బంధించితివా? ఏమి నీమాయావిలాసము!

రాణా: [స్వగతము] సుందరుఁడయి సర్వభోగ సమోపేతుఁడయి తన్ను ప్రాణప్రదముగ కామించుప్రియుని అలక్ష్యముచేసి అప్రత్యక్షమైన యూహావిగ్రహమును మనోవైకల్యములేని యేయువతియైన ప్రేమించునా?— ఇది యసహజము.—ఇదియొక మానసికవ్యాధి. ఔషధసేవనము మేలుచేయవచ్చును.

[నేపథ్యమున శంఖధ్వని]

మీరా: నాథా, నేనిఁక పోవచ్చునా? శ్రీకృష్ణ మందిరమున శంఖమును పూరించుచున్నారు. ఇది పూజా సమయము.

రాణా: నాయొద్దిక నీకంతి వెగటు పుట్టించుచున్నది కాఁబోలు. మీరా, మనజీవితమునందెంత మాధుర్యకలిగినదో నీవే యూహింపుమా. ఈ పరిసరములే అప్పటి మనవినోదమునకు సాక్షులు.

ఇచటి సంధ్యావిహారంబు, లిచటి చేఁత,
లిచటి యాటలుపాటలు హేళనములు,
నిచటి విడరాని కౌఁగిళ్ళు, నిచటి సుఖము
కనుల కాలేఖ్యమట్టులఁ గానవచ్చు.

సుఖమయముగా గడచిపోయిన ఆనాఁటి జీవితమునకును నీరసమై నిరయప్రాయమైన యీనాఁటి జీవితాభాసమున కెంతటి తారతమ్యము కలదో నీవెఱుంగకపోవు.

మీరా: సకల వస్తువులకును మార్పు అనివార్యము. భోగములు శాశ్వతములని తలంచితిరి కాఁబోలు! మీరు నారూపసౌందర్యమునే వలచియుందురేని నేనెప్పటికైన పరిత్యజింపఁబడవలసిన దాననే. నాసౌందర్యము నిరంతము కాదు. రోగపీడితను జరాభారకృశాంగిని కావచ్చును.

రాణా: నీవు నిజముగ లోకజ్ఞాన శూన్యవు. యౌవన సౌందర్యములెట్లు కాలబద్ధములో మానవుని భోగాభిలాష కూడ అట్లె. ఆ కామ్యానురాగమె అనుభుక్తమయి వార్ధక్యమునందు తప్తకాంచనమువలె నిష్కల్మషమయి బహుకాల సహవాసజనిత బాంధవ్యముగ మాఱును. వసంతమున పూచిన పువ్వు శరత్తున ఫలవంతమగును. సామాన్యమైన యీ ప్రకృతి ధర్మమును గుర్తెఱుంగని నీమనస్తత్త్వము నాకు దురూహ్యముగనున్నది.

మీరా: అసామాన్య ధర్మములుకూడ కొన్నికలవని మీరును గుర్తింపవలయును.

రాణా: [విసుగు కోపములతో] అవి కుక్కమూతి పిందియలు. చెడుకాలమునకు పుట్టు విపరీతములు.

మీరా: మీకట్లు తోఁపవచ్చును.

రాణా: [స్వగతము] మతితప్పినవారింత యుక్తియుక్తముగ మాటలాడుదురా? నాబుద్ధిసంశయగ్రస్తమగుచున్నది. [ప్రకాశముగ] విరాగవతీ రసహీనమైన తర్కము నేనెఱుంగను. హృదయముల భాష వేఱు. ఆ భాషయె నాకు తెలియును. నీవనావశ్యకముగ భావిచింతనము సేయుచున్నావు.

కడచినది కడచిపోయె దుఃఖమ్మొ సుఖమొ,
కడచుచున్నదె పెదవుల నిడినపాత్రి;
దానికన్న ననిశ్చితార్థంబు మేలె ?
రేపు రేపను మాటకు రూపు లేదు

[బ్రతిమాలుకొనునట్లు] నీవీ సన్న్యాసిని వేషమును తగులబెట్టి మున్నటి మీరావు కమ్ము.

మీరా: ఆమీరా నిక లేదు; పునర్జన్మము వచ్చినది. నాథా, వేషములో నేమున్నది ?

రాణా: [కోపముతో] నీహృదయములో నేమున్నదో అవల్ల కాదే వేషమునందు ప్రతిఫలించుచున్నది. ఎంతనొచ్చుకొనఁ బోయినను నీయాత్మోన్మాదము నాకు విసుఁగుపుట్టించి కోపము రేఁపుచున్నది. నీవు నీమతమునైనను లేక నన్నైనను వదలుకొనవలయును. అందు నీకేది సమ్మతము ?

మీరా: నాకు రెండును సమ్మతములు కావు. నేను మిమ్ములను ద్వేషించుట లేదు.

రాణా: ప్రేమించుటయు నేరవు. అట్లైన భావసామరస్యము లేని మనకు సంసారమెట్లు నిరంతరాయముగఁ గొనసాగును ?

మీరా: ఆసామరస్యము, ఆసంధి...... మీయందును నాయందును అందఱియందును కలదు. మనమందఱము నొక్క సూత్రమున గ్రుచ్చఁబడిన ముత్యములము; ఒక్క భిత్తిపై చిత్రింపఁబడిన బొమ్మలము; ఒక్క సముద్రమున రేఁగు తరంగములము. ఈబాహ్యవివిధత్వమునందు అంతర్భూతమైన ఏకత్వము కలదు.

రాణా: ఓసి వెఱ్ఱిదానా, నీరోగమునకు మందులేదా ?

మీరా: ఆమందుకొఱకె నిరంతర మన్వేషించుచున్నాను. చేతికి చిక్కీ చిక్కక మాయగారడివలె మఱుఁగిపోవుచున్నది. ఆమందు దొఱకిన నా పిచ్చియేకాదు, లోకము పిచ్చికూడ కుదురును.

రాణా: [కోపముతో] మీరా, నీవిఁక పిచ్చిదానివికమ్ము, బిచ్చకత్తెవు కమ్ము, ఇంక నేదియైన కమ్ము, నీవుమాత్రి మిఁక నంతఃపుర మర్యాదను దాఁటవలదు. సామాన్యస్త్రీలవలె అందఱికంటపడుచు నీవు కృష్ణమందిరమునకు పోవలదు. నీపరివర్తనము నీయొక్కతెకే సంబంధించినది కాదు; మాపైకూడ ప్రతిఫలించును. ఉదయపూరు రాజ్యాధీశ్వరుని పట్టమహిషి పిచ్చిపట్టి వీథులవెంబడి తిరుగుచున్నదను అపవాదమునుండి కాచికొనుము.

మీరా: నాపై ఆస వదలితి నంటిరి. బిచ్చకత్తె నగుటకు సమ్మతించితిరి. దారిపక్కల దుమ్ముతోకూడ సరిపోలని నాకు అభిమానమేల? ఆదురభిమానము పూర్వజన్మముతోడ నశించినది. దిక్కులేనివారికి దేవుఁడే తోడునీడ. బిచ్చమెత్తుటకు నాకు అనుజ్ఞయిండు; ఆలోకేశ్వరుని ముంగిట భిక్షాందేహియని నిలచెదను.

రాణా: నీ పిచ్చిక నిన్ను వదలినను త్రాడుతెగినగాలిపటమువలె నిన్ను తిరుగనిచ్చుట నాకిష్టములేదు. ఇంకను నేను నీకు పతిని.

మీరా: ఆ కృష్ణుఁడొక్కఁడే ప్రాణేశ్వరుఁడు. లోకములోని జీవులంతయును విరహిణులు.

రాణా: [కోపముతో] ఈపిచ్చి మఱింత ముదురుచున్నది. మీరా, నీవన్నమాట నీకు తెలిసివచ్చినదా?—వినుము, ఇంకను నేనునీకు ప-తి-ని.

మీరా: నన్ను సేవకురాలిగ పనిగొండు. నామతమునకు నన్ను వదలుఁడు. అన్యమతస్థులే పూజ్యమైన హిందూమతమును స్వీకరించి సంసారమును తరింపుచుండ మీరేల నాస్తికులగుట ?

రాణా: అన్యమతస్థులెవరు ?

మీ రా: అగ్బరు పాదుషావంటివాఁడే గోపిచందనము ధరించి భక్తి మార్గము నవలంబించి హిందూ మతమును ఆదరించుచున్నాఁడని వినికిడి.

రా ణా: [కోపముతో] అగ్బర్? మరల ఆతని ప్రశంస. ఇది వఱకే పలుమాఱులు హెచ్చరించితిని. ఆతని ప్రశంస నారాజ్యమునందు అపరాధము. ఆతఁడు మేకవన్నె పులి. తేనెపూసిన కత్తి. చిరకాలమునాఁటి రసపుత్రరాజ్యములను మెలమెల్లగ కబళించుచున్నాఁడు. ఆతని రాజకీయ నీతి అతలస్పర్శి.—ఆ!—సరి, సరి. నీయభిమానమునకు కారణముకలదు. అగ్బరు నిన్ను వివాహమాడ తలఁచి యుండెనుగదా. మీతండ్రికి మానము అభిజాత్యము లేకుండిన నీవు సార్వభౌముని శుద్ధాంత కాంతవై యుందువు. పాపము, నీదురదృష్టవశమున నాబోఁటి యల్పమండలేశ్వరునకు భార్యవైతివి.

మీ రా: కడచిన గాథలేల త్రవ్వెదరు? మీమనస్సులోని వేరు పుర్వు ఇంకను నశింపలేదు. మీయనుమానమె మీకు తెవులులేని వేదన యగుచున్నది. అగ్బరు పాదుషా మనకు విరోధియైనంత మాత్రమున ఆయన పేరుకూడ ఉచ్చరింపకూడదా? విరోధి లోనున్నంతమాత్రమున సద్గుణములు గౌరవింపఁబడకూడదా? పాదుషాహి జనకునివంటి కర్మయోగియని వింటిని.

రా ణా: [పిడుగడచినట్లు నిర్విణ్ణుఁడయి, కోపఘూర్ణిత నేత్రుఁడయి] ఏమీ?— నాసతి—నాయెదుట—ఆరసపుత్రకుల మానాపహారిని ఆమ్లేచ్ఛుని ప్రశంసించుట? వాని దుర్ణయములను సమర్థించుట!—సహింప రాని పతితిరస్కృతి. ఓసి మాన రహితా, నీవెంత సాహసమున కొడి గట్టితివి? ఆ మాయవేషగాఁడా నీకు పూజ్యుఁడు? ఆ కపటనాటకము హిందువుల నాకర్షించి మోసగించుటకై పన్నిన పన్నాగమని నీవెఱుఁగవా? గౌరవమైన రసపుత్రకులము చెడపుట్టిన బీహారీమల్లునివంటి వంశపాంసనులు వానిపాదముల నాశ్రయించి తమకూఁతుండ్లను వాని యంతఃపుర కాంతలు గావించి వాని గులాములకు గులాములై తిరుగుచుండ నేనొక్కఁడనే వానిని ధిక్కరించి స్వతంత్రుఁడనై యుండుట నీవెఱుంగవా? ఆమరా

తన్నునిపై ఏల నీకు గౌరవము? నా నెత్తురు తుకతుక యుడికిపోవుచున్నది.

మీరా: [దీనముగ] అయ్యో! నేనేమి సేయుదును? నాదురదృష్టమువలన నామాటలలో మీకు విపరీతార్థములు తోఁచుచుండును. నేను విన్న సంగతి యంటిని?

రాణా: అవునవును! విన్న సంగతి యంటివి. అంతఃపురమున నీకు వాని ప్రసంగములతో పొద్దుపోవుచుండెనా? వెడలిపొమ్ము, నామనము సంక్షుబ్ధమైనది.

మీరా: [కన్నీరు నించుచు] మీకింత మనోవేదన కలిగించు నేనుండియేమి ఉండకయేమి? శ్రీకృష్ణా, ఆపద్బాంధవా, నన్ను నీకడకు చేర్చికొమ్ము.

[నిష్క్రమించును.]

రాణా: ఎంతకాల మీయింటిలోనిపోరు?—హృదయములోని క్రొలిమి?— నాసతి నావిరోధికి వత్తాసివచ్చుట?—రవంతయైన యశుకు లేక ఆతుచ్ఛుని జనక మహర్షితో సరిపోల్చుట, ఆకాంత ధిక్కారము హృదయ శల్యమువలె పీడించుచున్నది. మన కింక శాంతిలేదు. మీరా, మన యిద్దరిలో నెవ్వరైన నొకరు చావవలయును.

[నేపథ్యమున] చేటిక: ఇద్దరున్నా.

రాణా: ఏమి యీయుపశ్రుతి? ఎవరక్కడ?

చేటిక: [ప్రవేశించి] దాసురాలిని వాసంతికను. రాణిగారూ సుశీలా యెక్కడికి పోయారని గోస్వాములవారడిగారు. ఇద్దరున్నా యిప్పుడే దేవాలయముం తట్టుకు పోయారని చెప్పేసరికి దేవరవారు హెచ్చరించుకొన్నారు.

రాణా: మరల ఆయునాన్మదిని దేవాలయమునకు పోయెనా? ఈ గోస్వాములు మహిషస్వాములు మాసంసారమిట్లు వల్లకాడుచేసిరి. ఏడి యాసన్యాసి? [తొందరగ నిష్క్రమించును.]

చేటిక: ఓయమ్మో. ఇంకేముంది— [అంటూ నిష్క్రమించును.]

[తెఱజాఱును]

స్థలము ౪ : ఉదయపురము.

[పాంథశాల. కొందఱు యాత్రికులు కునికిపాట్లు పడుచుందురు, కొందఱు నిద్రించుచుందురు. ఒక ముసలియవ్వ కాళ్ళుచాపుకొని కూర్చుండి మేలుకొలుపులు పాడుచుండును. ఈసందడికి వెంకటదాసు ముందుగాలేచును.]

వెంకటదాసు: ఏమండోయ్, గోకులదాసూ, లెగండి, లెగండి, ఎంత మొద్దునిద్రయ్యా మీకు! పొద్దున్నే ప్రయాణమంటే నాకు రాత్రంతా నిద్రపట్టదు. ఏమండోయ్, బృందావనానికి పోయ్యేబండ్లు కదిలిపోతున్నాయి; ఈసమయం తప్పితే మనకింక మంచి దారితోడు దొరకదు. లెగండయ్యా లెగండి.

[ఒక ఫకీరు ఈ కేకలకు నిద్రమేల్కొనును.]

ఫకీరు: అయ్! ఏకోన్ రే తెలంగిముసాఫిర్, రాత్రిహంతా దివానా మాదిరి పుకార్ శేస్తాడ్? ఈ హడావుడీసే మాకి హరొక్క ఛవంకూడా నీంద్ వుందిలేదు. హరొక్కముసాఫిర్ వస్తాడ్ హరిబోలో హరిబోలో శేస్తాడ్, ఇంకా హరొక్క బైరాగివస్తాడ్ జయ్‌సీతారాం బోల్తాడ్. తుత్తేరీ గడ్బడా హిందూ ద్యాలోగ్. [కోపముతో జోలె గొంగడి జవురుకొని పోవును.]

వెంకటదాసు: నీకేంటోయ్? పకీరి, కీసరపాసగ వుంటావు, కట్టిపుచ్చుకోని నీబుజ్జి బర్దాలు చెయ్యనా యేంటి.

[ఇంతలో యిద్దరు యాత్రికులు తూగుకన్నులతో లేచి కూర్చుండి "పట్టుకో పోనియ్యవద్దు, దొంగలు, దొంగలు" అని అరతురు.]

వెంకట: ఏంటే ఆవెఱ్ఱి కలవరింపు? పట్టుకోవడమేంటి!
యాత్రికుడు: నీవు మటి బుఱ్ఱ బద్దలుకొట్టమన్నది దొంగల్ని కాదూ?
వెంకట: (పకాయించి నవ్వును.)

[ఈసందడికి యాత్రికులందఱు లేచి మూటాముల్లె సవరించుకొందురు. ఇంతలో అక్బరు తాన్‌సేనులు హిందూ యాత్రికుల వేషములతో ప్రవేశింతురు.]

అక్బరు: వారుచెప్పిన పాంథశాల యిదియే కాంబోలు.
తాన్‌సేన్: ఈరాత్రి మనమిచ్చటనే నిదురించి వేగుజామున లేచి కృష్ణమందిరమునకు పోవచ్చును.

అక్బ: అట్లే కానిమ్ము.

తా౯: అయ్యో! మీరీ పట్టెనేల యెట్లు నిద్రింతురు?

[మూటలోని గుడ్డను తీసి పడకవేయును.]

అక్బ: [పడకపై కూర్చుండి] అహా! యీపాంథశాల యెంత గభీర సత్యమును బోధించుచున్నది. ఉమ్రుఖయ్యాము రుబాయిని తలంపునకు తెచ్చుచున్నది:

అంతములేని యీభువనమంత పురాతన పాంథశాల, వి
శ్రాంతి గృహంబు; నందు నిరుపంజలు రంగులవాకిళుల్; ధరా
క్రాంతులు పాదుషాలు, బహరాం జమిషీడులు వేనవేలుగాఁ
గొంత సుఖించి పోయిరెటకో పెఱవారికిఁ జోటొసంగుచున్.

ఇపటు; నున్నంతవఱకె మనదనియెడి భ్రాంతి. తరువాత సుకృత దుష్కృతములు తప్ప వేఱొండు మనల నంటిరాదు. ఇట్లయ్యును జీవితాశ సహజముగ నుండుట వింతగదా?

తా౯: భగవంతుఁడు భ్రాంతియనెడు పుష్పహారముచే విశ్వసంసారమును బంధించి యున్నాఁడు.

అక్బ: కావుననే బంధము గూడ ప్రియమైనది.

[పాంథశాలలోని యాత్రికులు వెడలుదురు]

వెంకటు: [తా౯ నేఁటట్టుతిరిగి] ఏమండోయ్, మీరింక సుఖంగా పండుకోవచ్చును. మేము వెళ్ళుతున్నాం.

తా౯: అయ్యా, మీరే దేశస్థులు?

వెంక: [స్వగతము] తిప్పాడయ్యా, బాగా డాబుసరిగా చెబుతాను. [ప్రకాశముగ] నేనా? ఆంధ్రుణ్ణి.

తాన్: చాలాదూరము యాత్రచేసినాము.

వెంక: అయ్యో! మాదురదృష్టం యిక్కడికి గూడా తగుము కొచ్చిందండి. ఆపరమభక్తురాలిని మీరాబాయమ్మగారిని దర్శనంచేసుకోని ఆమె కృష్ణమందిరంలో పాడుతుంటె విని మా పాపిష్టి జన్మలు కృతార్థం చేసుకోడానికి యింతదూరం ఎండనక వాననక కొండంత ఆశతో యీ పట్నంచేరినాము.

అక్బ: [ఆతురతతో] ఏమీ? ఆమెదర్శనము మీకు లభింపలేదా?

వెంక: మీ ఆత్రం చూస్తే మీరుకూడా ఆభక్తురాలి దర్శనానికి వచ్చినట్లుంది.

అక్బ: అవును.

వెంక: ఆతల్లి దర్శనమైతే యింత మనస్తాప మెందుకు? ఆమెకు పిచ్చిపట్టిందట! రాణాగారు ఆమెను అంతఃపురములోవుంచి చికిచ్ఛ చేయిస్తున్నాడట.

తాన్: తన యవివేకమునకు చికిత్సచేయించుకొనిన బాగుగ నుండెడిది.

వెంక: పిచ్చికుదిరి కృష్ణమందిరానికి వస్తుందని పది దినాలు కనిపెట్టుకొని వుండినాము. ఆమెకు దినదినం పిచ్చిహెచ్చుతున్నదని విని ఇక యింతదూరము వచ్చినవాళ్ళము బృందావనమైనా సేవించుకొని పోదామని బయలుదేర్నాము. మీరేమైనా వస్తారా?

అక్బ: [ఆలోచనా నిమగ్నుడై యుండును.]

తాన్: మేమిప్పుడే యిచ్చటకు వచ్చితిమి. పట్టణముచూడ వలయును.

గోకు: అబ్బబ్బా, యీ వెంకటదాసుతో వేగేది కష్టంగావుంది. ఎవరడిగినా ఆంధ్రిణ్ణి ఆంధ్రిణ్ణి అని బలే డాబుసరిగా మాటచెబుతాడు. కార్యంమాత్రం బండిసున్న. దారిలోమనిషి కనపడ్డ పాపానికి తలవిసిగి బట్టి

కట్టేవరకు వుపన్యాసంచేస్తాడు— ఏమోయ్ వెంకటదాసూ, బండ్లు కదలి పోతున్నాయి రావయ్యా, మాటలెట్టుకోని పెద్దదొర కొడుకులాగా నిలుచున్నావు?

వెంక: ఏమోయి, మనం దొరకొడుకులంగాక, రామరాజు ప్రభువు రాజ్యంచేసేవఱకు అంధ్రుడికుండే జబర్దస్తి పాచ్చావుకు కూడాలేదు, మన దెబ్బంటే గోల్కొండ అబ్బా అంటుంది!

గోకు: ఆఁ! యిట్లా యెగనిక్కేవాళ్ళే కిందపడేది. ఆఁ—ఇక చాలురావయ్యా ప్రసంగం.

వెంక: [కోపముతో] ఏమంత పుట్టుమునిగిపోయిందా యేంటి? మనిషి కనబడితే మాట్లాడనియ్యవు, నీబోటి శకునాలపక్షితో కూడా వస్తే యింతేకదూ మఱి.

యాత్రికులు: హా ద్వారకవాసా, శ్రీకృష్ణా, జయరమారమణా గోవిందోహరి. [మూటముల్లె లెత్తుకొని కదలుదురు.]

అబ్బ: మనము దైవముచే వంచింపఁబడితిమి; మందభాగ్యులము. ఆ పరమ భక్తురాలి వైరాగ్యమును ధ్యానపారవశ్యమును ఉన్మాదముగా శంకించి విషయలోలుఁడైన రాణా ఆమెను అంతఃపురమున బంధించి యుండవచ్చును. ఇఁక మనమెట్లు దర్శింపఁగలము?

తాన: మనలను ప్రేరేపించి యింతదూరము తీసుకొనివచ్చిన యాభగవంతుఁడు మన కేదైన సదుపాయము చూపింపకపోవునా?

అబ్బను: మిత్రమా, కోకిల పంజరమున బంధింపఁబడియు గానము మానదుగదా?

తాన: గానమున కప్పుడే యెక్కుడావశ్యకత. వేదనామయము మైన గానము మఱింత మధురమై భువనేశ్వరుని హృదయము ద్వారముకడ అతిథియై నిల్చి తలుపుఁదట్టఁగలదు.— ఇఁక విశ్రమించెదము.

అబ్బ: మీరాబాయిని దర్శించువఱకు నాకెక్కడి విశ్రాంతి?

[తాన్‌సేను మూటవిప్పి అక్బరునకు పడకపఱచును. ఇరువురును గుడ్డలు కప్పుకొని పండుకొందురు. తలారి మురళీదాసు కట్లకఱ్ఱతోను చేతిలాందరుతోను ప్రవేశించును.]

మురళీదాసు: ఎవరు ముసాఫిర్ ఖానాలో బాటసార్లు? మూటా ముల్లెజాగ్రత్తగా తలకింద పెట్టుకోండి. దొంగలు దోచుకుంటె మా జవాబు దారీలేదు. హుషార్. హుషార్.

[అక్బరు తాన్‌సేనులు గుడ్డకప్పుకొని లేచికూర్చుండుదురు.]

తాన్: అయ్యా, నీవెవ్వఁడవు?

మురళి: నేను గస్తీతిరిగే తలారివాణ్ణండి.

అక్బ: బాటసారులను నిదురలేపుటతోడనే నీ జవాబుదారితనము తీరినట్లున్నది!

మురళి: ఏమి చెయ్యమంటారండి బాబు? ఎవరుబాటాసార్లో యెవరు వేషధార్లో కనుక్కోనేది కనాకష్టం.

[అక్బరు తాన్‌సేనులు చిఱునవ్వుతో అర్థగర్భితముగ పరస్పరము చూచుకొందురు.]

మురళి: దొంగలుకూడా యాత్రికుల్లాగా వచ్చి నెమ్మదిగా పండుకొంటారు. అందరిని నిద్రపోనిచ్చి దొరికినవరకు చంకలో పెట్టుకొని పెద్దమనుష్యుల్లాగా వెళ్ళిపోతారు.

అక్బ: అవును! లోకము బహువిధము.

తాన్: నీ పేరేమి?

మురళి: మురళీదాసండి.

అగ్ని: పేరు వినుటకు సొంపుగ నేయున్నది.

మురళి: నవుకరిమాత్రిం బలే గడుసుగా వుందండి కడుపునిండా కూడులేదు. కంటినిండా నిద్రలేదు. కట్టుగుడ్డకు గూడా కరువు. ఇట్లాంటి కష్ట్రాలతో నవుకరి చేసేదానికంటె మీమాదిరి వైరాగులై "జై సీతారాం" మంటూ నాలుగిళ్ళకుపోయి నాలుగు పిడికెళ్ళు బియ్యంతెచ్చుకోని సుఖంగా పొట్టగడుపుకొంటూ కాలుమీద కాలువేసుకోని ఏసత్రిపుగోడకో ఆనుకోని దొరకొడుకు ఎట్లాండి వాడ్రా అనుకొంటూ కాలచ్చేపంచెయ్యడమే మేలుగా తోస్తుందిబాబుగారికి. మారాజులంకూడా సోమారిపోతుల్నే ఆదరిస్తారు. మాబోటి కష్టపడేవాళ్ళకు కూడులేదు యీకాలంలో. మావూళ్ళోవుండే రామాంజయ్యగోరు పొద్దున్నే మొగాన యెంటికపోసంత సంధ్యకూడాలేకుండా నామాలుపెట్టుకోని గుమ్మడికాయతపిలె నెత్తిన పెట్టుకోని అచ్చాపాత్రికొస్తాడు. సాయంత్రిం పూలదండలమ్ముతాడు. నెలకి రెండు మోకీల అచ్చాపాత్రిబియ్యం అమ్ముతాడు. సారాయంగడికి దినమ్మూ తప్పడు. మల్లీ పెళ్ళానికి బంగారు మురుగులు రాళ్ళకమ్మలు చెయ్యించాడు ఇదంతా అచ్చాపాత్రడబ్బే! ఇంక నేను నెలపొడుగుతూ నవకరిచేస్తే కళ్లు తాకక్కుండా బిగబట్టుకోని వుంటేగింతే పెళ్ళాం బిడ్డలకు దినానికి రెండు పూటలు కూడుదొరికేది కనాకష్టం. నాపెళ్ళాంగూడా బిచ్చమెత్తి మురుగులు చేయించిపెట్టమని దినమ్మూ తగువు. నాకు అదేతేలిగ్గా వుందిబాబు.

అగ్ని: దానము దుర్వినియోగమగుటయేతప్ప, బిచ్చమెత్తుటవలన బీదతనము పోదు, ఎంతట్టివానికైనను కాలుచేతులు చక్కగానుండు సంతవఅరకు యాచించుట నీచము.

మురళి: కడుపునకు చాలీచాలని నవుకరి అంతకంటె నీచంగా తోస్తుందండి. యాత్రికువచ్చిన పల్లెటూరివాండ్లను అదిలించి బెదిలించి, కొంచెము డాబుసరి మనుసులను యాచించి బేడా పావలా సంపాయించుకోని కాలం గడుపుతూ వుండినాను. ఇప్పుడు మాకూట్లో రాయిపడిందండిబాబు.

అగ్బ: ఏమీ?

మురః: రాణిగోరి వల్లనే యీపట్నం యాత్రాస్థళమైంది. ఆ తల్లికి పిచ్చిపట్టి అంతప్పురములోనే చెరపెట్టినప్పటినుంచి యాత్రికులందరు మెల్లింగా సళ్ళుకొంటున్నారు. మాకొక్క దమ్మిడీ యిచ్చేవాళ్లు కూడా కనబడరు.

తాజ: ఈ పిచ్చికథను సామాన్య జనులందరు నమ్మ చున్నట్లే యున్నది— ఈయూరిలో విశేషము లేవియైనఁ గలవా?

మురః: రాణిగోరికి పిచ్చిపట్టిందొక పెద్ద విసేసం. ఆలుబిడ్డల్ని పెట్టుకోని గుట్టుగా కాపరంచేస్తుండే సంసార్లకు మతాలు వైరాగ్యాలు నేర్పించి కుటుంబాల్లో కలహాలుపెట్టే గురువుల్ని సన్నాసుల్ని రాజ్యంలోనుండి యెళ్ళగొడ్తారని మొన్నధొరగారు పట్నమంతా తుడుమెయ్యించారు. ఈదిబళ్ళల్లో యేమితెలియని పిల్లకాయలికి యేలాంటి మతాలు మాయమాటలు చెప్పకూడదనీ యిందుకు తప్పినట్లయితే వురిసిచ్చని చాటించారు. వూరంతా కూడుడికినట్లు వుడికిపోతుంది. గురువులంతా వొక కట్టుగట్టి సిసువుల్ని సిసువురాండ్లని యెగదోల్తున్నారు.

తాజ: అయితే మీయూరిలో చాలావిశేషములు గలవు.

మురః: ఇంకా వకటుండి—ఆ—మరేంగలిస్తే—మీకేమైనా పిచ్చికి వైయిద్దం తెలుసునాండి? అట్లయితే దివాణంలో కొంచెం సంబావన ముట్తుంది. గోసాయిచిట్కాలంటే అందరు నమ్ముతారు.

అగ్బ: రాణిగారి పిచ్చి కుదుర్చుటకా?

మురః: అవునండి.

తాజ: సంస్థానపు వైద్యులులేరా?

మురః: ఎందుకులేరు! వుండాడు కండోజీరావు. ఆయన రాణిగారిని చూశి దణ్ణంపెట్టి ఈరోగానికి నాకు మందుతెలియదని వెళ్ళిపోయాడంట!

అగ్బ: అతఁడు వివేకి.

తాన్: అంతఃపురములోనికి ఇతరులను రానిచ్చెదరా ?

మురా: ఆ— వైద్యగులైతే రావచ్చును. అంతఃపురాధికారి బలవంత రావుగారి వుత్తరువు తీసుకొని రాణమ్మగారికి వైద్యం చేయవచ్చును. కుదిరితే మీకు బలే పేరుంటుంది. వూళ్ళో వాళ్ళందరు మిమ్మల్నే పిలుస్తారు.

అగ్బ: [చిఱునవ్వుతో] మీ యూరి వారికందఱకు ఇట్టి పిచ్చియే పట్టియున్నదాయేమి ?

మురా: కాదండి. ముందుగా రాజుగారి నగళ్ళల్లో పేరు తెచ్చుకొంటే ఆయెనక యూడబట్టినా చెల్లాకె.

తాన్: మేము రాణిగారియొద్దకు పోవలసియున్న రాణాగారివద్దకు పోవలసిన యవసరములేదా ?

మురా: ఇదంతా బలవంతరావుగారిమీదనే వదలి పెట్టేశిన లాగుంది. ప్రెభువుగా రిప్పుడు కొలువుకచ్చేరిలోకి రావటంలేదు. దొరగారు ముందటిమాదిరి కాదు. [నలుపక్కలుచూచి రహస్యము చెప్పువానివలె నటించి] ఎవ్వరు ఏమీ అనుకోడానికి కూడా జంకుతారు. బంగారమంటి దొర యీలాగై పొయ్యాడని పెద్దాచిన్నా అందరు అనుకొంటున్నారు [దుప్పటిమడచి క్రిందవేసికొని కూర్చుండి] అయ్యా, చలిపుడ్తావుంది. మీదగ్గర చిలిమివుంటె వొక్క దమ్ముస్తారా ?

అగ్బ. మేము బైరాగులముకాము. బంగి తాగము. ఇదిగో! యిటు రమ్ము, నీవు చాలామంచి వాడవుగా నున్నావు. ఈరూక తీసికొనుము.

మురా: [లేచి సంతోషముతో చేయిచాపి] దైశెయ్యాండి బాబు, మీపేరు చెప్పుకొని పిల్లాపిసుగు రెండుదినాలు కమ్మంగా కాగంగా కడుపునిండా గెంజితాగుతాము. నేను కల్లంగడికి పోనేపోనండి.

[రూక తీసికొనును]

తాన్: [మెల్లగా] రేపటి పన యెత్తుగడకు అవలంబము దొఱకినది

అగ్బ: అంతయు దైవేచ్ఛ. [గుడ్డకప్పుకొని పరుండును]

ముర: [రూకను చేతిలాందరు వెలుఁగున చూచుకొని] అబ్బో! ఇదిరూకగాదురో! మోరియ్యా!— ఇట్టాధర్మంచేసే బైరాగుల్ని నేను పుట్టిబుద్ధెరిగినాక ఎప్పుడూ చూళ్ళేదు. [మరల లాందరు వెలుఁగున చూచుకొని] అబ్బో! యీ మోరియ్య గిన్నెలో సారాయిలాగ చకచక మెరుస్తుంది.

[అటునిటు పరిక్రమించుచు]

గేయము— బంగారు మోరియ్యా బయమేసుతుంది
శేతులో మెరుపట్లు శెదిరిపోతుంది.
కనబడని దేవుండు గరడావాహనుడు
పెత్తేక్షదైవంబు బంగారుమోరి;
పిశినారివాడింట పెరిగే నంటుంది
మాబోటివారిండ్ల మారిపోతుంది;
పెళ్ళానికి సూపిస్తె పిరియమాడుతుంది
పిలిశి ముద్దెట్టి నక్ వలపించుతుంది.

దాని తస్సాదియ్యా, దానికి సూపించనే సూపించను.

సారాయమ్మోబాబు సల్లంగావుంటె
నవుకరికి శెలవిచ్చి నవ్వుకొంటాను;
బంగారు మోరియ్యా బయమేసుతుంది
శేతులో మెరుపట్లు శెదిరిపోతుంది.

[నిష్క్రమించును]

[తెరజాఱును.]

స్థలము - ౧౯ : అంతఃపురము

[మీరాబాయి ధ్యాననిమగ్నయై యుండును.
తెర యెత్తఁబడును. సుశీల మందుగిన్నెతో ప్రవేశించును.]

సుశీల: రాణిగారూ, ఈమందు కొంచెం పుచ్చుకోండి. ఈసారం కడుపులోకి పొయ్యేసరికే పిచ్చి కుదురుతుందట.

మీర: [పలుకదు]

సుశీ: ఈమెపిచ్చి మందూమాకులతో కుదిరేలాగులేదు. మూడు దినాలు నుంచీ అన్నం నీళ్లు అంటకుండా ధ్యానించుకొంటూ, పాడుకొంటూ, నవ్వుకొంటూ మనలోకంలోనే లేదు. మా లలితకు జన్నిగుణం తగిలినప్పుడు ఈలాగే వుణ్ణింది. ఇట్టాంటి రోగాలు కట్టైతోగూడా పోవాల్సిందే— అమ్మగారూ, కొంచెమయినా యీమందు తాగండి.

మీరా: [ధ్యాన నిమగ్నయై పలుకదు.]

సుశీ: మందంతా తాగేశిందని బలవంతరావుగారితో చెబుతాను. [ఒకప్రక్కకువచ్చి మందు క్రింద పాఱఁబోసి మెల్లఁగా స్తంభమున కానుకొని తూఁగుచుండును.]

మీర: [మెలమెల్లఁగఁ గనులెత్తి] శ్రీకృష్ణా, రాధామనోవల్లభా, దీనావనదీక్షా పరతంత్రా, నన్నేల యీనిర్బంధమున నుంచితివి? నేనేమి యపరాధ మొనరించితిని? నీమందిరమునకు వచ్చి నీదివ్యసుందరమూర్తిని సేవింప నీయక నాభర్త నన్నీ యంతఃపురమున బంధించియుండుట నీకు సమ్మతమేనా?— తమ సర్వస్వమును నీపాదములకు నర్పించిన పల్లెటూరి గొల్ల పడుచుల సైతము నల్లాటవెట్టుట కలవాటుపడిన నీకు నన్ను పేతుసేయుట యొకవింతయా!—ఓభక్తవత్సలా, యజ్ఞానముచే నీసదుద్దేశమును తెలిసికొన

లేక నిందించితిని. సందేహించితిని. విషయవాంఛా మలీమసములైన గోపికల హృదయములను విరహాగ్ని జ్వాలలందు పరిశుద్ధము గావించి, వారికి నిర్వాణసామ్రాజ్యము నొసంగితివి. నీదాసురాలను నన్నుఁగూడ నట్లే పరిశుద్ధము చేయుటకు ఈ యుపాయము పన్నితివి గాఁబోలు! "సకలాంతర్యామివైన నన్ను ఈ యజ్ఞానవతి యెఱుంగలేక మందిరము మందిరమని భ్రమపడుచున్నది. దీనికి చక్కని గుణపాఠము నేర్పించెద"నని యెంచి, నాకీ బంధనము విధించియుందువు. ఆపత్పరంపరలు మహోపకార గర్భితము లను గభీర సత్యమును నేఁడు గ్రహించితిని. కృష్ణా, నీకరుణ అనంతము! అనంతము!

[ధ్యాననిర్మగ్న యగును.]

[వాసంతిక ప్రవేశించును.]

వాసంతిక: సుశీలా, యెక్కడ?

సుశీ: [తూఁగుచుండి యులిక్కిపడిలేచును] మళ్లీ మందుతెచ్చావా? అమ్మగారు వొక్కమక్క పోకుండా మందంతా తాగేశినారు.

వాసం: దొరసానమ్మగారు ఆ అవస్థలో వుంటే నీవు నిమ్మళంగా నిద్రపోతున్నావా?

సుశీ: నీవొక్కదానివే బయబక్తులతో నవకరి చేసేదానివిన్నీ తక్కిన వాళ్ళందరూ కూలికి పనిచేసేవాళ్ళు. ఎందుకీ పనికిమాలిన బడాయి? వచ్చినపని చూచుకోని పోరాదూ.

వాసం: సుశీలమ్మగారూ, బుద్ధి, బుద్ధి. [చెంపలు వేసుకొనును] రాణిగారికెట్లావుందో కనుక్కోని రమ్మన్నారు బలవంతరావుగారు. మందు తాగిన వెనుక నెమ్మదిగా పడుకుందోలేదో కూడా అడిగి రమ్మన్నారు.

సుశీ: బుద్ధితో అట్లా అడుగు చెబుతాను.—మునుపటికంటె పైదుర్గుణాలేమి కనిపించలేదు. ఇంకా కాళ్ళుముక్కు పీక్కునే సితికిరాలేదు.

తనలో తానే మాట్లాడుకొంటుంది. ఇప్పుడే కన్నుమాల్చింది. ఇంతవఱకు నేను విసురుతునే వున్నాను— కానీ, యీసంగతంతా నేనుపోయి బలవంత రావుగారితో విన్నవిస్తాను. అంతదాకా రాణిగారి దగ్గర వుంటావుగదూ?

వాసం: ఆ మాటలు చెప్పడానికి యెవరితెలివైనా యెరవుతెచ్చుకో వాల్నా యేంటి? [నిష్క్రమించును.]

సుశీ: ఇది బహుచమత్కారి తొత్తుకూతురు. మతిచెడిపోయైనా మోసపోతుందంటె మోసపోదు రేయింబవుళ్ళు నన్నే పడిచావమంటుంది.

మీర: [ఉలిక్కిపడిలేచి బయలుచూచుచు] హృదయేశ్వరా, యింతలో నా కౌఁగిలి విడిపించుకొని యెట్లుపోయితివి? ఎచ్చటికేగితివి? ఈదీనురాలిని వంచించుటకు నీకు మనసెట్లు పుట్టెను? ఒక్కస్థలమున నుందువని నిర్ణయములేని నిన్ను నే నెక్కడయని వెదకుదును?

ఉందువో మానిజనోత్ఫుల్ల హృదయాబ్జ
కర్ణికా నాట్య రంగములయందు?
ఉందువో శాంత రసోజ్వల మూర్తివై
క్షీరాబ్ధిలో మృదు శేషశయ్య?
ఉందువో దీనావనోద్యోగ రతుఁడవై
తలపోఁత కందెడు దవ్వునందు?
ఉందువో నిర్వాణయోగ సంధాయివై
రాస లీలా భోగరాజ్యమందు?
ఇంక నెచ్చోట నుందువో యెవరికెఱుక?
సృష్టినాటక సూత్రధారివి! నిరంత
ప్రకృతి కేళీ వినోద హర్షంబు కొఱకు
బొమ్మరిలు గట్టి తుడిపెదు మొదలునెడక.

లోకేశ్వరా, ఎందుకీ లీలావిలాసము? నీదివ్యమంగళ సౌందర్యము నీ యనంత ప్రకృతి దర్పణమునఁ ప్రతిఫలింపఁజేసి నిన్ను నీవు చూచుకొనుట కా? [బయలుచూచి క్రమక్రమముగ ధ్యాననిమగ్న యగును.]

సుశీ: ఈయమ్మగారి మాటలూ మందలింపులూ నాకు సంస్కృతంగావుంది—నిన్నటిరాత్రంతా కునికిపాటైనాలేక యీమెతోటి మేల్కొని అవస్థపడ్డాను. కొంచెమట్టు కన్ను మూలస్తాను. ఆ ముదనష్టపు వాసంతికతో నాకు అత్తెసారయింది. [పైటచెంగు పఱచుకొనియొక మూలగ పరుండును]

మీరా: నన్నేల యింకను నీయొద్దికి చేర్చుకొనవు? దవాగ్ని మధ్యమున పరితపించుచున్న యీ కురంగిని కాపాడుటకు నీకింకను దయ గలుగలేదా? నీకంఠమున వేయుటకై కట్టిన పొగడదండ నాయంజలిపుటమున కమలిపోయినది. ఇంకను నీవు రావేమి? నేను పంపుచుండిన బాష్పదూతికలు నిన్నింకను చేరలేదా? నా విన్నపమును గొనిపోయిన బలాకలు దారిలో నేమైన నాలసించినవా? లేక నీవే యుపేక్షించితివా?

ధూళి గప్పిన యీజీర్ణ చేలఁదాల్చి
గఱిక పువ్వులు కొప్పులోఁ దుఱిమి, ముసుఁగు
టంబరంబును రాణివాసంబు వీడి
దుమ్ము గద్దియనెక్కితిఁ దుదకు నాథ!

ఇంకనైనను నీచరణదాసినగుటకు తగనా? పూర్వ మా రుక్మిణిని గొనిపోయినట్లు నన్నేల గొనిపోవు? రాధామనోవల్లభా, నీవు రాధకౌఁగిటిలో చిక్కియున్నావు. లేకయున్న నీవేల మఱతువు, రాధా? నీవు ధన్యవు— ధన్యవు—　　　[ధ్యాన నిమగ్నయగును.]

సుశీ: [మేల్కొని కూర్చుండి పైటచెంగుతో విసరుకొనుచు] అబ్బా! యీ హడావుడిలో నిద్రపట్టడంగూడానా. [ఆవులించి, తూగి,

కొంచెము జరిగి పండుకొనును.]

మీరా: [ఉలిక్కిపడిలేచి అటునిటుమాచుచు] ఇంతలో నెక్కడ మాయమైతివి?— నాయొద్దనే కూర్చుండి నన్ను ముద్దిడుచుంటివే. నీ త్రిజగన్మోహన స్వరూపము నొక్కక్షణమాత్రము నాకన్నులకు కనిపించి యానందపారవశ్యమున నే నొడలు మఱచియుండ మోసముచేసి తొలిపోయితివా? నీకెందఱో ప్రాణవల్లభలు గలరు. వారిని వదలి నీవొక్క క్షణమైన సహింపనోపవు. ఈరాధతో నీకేమిపని?— నేను సౌందర్యవతిని గాను. భాగ్యవతిని గాను— కులీనురాలను గాను— కృష్ణా, నీకిట్టి భేదబుద్ధియుం గలదా? ఆకుబ్జ యెట్టి యందకత్తె? ఆ విదురుఁడెంతటి భాగ్యవంతుఁడు? ఎట్టికులీనుఁడు? అట్టి యవ్యాజ కృపాకటాక్షము నాయెడల యేల యుజ్జగించితివి?— మోసగాఁడా, పొమ్ము, పొమ్ము. నీవు మరల అర్ధరాత్రమున వచ్చి నాతలుపుతట్టి నన్ను బ్రతిమాలుకొన్నను నేను లోఁబడను. అలుకపూని నిన్ను వెనుకకు మరలించెదను. చెలులారా, ఒకవేళ నేను మెత్తందన మూనినను మీరు గట్టితనముబూని నాకు సహాయపడవలయును.— ఇసీ! నేనెంత మద్దరాలను? పదియారువేల గోపికలకు జీవితేశ్వరుఁడైన మన్మథజనకుని ఈదీనురాలి అలుకయేమిసేయును? పేదవారలకోపము పెదవులుదాఁటదు. దాఁటినను నవ్వులచేటు.— హృదయేశ్వరా, నా కా యభిమానము దుమ్మైదుమారమైనది. నేను నీసొత్తును. అస్వతంత్రను. తలపై పెట్టుకొన్నను కాలిక్రింద వైచికొన్నను నాకిష్టమే.— నాకిష్టమనునది యెక్కడిది? అంతయు నీయిష్టమే. నన్నేల ప్రొద్దుపొడుపున నే నీతోడ యమునా తీరమునకు గొనిపోవు? గొల్ల పడుచునకు రాణివాసమెక్కడిది? ఇరువురముఁ దోడుతోడుగఁ బసుల మేపు కొనుచుందుముగదా!

నీ వెండలోఁ జెట్లనీడలఁ బన్నుండి
పసుల మేపఁగ నన్నుఁబంపరాదొ;

చలిదిచిక్కంబుల సడలించి యన్నంబుఁ
　　బెట్టవే యని పేర్మిఁ బిలువరాదో;
అలసితి నొక్కింత తలిరువీవన వీవు
　　ప్రేయసీ, యని యాజ్ఞ వెట్టరాదో;
మనసయ్యె భువన మోహనగాన మొనరింప
　　మురళి యిమ్మని చూడ్కి నెఱపరాదో;
తలిరుటాకులు పూవులు దండగట్టి
మెడను గీలింపుమా యని నుడువరాదో;
అట్టి యుపచారముల కే నన్హ౯నైన
నిష్టముండిన రీతి నన్నేలరాదో!

[ధ్యాననిరమగ్నయగును]

[అగ్బరు తాన్‌సేనులు వైద్యుల వేషముతో ప్రవేశింతురు]

అగ్బరు, తాన్‌సేనులు: తల్లీ, చరణదాసులము. [దండము పెట్టుదురు.]

మీరా: [ఆనంద పారవశ్యమున నుండును]

తాన్: దర్శనమాత్రముననే ధన్యులము.

అగ్బ: గానమువిన్న నేమి యగుదుమో!

మీరా: నందనందనా, దివ్యసుందరశరీరా, నీవంటి సుకుమార కుమారుని ఆకొండ తిప్పలలో ఆ యరణ్యములలో పసుల గాచుటకు ఆ యశోదాదేవి యెట్లుపంపెను? ఆనందుఁ డెట్లియ్యకొనెను? తలిదండ్రుల హృదయము లింత కఠినముగ నుండునా?

పగలెల్ల సూర్యాతపంబునఁ దిరుగంగ
ముదుక వాడిన నీదు మోముఁగాంచి;
సజలమేఘశ్యామ సంకాశదేహంబు
గోరజచ్ఛన్నమౌ తీరుగాంచి;
లలిత పల్లవ కోమలములైన వ్రేళులు
కల్లు రాపిడి కాయ గాయఁగాంచి;
వ్రజభామినీ మనః పథముల విహరించు
పదములు ముండ్ల పాల్పడుటఁగాంచి;
వేడినిట్టూర్పు విడతు; నావిధిని దూరు
కొందు; హృదయంబు వ్రీలిపోఁ గుందుచుందు;
నీచరణదాసిని రాధను నేను లేనె,
యంతకష్టంబు నీకేల యాత్మపాల!

అక్బ: ఈ పరమభక్తురాలికి రాధాత్వము సిద్ధించినది.

మీర: కృష్ణా, రేపటినుండియు నేనే యాల మేపఁబోయెదను. నీ వా యరణ్యమునకు రావలదు. నాకు వాదోడుగా నుండుటకు నీపిల్లనగ్రోవి నిమ్ము. నీపెదవి కెంజిగురులంటిన వివరమునందె నా వాతెఱనాన్చి నీమధు రాధర రసస్పర్శ ననుభవించెదను.

తాన: [మెల్లగా కనుఱెప్పలువాల్చుచు] గానపారవశ్యముచేత కన్నులు మూఁతపడుచున్నవి.

అక్బ: కన్నులు మూఁతపడుచుండఁగనె ఇంతకు ముం దెన్నఁడును ఎఱిఁగియుండని హృదయద్వార మొకటి తెఱవఁబడినది.

తాన: దాని తాళపుచెవికొఱకె మనమింత దూరము వచ్చితిమి.

ఏమి యీగాన విశేషము !

అగ్బ: కావుననే లోకప్రసిద్ధమైనది.

తాజ: తల్లీ, మమ్మొక్కమాఱు కరుణింపుము. మేము కృతార్థులమయ్యెదము.

సుశీ: [కన్నులు నులుముకొనుచు లేచి కూర్చుండి] మల్లీ వైద్దుగులొచ్చినారె! రోగమొక దోవ మందొకదోవ.

మీరా: [ఉలిక్కిపడి లేచును]

[అగ్బరు తాజసేనులు లేతురు]

మీరా: ఆ!—మనోమోహనా, వచ్చితివా! నన్నుఁగొనిపొమ్ము. ఎంత కాలము నీకయి వేచియుంటిని?

సుశీల: ఇక్కణ్ణుంచి కొనిపొమ్మని వేడుకొంటుంది దొరసానమ్మ.
[కూర్చుండి తూగును.]

మీరా: [అగ్బరు తాజసేనుల తట్టుతిరిగి] ఇద్దరు శ్రీకృష్ణులు! [సుశీలవంక చూచి] ఇంకొక శ్రీకృష్ణుఁడు. [నలువంకలు చూచి] కోటాను కోట్ల శ్రీకృష్ణులు! ఇందులో నాప్రాణేశ్వరుఁడైన యశోదానందనుఁడేడి?

అగ్బ: ఈ భక్తురాలికి లోకమంతయు శ్రీకృష్ణమయముగ నున్నది. అమ్మా, ఆ కృష్ణుని మాకు చూపించి మమ్ములను భవవిముక్తులను గావింపుము.

మీరా: జగన్మోహనా, నీవు నాతో చెరలాట మాడుచున్నావా? నీవు నిన్నెఱుఁగవా? నీవు శ్రీకృష్ణుఁడవుగావా?

అగ్బ: ఈమె కీసమయమున నిహలోకజ్ఞాన మంతరించినది. రాధయే తానను విశ్వాసమున శ్రీకృష్ణ విశ్లేషము సహింపనోపక యార్తిఁజెందుచున్నది. మనమిప్పు డీమెతో సంభాషింపలేము. దర్శనముచే పవిత్రుల మైతిమి. గానముచే హృదయము నిర్మలమయ్యెను. ఇఁక మరలుదము.

తాళ: 'నీవు నిన్నెఱుఁగవా? నీవు శ్రీకృష్ణుఁడవు గావా?' యను వాక్యముతో మనకు చిరంతన సత్యమును బోధించినది.

సుశీ: [కనులెత్తి] అబ్బో! మరల దోమరాటుకూడా యెక్కువైంది. [పైటతో విసరుకొనుచు] కన్నట్టి మూయనీయవీ పాపిష్టిదోమలు— అయ్యా, యేమైనా మందిచ్చిపోతున్నారా? కుప్పెకట్టియితే మఱొక్క సుట్టు యెక్కువగా సాదియ్యండి. కాస్త యిచ్చాపత్తెం పెట్టండి. పాపం! మా రాణిగారు ఇప్పటికే సన్నగిల్లి పోయారు.

అగ్బ: ఆ తెంపిచ్చికి ఆమెయొద్దనే మందుగలదు. దానిని మేము గూడ కొంచెము గ్రహించితిమి.

సుశీ: [స్వగతము] వీళ్ళకుగూడా పిచ్చిపట్టిందాయేంటి! ఈపిచ్చి అంటురోగమాల అందరికీ తగులుకొనేటట్టుంది. ఈగాలితగిలి నాకూగూడ పిచ్చిపట్టిందోయేమో అద్దము చూచుకొని వస్తాను. [నిష్క్రమించును.]

అగ్బ: ఈదాసీ మనల ననుమానించి యుండదుకదా.

తాళ: అది తూగుబోతు.

అగ్బ: తల్లీ! ఈగురుకట్నమును గ్రహింపుము. ఈ హారమును శ్రీకృష్ణునకు స్వయంవర హారముగ సమర్పింపుము.

[మీరాబాయి అంజలిలో హారమును విడచును.]

తాళ: ఈబీదకట్నమునుగూడ పరిగ్రహింపుము.

[పూవులదండను దోసిట విడచును.]

[దండముపెట్టి యిరువురు నిష్క్రమింతురు. ధ్యాననిమగ్నయైయున్న మీరాబాయి చేతిలోనుండి హారము క్రిందికి జాఱిపడును.]

సుశీ: [ప్రవేశించి] అద్దములో చూచుకొంటె ముందరి మొఖం

లాగేవుంది. నాకేం పిచ్చిపట్టలేదు — వైద్దుగులు మందైనా యియ్యకుండా వెళ్ళిపొయ్యారె.— [హారమును చూచి ఆశ్చర్యముతో] ఆ! యిదేంటి చుక్కల దండలాగా మెరుస్తుంది. [నలుప్రక్కలు పరికించి] ఇక్కడ యెవ్వరూలేరు. రాణిగారు కన్నుమాల్చివున్నారు. [హారమునుతీసికొని] వైద్దుగులు చూచివుంటె తస్కరిసివుండేవాళ్ళే. దీన్ని దొంగిలిస్తే దేవుడుకూడా కనుక్కోలేడు. [అటునిటుచూచి ఱవికలో దోపుకొనును]

మీరా: [మెల్లగా కనులెత్తి] ప్రాణవల్లభా, యీవిరహిణిని నీవు పరిత్యజించితివి. ఇఁక నే జీవించియుండలేను. ప్రాణపరిత్యాగము చేసికొందును. ఈ హత్యాపాతకము నిన్నుఁదప్పక చుట్టుకొనును. [తన్నుఁజూచుకొని యులిక్కిపడిలేచి] హా! ఇదియేమివింత! నేనే కృష్ణుఁడను!—మా కిరువురకు నభేద ప్రతిపత్తి గలిగినది!—ఈ చరాచర భూతసృష్టియంతయు నేనే!—నేను లేనిదియు నేను కానిదియు నాకెక్కటియైన కనఁబడదు! అంతయు నేనే— నేనే— నేనే— నే— నే.....

[మూర్ఛిల్లును; సుశీల ఆనుకొని పట్టుకొనును]

[తెరజాఱును.]

స్థలము ౬ : రాణీగారి అలంకార మందిరము.

[తెర యెత్తఁబడునప్పటికి సుశీల అచ్చట సామానులు సరదుచుండును]

సుశీల: అదృష్టం గోడమీది పిల్లి దూకినట్లు దూకుతుంది. కలలో నైనా యిట్టాంటి హారం వేసుకొనే దినం వస్తుందని నే ననుకోలేదు.

[రవికెలో దాచియున్న హారమునుతీసి కన్నులద్దుకొని, మెడలో వేసికొని అద్దముచూచుకొనుచు పాపట దిద్దుకొనుచు]

దాసీయని పేరేగాని నాకుమాత్రం అంద చందాలు లేవా యేంటి? రాణివాసంలో పుట్టేవుంటే నేనూ వొక రాణినై యుండేదాన్నే.

[ఇంతలో వాసంతిక ప్రవేశించి, సుశీల మాటలువిని యొకప్రక్క నక్కియుండును.]

వాసం: ఈగదిలో యేంచేస్తుంది సుశీల? రాణిగారిని వదలిపెట్టి యిక్కడ తారాడుతుంది. [కొంచెము వంగిచూచి] ఓహో! అందం చూచుకొని మూర్ఛపోతుంది. ఆ మొఖం యింకా కాస్త బాగుంటే అద్దం రవికెలోనే వుండాల్సి వుంటుందేమో.

సుశీ: అందంలో రాణిగారికి చవితనిగా వున్నాను. మరీ యీ హారంవల్ల నాఅందం యిమ్మడించింది.

వాస: [ఆశ్చర్యముతో] ఇదేంటి యీవిచిత్రం! ఈబుగ్గలబూచి! కడుపులో యెన్ని ఆలోచనలున్నాయి! వొక్కదెబ్బలో రాణిగారికి చవితై పోయింది! ఇంక రాజాగారివంటి మొగుడొక్కడే తక్కువ!

సుశీ: నేనింక అధికారంచేస్తే వొక్కదాసీతొత్తు కూతురుకూడా పల్లెత్తు మాటనలేరు. నా హారంచూచి గపుచిపుమని నోరుమూసుకోని పోతారు.

వాసం: ఈ దయ్యాల మంగిని చీపురుకట్టతో శివాలించ బుద్దేస్తుంది. దీని కెక్కడిదీ హారము? ఏ మిండమగడైనా యిచ్చిపోయినాడా యేం?

సుశీ. నాకు మంచికాలం వచ్చేసరికి ఆ వైద్దుగులు దొరసానమ్మకు హారం నజరిచ్చి పోయినారనుకుంటాను. లేకపోతే వుట్టిపుడియంగా హారాలు ఆకాశం బొందచేసుకొని కిందపడతవా?

వాసం: ఆ! తెలిసింది. ఎవరో నజరిచ్చి పోయిన హారాన్ని రాణి గారు మాంద్యంలో వుండేటప్పుడు ఈ మాయలాడి తట్టేసివుంటుంది.

సుశీ: ఆవాసంతిక నా అందాన్ని చూచి చూపోపలేక గొంతుకు వురివేసుకోని చస్తుంది.

వాసం: [మెటికలు విఱచుచు] ఓసి లంబాడి, నీబుగ్గలుకోసి వండివేస్తే పదిమంది సిపాయిల కడుపులు నిండుతాయి. నీయందాన్ని చూచి నేను వురివేసుకోని చావాల్నా?

సుశీ: సరిసమానుల్లో వొకరికి కొత్తగా భాగ్యంవస్తే తక్కినవాళ్ళ కళ్ళలో కారం చల్లినట్లుంటుంది. వాళ్ళయీసు నన్నేమి చేస్తుంది? కొంచెం వోరపైటవేసుకోని మద్యరంగంలో పనివున్నట్లు తిరుగుతుంటాను, ఎవరైనా యెక్కడిదీహారమంటే రాజాగారిచ్చినారని రహస్యంగా చెబుతాను.

వాసం: [ఈమాటలు విని నవ్వునిలుపుకొనలేక పక్కున నవ్వును.]

సుశీ: [ఉలిక్కిపడి] ఎవరక్కడ? — వాసంతికా?

వాసం: అమ్మా, దొరసానమ్మా, అట్లాంటిరాజు నాకూ మొగుడైతే నేనూ రాణిగారికి చవితినై వుందునుగదా!

సుశీ: [ప్రాణములు పోయినట్లు దిగాలువడును.] ఈలంజె కూతురు అంతా విన్నది [తెప్పరిల్లి] వాసంతికా, యెంతసేపైంది నీవు వచ్చి?

వాసం: తమరు రాణిగారికి చవితి అయ్యింది మొదలు తమరి అంద చందాన్ని చూచి వాసంతిక వురివేసుకొని చచ్చేవఱకు, రాణాగారు నిన్ను మోహించి ఆ హారం బహుమానం చేసేవఱకు.

సుశీ: నే ననుకొన్నట్లే మోసపోయావు.

వాసం: అదేంటి?

సుశీ: నీవు వచ్చి వాకిటివద్ద దాంకొన్నది అప్పుడే చూచాను. నీ వేమనుకొంటావో చూస్తామని అట్లా మాట్లాడినాను.

వాసం: [నవ్వుచు] నేనుమాత్రం నిజమనుకొన్నానా? నీవు తమాషా పట్టిస్తున్నావని నేనుకూడా నవ్వుతున్నాను.

సుశీ: నేను ఎగతాళికి అన్నమాటలు నీవు దాసీలదగ్గర అనవద్దు. వొట్టు, వాళ్ళు ఎకసక్కెంమాటలుకూడా నిజమని యెత్తి పొడుస్తుంటారు.

వాసం: అంతేగా భాగ్యం. అట్లాగే, నాకు పనివుంది, మళ్లీవస్తాను. [స్వగతము] ఇది నన్ను మోసంచేసినానని అనుకొంటుంది. దీన్ని మోసంచేసి కొరడా వేట్లతో నలుగు పెట్టిస్తాను. [నిష్క్రమించును.]

సుశీ: పాపము, వాసంతిక నన్నొకకంట కని పెట్టేవుంటుంది. ఎట్లయినా దానికి నన్నుచూస్తే కొంచెం భయమె. [హారముతీసి ఱవికెలో దోపు కొనును] శుక్రవారమునాడు తలకుపోసుకొని రాణి గారిచ్చిన బనారసుచీర కట్టుకొని మళ్లీ యీ హారం వేసుకొంటాను.

[తెరలో 'సుశీలా, ఇంకా యేం చేస్తున్నావు?' అని కేక వినఁబడును]

సుశీ: ఇదిగో! వస్తున్నాను. రాణిగారి మందు సంగతే మరచి పోయ్యాను. [నిష్క్రమించును]

—:(o):—

స్థలము 2: రాణాగారి విశ్రాంతిమందిరము.

[పట్టు మెత్తలుకుట్టిన సోఫాయుండును. దానికి కుడి ప్రక్కన రెండుకుర్చీలు వేయఁబడియుండును. ఎడమ ప్రక్కన ఒక చిన్న టేబిలుపై హుక్కాయుండును. రెండు మూడు పుస్తకములు పెట్టఁబడియుండును. రాణా ఆలోచనా నిమగ్నుఁడయి అటునిటు పచారుచేయుచుండఁగా తెరయెత్తఁబడును. రాణా కుదుటపడని మనస్సుతో ఒకతూరి పుస్తకము తీసికొని పుటలుత్రిప్పి మరల బల్లపై పెట్టును. అటునిటు తిరుగును. ఒక్క గుక్కెడు హుక్కాపీల్చి గొట్టమును బల్లపై పెట్టును. రాణా యిట్లు మనస్సంక్షోభము కనఁబఱచు చేష్టలు ఒకటి రెండు నిమిషములు చేయును.]

రాణా: మీరాయొక్క నడవడి విడదీయరాని చిక్కుగ నేర్పడినది. ఇది యదియని నిర్ణయించుటకు వీలుకాకున్నది. కొందఱు దీనిని మతావేశమని చెప్పుచున్నారు. మతావేశముకూడ యొక మానసిక వ్యాధియనియే నాయుద్దేశము. [సోఫాపై కూర్చుండును] ఔరా! నాకన్నుల యెదుటనే నా జీవిత మెట్లు మాఱిపోయినది! ప్రేమకు విషయీభూతమగు వస్తువే ద్వేష ప్రేరకమైనయెడల— ఈరాజ్యమేకాదు, ప్రపంచమునంతయు నేలువానికైన శాంతిలేదు, ఆనందములేదు.— హృదయము శ్మశానము. జీవితము మరుప్రదేశము. ఇంతకన్న దుఃఖకరమైన ఆంతరిక సంక్షోభము వేఱొండులేదు. [లేచి అటునిటు తిరిగి] తనకు తెలిసి మీరా నన్ను తిరస్కరించుట

లేదు, ద్వేషించుటయు లేదు. ఒకప్పుడు తాను వచించు మాటల ఫలితమును యోచింపలేనంత అమాయికగ నగపడును. ఆ కాంత యొనరించు ప్రతి కార్యమును తనకు నైసర్గికమైనట్లె తోఁచుచుండును. ఏదియో యొక బలాత్కార శక్తి తన్ను నన్నుండి యాకర్షించుకొన్నట్లు నిస్సహాయయై వర్ణించుచుండును.

[మఱల సోఫాలో కూర్చుండును.]

మీరాను పరిత్యజింపఁజాలను, ప్రణయమంజులమైన గతజీవితస్మృతి నా సంకల్పమున కడ్డుపడుచున్నది. ఎప్పటికైనను మీరాను నావంకకు త్రిప్పుకొనగలనను నమ్మకము గలదు.

[బలవంతరావు ప్రవేశించును]

బలవంతరావు: జయము, జయము ధర్మప్రభువులకు!

రాణా: కూర్చుండుము— మీరా ఇపు డెట్లున్నది?

బల: [కూర్చుండి] నిన్నటివలెనే యున్నది. ఔషధ సేవనము వలన ప్రయోజనమేమియు నగపడుటలేదు. దైవానుకూలముగ నా కొక విషయము జ్ఞప్తికి వచ్చినది. భూతచికిత్సచేయించి వేయిమంది సద్బ్రాహ్మణులకు షడ్రసోపేతముగ సంతర్పణ చేయించి, శాంతిచేసిన యెడల రాణిగారికి తప్పక జాడ్యము కుదురును!

రాణా: [విసుగుచూపుచు, స్వగతము] ఇతఁడు పురాణ పురుషుఁడు. ఇతని ఇప్పటి యోగ్యత వార్ధక్యమే!

బల: భేతాళుని ఆజ్ఞలోనుండి అప్పుడప్పుడు కొన్ని పిశాచములు తప్పించుకొని, భూలోకమునకువచ్చి ప్రజలను బాధపెట్టుచుండునని మంత్రశాస్త్రవేత్తలు చెప్పుదురు. అవి పట్టినప్పుడు ఆవేశమువచ్చినట్లూ, పిచ్చిపట్టినట్లూ ఉండేదికలదు. భల్లూకశాస్త్రులవారు శాతపాడి మంత్రములలో—

రాణా: [విసుగుతో] ఇస్—ఇఁక చాలింపుము! ఎంత తెలివి

తక్కువ వ్యాఖ్యానము ?

బల: [అణఁగిపోయి] ప్రభువులవారు మత విషయములో ఇఁత కఠినముగా మాట్లాడడము కొంచెము— [నీళ్ళు నములును]

రాణా: మూఢ భక్తులకు మతము కానిదేది ?

బల: పాఠశాలలో మతప్రచారము చేయకూడదని దేవరవారు కావించిన శాసనము ప్రజలలో కల్లోలము పుట్టించుచున్నది. పీఠాధిపతులు, కులగురువులు, రాజద్రోహము బోధించుచున్నట్లు వినికిడి. మొగలాయి వాళ్ళు మనమీఁద కత్తిగట్టియున్న యీసమయమున మన ప్రజలలో రాజ్య ద్వేషం కలగడము మంచిపనిగాదు. ఏదో వృద్ధుఁడను, సంస్థాన శ్రేయోభిలాషిని, అనుభవశాలిని విన్నవించుకొన్నాను. తర్వాత ప్రభువుల చిత్తము.

రాణా: నిజమే! దానిని నేను గమనింపకపోలేదు. విశ్వసనీయుఁడైన సేనాధిపతికి ఖచ్చితమైన ఉత్తరువు పంపియున్నాను. ఈమతాధికారము ప్రతిపదమునందును నాయాజ్ఞ నెదుర్కొనుచున్నది. నారాజ్యమునందు నా శాసనమే శిరసావహింపఁబడవలయును. అరాజకము, బహురాజకము రెండును అపాయకములే! మతాచార్యుల పలుకుబడి సన్నగిల్లిననే ప్రజలలో మూఢభక్తి నశింపఁగలదు. లౌకిక జ్ఞానమును, జీవితమును ద్వేషించు ప్రతి మతమును మానవుని మనోవికాసమునకు అభ్యంతరమగును. ఈ సంకుచిత మతములను నారాజ్యమునుండి సమూలముగా నిర్మూలింపవలయును.

బల: మతాధికారము చాలా శతాబ్దములనుండి వేళ్ళు పారియున్నది.

రాణా: నేను ప్రవేశపెట్టిన విద్యాపద్ధతికి కఱకైన వాదరగలదు.

బల: దేవరవారికి తెలియనిదేమున్నది? సర్వజ్ఞులు— అయినా అనుభవశాలిని. శలవు పుచ్చుకొంటాను. [లేచి కొంతనడచి] మనవి చేసుకొనవలయునని మఱచిపోతిని— ఒక చిన్నసంగతి, ప్రభువులవారికి తెలియవలసిన ముఖ్యమైన విషయముగాదు.

రాణా: ఏమది?

బల: రాణిగారికి చికిత్సచేయుటకు నిన్నటిదినమున ఎవరో యిద్దరు వైదేశిక వైద్యులు వచ్చియుండిరి. వారును వచ్చినట్లే పోయిరి. అప్పుడు రాణిగారివద్ద సుశీలయనుదాసి యుండినది. ఈనాఁడు అదిఏదోయొకహారము వేసికొని తిరుగుచున్నదని ఇంకొక దాసి వాసంతిక చెప్పెను. దానిని పిలిపించి తిని; అది ధరించుకొన్న హారము అమూల్య వజ్రహారముగా కనుపట్టినది.

రాణా: ఈవిషయము చిత్రముగనున్నది. దాసి ఏమి? వజ్రహారమును ధరించుటేమి? దాని నిటకు పిలిపింపుఁడు.

బల: ఎవడురా అక్కడ?

ద్వారపాలకుఁడు: స్వామి.

బల: రాణిగారి పెద్దదాసిని సుశీలను ఇచ్చటకుఁ దోడ్కొనిరమ్ము

ద్వార: చిత్తం. [నిష్క్రమించును.]

రాణా: ఆదాసి యెచ్చటనైన దొంగిలించి యుండునా?

బల: అది సామాన్యభాగ్యవంతులు వేసికొను హారముగాదు. దొంగిలించియుండిన అంతఃపురముననే దొంగిలించి యుండవలయును.

[సుశీల మెడలో హారము వేసికొని యోరపైటతో కులుకునడకతో ప్రవేశించును]

సుశీల: [స్వగతము] రాజుగారు నన్నెప్పుడు పిలిపించేవారుగారు. ఈదండ మహత్తెంవల్ల నాకేదో యదృష్టం పట్టేలాగుంది. [సిగ్గు నభినయించుచు] నీళ్ళల్లో లోతు, మనసులో మర్మం యెవరికి తెలుస్తుంది! [పైట సవరించుకొని హారము దిద్దుకొని] దాసురాలిని [దండముపెట్టును.]

రాణా: [సుశీల మెడలోని హారమును పరికించును.]

సుశీ: [స్వగతము] రాజుగారు నా వోరపైటమీదనే కన్నువేశారు

రాణా: ఆ హారమును దీసికొండు.

సుశీల: [సిగ్గుపడుచు హారముదీసి వినయ మభినయించుచు దూరము నుండి బలవంతరావుచేతి కందియిచ్చును]

బల: [రాణాచేతబెట్టును]

రాణా: [పరీక్షించుచుండును.]

సుశీ: [స్వగతము] ఎవరైనా నన్ను మోసంచేసి వుండరుగదా?

రాణా: దాసీ, నీ కీహార మెక్కడిది? మాబొక్కసములోని ధన మంతయు వెచ్చించినను దీని మూల్యమునకు సరిపోదు.

సుశీ: [స్వగతము] అబ్బో! అట్టాంటి హారమా యిది? యెంత వెట్టి ముండను. దాచైనా పెట్టుకోక పోతిని.

రాణా: ఏమి యాలోచించుచున్నావు? కట్టుకథ లల్లకుము. యధార్థము చెప్పుము.

సుశీ: నిన్నటిదినం రాణిగారికి మందియ్యడానికి వచ్చిన వైద్యగులు ఈహారము ఇచ్చిపోయినట్లుంది.

రాణా: ఊహించుటయేమి ? నీవు చూడలేదా ?

సుశీ: [భయముతో] రాత్రంతా అమ్మగారికి విసుర్తూనే వుండి నిద్రలేక అప్పుడే కన్నట్టు మాల్చాను.

రాణా: ఓహో ! కన్నుమాల్చితివా?

సుశీ: తర్వాత రాణిగారు నన్ను దగ్గరికి పిలిచి “ ఒసె సుశీలా, ఇక్కడ వుండే దాసీల్లోకెల్లా నీవుకొంచెం ముక్కూ మొగం అందంగా వుండేదానివి, ఈహారం నీకైతే తగివుంటుంది ” అని నేను వద్దనేకొంది నా మెళ్ళో వేశారు.

రాణా: [కోపముతో] ఓసీ, బుద్ధిలేనిదానా, నీసౌందర్యవర్ణనము తో మాకిప్పుడు పనియేమి? మీ రాణి ఆవైద్యులు ఈవజ్రహారము నిచ్చిరా? లేక అంతకుముందే ధరించియుండినదా?

సుశీ: అంతకుముందు లేదండి దొరగారు, వాళ్ళు రాణిగారికి నజరు తెచ్చినారేమో.

రాణా: వైద్యులేమి అంతఃపురమున కిట్టి నజరులు తెచ్చుటయేమి? ఇదియొక క్రొత్తచికిత్స కాఁబోలు!

బల: [స్వగతము] ఇది అటుతిరిగి యిటుతిరిగి కడపటికి నాప్రాణముల మీఁదికే వచ్చునట్లున్నదే.

రాణా: పాతర త్రవ్వఁబోవఁగా భూతము బయటపడినట్లు ఇదేదియో యొక క్రొత్తవిషయము బొగడ పొడిచెను. దీనినంతయు మా యమాత్యులుకూడ విచారించి పరిశీలించిన బాగుగనుండును—ఓరీ

ద్వారపాలకుఁడు: దాసుణ్ణి.

రాణా: మా మంత్రులను నిచ్చటకు రమ్మని చెప్పుము; శీఘ్రముగ.

ద్వార: చిత్తం. [నిష్క్రమించును.]

రాణా: బలవంతరావ్, ఆవైద్యులు మీయుత్తరువు తీసికొని యంతఃపురములోనికి ప్రవేశించిరా?

బల: [సగర్వముగ] నా యనుమతి లేనిదే పోతుటీఁగ కూడ అంతఃపురములోనికి ప్రవేశింపదు.

రాణా: వారి వేషభాష లెట్లుండినవి? అసాధారణ విశేషము లేవియు నీకు తోఁపలేదా?

బల: వారివేషములు వారికి తగినవిగనే యుండినవి. వారి సంభాషణ యోగ్యతను పట్టిచూడగా రాజసంస్థానములలో మెలఁగిన వైద్యులవలెనే యగపడిరి. ద్రవ్యార్జనముకంటె వ్యాధి కుదిర్చిన కీర్తియే వారికి ముఖ్యమైనట్లు తోఁచినది. తిరిగి పోవునప్పుడు సంభావన మాటయే యెత్తలేదు.

రాణా: [కోపము బిగబట్టుకొని] అప్పుడు నీబుద్ధి స్వాధీనమున నుండినదా లేక అభిని మత్తున తూఁగుచుంటివా?

బల: [తత్తరముతో చేతులు పిసుకుకొనుచు, స్వగతము] రాజా

గారికిగూడా తెలిసినట్లై యున్నది.

రాణా: [కోపముతో] ఓయీ, పిచ్చిబ్రాహ్మణుఁడా, నీవు కన్ను లుండియు చూడలేవు; వీనులుండియు వినలేవు; తలయుండియు నాలోచింపలేవు. ఇట్టి యమూల్య హారములను నిశ్చింతముగ కానుక యియ్యఁగల వైద్య వేషధారులకు నీవిచ్చు బీదసంభావన లెందుకు?

బల: [ఆశ్చర్యముతో] వేషధారులా వారు!

రాణా: కాక, మఱియెవ్వరు?

సుశీ: [స్వగతము] ఈ ముసలాయనకు మూడుచిట్ల ముక్కజొన్నలు బత్తెం పడేలాగుంది.

[మంత్రు లిరువురు ప్రవేశింతురు]

మంత్రులు: జయము, జయము!

రాణా: విచ్చేయుఁడు.

[మంత్రులు కూర్చుండుదురు]

రాణా: శ్యామలరావుగారూ, మన యంతఃపురమున వింతలు పుట్టుచున్నవి. ఈ హారమును చూచితిరా? [శ్యామలరావు చేతికిచ్చును.] దీనిని ఆదాసివేసికొని తిరుగుచుండఁగా మఱియొకదాసి చూచి బలవంతరావుగారి కెఱిఁగించెను.

సుశీ: [స్వగతము] చూపోపలేక ఆ మాయలాడి తొత్తుకూతురు వాసంతిక మోసంచేసి వుంటుంది. ఈ ముసలిబాపడికి నేనంటె కళ్ళల్లో కారం చల్లినట్లుంటుంది.

రాణా: నిన్నటిదినమున ఎవరో యిద్దఱు వైద్యులు మన యంతఃపురమునకు వచ్చి మీరాకు ఈహారములను నజరిచ్చి పోయిరఁట!

శ్యామ: వైద్యులా యిట్టిహారములను బహుమతిచేయుట!

మాధ: [హారమును తాను తీసికొని] ఇది నమ్మతగినది కాదు.

సుశీ: నిజమేనండి దొరగారు.

మాధ: నీవు చూచితివా?

సుశీ: నా చేరదేసి కళ్ళనిండా చూచానండి.

రాణా: రావుజీ, వైద్యులు మనయంతఃపురమునకు వచ్చినమాట యథార్థము. ఆసంగతి బలవంతరావుగారె చెప్పిరి.

బల: వచ్చినమాట వాస్తవమె.

రాణా: ఆవైద్యులే యీ హారమును దెచ్చియుండక పోయిన, అంతరాళము నుండి యూడిపడి యుండునా!

శ్యామ: వారు నిక్కమైన వైద్యులైనట్లు తోఁపదు.

రాణా: నేనును అట్లేతలంచితిని. ఎవరో దురాత్ములైన సంస్థానాధిపతులు మాయంతఃపురము నపవాద కళంకితము కావించుటకొఱకు వైద్య వేషధారులై వచ్చిరి.—నీకు వారి యుచ్చారణలో భేదమేమైన గోచరింప లేదా?

బల: [ఉత్తరముతో] ఏదో కొంచెముండినట్లుగనే తోఁచుచున్నది. నాకప్పు డనుమానము తట్టనందువలన అంతగా పరిశీలింపలేను. కొంత మొగలాయిదేశ స్పర్శ ఉండినట్లుగా భ్రమ.

రాణా: ఆ!—తెలిసినది. ఇది యంతయు ఆ కపటాత్ముఁడు అక్బరు పన్నిన కుట్రవలె నగపడుచున్నది. నన్ను శౌర్యముతో లోఁబఱచుకొనలేక యిట్టి యధమకృత్యమున కొడిగట్టి యుండును— మీరేమి తలంచెదరు?

శ్యామ: మన యూహావలంబనమునకు ఇంకను కొన్ని,ఘనిష్ఠములైన యాధారములు దొఱకవలయును.

మాధ: ఒకవేళ ప్రభువుగారి యూహ సత్యముగనే యుండవచ్చును. మొగలాయివారు ఎట్టి నీచకార్యములకైన సాహసింపఁగలరు.

రాణా: ఆ దుర్వివేకుఁడు ఇట్టి కుతంత్రములవలన నన్ను లోఁబఱచు

కొనఁగలఁడా? అక్కసెలియుండ్రను ఆలుబిడ్డలను మొగలాయి పాదుపాల కర్పించి యీ యపకీర్తి మూల్యముచే నున్నతోద్యోగముల వరించి నీచ జీవనము సేయుచు చిరంతన యశో విరాజితమైన రాజపుత్ర కులమునకు కళంకము దెచ్చిన మానసింహాదులవంటి పతితుఁడ ననుకొనెనా నన్ను! ఎన్ని యుపాయములైన పన్నుగాక, కుంభరాణా అన్నునకు ప్రాణముతో లోఁబడఁడు. [బలవంతరావు తట్టు తిరిగి] ఓయీ నిద్దురపోతా, నీ యజాగ్రత్తవలన గదా మాయంతఃపురమున కింత యపనింద కలిగినది?

బల: [లేచి. గద్గద స్వరముతో] మహాప్రభూ, అంతః పురాధికారి నాట చేసే యపరాధిని. వృద్ధుడనౌట బుద్ధిపాటవముకూడ తగ్గిపోవుచున్నది. కన్నులును చక్కఁగఁ గనఁబడవు. నన్నిక నుద్యోగ విముక్తుని గావింపవలయునని ప్రార్థించుచున్నాను.

రాణా: ప్రార్థన మవసరములేకయే నిన్ను పదభ్రష్టుని గావించుచున్నాను; నీవయస్సు, నీస్వామిభక్తియు, నీప్రాణములను దక్కించినవి. వెడలి పొమ్ము.

బల: మన్నింపఁబడితిని. ధన్యుఁడను. [తాళములు రాజుముందర పెట్టును]

రాజసేవ కత్తిమైని సాము! [నిష్క్రమించును]

సుశీ: [స్వగతము] ఈ ముసలిబాపడు మేయుబోయి మెడకు దగిలించుకొన్నాడు. ఆ వాసంతిక మాటవిని నామీద చాడీలు చెప్పినందుకు ఆ వుద్యోగం కాస్తా వూడిపోయింది.

రాణా: మాకు విశ్వాసపాత్రుఁడైన కుమార సింహుని అంతఃపురాధికారినిగా నియమించితిమి. ఉత్తరువు సాదరు చేయుంచుఁడు.

శ్యామ: చిత్తము, దేవరవారు చాలా న్యాయముగఁ దీర్మానించితిరి. కుమారసింహుఁడు పసిప్రాయము వాఁడగుటవలన అతని తండ్రి యుద్యోగమును బలవంతరావుగారి కొసఁగఁబడియుండెను. ఇప్పుడు కుమార

సింహుండు యుక్తవయస్కుడు.

సుశీ: రాణిగా రొంటరిగా వుంటారు. మళ్లీవస్తాను.

[నిష్క్రమించును.]

ద్వార: తలారివాడొకడు ప్రభువులవారి దర్శనానికి కనిపెట్టుకొని వున్నాడు.

శ్యామ: ప్రభువుగా రిప్పుడు కార్యాంతర నిమగ్నులు. రేపువచ్చి మనవి చేసికొమ్మనుము.

ద్వార: [నిష్క్రమించి, మరలవచ్చి] వాడిది అగత్తెమయిన మనివంట. పెళ్ళాం బిడ్డల నోటికాడ కూడంట.

రాణా: ఏమది! వానిని రమ్మనుము.— నాదర్శనమును గోరు వారి నెవ్వరిని ఆటంక పెట్టకుడు. అంతకన్న నాకు ఉత్తమ మయిన కార్య మేమున్నది?

శ్యామ: చిత్తము.

[తలారి మురళీదాసు ప్రవేశించును.]

మురళిదాసు: మహాప్రభో, నాది అగిత్తెమయిన మనివండి. పెళ్ళాం బిడ్డల నోటికాడ కూడండి. [వంగి దణ్ణముపెట్టును.]

శ్యామ: ఏమిరా నీమనవి? ఒకటి రెండు మాటలతో విన్నవించుము.

మురళి: చిత్తం మహాప్రభో, యీయాళపొద్దున, అంటె పొద్దు అల్లాడి కెక్కినాక, [నిర్దేశించును] నేనొక బంగారు మోరీ యెత్తుకొని మార్చుకొందామని దునీచంద్ సేట్ దగ్గరికి వెళ్ళినాను. ఆమోరీ తీసుకొని దాని కరీదు పది రూపాయలని అయిదు రూపాయలిచ్చి మిగత పైకానికి పదిరోజులు తాళి రమ్మన్నాడండి.

రాణా: కానిమ్ము.

మురళి : ఆపక్కొంగటి సేటు ఆయన కడుపు సల్లంగుంటె—దాని ఖరీదు యిరవయి రూపాయలని చెప్పినాడు. ఆపాట మల్లీ దునీచందుసేటు దగ్గిరికి పోయి నీపయికంతీసుకోని నా మోరీఅన్నా యియ్యి, లేకుంటె యిరవయి రూపాయలన్నా యియ్యి అని బతిమాలినాను. మోదేసుకొన్నాను. ఏమీచేసినా నాకోడికి మూడే కాళ్ళంటాడు. సనేమంటే సనేమంటాడు. మోరీయెత్తి తిత్తిలో యేసుకోని పెట్లోపెట్టి బీగంయేసి, మోల్లో యేసుకొన్నాడు. నేను మల్లీ గట్టిగా అడిగితే నీవిక్కడ అల్లరిచేస్తే దొంగసొత్తని చెప్పి దండాధికారికి పట్టిస్తాను కబరారని గుర్లు మిటకరించాడు. ఆపాట నేను యిదంతా యిన్నపం చేసుకోడానికి దండాదికారిదగ్గిరికి పోయినాను. పోయినపాటనే అక్కడవుండిన నౌకరి నాచేతికి యిసనకఱ్ఱ పట్టిచ్చి ఆయన యాడకో జారుకొన్నాడు. నేను విసుర్తూ మనవి చేసుకొంటూ వుణ్యాను. అయ్యాగారు మెల్లంగా కన్నుమాల్చినారు. రెండు గెడియలకి మేలొక్కొని సరే అంతా విన్నానుగాని, దునీచందు నీమీద ఫిర్యాదుచేస్తే అప్పుడు విచారిస్తాను పో అని పంపేశాడు. నామోరీ యిప్పించేమాట మరిశేపొయ్యాడు.

శ్యామ: నీమనివి యీ మోరీని తిరుగ యిప్పించమనియే కదా.

మురళి: అదేనండి మహాప్రభో.

రాణా: శ్యామలరావుగారూ, చూచితిరా మన పరిపాలనా సౌష్ఠవము, దండనీతి విధానము? ప్రజల మనస్సులేకాదు పాలనా యంత్రము కూడ సంస్కరింపఁ బడవలయును.

శ్యామ: చిత్రము.

రాణా: నీకు మొహరీ యెక్కడిదిరా?

మురళి: నిన్నటిరాత్రి ముసాపురిఖానా వద్ద గుస్తు తిరుగుతుణ్యాను. నేను అందరి తలారివాళ్ళలాగ రాత్రంతా నిద్రపోయి పొద్దున్నేలేచి బాగిడా పట్టుకోని వచ్చేవాణ్ణి కాదండి. గుట్టుగా నవుకరి చేసుకోని బతికేవాణ్ణి.

రాణా: కానిమ్ము.

మురళి: చిత్తం మహాప్రభో— ఆ సాలలో యిద్దరు ముసాఫర్లు పండుకొని నిద్రపోతుండినారు. వాళ్ళను లేవగొట్టి మాటాముల్లె భద్రమని యెచ్చరించాను. నేనెప్పటికి ప్రతి బాటసారిని కఱ్ఱతో తట్టి లేపి కాఁడా బట్టి చూస్తుంటాను. అందువల్లనే నా ఫారాలో వొక్క దొంగతనమైనా పోలేదండి ధొరగారూ. అదంతా ప్రభువుల కరికె.

రాణా: అధిక ప్రసంగము చేయకుము. శీఘ్రముగ ముగించుము.

మురళి: [భయముతో] చిత్తం మహాప్రభో— మాటామాటలో మా యింటి మంచీ శెబ్బరా చెప్పుకొన్నాను. వాళ్ళల్లో వొకాయన నా మీద కనికరంపుట్టి వొక మోరియ్యా యినామిచ్చినాడు. ఇంతకంటె చిల్ల పెంకెత్తుగూడా యెత్యాపం జరగలేదండి ధొరగారు. [దండము పెట్టును.]

రాణా: వారు వైదేశిక యాత్రికులా, బైరాగులా? వారిపై నీకేమైనా అనుమానము తట్టలేదా!

మురళి: వాళ్ళు దొంగల్లాగా లేరండి మహాప్రభూ, పెద్ద పెద్ద నామాలు, తొళిసిపూసల దండలూ చూస్తే భక్తుల్లాగా కనబడ్డారు. నా యంటివాణ్ణి గూడా 'అయ్యా' అని పెద్దమణిశినిలాగా పలకరించారు.

రాణా: అందుకే యుబ్బి తబ్బిబ్బులయి నీ యుద్యోగ విధులను మఱచితివా! అడిగినంతనే బంగారు మొహరీల విఁరి పాఱవేయఁగల సంపన్న యాత్రికులు బిచ్చగాండ్రకయి కట్టింపఁబడియున్న పాంథశాలలలో నివసింతురా? ఓరీ, మూర్ఖుడా, నీగాడిద బుద్ధిచే మానవాకృతి దూషింపఁబడినది. [మంత్రులతట్టు తిరిగి] రావుజీ, యీబాటసారులే యావేషధారి వైద్యులు.

శ్యామ: అట్లే తోచుచున్నది. ఆ దునీచందు శేటును పిలిపించెదము. ఆతఁడు రత్నవ్యాపారముచేయు గొప్ప సాహుకారు. ఆతనిచేత ఈ హారమునకుగూడా మదింపు వేయింపవచ్చును.

రాణా: పిలిపింపుడు

శ్యామ: ఓకే.

ద్వారపాలకుఁడు: స్వామి.

శ్యామ: నీవు శీఘ్రముగాపోయి దునీచంద్ శేటును రాజాజ్ఞగా పిలిచికొనిరమ్ము. తలారియొద్ద తీసికొనిన మొహరీనిగూడ తీసికొని రమ్మనుము.

ద్వార: చిత్తం. [నిష్క్రమించును]

రాణా: మనవేగువారు చాలాప్రమత్తులయినటుల కనఁబడుచున్నారు. లేకయున్న పరదేశీయులు మాఱువేసములతో సంచరించియు, అంతఃపురమున దూరియు తప్పించుకొని పోఁగలుగుదురా?

శ్యామ: ఈతూరి ప్రమాదమే జరిగినది.

రాణా: తీవ్రముగ మందలింపుడు.

శ్యామ: చిత్తము.

[దునీచంద్ శేటు ప్రవేశించును.]

దునీచంద్ శేటు: [తలారి మురళీదాసును చూచి రహస్యముగ] ఏమిరా యీసంగతి రాజుగారిదాకా తెచ్చావా? ఉండు! భడవా, నీసంగతి చెప్పిస్తాను.

మురళి: చూడండి ధొరగారూ, యీ శేటుగా రేమంటున్నారో.

దునీ: జయము, జయము ఏలినవారికి! ధొరగారి వుత్తరువైతే యీ మొహరీ వాడికిస్తానని చెప్తున్నానండి.

మురళి: [స్వగతము] ఆ— వూరికే యిస్తావా, వుంగరాల చేతి మొట్టు దగిలితే పెద్దమణిశి లాగా యిస్తావు.

శ్యామ: నీవుపోయి, నీ నవుకరి చూచుకొమ్ము, మేము విచారించి

నీసొత్తును నీకిప్పించెదము.

మురళి: దయిసేయించండి సోమి, పిల్లా జల్లా గల్లవాణ్ణి.

[దండముపెట్టి, నిష్క్రమించును.]

దునీ: [తిత్తికుచ్చె విప్పుచు] తమరు బంట్రోతును పంపేటప్పటికే నేను దండాధికారి దర్శనం చెయ్యడానికి సగందూరం వచ్చానండి. నే నబద్ధమాడితే ఆ జవాన్నడగండి. [మొహరి శ్యామలరావు చేతికిచ్చి] ఇది దొంగ సొత్తేనని నాకు చాలా అనుమానం తట్టింది. అట్టాంటి సొత్తులను కొనవలెనంటె నాకు మహా చెడ్డ భయమండి.

శ్యామ: [పరిశీలించి] ప్రభువుగారు దీనిని చిత్తగింపుడు: ఇది మొగలాయి నాణెము.

రాణా: [పరికించి] అవును! ఆ వేషధారులు కూడ మొగలాయి రాజ్యమునకు సంబంధించినవారె.

దునీ: [భయముతో] ఇంకే వేషధారులు మా దుకాణానికి దొంగ సొత్తులు తేలేదండి. కర్పూరం వెలిగించి ఆర్పమన్నా ఆర్పుతాను.

శ్యామ: శేటుగారూ, దొరగారు మీ పెద్దమనిషితనమును అనుమానింపలేదు. ఈ వజ్రహారమునకు మదింపు వేయుడు.

దునీ: [హారమును తీసికొని ఉత్తరీయపు చెఱఁగుతో దానిరుద్దుచు] నేను ధరవేస్తే త్రాసులో పెట్టి తూచినట్లు సరిపోతుంది. [పరికించి ఆశ్చర్యముతో] ఈహారము నే నిదివఱకు చూచినదేనండి. కాశ్మీరదేశవర్తకుడు సంవత్సరము క్రిందట పదిలక్షుల రూపాయలకు అగ్బరు చక్రవర్తి గారికి అమ్మినాడు.

రాణా: [చివుక్కునలేచి] ఏమంటివి? అగ్బరుకా?

దునీ: [తత్తరముతో స్వగతము] కొంపమునిగినట్లుంది [ప్రకాశముగ] పరధ్యాన్నంమీద యేమొ అన్నాను.

రాణా: [ఉద్రేకముతో శేటు భుజముపట్టుకొని] యథార్థము

చెప్పుము! సంవత్సరముక్రిందట అగ్బరు ఈహారమును కొనియుండెనా?

దుసీ: ఇటువంటిదానివలె వుండినదేగాని, అయితే యిదౌనో కాదో నేను నిర్ణయించి చెప్పడానికి జ్ఞప్తిచాలదండి మహాప్రభో.

మాధ: నిజముచెప్పుము; అందువలన నీకేమి యపాయములేదు.

దుసీ: [అనుమానించుచు] ముత్యాలికా మూడువిసాలా మూడు పిరలు ఆ హారంమాదిరిగానే- వుండినట్లు- తోస్తుందండి ప్రభో.

రాణా: [శేటుభుజము వదలి] సత్యము బయటబడినది. అమాత్యులారా, యింకను మీకు ఘనిష్ఠమైన యాధారములు కావలయునా? ఆ దుర్మార్గుండైన అగ్బరే మారువేసమున మాయంతఃపురముం జొచ్చెననుట కింకను సందియము గలదా? కుంభరాణా బ్రతికి యుండగనే తనయంతఃపురమున నింతటి యన్యాయము జరుగునా? [నలుప్రక్కల చూచి] ఆదాసి యెచ్చటకు జారిపోయినది?— అంతఃపురములో నాళ్ళవు లేనిదే యితరు డింతటి సాహస కార్యమున కియ్యకొనునా? పూజ కను నెపమున కోరినప్పుడెల్ల మీరా కృష్ణమందిరమునకు పోవుచుండెను. యాత్రికుల వేషము ధరించి అగ్బరు అప్పుడప్పుడు ఆ మందిరమునకు వచ్చుచుండెం గాంబోలు! ఆ కపటవతి యంతఃపురమున బంధింపం బడుట యెఱింగి వైద్యవేషధారులయి వారు వచ్చి యుందురు.

శ్యాము: నాబుద్ధి సంశయాందోళితమైనది. ఎట్లు నిర్ణయించుటకును వీలు కాకున్నది.

మాధ: రాణిగారిట్టి నింద కతీతులు.

రాణా: [రేగుచున్న కోపము బిగబట్టుకొనుచు] ఏమీ? రాణిగారు ఆకసము బొంద చేసికొని క్రిందికినూడి పడిరా? ఏల మీకింకను సందేహము? అది యేమిబుద్ధి? మీ ముందు మట్టిబొమ్మనుచేసి పెట్టినంగాని యాథార్థము నూహింపలేరా?— ఆ దాసి యెక్కడ!

[భయముతో సుశీల ప్రవేశించును.]

రాణా: ఓసీ, ఆ వైద్యులు వచ్చినప్పుడు నీ వంతఃపురమున నుంటివా?

సుశీ: [గొణుగుచు] వుణ్ణానండి

రాణా: మీరా ఆ వైద్యులతో నేమైన మాటలాడినదా?

సుశీ: అమ్మగారు ముందటి మాదిరిగానే మాట్లాడుకుంటూ వుణ్ణారు. వైద్యుగులను చూచి అమ్మగారు "వచ్చితివా, నన్ను తీసుకొని పొమ్మ, ఎంతకాలము వేచివుందును" అని వేడుకొంటూ వుణ్ణింది.

రాణా: ఆఁ? [క్రోధమూర్తి యగును]

సుశీ: అమ్మగారితో కూడా రాత్రంతా మేల్కొనుండి అప్పుడే తెలియకుండా కన్నుమాల్చినాను.

రాణా: [కోపముతో] అమ్మగారు— అమ్మగారు— ఆ అమ్మగారిని నిన్ను ఒక్క త్రాటనే యురివేయించెదను. నీకంతలోనే నాడులు తెలియని నిద్రవచ్చెనా? దీని నిద్రమత్తు వదలునట్లు గుఱ్ఱపు కమిచీతో మేలుకొల్పుడు.

సుశీ: [దుఃఖముతో] ఈతప్పు మన్నించండి దొరగారు. బుద్ది గడ్డిదిని నిద్రబొయ్యాను.

[బంట్రోతు నెట్టుకొనిపోవును.]

శ్యామ: మహాప్రభూ, యిట్టి సందర్భముల తొందరపాటు తగదు. ఆ తెలివితక్కువదాసి చెప్పిన తబ్బిబ్బు మాటల నాధారము చేసికొని మీ సందేహమును బలపఱచుకొనఁ బోకుడు. అది నిద్రమత్తున నుండి పూర్వాపరముల నెఱుంగక అసంగతముగ కొన్నిమాటలు చెప్పెను.

రాణా: శ్యామలరావ్, మీ సదుద్దేశము ప్రశంసనీయము. కాని,

సదుద్దేశములు అపరాధ కళంకమును తుడిచి వేయఁజాలవు. ఇఁక నేను బూటకపు సమాధానముల నమ్మను. ఇదివఱకు నా యనుమానము నిర్హేతుకమని తలఁచి యుంటిని. సందేహ వశంవదుఁడనైన నా యభిప్రాయము సరిఁగ ద్రొక్కి నిష్పక్షపాత బుద్ధితో అన్యునివలె విషయ పరిశీలనము గావించితిని ఇప్పుడంతయు స్పష్టమైనది.

శ్యామ: ప్రథమ విచారణయందు దోషములని తేలినవి కొన్ని పునర్విచారణయందు నిర్దోషములని నిరూపింపఁ బడవచ్చును. మేఘాచ్ఛన్నమైన యాకాశము ఒక్కపెట్టున మేఘ నిర్ముక్త మగుటలేదా?

రాణా: మీ కవితా ప్రియత్వము మన్నింపఁ దగినది.

శ్యామ: దేవరవారు నామనవిని తుదివఱకు చిత్తగింపుఁడు:— అగ్బరు చక్రవర్తి మాఱు వేసమున మన యంతఃపురము జొచ్చినది నిశ్చయము. అది అంతఃపురధర్మమునకు కేవలము విరుద్ధము.

మాధ: నింద్యమును.

శ్యామ: నింద్యమె, కాని!—

రాణా: [విసుగుతో] కాని, యేమి?

శ్యామ: కొంచెము ఓర్పు వహింపుఁడు.

రాణా: నిరర్థక కాలయాపనము!

శ్యామ: అయినను ఇచ్చట కార్యోద్దేశము ముఖ్యముగ గమనింపఁ దగిన విషయము. రాణిగారు సర్వభోగములఁ బరిత్యజించి, వైరాగ్యమూని నిరంతరము శ్రీకృష్ణపద ధ్యాన పరాయణయై కాలము గడపుచున్నది. ఆమె భక్తురాలను కీర్తి దేశమంతట వ్యాపించియున్నది. ఆమెను దర్శించుటకు వేనవేలుగ భక్తులు వచ్చుచుందురు.

రాణా: ఇంతకు మీమాటలలో స్ఫురించున దేమనఁగా, మీ రాణియొక లోకాతీతయైన భక్తురాలు, అగ్బరు లోకాతీతుఁడైన పరమభాగవ

తోత్తముఁడు, మోక్షార్థియై భక్తిభావనతో అతఁడు మీరాను సేవింప వచ్చెను. ఇంతియేనా?

శ్యామ: చిత్తము.

రాణా: చక్కగానున్నది విషయకల్పనము! విపరీత వ్యాఖ్యానమునకు కూడ నొక హద్దుండవలయును. ఆత్మవంచనమునకు పరస్పర ప్రతారణమున కిచ్చట నవకాశములేదు. నా వివేకమును మీ రనుమానించు చున్నట్లున్నది. నేను పసిపాపనుగాను [ఉద్రేకముతో] నేను తిరస్కరింపఁబడితిని. వంచింపఁబడితిని. నాబలము, నాశౌర్యము, నాయభిమానము, నాగౌరవము-తుదకు నాస్థితియె ధిక్కరింపఁబడినది, తృణీకరింపఁబడినది. పట్టపగలే నాయంతఃపురము గణికా మందిరమైనది. ఇఁక నేమి కావలయును?

మంత్రులు: రామ! రామ! పాపము శాంతిల్లుఁగాక!

రాణా: [దుఃఖగద్గద స్వరముతో] నా యాశాలేశముకూడ భగ్నమై పోయినది. [మీరాబాయి నుద్దేశించి] మీరా, ఇఁక నీవు నాప్రేమకుఁ బాత్రమవు కావు. నా సంసార మసారమైనది. సుఖస్వప్నము అతర్కితముగ భిన్నమైనది. మీరా, నీవు చావ వలయును! చావ వలయును!

శ్యామ: [తత్తరముతో] మహాప్రభూ,— ఏమి నిర్ణయించితిరి. ఘోరము! ఘోరము! ఈ తొందర పాటునకుఁ బశ్చాత్తప్తులు కాఁగలరు. వెనుక చింతించుటకంటె ముందుజాగ్రత మేలు. కోపోద్రిక్త మానసులయి సత్యము నెఱుంగఁ జాలకున్నారు.

రాణా: దుర్బల హృదయులై మీరు సత్యము నెనుర్కొన భయపడుచున్నారు. మీరా భక్తురాలను మీ దురభిప్రాయము సత్య సందర్శనమున కడ్డువడుచున్నది.ఆమాయలాడి రక్తపాతమునఁగాక యీ యపయశో మాలిన్యము సమ్మార్జితముకాదు.

మాధ: హరి! హరి! కొంచెము తడవిండు. నిజము నిలుకడమీఁద తేలఁగలదు.

రాణా: కాలము జరుగుకొలఁది దాంపత్యప్రేమ విడఁబించి విధి నిర్వర్తనమునందు అసమర్థుఁడను గావచ్చును.

శ్యామ: నాచిన్న మనవి యాలకింపుఁడు. ఈ విషయమును గుఱించి రాణిగారేమి సమాధానము చెప్పికొందురో తెలిసికొనవలయును.

మాధ: అవును. అపరాధిని విచారింపక యెంత యల్పదండనము విధించినను అది న్యాయ్యము గాదు.

రాణా: నాకుఁ దెలిసి నేనెవ్వరికి నన్యాయమొనరింపను. ఇంతకుఁ దెగించిన సాహసవతి తనతిప్పల నొప్పుకొనక పోవునా? అయినను కనుగొందము. పిలిపింపుఁడు.

శ్యామ: రాణిగారు పట్టమహిషి!

రాణా: [కోపముతో] ఇంకను పట్ట మహిషియా?

శ్యామ: దేవరవారు పట్టభద్రులై యున్నంతవఱకును.

రాణా: [విసుగుతో] నా సంకల్పము నాటంక పెట్టుటకు మీరు పండితులు. నే నిప్పు డేమి చేయవలయు?

శ్యామ: అంతఃపురమునకుపోయి రాణిగారిని విచారింపవలయును.

రాణా: [లేచి కొంతదూరము పోయి, వెనుకకు మరలి కోపముతో] ఆపాపిష్టురాలి మొగము నే నింకఁ జూడనొల్లను. [కూర్చుండును]

శ్యామ: అట్లయిన నెవరినైన నియోగింపుఁడు.

రాణా: నే నెవ్వరిని విశ్వసింపఁ జాలను. నేనే పోయి విచారించెదను. ఇప్పుడు నేను భర్తను గాను. న్యాయాధిపతిని. [లేచును.]

శ్యామ: మాకు సెలవిండు. మరల మాపై మీకు నమ్మకము గలిగి నప్పుడు పిలిపింపుఁడు.

రాణా: [వినిపించుకొనక నిష్క్రమించును.]

మాధ: రాజు తననే తాను నమ్మలేఁడు. ఇఁక నితరులను నమ్ము టెట్లు?

శ్యామ: అయినను ఈ సమిష్టినింద యసహ్యము. మన జీవిత మంతయు ప్రభువు శ్రేయోభి వృద్ధులకు ధారవోసితిమి! అందుకు ప్రతిబహూమానమేమి?

మాధ: అవిశ్వసనీయుల మగుట!

శ్యామ: మరల రాజమందిరమునకు వచ్చుటకుఁ బూర్వము మన కర్తవ్యమును నిశ్చయించుకొనవలయును. మొదటినుండియు రాజు స్వభావము మన మెఱుంగుదుము. అనురాగముగాని విరాగముగాని అతిగాఢము; భావోద్రేకము కలవాఁడు. వదలక పట్టుపట్టి తన యభిమతము నెగ్గించుకొనును.

మాధ: చాలవఱకు న్యాయబుద్ధియుఁ గలదు.

శ్యామ: కలదు; కాని, న్యాయబుద్ధియె తప్పుదారిపట్టి అందుకు ధృఢ సంకల్పము తోడ్పడునెడల గుణము విషమించి యవగుణ మగును. ఒకవేళ ఆశ్రయనాశకమును గావచ్చును.

మాధ: మనచేత నైనంతవఱకు విప్పిచెప్పితిమి. మన విధి మనఃపూర్వకముగ నిర్వర్తించితిమి. రాజుగారి యకార్యమునందు మనము భాగస్వాములము కాము. ఇఁకమీఁది కర్తవ్యము మీరే నిశ్చయింపవలయును.

శ్యామ: భాగస్వాములము కాము గదాయని తృప్తిపడి యుండకూడదు. పవిత్రశీలయగు రాణిగారు రక్షింపఁ బడవలయును.

మాధ: అవును. మా మంత్ర ప్రయోగమునకు అవకాశ మేర్పడినది.

శ్యామ: సైన్యాధిపతి మన యభిప్రాయమునకు విరుద్ధుఁ డయ్యెనేని ఆతని నెట్లయిన మనప్రక్కకుఁ ద్రిప్పుకొనవలయును.

మాధ: అదిచాల ముఖ్యము.

శ్యామ: రాణిగారిని సంరక్షించుటకొఱకు రాజుగారిని తిరస్క-

రింపవలసి వచ్చినను అందుకు మనము సంసిద్ధులమై యుండవలయును.

మాధ: నేను మిమ్ము ననుసరించెదను.—కాని, కుమారసింహుఁడు?

శ్యామ: అతఁడు రాజభక్తి యంత్రము. ధర్మమైనను అధర్మమైనను రాజాజ్ఞ నెరవేర్చును. మన నిర్ణయ మతనికి తెలియకూడదు.

మాధ: అట్లే.

[ఇరువురు నిష్క్రమింతురు.]

స్థలము ౮ : రాజమందిరము.

[రాజు ఖిన్నమానసుఁడై, సోఫాపై కూర్చుండి యుండును]

రాణా: ఇంతవఱకె యీ యపవాదము నగర మెల్లెడల మాఱు మ్రోగుచుండును. పనిపాటులేని సోమరిపోతులు రచ్చకొట్టములలోఁ గూర్చుండి గోరంత కింవదంతిని కొండంత సత్యముగ నెంచి వితర్కించుచు ఆనందించుచు ప్రొద్దు పుచ్చుకొనుచుందురు కాఁబోలు! ఇంకను ఆ కళంకవతిని బ్రతుకనిచ్చి నందులకు రాజపుత్ర యువకులు నన్ను దూషించుచుందురు. నా బ్రతుకు నగుఁబాట్ల పాలైనది.— ఎంత సాహసవతి! తన దుష్కార్యమును గప్పిపుచ్చుటకు అసత్య మాడుచున్నది!

[మంత్రులు ప్రవేశింతురు]

రాణా: [చిత్తోద్వేగము నడచుకొని] అమాత్యులారా, మీరా ఒక దేవత యనియు, సత్యవ్రత యనియు, మీరు విశ్వసించి యుంటిరి. మీ విశ్వాసము మూఢభక్తియనియు అస్థానికమనియు ఆ దుశ్చరితయొక్క యసత్య వాదనమె నిరూపించుచున్నది— వేయినోళ్ళ ఘోషించుచున్నది.

శ్యామ: రాణిగా రేమిచెప్పిరి?

రాణా: పూజ్యురాలైన మీరాణిగారు అంతఃపురమునకు నిన్న వైద్యులెవ్వరును వచ్చియుండలేదని సెలవిచ్చిరి.

మాధ: అది యెట్లు?

రాణా: ఎట్లో బుద్ధిమంతులు మీరే యోచింపుఁడు.

మాధ: [సంశయముగ] రాణిగారేల యబద్ధ మాడవలయును?

రాణా: ఏలనో కనుగొందు. ఇప్పటికైనను దెలియవచ్చినదా మీ రాణిగారి పూజ్య ప్రవర్తనము?

శ్యామ: [ఆలోచించి] మహాప్రభూ, రాణిగా రేమియు నసత్య మాడలేదు. వైద్యులు వచ్చిన సంగతియే యామె యెఱిగియుండదు.

రాణా: శ్యామలరావ్, మంచి ఘాఁతమాటలు! మీరా ప్రాణ రక్షణోద్యమము ప్రశంసనీయ మైనను మాకుగల గౌరవమును బలి యీయ నెంచుట నింద్యము.

శ్యామ: పరాభిప్రాయమునించుక సహింపుఁడు. నిజము తేలఁగలదు. భక్తిపరవశురాలైన రాణిగారికి వైగ్యులు వచ్చునప్పటికి నిహాలోక జ్ఞాన మంతరించి యుండినది.

మాధ: ఉండవచ్చును.

రాణా: [గంభీరముగ] నా యధికారము నెల్లిదము సేయుటకు మీరు కృతనిశ్చయులైనట్లున్నది.— కానిండు.

శ్యామ: తప్పుదలఁచితిరి. మేము న్యాయైక పక్షపాతులము. నిరం తరమును దేవరవారి మేలుగోరు మంత్రులము. మా విధిని నిర్వర్తించు చున్నాము.

రాణా: ఏల యీ వ్యర్థప్రసంగము? నానమ్మకము అవిచార మూ లకముగాదు. సత్యము నూహించితిని. నిజ మెఱిఁగిన వెనుక నాకర్తవ్యమును అనుకూలముగ మఱచునంతటి భీరువునుగాను—స్వార్థపరుఁడనూ గాను. నా సంకల్పము న్యాయ్యము. నా న్యాయ్యసంకల్పము శాసనము. నా శాసనము పొల్లుపోవక కొనసాఁగి తీఱవలయును.

శ్యామ: మీ యాజ్ఞ కేవలము ధర్మబాహ్యము. మా యంతరాత్మకు విరుద్ధమైన కార్యము మేము చేయఁజాలము. మమ్ము నుద్యోగ విముక్తులను గావింపుఁడు.

రాణా: [ఆశ్చర్య కోపములతో స్తంభితుఁడై చూచి] ఏమీ?—

నాయాజ్ఞకు మాఱు పల్కుటయా?—మీకు మతిభ్రమణము కలిగినదా? లేక నేను కుంభరాణాయను సంగతి మఱచితిరా? మమ్ము పదభ్రష్టుల గావించు టయేగాదు వధ్యశిలయొద్దకు మరణదండనము మీవెనువెంట నంటివచ్చును పొందు. మీ సర్వస్వము మా సైన్యాధిపతి జప్తిచేసి కోశాగారమున కర్పించును.

శ్యామ: సత్యమేవ జయతి. [నిష్క్రమించును]

మాధ: [అనుసరించును]

రాణా: [క్రోధముతో] పాదాన్వితములైన రాజద్రోహపిండ ములు నడచిపోవుచున్నవి—ద్రోహులు—తేనెపూసిన కత్తులు—నట్టనడి యేట పుట్టిముంచు పాతకులు—వారికి చెడుకాలమునకు బుద్ధి పెడదారి పట్టి నది కాఁబోలు! ఏమివారి అపూర్వప్రవర్తనము!—ఓరీ.

భటు: స్వామి—

రాణా: పరుగెత్తుము. పొమ్ము. మాసేనాధిపతిని పిలుచుకొనిరమ్ము.

భటు: ఆజ్ఞ. [నిష్క్రమించును.]

రాణా: [ఉద్రిక్తచిత్తుఁడై అటునిటు తిరుగుచు] ఈ యమాత్యుల విపరీత ప్రవర్తనము నాకు బోధపడకున్నది. నన్ను ప్రతిఘటించుటకుఁ దగిన ధైర్యము వారి కెట్లువచ్చెను? ఆ! యీ ధిక్కారము నేను సహింపఁజాలను.

[సేనాధిపతి ప్రవేశించును.]

సేనాధిపతి: జయము, జయము!

రాణా: ధర్మసింహా, నీవు గుఱ్ఱపు రౌతుల వెంటఁబెట్టుకొనిపోయి అమాత్యుల భవనములను ముట్టడించి, వారి స్థిర చరాస్తులను జప్తిచేసి కోశాధిపతి యాధీనము చేయుము. వారిరువురకు మరణదండనము విధించితిని. ఆజ్ఞాపత్రముగొని దానిని నిర్వహింపుము.

సేనా: [ఆశ్చర్యముతో] మరణ దండనమా! ఎందులకు?

రాణా [కోపముతో] ఏమీ? యీ యాజ్ఞా విమర్శన మహామారి యందఱకు వ్యాపించి నట్లున్నది!— అది నా యుత్తరువు.

సేనా: అమాత్యు లంతటి యపరాధ మేమిచేసిరి?

రాణా: [కోపము నడచుకొనుచు] ఆ విచారము నీ కనవసరము. నా పనుపు సేయుము, పొమ్ము.

సేనా: నిరపరాధులను నేను హత్య చేయఁజాలను.

రాణా: ఇది హత్య కాదు. దండనము.

సేనా: నిర్హేతుకమైన దండనము బలాత్కార హత్య.

రాణా: [విసుగుతో] ఇంక వేఱేమి హేతువు కావలయును? సతీత్వమర్యాదను అతిక్రమించిన మీ రాకు మరణశిక్ష విధించితిని. అమాత్యులు నాయాజ్ఞను తిరస్కరించిరి.

సేనా: అపరాధ మొనరించినది అగ్బరు, అతఁడు దండ్యుఁడు.

రాణా: [కోపముతో] నీవు నాకు ధర్మోపదేశము చేయునంతటి పండితుఁడవైతివా? అమాత్యులయొద్ద శిక్షపొందితివా?

సేనా: అపరాధులే దండ్యులగుట న్యాయమని మనవి చేసితిని.

రాణా: ఇరువురును దండ్యులే. ఆ అగ్బరును మాత్రము వదలితి నను కొంటివా? ఆ దురాత్ముని రక్తపూరము మాయంతఃపురమునఁ జల్లించి అంటు వాపెదను. మీరాను శిక్షింపనిదే లోకము సంతృప్తిపడదు.— ఈ అనవసర కాలయాపన మెందుకు?— నాయాజ్ఞను నిర్వహించెదవా? లేదా?— ఒక్కమాట.

సేనా: సంగ్రామభూముల విరోధికంఠ నాళముల నిష్కారుణముగ చెండాడితిఁగాని, ఎన్నడును నిరపరాధులను హత్యగావించి యెఱుఁగను, మీరు నన్ను నిర్బంధింతురేని ఇదిగో! నాయధికార చిహ్నమును మీకు సమర్పించుచున్నాను [కత్తిని రాజుపాదములకడ వైచి నిష్క్రమించును]

రాణా: [కోపస్తంభితుఁడై అట్టె కొంతవఱకుచూచి] ఆ!—వీరందఱకు సంఘాతమరణము విధింపవలయును.—అందఱు స్వామిద్రోహులు—ఈవిప్లవకారులు నా నీడయందె పన్నాగించుచున్న యీకుట్రను నేనుశంకింపలేకపోయితిని. అౌదఱు లంచగొండెలు. అగ్బరుచే లంచములను దీసికొని నా యుప్పుపులుసునకు ద్రోహముచేసిరి!—వీరిని ముక్కలుముక్కలుగ తఱిగించి గ్రద్దలకు వెదచల్లించినను నాకసి దీఱదు.—ఎవఁడురా అక్కడ? [పలుకరు]

[అటునిటు నాలుగుతట్టుల తిరుగును] ఓరీ—[పలుకరు]—ఏమి? ద్వారపాలకుఁడును లేఁడా? నా జీవితమునం దెప్పుడును ఇటువంటి యాజ్ఞాతృణీకరణము ననుభవించి యుండలేదు.—నా కన్నులయెదుటనే నా పాలనాదండము భగ్నమై పోయినదా? ఈధిక్కార మసహ్యము! ఉదయపూర్ రాజ్యాధిపతి ఒక్కక్షణములో నిస్సహాయుఁడయ్యెనా?— ఇది స్వప్నము కాదుకదా! [కలయంజూచి] అహో! యిది నగ్నసత్యము!—కుమారసింహా, నీవును విశ్వాసఘాతుకుఁడవైతివా?

[కుమారసింహుఁడు ప్రవేశించును]

కుమారసింహుఁడు: మహాప్రభూ, నేను విశ్వాస ఘాతుకుఁడను గాను. స్వామి యాజ్ఞకై వేచియున్నాను.

రాణా: [ఆతురతతో కౌఁగిలించికొని] కుమారా, నీవొక్కఁడవే నాకు స్నేహాస్పదుఁడవు. తక్కినవార లందఱు విప్లవకారులు. స్వామిద్రోహులు. అమాత్యులతోడ నందఱును వెడలిపోయిరా? ఇది దీర్ఘాలోచితమైన కుట్రగానున్నది. వారి కింత పలుకుబడియుండుట యెప్పటికైన నపాయకరమె.

కుమా: రాణిగారిపై ఆబాలవృద్ధముగ నందఱికిని భక్తి విశ్వాసములు కలవు. ప్రజలును అట్టివారె. దివాణమున నుండిన ఎవ్వరైన మీ యాజ్ఞను నిర్వర్తింపవలసి వచ్చునేమో యని యందఱు వెడలిపోయిరి.

రాణా: నా ప్రజలు నన్ను త్యజించిరా?

కుమా: రాణిగారిని విశ్వసించుచున్నారు.

రాణా: నా సైన్యములు?

కుమా: రాణిగారి సతీత్వము ననుమానింపవు.

రాణా: [యోచనా మగ్నముగ] అమాత్యులు, ప్రజలు, సైన్యములు మీరా సతీత్వము సంశయింపరు!— నే నేమైన పొరపడితినా?

కుమా: ఎట్టి వివేకవంతులైనను పొరపడుట కలదు.

రాణా: [యోచించుచు హఠాత్తుగ తలయెత్తిచూచి] కుమారా, నేను పొరపడలేను. న్యాయమని నాకు తోచినయెడల ప్రపంచమునకు ప్రతిస్పర్ధిగ నైన నిలువఁగలను— లోకులు మూఢభక్తులు, గతాను గతికులు; అమాత్యులు దుర్బల హృదయులు, సైనికులు వివేక శూన్యులు. ప్రత్యక్ష సాక్ష్యము మీరా యపరాధమును నిరూపించుచున్నది.— ఇపుడేమి కర్తవ్యము?— ఎవ్వరును లేరా?

కుమా: రాజప్రాసాద మంతయు నంధకార కులాయముగా నున్నది.

రాణా: [కోపముతో] మీరా రక్తజ్వాలలతో మన ప్రాసాదము మరల నుద్దీప్తము కాఁగలదు. కుమారా, నీవు విశ్వాసపాత్రుఁడవని నే నెఱుంగుదును. నాయాజ్ఞను నిర్వహింపుము. నీవె నాకుఁ గడపటి పట్టుగొమ్మవు. మీరాకు మరణదండన పత్రమును వ్రాసితెమ్ము.

కుమా: రాణిగారిని శిరచ్ఛేదన మొనరించుట కొక్క కటికవాఁడైన నొప్పుకొనఁడు.

రాణా: నీవో—

కుమా: [వెఱగుపడి ఒకయడుగు వెనుకకు పెట్టుచు] నేనా?—

రాణా: అట్లయిన మీరాయె స్వప్రాణ హంతకి కావలయును. అటులనే వ్రాసితెమ్ము.

కుమా: [స్వగతము] రాజాజ్ఞ అనుల్లంఘనీయము.

[నిష్క్రమించును.]

రాజా: [సంతుష్ట చిత్తుండై గద్గదస్వరముతో] వీరా, నీవు చావవలయునా? నీకీ దుర్బుద్ధి పుట్టకయున్న నీ విట్టి చావు చావవుగదా! భర్తయే భార్యకు మరణదండనము విధించుట! హా! ప్రళయంకరోద్యోగము. అసహ్యమైన మానసిక సంఘర్షణము!— నేను రాక్షసుడను.—

[దుఃఖించును.]

[ఇంతలో కుమారసింహుఁడు ఆజ్ఞాపత్రము వ్రాసికొని తెచ్చి, నిలుచుండి వేచియుండును]

రాజా: [కొంతసేపటికి తలయెత్తి, స్వప్నములోవలె] తెచ్చితివా?

కుమా: [ఆజ్ఞాపత్రమును చేతికిచ్చును.]

రాజా: [చేవ్రాలు చేయఁబోవునప్పుడు, చేయి వడకును, కొన్ని యక్షరములు వ్రాసి నిలుపును. ఎట్లో చేవ్రాలు పూర్తిచేయును.] ఈ పత్రికను మీ తాహస్తమునఁ బెట్టుము. ఎంత వేడికొన్నను నాదర్శన మిప్పింపకుము. ఆ కాంత ప్రాణపరిత్యాగము గావించుకొనువఱకు నీ వంగరక్షకుఁడవుగ నుండుము. పొమ్ము.

కుమా: [స్వగతము] అకటా! నే నీ సతీతిలకముయొక్క యాత్మహత్యకు సాక్షిగ నుండవలయునా? ఘోరము! ఘోరము!

[నిష్క్రమింపఁబోవును]

రాజా: ఏదీ, పత్రిక నిటుదెమ్ము. చక్కగ చేవ్రాలు చేసితినో లేదో చూతము.

కుమా: [ఇచ్చును.]

రాణా: [పత్రికను చూచిచూచి యొక్క బాష్పకణము రాల్చి, కుమారసింహుని చేతికిచ్చును]

కుమా: [నిష్క్రమించును]

రాణా: [దుఃఖ · గద్గదస్వరముతో] వీరా. నీ యపరాధమునకు మరణమునకన్న నల్పదండనము వేఱొండులేదు. ఇంకొక్క నిమిషములో చిరపరిచితమైన నీ మోహనస్వరూపము, ఏడెనిమిది సంవత్సరములు నా జీవితమున కమృతంపువర్తియైన నీ ముఖేందుబింబము, మర్త్యలోకమునుండి సమాచ్ఛాదితము కాఁగలదు. నా యాశలు నిరాశలైనవి. నా సంసారము నిస్సారమయి ప్రదేశమైనది.—వీరా,... వచ్చితివి... చచ్చితివి...

[సోఫాలో నొరగఁబడును]

[తెరజాఱును]

స్థలము ౯ : యమునానదికిఁ బోవుమార్గము.

[చీఁకటి. అప్పుడప్పుడు మెఱయుచుండును. అగ్బరు తాన్‌సేనులు యాత్రికుల వేషములతో ప్రవేశింతురు.]

తాన్‌సేను: నేనెంత బ్రతిమాలుకొన్నను వినకున్నారు. మూడు దినములనుండియు మనము మాఱువేసములతో ఉదయపురమున నున్నాము. ఇచ్చట మనము నిస్సహాయులము. మన యునికి రాణా యెఱింగిన ప్రాణములతో మన శరీరములు ఢిల్లీకి పోవు. భారతసామ్రాజ్యము మీ పరిపాలనమున సుఖించుచున్నది. అట్టి మీ యమూల్య జీవితమును బ్రతి నిమిషమునందును అపాయమున కగ్గముసేయుట భావ్యముకాదు. ఇప్పుడే కదలుదము రండు.

అగ్బరు: తాన్‌సేన్, నే నధమపతితుఁడను. ఉత్సాహముచే దీర్ఘాలోచనము సేయనేరక మీరాబాయిని అంతఃపురమున దర్శించితిమి. అంతఁ బోక యానంద జడచిత్తుఁడనై వివేక శూన్యుఁడనై, ఆమెకు వజ్రహారమును సమర్పించితిని. అదియె యా పరమ పావన చరిత్ర మరణదండనమునకు హేతువయ్యెను. ఈ ఘోరపాతకమునుండి నే నెట్లు విముక్తుఁడను కాఁగలను. ఇందుకేమైన ప్రాయశ్చిత్తము కలదా? నా సింహాసనమైనను లేక నా ప్రాణమైనను సమర్పించి యీ పాపమును బాపుకొనఁ గలిగినయెడల నే నందుకు సంసిద్ధుఁడను.

తాన్: అంతయు దైవికముగ జరిగినది. దైవేచ్ఛకు మానవుఁడు ప్రతికూల కల్పనము చేయఁజాలఁడు.

అగ్బ: అది దైవేచ్ఛయే యగును గాక! ఆదైవము మనయెడలఁ బ్రతికూలము. మాఱువేసములతోఁ బరుల యంతఃపురముఁ జొచ్చితినన్న

యపవాదము నా జీవితమునకు కళంక మాపాదించుచున్నది.

తాన్: మీరాబాయి పావన చరిత్రము లోకు లెల్లఱకు విదితము. సామాన్యములైన యంతఃపుర ధర్మములు మానావమానముల కతీతమైన యీ పరమ భక్తురాలియెడఁ జెల్లవు, మీ సదుద్దేశమును బ్రజలు శంకింపరు.

అగ్బ: ఎట్టులో సమాధానపఱచుకొనుటకు మార్గములు కలవు—కాని, మన తొందరపాటునకుఁ బర్యవసాన మేమి? మీరాబాయి హత్య!—ఇది మరణాంతమువఱకు పీడించు హృదయ శల్యము. ఈ రాత్రియె యామె మరణింపవలయునని వింటిమిగదా!

తాన్: [ఆలకించి] దారిలో పదశబ్దములు వినవచ్చుచున్నవి.

అగ్బ: [ఆలకించును]

[మీరాబాయియు కొంతదూరమున కుమారసింహుఁ
డును బ్రవేశింతురు.]

తాన్: ఏదోయొక స్త్రీవ్యక్తి.

అగ్బ: అమ్మా, మీ రెవ్వరు?

మీ రా: పథికురాలను.

అగ్బ: ఎచ్చటి కేఁగుచున్నారు?

మీ రా: బృందావనమునకు.

అగ్బ: ఆదారి తప్పివచ్చితిరి. ఈ త్రోవ యమునానది యొద్దకు పోవును.

మీ రా: ఇదియే దగ్గరి మార్గము.

అగ్బ: అడవిదారి ఒంటరిగా పోవుచున్నారు.

మీ రా: తోడు లేనివారికి దోడ్పడు బఁటు ముందు నడచుచున్నాఁడు.

అగ్ర: చిమ్మచీఁకటి.

మీ రా: ఇదియె యభిసరించుటకుఁ దగిన సమయము.

అగ్ర: నిన్నంత శ్రమ పాలుచేసిన యాకఠిన హృదయుఁ డెవఁడు?

మీ రా: నా ప్రాణేశ్వరుఁడు.

అఖిల భూభువన పట్టాభిషిక్తుండయ్యుఁ
బసుల మేపుట కిష్టపడియె నెవఁడు?
బ్రహ్మాండ సంసార బంధముక్తుండయ్యుఁ
దల్లి బంధములలోఁ దవిలె నెవఁడు?
గోపాంగనా ప్రేమ గోష్ఠి రతుండయ్యు
నిర్మల జ్యోతియై నెగడె నెవఁడు?
నిర్జీవ వేణు ప్రణీత గీతుండయ్యు
ఆల నాత్మల రేపఁజాలె నెవఁడు?

బర్హి పింఛంబు హారంబ్బు చలువతోడ
విశ్వమోహన మూర్తియై వెలిఁగె నెవఁడు?
అట్టి శ్రీకృష్ణుఁడే నాకు నాత్మవిభుఁడు;
అతని యన్వేషణమె జీవితాంత్య ఫలము!

అగ్ర: ఆ! తల్లీ, ఈపాతకులను మన్నింపుము.

[ఇరువురు పాదముపై వ్రాలుదురు]

మీ రా: అయ్యలారా, లెండు! మీరెవ్వరు?

అగ్ర: మీ నిర్హేతుక మరణదండనమునకుఁ గారకులమైన రాక్షసులము.

కుమారసింహుఁడు: [స్వగతము] హా! అగ్బరు పాదుషా! రాణా కటింగించెను. [పోఁబోయి] అయ్యో! ఆజ్ఞ లేదే! అయినను ఈ వార్త రాణాకు ప్రియముగ నుండవచ్చును. తడయుజనదు.

[నిష్క్రమించును]

తానె: ఎవరో పరుగెత్తుచున్నటుల కాలిచప్పు డగుచున్నది!

మీరా: పాదుషా, నీవు నాకుఁ బరమ బంధుఁడవు. నీమూలమున నాకు బంధవిముక్తి కలిగినది. నీవు నిమిత్త మాత్రమైన కీలుబొమ్మవు, సూత్రధారుఁడు సర్వేశ్వరుఁడు.

అగ్బ: తల్లీ, యీ మరణోద్యోగము నుండి విరమింపుము. నా వలన నీవు మరణింప వలసివచ్చె నన్న దుఃఖము సహింపఁజాలను.

మీరా: పాదుషా, అజ్ఞానలేశము నిన్నింకను ఆవరించియున్నది. పరలోకము భయంకరమను అపోహాయు, ఇహలోకముపైఁ గల అత్యంత మమతయు మరణమాధుర్యమును విషవంతము చేయుచున్నది. జీవితము నిరంతర ప్రవాహము—ఆద్యంతములు లేనిది. ఒకచోటి చావు మఱియొక చోటి పుట్టుక. మరణము భౌతిక పరిణామము. అనివార్యము. అందుకు చింతయేల?

అగ్బ: అమ్మా, మరణ మనివార్యమైన యెడల దానిని జయించుటకు మార్గము లేదా?

మీరా: కలదు. మరణమును చిఱునవ్వుతో నెదుర్కొనుటయె విజయోపాయము....హృదయేశ్వరా,...యిదిగో! వచ్చుచున్నాను. వాఁడుగో! నా మనోవల్లభుఁడు, నన్ను పిలుచుచున్నాఁడు. [కదలును]

అగ్బ: [పాదములపైఁ బడి] తల్లీ, మన్నింపుము. నిలువుము. నిలువుము!

మీరా: [తొలఁగి] పాదుషా, నన్నంటకుము.

[నిష్క్రమించును]

[నేపథ్యమున మీరాబాయి గీతము పాడుచు పోవుచుండును. ఆగీతము క్రమక్రమముగ సన్నగిల్లును.]

తాన్: మనహృదయము లింకను పరిశుద్ధము కావలయును?

అగ్బ: ఇదియె కడసారి పాట!

తాన్: అశరీర గానము ఆకసమునఁ దేలిపోవు చున్నట్లున్నది.

అగ్బ: ఆగాన మస్ఫుటమై లయించినది. అకటా! మీరాబాయి నిఁక మర్త్యలోకమునఁ జూడలేము.

చిర విరహాతాప సంశీర్ణచిత్త, మీర
యభిసరించుచు నున్నది యాత్మనాథు—

తాన్: నెన్నడో దివ్యపాదోధి నెడసినట్టు
జలకణంబు సంగమ తృష్ణఁ జనెడురీతి.

[తెరజాఱును.]

స్థలము ౧౦ : రాజమందిరము.

[రాణా చెదరినపెంట్రుకలతో ఉద్రిక్తచిత్తుఁడై అటునిటు తిరుగుచుండును]

రాణా: మీరా యింతలోన విషముత్రావి నైనను ఉరివేసికొని నైనను లేక యమునలో దూకి నైనను ప్రాణపరిత్యాగము గావించుకొని యుండును. ఓసీ, కాంతాపాత్రనిర్వహణముతో నన్ను మోసగించిన పిశాచీ! నీవు యమునలోనే దూకి చావుము. నీ యపయశో మాలిన్యము గుర్తింపరాక ఆ యమునా జల నీలిమములో మిళితమై పోఁగలదు. నీ చిఱునవ్వు మఱుగున

విషదిగ్ధమగు కోఱల నెట్లు దాఁచుకొని యుంటివి?—నే నెంతబుద్ధిహీనుఁడను! ఇంకను ఆ కులభ్రష్టవిషయమై చింతించు చున్నాను; దాని మనోహర ప్రతిమను నాహృదయమునుండి బలాత్కారముగఁ బెఱికివైచితిని. కాని, మచ్చ మాత్రము మాసిపోదు.

ఒక్క దినములో వార్ధక్యము వచ్చినట్లు తోఁచుచున్నది! నా జీవితపు పునాదియే సడలినట్లు కదలుచున్నది. నేను కుంభరాణాకన్న నన్యుఁడనను భ్రమపుట్టుచున్నది—నాస్మృతి పథమున జీవించియున్న కుంభరాణా, ఇప్పటి నన్ను నీ వెక్కిరింపకుము!—ఆ! గతస్మృతి! ఇది మరణదండనమున కన్న హింసాకరము! ఘోరము!

[కుమారసింహుఁడు ఎగుఊపిరితో పరుగెత్తుకొనివచ్చును]

కుమారసింహుఁడు: అక్బరిచ్చటనే యున్నాడు.

రాణా: ఎక్కడ? అంతఃపురములోనా?

కుమా: కాదు. యమునామార్గమున రాణిగారిని నే ననుసరించుచుంటిని.

రాణా: కానిమ్ము, ఒక్కమాటలో చెప్పుము! ఎక్కడ?

కుమా: అచ్చట నొకచోట నిద్దఱు మనుష్యులు ఆమెతో మాటలాడుచుండిరి. వారిలో నొకడు "మీమరణ దండనమునకు కారణమైన రాక్షసులమని చెప్పుచుండెను. నేను పరుగెత్తుకొని వచ్చితిని. అతడే అక్బరు కావలయును.

రాణా: [కోపముతో] ఆ దుశ్చరితుఁడే అక్బరు కుమారసింహా, నీ వేల యింత మందబుద్ధివైతివి? ఆ యంతఃపుర ద్రోహి ప్రక్కలో నొక్క కత్తిపోటు పొడిచి యా సంతోషవార్తను దెచ్చుటకుమాఱు ఊరకయేల బేలవై పరుగెత్తుకొని వచ్చితివి?

కుమా: [చేతులు పిసుగుకొనుచు] ఆజ్ఞకొఱకు.

రాణా: ఓరి, దుర్బలహృదయుఁడా, కాలు దవిలిన విషసర్పమును చావమొత్తుట కెవరియాజ్ఞ కావలయును? పొమ్ము! ఱెప్పపాటుతో ఆస్థలము చేరుము. నీ పిడిబాకుతో వాని హృదయమును జీలిచి ఆరక్తపూరములో నీ రుమాలు గుడ్డను తడిపి కొనిరమ్ము. [చేతిగుడ్డను విసరి కుమారసింహునితట్టు పాఱవేయును; కుమారసింహుఁడు వంగి అందుకొనును]

ఆ దురాత్ముఁడు మీ రాను ఢిల్లీకిఁ దీసికొనిపోవుటకు వేచియున్నాఁడు. అదియె వారు నిర్ణయించుకొన్న సంకేతస్థలము.—ఇంకను నీ విచ్చటనే యున్నావా? పరుగెత్తుము. ఎగిరిపొమ్ము. [కుమారసింహుఁడు నిష్క్రమించును] వంటయిలుసొచ్చిన కుందేటిని వదలివచ్చితివి.

ఓరీ! పాముషా, నీకు దగిన శిక్షను నీవు పొందనున్నావు. ప్రాణములతోడ నీవు మరల ఢిల్లీకిఁబోవు. ఓ మృత్యుదేవతా, ఈనాఁటిరాత్రి నీకుఁ జేతినిండ పనిదొరకినది. ప్రళయంకరోన్మత్త నృత్యము గావింపుము.

ఆఁ! యిసీ! నేనెంత మందమతిని? ఎంతపొరపడితిని? నాయంతిపురము వాఱడి వుచ్చి, నా యానంద భాండమును బగులఁ దన్ని, మా పవిత్ర వంశ యశమును అపవాద దూషితము గావించి, నన్నిట్లు పిచ్చిబికారిని జేసిన యా నరాధముని ఈ కరవాలమునఁ గ్రుమ్మి యాతని మరణవేదన నా కనులారఁ జూడకున్న నా హృదయ సంతాప మెట్లు తీఱును? అక్బర్, నీకు మృత్యు వాసన్నము. [ఖడ్గహస్తుఁడై వేగముగ నిష్క్రమించును.]

[యవనిక జాఱును.]

స్థలము ౧౧ : యమునానదీ మార్గము.

[గాఢాంధకారము. రాణా ఖడ్గ హస్తుఁడై ప్రవేశించును.]

రాణా: ఇదియేనా యమునకుఁ బోవుమార్గము? [నలుప్రక్కలఁ

గలయుంజూచి] అమావాస్యరాత్రి, కాఱుమబ్బులు నలుదెసలు నావరించి యున్నవి. ఈ వృక్షశ్రేణులక్రింద నాకు నేనే యగపడుటలేదు! చినుకులు గూడ పుటపుట రాలుచున్నవి. అంతయు నాహృదయమువలె గాఢాంధకార మలీమసమై నిశ్శబ్ద సమాధిగ నగపడుచున్నది. [ఆలకించి] ఎవరిదా కాలిచప్పుడు? [మరల నాలకించి] కాదు, కాదు. చెట్లయాకులు కదలుచున్నవి. [పరికించి] ఇచ్చట ఎవ్వరును లేరు. వా రింతవఱకే వెడలిపోయి యుందురా? [కొంత పరిక్రమించి] అచ్చట నేదియో యొక యాకృతి కనఁబడుచున్నది. [కాలిచప్పుడు కాకుండ దగ్గఱకుపోయి కత్తితో పొడుచుట నభినయించి] ఓ! తిరుకాండము! అగ్బ రని భ్రమించితిని!

[వెదకుచుండును.]

[కుమారసింహుఁడు ఖడ్గహస్తుఁడై ప్రవేశించును.]

కుమారసింహుఁడు: [స్వగతము] నే నెచ్చట వెదకినను వారిరువురు నగపడలేదు. ఈ చెట్ల నీడలో దాగుకొని యుందురు. [అటునిటు పరికించి] అదిగో! చీకటిలో నస్పష్టముగ నటునిటు తిరుగుచున్న వ్యక్తియె అగ్బరు పాదుషా. అతని యీకత్తిచే నొక్కపోటు పొడిచి నా స్వామి ఋణమును దీర్చుకొందును. [మెల్లగాపోయి పొడిచి] అగ్బర్ పాదుషా, యిది యుదయపూర్ రాజ్యాధిపతి యాజ్ఞ. నీ దుండగమునకు దగిన మరణదండనము— నా స్వామి ఋణము దీర్చుకొంటిని.

రాణా: [తిరుకాండమున గానుకొని బాధ నభినయించుచు] అయ్యో! ప్రమాదము! కుమారా, చచ్చితిని, చచ్చితిని.

కుమా: [దుఃఖోద్వేగముతో] హా! స్వామి ఘాతుకుడను. అయ్యో, తండ్రీ, నీవేల యింతలో నిచ్చటకు వచ్చితివి? హాతవిధీ, తలపట్టి యీడ్చుకొని వచ్చితివా? ఈదుఃఖము దుర్భరము. మీ సేవకుడు మిమ్ము ననుసరించుచున్నాడు. [నడుము కట్టులోనున్న ఖడ్గముదూసి పొడుచుకొని]

తండ్రీ, మన్నింపుము. మన్నింపుము.— విధి— చేష్ట— వి— ధి— చే— ష్ట— [మరణించును.]

రాణా: [తరుకాండము క్రిందికిజాఱి] కుమారా, స్వామిభక్తున కను రూపమె నీ ప్రాణ పరిత్యాగము. ప్రయోజనమేమి? నీవైన ఏల బ్రతుకవు? తలంపని చోటనుండి కులిశాఘాతము! ఎంత ఘటనా వైపరీత్యము.

ఓరీ, అక్బర్, నీ కింకను మంచి దినములుఁగలవు; నీవు బ్రతికితివి. నే నిప్పు డశక్తిమంతుఁడను. ఒక్క నిమిషములో మరణింపనున్నాను. కాని, నీకు మాత్రము దండనము తప్పదు. నా యవమానమును కులావమానముగఁ దలంచిన యే రసపుత్ర వీరుఁడైనను నా మనో నిశ్చయమును నెరవేర్పఁగలఁడు. రక్తజ్వాలా భయంకరమైన నా యభిశాపము పిడుగువలె నీ తలపై వ్రేలఁగలదు.

[అక్బరు తారాసేనులు ప్రవేశింతురు.]

అక్బరు: ఎవఁడో వేదనా భరితుఁడు నన్ను నిందించుచున్నాఁడు. [దగ్గఱి] అయ్యా. మీరెవ్వరు? అక్బరు నేల శపించుచున్నారు?

రాణా: [వేదనా గద్గదస్వరముతో] ఆ పరమపాతకుని నామమును మీరేల యుచ్చరించెదరు? ఆ మొగలాయి కులకలంకుఁడు నన్నాఱడిపుచ్చి నా యిల్లాలిని దొంగిలించుకొని ఢిల్లీకి పాఱిపోవుచున్నాఁడు.

తా॥ సే॥: ఇదియేమి భ్రాంతి?

అక్బ: మీకేల యింత దురవస్థ కలిగినది?

రాణా: విపరీత సంఘటనము.

అక్బ: అక్బరును చంపింప నెంచి మీరే చంపఁబడితిరా?

తా॥: పాదుషాకు ప్రాణాంతకమైన గండము తప్పినది.

అక్బ: కుంభరాణా.

రాణా: నా రాజ్యమున నన్ను పేరుపెట్టి పిలచు మానవుఁ డెవ్వఁడు?

అక్బ: అక్బరు మీ యంతఃపురముం జొచ్చినది నిజము. తన జీవితమును పునీతముచేసి కొనుటకై పరమ భక్తురాలైన మీరాబాయిని సందర్శించెను. ఆమె పాదరజః ప్రసాదము యాచించుట కొఱకు సాధారణ ధర్మములు లెక్కసేయక పాదుషా సాహసించెను.

రాణా: [భూమిపైనుండి సగము నిక్కి] ఏమీ? అక్బరు మీరాను మోహింపలేదా?

అక్బ: తల్లి స్తన్యపానము చేయుచున్న పసిబిడ్డకు మోహా మంటగట్టు నీచు డెవ్వఁడుండును?

రాణా: నీవెవ్వఁడవు? అక్బరు సహాయులలో నొక్కఁడవా?

అక్బ: నేనే అక్బరును.

రాణా: [క్రోధముతో] అక్బర్! [దూరముగ పడియుండిన కత్తికయి చేయి తడవును].

అక్బ: [కత్తితీసికొనివచ్చి కుంభరాణా కందించుచు] నా మరణమువలన నీ హృదయము నీ మరణకాలమున క్రోధరహితమయి, సుఖవంతమగు నేని నన్ను వధింపుము. ఇదిగో! అనాచ్ఛాదితమైన నా వక్షస్థలము [మోకాలూనిన వంగును]

తాన్: ఏమి యీ సాహసము? [చేయిపట్టుకొని పైకి లాగును.]

రాణా: [ఇతి కర్తవ్యతా మూఢుఁడయి, ఆశ్చర్య స్తంభితుఁడయి] పాదుషా, నీవు సత్యము పలుకుచున్నావా? ఇంతదనుక నన్ను బాధించుచున్న సంశయము కేవలము స్వప్నమా? మీ రిరువురును నిరపరాధులా?

అక్బ: రాణా, నీ యెడల నాకు జాలి కలుచున్నది. మీరాబాయి మాతల్లి. నే నామె పుత్రుఁడను. ఇంతకన్న నెక్కుడుగ నేనేమి చెప్పఁగలను? నీకేల యింత భ్రాంతి కల్గెను?

రాణా. పాదుషా, నా హృదయమున నెరముచుండిన శల్యమును పెరికి వైచితివి. నాకు నీవు ప్రబలద్వేషి వయ్యును ఇప్పుడు పరమాప్తుఁడ

వైతివి. సంశయ గ్రస్త చిత్తుఁడనై బ్రతికియుండుటకన్న సత్యమెఱుంగుట కాస్పదమైన యీ మరణమె సుఖవంతము. అక్బర్, నా మీరా యేమైనది?

అక్బ: ఆ పతివ్రతా శిరోమణి యమునాగర్భము నాశ్రయించినది.

రాణా: [గద్గదస్వరముతో] హా! పరమ పాతకుఁడను. ఆ అమాయికను నిష్కారణముగ హింసించినందులకు దుఃఖించెదను. మందమతినై తప్పుజాడపట్టితిని. స్వయంకృతాపరాధమునకు తగిన చరమశిక్ష ననుభవించుచున్నాను.— అబ్బా, భ్రమ కప్పుచున్నది.—మీరా— మీరా—క్షమాపణము వేడికొనుటకై నీయొద్దకే వచ్చుచున్నాను.— పాపాత్ముఁడనని వెడమోము పెట్టకుము. నీ యెదుట నంజలి బద్ధుఁడనై నా యపరాధము నొప్పుకొందును. మీరా— మీరా — మన్నింపుము— కనికరింపుము— మీ— రా— మీ— రా— రా— రా— [మరణించును.]

అక్బ: రాణా మరణమునకన్న నా బ్రతుకే శోచనీయము. అతఁడొక్కసారియే మరణించెను. నేను ప్రతిక్షణము మరణవేదన ననుభవించుచున్నాను.

తాన: మృత్యువు దైవముయొక్క అమోఘాస్త్రము.

అక్బ: అజ్ఞాతముగ మన మీ ఘటనావర్తములోని కీడ్వఁబడితిమి.

పరమభక్తురాలి పదములు సేవింప
భక్తితోడ నిటకు వచ్చినాఁడ,
దైవఘటన మెట్లు తలపోతు? మరలెద
రక్తసిక్తమౌ కరంబుతోడ.

[తెరజాఱును.]

సంపూర్ణము.

29-10-1924.

—:(o):—

మాధవ విజయము.

20—2—1925



నాటకపాత్రలు

—పురుషులు—

శాంతవర్మ	...	వసంతపురాధిపతి.
మాధవవర్మ	...	శాంతవర్మగారి సాకుడుబిడ్డ.
రాజశేఖవర్మ	...	,, ,, కుమారుఁడు.
విజయవర్మ	...	హేమనగరాధిపతి.
సమరసేనుఁడు	...	సేనాధిపతి.
అచ్యుతవర్మ	...	సుబేదారు.
లతీఫ్‌సాహెబు	...	పాతాళగృహద్వారపాలకుఁడు.

పరిచారకులు, భటులు, ద్వారపాలకులు.

—స్త్రీలు.—

యశోధర	...	శాంతవర్మగారి భార్య
మనోరమ	...	,, కుమారిక.
మాలతి	...	విజయవర్మగారిఅన్నకూఁతురు.

మాధవ విజయము.

స్థలము ౧: హేమనగరము.

[విజయవర్మ విశ్రాంతిమందిరమున అటు నిటు తిరుగుచుండఁగా తెర యెత్తఁబడును]

విజయవర్మ: మధ్యాహ్నము కావచ్చినను వీరేల యింకను ప్రయాణసన్నాహము కావింపకున్నారు? సేవకుఁడు మొదలు సైన్యాధిపతివఱకు అందఱును సోమరిపోతులు! ఎంతటి నేరమునైన మన్నింతునుగాని, సోమరితనమును మాత్రము మన్నింపఁజాలను.

[సమరసేనుఁడు ప్రవేశించును]

విజ: సమరసేనా, యేల యీ యాలస్యము?

సమరసేనుఁడు: గంతగుఱ్ఱములకు సామాను లెక్కించుచున్నారు. నెలదినముల ప్రయాణమునకు వలయు పదార్థములు సిద్ధము చేయించితిని. ఇంకనొక యరగడియలో మనము బయలుదేరుదము.

విజ: తమయింట రెండుదినములు బసచేయవలయునని శాంత్రవర్మగారు మన కాహ్వానము పంపిరి.

సమ: మన ప్రయాణమున కభ్యంతరమగునుగదా!

విజ: [చిఱునవ్వుతో] ఆ యాహ్వానము తెప్పించుటకే యీ ప్రయాణము.

సమ: [ఆశ్చర్యముతో] ఏమీ!— ఉత్కళదేశ ప్రయాణము నెపము మాత్రమేనా? [కొంచెము తలయూఁపుచు] పూర్వమువలె మీ

రహస్యము తెలుపఁదగునంతటి విశ్వాసపాత్రుఁడను కాకపోయితిని. పనిదీరిన వెనుక పనిముట్టు త్రిప్పఁబట్టుటలో నాశ్చర్యమేమి గలదు?

విజ: సమరసేనా, కొలఁది దినములనుండియు నిగ్రహముగ మాటలాడుట నీ కలవాటుపడిన ట్లున్నది. నాలోపము నాధారము చేసికొని నాస్నేహితమును నీచముగ దుర్వినియోగపఱచుచున్నావు. నీసాహాయ్యమునకు తగిన యుపకారము నొనర్చితిని. మాయన్నగారి పరిపాలనా సమయమున తక్కువ యుద్యోగమునందున్న నీకు క్రమక్రమముగ సైన్యాధిపత్యము నొసంగితిని. నీకింకను తృప్తికలుగదు. వివేచనా రహితమైన నాయంగీకారమె నీయత్యాశకు సోపానమైనట్లున్నది.

సమ: ప్రభువు లేమి మాటాడినను న్యాయముగనే యుండును. ప్రయోగదక్షులు ఫలసిద్ధికొఱకు ఎంతటికార్యములనైన నొనరింతురు. ఉదారహృదయులైన మీరు కనికరించి నాకు మహాదానమొనరించితిరని యనుకొందు.

విజ: నీ యుద్యోగము నీయోగ్యతకు తగిన బహుమతియనుకొంటివా?

సమ: నా సాహాయ్యమునకు మించని పదవియనుకొంటిని.

విజ: [స్వగతము] నాగుట్టంతయు వీనిచేతిలోనున్నది. విరోధమపాయకరము. [ప్రకాశముగ] సమరసేనా, నీవు చెప్పినది యథార్థమె. నీఋణము పూర్ణముగ నేను తీర్చుకొనఁజాలను. మనయిరువురిలో నొకరి కొకరికి తెలియరాని రహస్యములులేవు.

సమ: [స్వగతము] విజయవర్మ నా ప్రాముఖ్యము నిప్పుడు గుర్తెఱుఁగుచున్నాఁడు. [ప్రకాశముగ] కాంతవర్మగారింట మీ రేల బసచేయవలయును?

విజ: కాంతవర్మకు రమణీయవతియైన యొక కుమారిక కలదు. నే నా కాంతను పెండ్లియాడఁ దలంచుకొంటిని.

సమ: ఎంతకాలమునకు సంతోషవార్త వింటిని! అట్లయిన వసంతపురమువఱకె మన ప్రయాణము?

విజ: అవును!

సమ: ఇంత సిబ్బందియు ఇన్ని పదార్థములు అనావశ్యకము కదా?

విజ: మనము దూరప్రయాణము చేయువారివలె నగపడవలయును. నీవు పోయి తొందరగ ప్రయాణ సన్నాహము కావింపుము. అచ్యుతవర్మ కూడ మనతోడ రావలయును.

సమ: అట్లె! [నిష్క్రమించును]

విజ: సమరసేనుఁడు తన ప్రయోజనమును తానెఱుంగును. అతఁడెన్నటికైన అపాయకరుఁడు. ఇప్పటికే నా యవివేకమునకు తగిన శిక్ష నొందితిని. నేను రాజ్యము నేలిన అతఁడు నన్నేలుచుండును. ఈకంటిలోని నలుసును తీసివేయునంతవఱకు నాకు సుఖ నిద్రయుండదు.

[సైనికుఁడు ప్రవేశించును.]

సైనికుఁడు: మహాప్రభూ, సిబ్బంది పయనమగుచుండఁగా ఏదో యొక దుశ్శకునము గలిగెను. తరువాత దేవరయాజ్ఞ.

విజ: ఓరీ, మూఢమతులకేది దుశ్శకునమో అదియే ధీమంతులకు శుభశకునము. నేను తలంచిన కార్యమునకు విఘ్నము వాటిల్లదు. ఇప్పుడే కదలవలయును. నాగుఱ్ఱము నాయత్తపఱపింపుము. పొమ్ము.

సైని: ఆజ్ఞ. [నిష్క్రమించును]

విజ: తమకార్యములెల్లను పూర్వనిర్ణీతములని భ్రమించు అవివేకులను జూచినప్పుడెల్ల నాకు జాలికలుగుచుండును. సంకల్పశూన్యుల కంతయు పూర్వనిర్ణీతమె. దౌర్బల్యమునకు మంచి యాశ్రయ మీమెట్టవేదాంతము!

ఏల యింకను ఆలస్యము? [నిష్క్రమించును.]

స్థలము ౨: వసంతపురము.

[రాజప్రాసాదమున నొక గది. శాంతవర్మ పట్టుమెత్తలు కుట్టిన సోఫాపై కూర్చుండియుండును. యశోధర దగ్గఱగా నొకపీఠముపై కూర్చుండియుండును. తెరయెత్తఁబడును]

శాంతవర్మ: మన చిన్ననాఁటి కాలము వలెకాదు. ఇప్పు డంతయు తలక్రిందుగ మాఱిపోవుచున్నది. మహాభారతమును వ్రాసిన వ్యాసమహర్షి ఏమంత తెలివి తక్కువవాఁడా? కలియుగ ధర్మమునంతయు ముందుగనె యోచించి వ్రాసి పెట్టెను. ఇప్పుడంతయును తూచా తప్పకుండ జరుగుచున్నది. ఈ కాలమున చిన్నయెవఁడు? పెద్దయెవఁడు? లేకున్న తల్లిదండ్రుల మాటలు బిడ్డలు వినకపోవుదురా?

యశోధర: ఈ కొద్దిపాటివిషయమును మీరింత గొప్పచేసి చింతించుట యెందుకు? మనోరమ లేక లేక కలిగిన చిన్నారి కూఁతురు. నిండు గారాబమున సాఁకి సంతరించితిమి. కావుననే కన్యాత్వసహజమైన చనవుతో అంతవిడువక పట్టు పట్టి యున్నది. ఆబిడ్డ కింకను పెండ్లియాడు మించలేదు.

శాంత: పదునేడేండ్లు నెత్తికివచ్చిన కన్యక యింకను ఒడిలోని పసిపాప యనుకొంటివా?

యశో: మనోరమ వినయవివేకములులేని బాలిక కాదు.

శాంత: బాలిక!

యశో: నేను బ్రతిమాలినప్పుడెల్ల "అంత తొందరయేమి?" అని నన్ను వారించుచుండును.

శాంత: యుక్తవయస్కను అవివాహితనుగ నింట నుంచికొనుట యుచితముకాదు. ఆడువారి మర్మములు ఆడువారికే తెలియును. మనో రమ మనస్సు ఎవనియందైన లగ్నము కాలేదుగదా?

యశో: [చిఱునవ్వుతో] నేనుకూడ అట్లే సందేహించి యడిగితిని. సిగ్గుచేత తలవంచుకొని మాటాడదు.

శాంత: అట్లయిన ఏదోకొంత దాపటికమున్నది. ఎంతతెలివిగల వారైనను కన్యలు కన్యలే గదా! మనము బాల్యచాపల్యమును గౌరవింపరాదు- సాధ్యమయినంతవఱకు పూర్వాచార గౌరవమును నాచేతులార భగ్నము చేయను.

యశో: యోగ్యులయిన వరులు మీదృష్టిలో నెవరైన నున్నారా?

శాంత: నేను చాలకాలమునుండి యోచించుచున్నాను.

"శ్రీయును కులమును రూపును
వా)యుము శుభలక్షణంబు, బాంధవ విద్యా
శ్రే)యము గల వరునకు"

కన్య నియ్యవలయునని మహాభారతములో వ్యాసభగవానులు నొక్కి చెప్పియున్నారు. బిడ్డలయెడ తల్లి దండ్రుల బాధ్యత అంత తేలిక గాదు సుమా.

యశో: అయితే యింతవఱకు మీరు వరుని నిర్ణయింపలేదు?

శాంత: ముప్పాతిక పాలు నిర్ణయించినట్లే. మరల ఆలోచించి రేపు చెప్పెదను—నీ వెవరినైన నిశ్చయించితివా?

యశో: నానిశ్చయముతో ఏమిప్రయోజనము? మీయిష్టమేగదా నెరవేరవలయును. మనోరమ యిప్పటికిని పసిబిడ్డవలె పెరుగుచున్నది.

శాంత: ఆమాటనే నే ననవద్దని చెప్పినది.

యశో: నన్నుచూడనిదే యొక్కనిమిషమైన నుండలేదు. నాకును అట్టివయసులే యున్నది.

శాంత: అట్లయిన కూఁతురికి పెండ్లిచేయవా?

యశో: ఎవనినైన నొక జమీందారుకుమారుని ఇంట నుంచుకొని మనోరమ నియ్యవలయునని నాకోరిక. అందఱ మొక్కచోటనే యుందుము.

శాంత: [నవ్వుచు] ఔనౌను! స్త్రీజన సహజమయినదే యీ కోరిక! ఎవనినో యొక యనామకుని తెచ్చుకొని ఇంట నుంచుకొనవలయును, ఆతనికి కూఁతురి నియ్యవలయును! అదు గడుగునకును పారతంత్ర్యమను భవించుచు, అదవ తాగ్రుడు తాగ్రుచు, దెప్పినలను సహించుకొనుచు, లజ్జ లేని కీలుబొమ్మవలె ఆతఁడు అంతఃపురమున కొలువుదీరి యుండవలయును! మనకూఁతు రా దురదృష్టవంతునిపై అధికారము చేయుచుండుటచూచి మన మానందింపవలయును! చక్కని యూహ!

యశో: ఏల మీరిట్లు గేలిసేయుచున్నారు? ఆతఁడేల యనామకుండుగ నుండవలయును? ఏల యదవ తాగ్రుడు తాగ్రవలయును?

శాంత: ఇంకను వివరింపుమందువా? మనకొక కుమారుఁడు కలఁడు. మనకన్న తక్కువ శ్రీమంతుఁడు కానిదె యేజమీందారుని కుమారుఁడైన మన యింట బ్రతుకుట కిష్టపడఁడు. ఆకు ముల్లుపైఁ బడినను ముల్లు ఆకుపైఁ బడినను ఆకే చినుఁగును. యశోధరా, ఇల్లఁటము నీచము. నీవొక్క కూఁతురి సంగతినే తలపోయుచున్నావు. నేను అల్లుని విషయముగూడ ఆలోచించు చున్నాను. ఆతఁడెంతటి స్వాతంత్ర్య ప్రియుఁడయ్యెను మనయిష్టానుసారమె ప్రవర్తింపవలయును.

[రాజశేఖరుఁడు ప్రవేశించును.]

శాంత: రాజశేఖరా, సమయమునకే వచ్చితివి. కూర్చుండుము!

రాజ: [తండ్రిప్రక్కనకూర్చుండి] అవును! సమయమునకే వచ్చితిని, నేఁడే సర్దారు పంజాబు గుఱ్ఱముల బిడారును వజ్రపురికి కదలించుచున్నాఁడు. ఈసమయము తప్పిన నొకకుంటి గుఱ్ఱము కూడ మనకు దొఱకదు.

శాంత: గుఱ్ఱపు బిడారేమిటి?

రాజ: పంజాబుసర్దారు కందుకకేళి యలవడిన బొమ్మలవంటి యవనాశ్వములను అమ్మకమునకై మన పట్టణమున నిల్పియున్నాఁడు.

శాంత: రాజశేఖరా, నీ కందుకకేళి పిచ్చి మితిమీరుచున్నది. నిరుడు కొన్నవి కాక ఈ యేడును గుఱ్ఱములు కొనవలయునా? ప్రతిసంవత్సరమును వానిపోషణమునకు తరిబీతునకు రెండులక్షల రూపాయలు ఖర్చు పెట్టుచున్నావు. ఒక్క పందెమైన గెలిచితివా? మహాభారతమున—

రాజ: [విసుగుతో] మీ మహాభారత పురాణ శ్రవణమునకు తీఱికలేదు. నేను పదిగుఱ్ఱములు కొనవలయును.

యశో: [కన్నురుముచు] ఆ! శేఖరా, నీవింకను మట్టు మర్యాదలు నేర్చుకొనవు.

శాంత: [కోపముతో] ఈ యవిధేయత నేనొక్కక్షణమైన నోర్చుకొనను. [భార్యతట్టుతిరిగి] ఇది యంతయు నీగారాబము—నీ చనవు-వీనికి తృణీకరభావము తుంటరతనము హెచ్చి పోవుచున్నది. మాధవునికిని వీనికిని ఎంతయో తారతమ్యము గలదు.

రాజ: అవునవును. మాధవుఁడు మీకడుపునఁబుట్టిన బిడ్డకదా!

శాంత: కాకపోయిన నేమి? పరాయిబిడ్డయే యోగ్యుఁడుగ నగపడుచున్నాఁడు.

యశో: కుమారునిబాల్య చాపల్యమును మన్నింపుఁడు. ఇంకను ఆటప్రాయమేగదా. [రాజశేఖరునికి కనుసైఁగ చేయుచు]

రాజ: నాతొందరపాటు మన్నింపుఁడు.

శాంత: నీవు మహాభారతమును చదివి మట్టు మర్యాదలు నేర్చుకొనవలయును

రాజ: [మంచిబిడ్డవలె] అటులనే చదివెదను.

శాంత: శేఖరా, మే మిరువురము మనోరమ వివాహ విషయము మాటాడుచుంటిమి. ఎవనినైన నొకని యిల్లఁటముతెచ్చి పెట్టవలయునని మీతల్లి కోరిక. నీయభిప్రాయమేమి?

రాజ: [ఆశ్చర్యముతో] ఇల్లఁటమా! నాకుసమ్మతముగాదు.

యశో: ఎందువలన?

రాజ: ఒక యొరలో రెండుకత్తులు మెలఁగుటకు వీలులేదు.

శాంత: నిజము, నిజము.

రాజ: ఇప్పటికే మాధవునితో వాతల విసిగి బట్ట కట్టుచున్నది. అతఁడొక మహారాజు కొమారునివలె లేనిపోని యాత్మగౌరవముతో విఱ్ఱవీఁగుచుండును. ఎవనినో యొక యజ్ఞాతజన్ముని మనము సాఁకి సంతరించినంతనే యా దరిద్రుఁడు మనతో సాటియగునా? మాధవుఁడు నన్నొక పూరిపుల్లకు కూడ సరకుచేయఁడు. కొఱవితో నెత్తి గోకికొనునట్లు అతఁడొకఁడు చాలక మఱియొకనిని తెచ్చిపెట్టుకొనవలయునా?

శాంత: నీవు దురభిమానివి. మాధవుఁడు అవిధేయుఁడు గాఁడు మన సంస్థానమున పెరిగిన బిడ్డ మనవలె నుండక మఱి యెట్టులుండును?

రాజ: పుట్టుకలో తారతమ్యములేదా? రాజసము మనకు సహజముగాని యేబిచ్చకత్తె బిడ్డకో అది యెట్లు తగియుండును?

శాంత: అతఁడు బిచ్చకత్తె బిడ్డయేయైయుండిన యెడల అంతటి రూపలావణ్యము, అంతటి గౌరవప్రీతి యలవడియుండదు. అతని జన్మరహస్యము ఎపుడైన నొకప్పుడు వెల్లడికాకమానదు. అప్పుడు మనము పశ్చాత్తప్తులము కావలసిన యవసరము నుండదు.

రాజ: నాకన్న నాతడంత రూపవంతుఁడా? గొప్పతనమంత కాఁతి పోవుచున్నదా? ఎత్తి పెంచిన మరులు మిమ్మట్లు పలికించుచున్నది. సమయము వచ్చినపుడు మాధవుఁడు తనయంతరమును దా నెఱుంగునుగాక!

శాంత: శేఖరా, నిష్కారణముగ మాధవుని అవమానించిన నిన్ను మన్నింపను.

రాజ: [చివుక్కునలేచి] నేను సర్దారుతో మాటాడవలయును.

[నిష్క్రమించును]

యశో: మాధవునిపై రాజశేఖరునకు అసూయ నానాటికి హెచ్చుచున్నది. వారిరువు రొకమీఁద పొంది పొసఁగి యుండుట దుర్లభము.

శాంత: నా కిరువురును సమానులే! మాధవుని గౌరవ ప్రీతి మన వానికి గిట్టదు. అసూయ నింద్యమని మహాభారతములో చెప్పఁబడియున్నది.

[మాధవవర్మ ప్రవేశించును.]

శాంత: మాధవా, యేమి?

మాధవవర్మ: విజయవర్మగారి విడిదికై మోతీమహలును సిద్ధపఱపించితిని. వారు మన పట్టణము దాపునకు వచ్చిరని పోలిమేరకాపు చెప్పిపంపెను.

శాంత: మఱచియుంటిని. ఎదురేఁగుటకు కొంత సిబ్బందితో రాజశేఖరుని పంపెదను. గుఱ్ఱపు రౌతులను ఆయత్తపఱచుము.

మాధ: అట్లే. [నిష్క్రమించును]

శాంత: మాధవుని చూచినప్పుడెల్ల నాకు వాత్సల్యముతోడ గౌరవమును కలుగుచుండును. అతని మొగముపై నేదో గంభీరమైన చింత పొడకట్టుచుండును. నీ వెప్పుడైన గమనించితివా?

యశో: అవునవును! మాధవుని చిఱునవ్వు నే నెప్పుడును చూచియెఱుఁగను.

శాంత: అది నాకుఁగూడ చిత్రముగ తోఁచినది.

యశో: మనమెంత ప్రేమతో నాదరించినను సొంతతల్లిదండ్రులు లేని లోపమును పూర్తి చేయఁజాలము.

శాంత: మాధవునికిఁగూడ పెండ్లియీడు వచ్చినది. అతఁడు స్వతం

త్రిముగను గౌరవోచితముగను బ్రతుకుటకు మనభాగ్యత నెట్లు నెరవేర్ప వలయునో నాకు తోఁచకున్నది.

యశో: ప్రస్తుతము విజయవర్మగారి యాతిథ్యమునకు వలయు ఏర్పాటులు చేయించుఁడు.

శాంత: చక్కఁగ జ్ఞప్తిచేసితివి [లేచి] మతిమఱపు వార్థక్యమునకు అనివార్యముగ నున్నది.

[నిష్క్రమించును.]

యశో: మనోరమను మాధవుని చూచినపుడెల్ల నాకు పట్టరాని దుఃఖము కలుగుచుండును. ఇరువురికి చక్కని యీడుజోడు. వారిచేష్టలు చూపులు అనురాగగర్భితములుగ కనుపట్టుచుండును. అయ్యో! సఫలముగాని కోరికలె మిక్కిలి యనురూపముగ నుండును!

[మనోరమ ప్రవేశించును]

మనోరమ: [అమ్మను కౌఁగిలించుకొని] అమ్మా, ఒంటరిగా కూర్చొనియేమి చేయుచున్నావు? ఇప్పుడు మనయింటికి అతిథు లెవరో వత్తురఁటకదా!

యశో: నిజమేనమ్మ.

మనో: ఆ జమీందారుని గురించేనా నాయన సమయము దొరకిన నప్పుడెల్ల చాల గొప్పగా పొగడుచుండినది?

యశో: అవును! మీనాయనగారు అల్లుని సంపాదించు కొనుచున్నారేమొ!

మనో: [ఆశ్చర్యముతో] ఏమీ! అమ్మా, నీవుకూడ నన్ను ఎగతాళి ట్టించుచున్నావు?

యశో: కాదు కాదు; మీనాయన యుత్సాహముచూచి నేనటూహించితిని; ఒకవేళ విజయవర్మయె తగిన వరుఁడని మీ నాయన నిర్ణయించిన నీవేమి తలంతువు?

మనో: నేనా వరునికి అగ్రాహ్యముకాని వధువును.

యశో: ఆ వరుఁడే నిన్ను వరించునెడల?

మనో: వివాహము మానుకొందును.

యశో: తల్లిదండ్రుల నవమానించి నట్లౌనుగదా?

మనో: బ్రతికియున్న వారికేఁగదా యీవిచారము!

యశో: (మనోరమను ప్రక్కకుఁ జేరఁ దీసికొని) మనోరమా, నీ రహస్యము చెప్పుకొనుటకు నాకన్న నమ్మకము గలవార లెవరుందురు? తల్లికి కూడ తెలియరానంత దాపటిక మేమున్నది? నా యెదుట నీకేమి సిగ్గు?

మనో: అమ్మా, నేను దురదృష్టవతిని, [తల్లియొడిలో వ్రాలి దుఃఖించును.]

అంటరాని పాపాత్మక యంచుఁ దలఁచి
యముఁడె ద్వేషించి నన్ విడనాడె నేని
ఏకభుక్తంబు వెలిచీర హితవు గాఁగ
బ్రహ్మచర్యంబు వహియించి బ్రతుకుదాన.

యశో: చిట్టి తల్లీ, ఏల యిట్లు లోలోన కుములుచున్నావు? ఇంత నిరాశ యెందుకు?

కలుగునో యాఁడుబిడ్డ యని కానక కానక నిన్నుఁ గంటిఁ గాం
త లెపుడు సల్పియుండని వ్రతంబుల నోముల నాచరించి; నీ
లలితపుఁ గాలు సేతులు నిలాతల మంటినఁ గందునంచుఁ బు
వ్వులు పఱపించితిన్ గునిసి పోకల సీవటు దోఁగియాడఁగన్.

ఈ య్యేలను సైతము నమ్మలేక నిన్ను నా యొడియందె యుంచుకొని సాఁకితిని, అట్టినీవు నాయెదుట "అమ్మా నేను దురదృష్టవతిని" అని పల్కిన మాట నాహృదయమును చీల్చివైచినది. నా కడుపుంలో మంట పెట్టినది. నేనును ఆఁడుపుట్టువు పుట్టినదాననె. నీ వనుభవించుచున్న దుఃఖమును ఒకప్పుడు నేనును అనుభవించితిని; నీ కోరికను తండ్రి గౌరవింపకుండిన నుండును గాక? తల్లియేల యాదరింపకపోవును?

మనో: [కొంచెము లజ్జతో] అమ్మా, మాధవుని సహవాసము లేని దిన మొక్కొక్కయుగముగఁదోఁచుచుండును. ఆయనతోడ పాచికలాడుచున్న తరుణమున కాలము నిర్దయముగ నెగిరిపోవుచుండును. అమ్మా, యీసంగతి తండ్రికి తెలియఁగింప వలదు. నా యపరాధమునకు మాధవుఁడు శిక్ష ననుభవింప వలసి వచ్చును.

[రాజశేఖరుఁడు ప్రవేశించును.]

రాజశేఖరుఁడు: విజయవర్మగారు వచ్చిరి. మీ రిఁక అంతఃపురము లోనికిపొండు.

[అందఱు నిష్క్రమింతురు]

స్థలము 3: విడిది గృహము.

[విజయవర్మ సోఫాలో వానుకొనియుండును. ప్రక్కన చిన్నకూజాపైని పళ్ళెరములో పన్నీరుచెంబు, గంధపుగిన్నె, వెలిగించిన సాంబ్రాణివత్తులు, పండ్లు పెట్టఁబడియుండును. పరిచారకుఁడు సురటి వేయుచుండును. తెర యెత్తఁబడును.]

విజయవర్మ: [స్వగతము] అన్నియు నాయభీష్టమునకు అనుకూలముగనె జరుగుచున్నట్లున్నవి!

[శాంతవర్మ ప్రవేశించును]

విజ: [లేచి] విచ్చేయుఁడు!

శాంతవర్మ: [కూర్చుండి] చాలదినములకు పునర్దర్శనము! మీకు కుశలమేగదా?

విజ: [కూర్చుండి] మీబోఁటి పెద్దల యాశీర్వాదమువలన మాకందఱకు కుశలమె. ఆదరణ పురస్సరమైన మీ యాతిథ్యమును గుఱించి మీ యెదుట చెప్పుట ముఖస్తుతిగ నుండవచ్చును. నన్ను మీబంధువర్గములో నొకనిగ తలంచి గౌరవించితిరి.

శాంత: మీరు మా యాతిథ్యమును స్వీకరించుట కంగీకరించుటయే మా భాగ్యము.

విజ: నేనంత వినయమునకు పాత్రుఁడను గాను.

శాంత: మార్గాయాసము శమించునట్లు కొంత విశ్రమింపుఁడు. క్రొత్తస్థలమని మీ సౌఖ్యమునకు భంగము కలిగించుకొనఁబోకుఁడు.

విజ: మీ సౌజన్యమువలన నా కిది పరస్థలముగ తోఁచుటలేదు.

శాంత: [స్వగతము] చక్కని వినయవంతుఁడు!

విజ: మీపై నాకు తండ్రిపై నున్నంత గౌరవప్రీతులుగలవు. పాదుషా పట్టాభిషేక సమయమున మిమ్ము చూచినప్పటినుండియు మీమైత్రి సంపాదించుకొని రాజకీయవిషయములలో మీసలహా పొందవలయునని నాకెక్కుడు కోరికగలదు.

శాంత: [సంతోషముతో] రాజకీయవిషయములలో నేనంత పండితుఁడనుగాను; అయినను వయోవృద్ధుఁడను- మహాభారతము నాకభిమాన గ్రంథము. అందలి ధర్మములను నీతులను అవగతము చేసికొంటిని. పెద్దవారు చెప్పిన మాటలు వినక కుటిలపన్నిన దుర్యోధనాదులు హతులైరి. అన్నను సేవించుచు అతని యాజ్ఞను జవదాటని భీమార్జునాదులు జయము నొందిరి.

విజ: [స్వగతము] కడపటి వాక్యము మర్మస్పర్శిగనున్నది. ఈతఁడు సూక్ష్మఘాతము లోనరించునంతటి కుశాగ్రబుద్ధి కాఁడు. ఏదో తన గొడవ చెప్పుకొనుచున్నాఁడు.

శాంత: ఏమి యాలోచించుచున్నారు?

విజ: మహాభారతములోని సారమంతయు రెండువాక్యములలో సంక్షిప్తముగ చెప్పినందుకు నాకాశ్చర్యము కలిగినది.

శాంత: ఏదో నాయల్పబుద్ధికి తోఁచినంతమాత్రము గ్రహించితిని. నేనెప్పుడును నాబిడ్డల యవిధేయతను మన్నింపను.

విజ: మీరు మాటాడు కొలఁది మీగొప్పగుణములు బయలుపడుచున్నవి. నాకొక మేనమామయుండెను. ఆయనయెడ నేను చాల భక్తివిశ్వాసములతో ప్రవర్తించుచుంటిని. సంవత్సరము క్రిందట పరిణత వయస్కుఁడై ఆపూజ్యుఁడు మరణించెను. నాయదృష్టవశమున అట్టి వారె మీరు పరిచితులైతిరి. మిమ్ములను 'మామా' యని సంబోధించి మామ పోయిన లోపమును తీర్చుకొందును.

శాంత: మీబంధుప్రీతి కొనియాడఁదగినది [స్వగతము] నామనస్సు కూడ ఈతని వంకకే పరుగెత్తుచున్నది. మనోరమకు ఈతనినే దైవము నిర్దేశించెనేమొ! [ప్రకాశముగ] రఘుపతివర్మగారిని నే నెఱుంగుదును. వారికి మీ రేమి కావలయును?

విజ: ఆయన నా సవతితల్లి కుమారుఁడు, పెద్దవాఁడు; వేఁటలో పులివాతఁబడి మరణించెను.

శాంత: అవునవును! ఆయన యకాలమరణమును విని మేమును దుఃఖించితిమి. రఘుపతివర్మగారి కొక కుమారుఁడుండెనని విని యుంటిని.

విజ: దురదృష్టవశమున ఆబిడ్డయు విషజ్వర పీడితుఁడై పసిప్రాయమందె మరణించెను. ఒక్క కుమారిక మాత్రము కలదు.

శాంత: అయ్యో! అట్టులనా? ఈప్రస్తావము మీకు దుఃఖము పురికొల్పినట్లున్నది!

విజ: పదునెనిమిది సంవత్సరములు గడచినను స్మృతియింకను క్రొత్తదిగనేయున్నది.

శాంత: మీరు వివాహ ప్రయత్నము లేమియు చేసియుండలేదా?

విజ: ఎన్నిప్రయత్నములు చేసినను దైవానుకూల్యము లేనిదే ఫలింపవు.

శాంత: [స్వగతము] దైవభక్తిసంపన్నుఁడు. [ప్రకాశముగ] మామ లేని లోపమును నా వలన తీర్చుకొన తలంచితిరి. నే నాలోపమును యథార్థముగ పూరింప సమకట్టితిని.

విజ: మీ మాటలు నా కర్థమగుటలేదు!

శాంత: నా కొక కుమారిక కలదు.

విజ: [ఆశ్చర్యము] అటులనా? నేను వినియుండలేదు. నా భాగ్యము ఫలించినది.

శాంత: మీవంటి యల్లుఁడు మాకు దొరకుట పూర్వపుణ్యము! మీ యంగీకారమును అంతఃపురమున తెలిపివచ్చెదను.

విజ: అంత తొందర పడకుఁడు. ఈ సంబంధము మీకు నచ్చినట్లు తక్కినవారికి నచ్చవలయునుగదా?

శాంత: వారెవ్వరును నా కవిధేయులుగ నుండఁజాలరు. ఎవఁడురా అక్కడ ?

ద్వారపాలకుఁడు: స్వామి!

శాంత: మాధవుని యిచ్చటికి రమ్మనుము.

ద్వార: చిత్తం. [నిష్క్రమించును.]

శాంత: మాధవునితో మీరు ప్రొద్దుపుచ్చుకొనవచ్చును. అతఁడు వివేకి; మట్టుమర్యాద లెఱిఁగిన గుణవంతుఁడు.

[మాధవవర్మ ప్రవేశించును]

విజ: కూర్చుండుఁడు.

మాధవవర్మ: [నిలచియుండును.]

విజ: అయ్యా, యీయన మీపుత్రుఁడా?

మాధ: [చింతతో మొగము వ్రేలాడవేసికొనును] [స్వగతము] ఈనిష్కపటహృదయుఁడు నా యనాథచరిత్రమంతయు చెప్పివేయు నేమో.

శాంత: కాదు, కుమారునివలె పెంచుకొంటిమి.

విజ: [స్వగతము] మాలతి పోలికలు ఈతని మొగమునందు పొడ కట్టుచున్నవి. [ప్రకాశముగ] ఏమీ! మీ యౌరసుఁడు కాఁడా?

మాధ: మరల ఇప్పుడే వచ్చెదను. [నిష్క్రమించును].

శాంత: ఇప్పటికి షుమారు పదునెనిమిది సంవత్సరములకు పూర్వము ఒకనాఁటిరాత్రి ఎవరో మా హజారపు సోపానములపై వానిని పడవేసిపోయిరి. ప్రొద్దుననే పరిచారిక యొకతె మా కీసంగతి యెఱిఁగించెను. మేము పోయి

చూచితిమి. ఆబిడ్డ మృతినొందినవానివలె నగపడెను. అంతట వైద్యుని రప్పించి పరీక్షింపఁజేసితిమి. శిశువునకు మూర్ఛరోగమనియుఁ గొంతసేపటికి స్మృతికలుగవచ్చుననియుఁ నాతఁడు చెప్పెను.

విజ: వింతగానున్నది!

శాంత: మధ్యాహ్నమగునప్పటికి ఆబిడ్డ యేడువసాగెను. మా కప్పటికి సంతానము లేనందున దైవదత్తమని ఆపసిబిడ్డను పెంచుకొంటిమి.

విజ: అప్పటి కా బిడ్డకు ఎంత వయస్సుండినది?

శాంత: బహుశా మూడు సంవత్సరము లుండవచ్చును.

విజ: ఆ పరిచారిక యిపుడున్నదా?

శాంత: రెండుసంవత్సరములకు పూర్వము మరణించినది.

విజ: ఓహో!

శాంత: మాధవుఁడెచ్చటికి పోయెను? — మీరు కొంచెము విశ్రమింపుఁడు.

[నిష్క్రమించును.]

విజ: [ఆలోచనామగ్నుఁడయి తిరుగుచు] — పదునెనిమిది — సంవత్సరములకు పూర్వము! — అప్పటికి రెండుమూడు సంవత్సరముల బాలుడు! — స్మృతితప్పి మృతునివలె పడియుండెను! ఇంతవఱకు కొంచెమించుమించు సరిపోవుచున్నది! మాలతి మొగము పోలికలు గలవాఁడు మఱియెవ్వఁడుగ నుండును? ఓ! వంచింపఁబడితిని. ఆ వైద్యుఁడు నన్ను మోసగించి విషమునకుమాఱు మరణమువంటి మైకము కల్పించు నేదియో మత్తుపదార్థమునిచ్చియుండును. అవునవును! బాలునిశవమును దహనము చేయవలయునని నేనంటిని. శిశువు గావున భూమిలో నిక్షేపించుట యుక్తమని ఆవైద్యుఁడుచెప్పెను. ఆ నాఁటి రాత్రియే నిక్షేపింపఁబడెను. అతఁడే రహస్యముగ ఆ శిశువును తెచ్చి సంతానరహితులైన వీరి హజారపు

ముంగిట ఏలయుంచి పోయియుండరాదు? తరువాత రెండుమూడుదినములకే యాతఁడు కాశీయాత్రకనిచెప్పి యూరువెడలెను. ఇంతవఱకు పోబడియే లేదు. అన్నియు సరిపోవుచున్నవి. ఇది యథార్థమైయుండునా? లేక నాభావనయా? వానికి కుడితొడపై పెద్ద పుట్టుమచ్చ యుండవలయును; ఆ యానవాలె సత్యమును నిర్ణయింపఁగలదు.

[మాధవవర్మయు సమరసేనుఁడును ప్రవేశింతురు]

విజ: విచ్చేయుఁడు.

సమరసేనుఁడు: మాధవవర్మగారు మనలను చాల స్నేహముతో విచారించుచున్నారు. మన పరివారమునకంతయు సంతృప్తికరముగా నేర్పాటులు గావించిరి.

విజ: మాధవవర్మగారికి మనము కృతజ్ఞులము.

మాధవవర్మ: ఇందు నా యోగ్యతయేమియు లేదు. అంతయు శాంతవర్మగారి యుత్తరువు.

విజ: మిమ్ములను గాంచినప్పటినుండియు మీయెడల నాకు బంధుప్రీతి పొడముచున్నది. శాంతవర్మగారు మిమ్ము సొంత కుమారునివలె ఆదరింతురని తలంచెదను.

మాధ: అవును. తండ్రివలె నన్ను నాదరింతురు. [స్వగతము] ఈతని గాంచినంతనె నిర్నిమిత్తముగ నాకు వికర్షణము కలుగుచున్నది. ఇతఁడు మా కుటుంబ రహస్యములను మెల్లదిగ లాఁగుదీయుటకు యత్నించుచున్నాఁడు.

విజ: రాజశేఖరవర్మగారుకూడ మిమ్ము సోదరప్రీతిలో చూచుచుందురు గదా?

మాధ: అవును.

విజ: [స్వగతము] నా యుద్దేశమును వీఁడు గ్రహించియుండును; ప్రత్యుత్తరములు ప్రోత్సాహకరముగ లేవు. [ప్రకాశముగ] మీరేయే గ్రంథములు చదివితిరి? మహాభారత ప్రియులైన శాంతవర్మగారు మీ కా పురాణమును చెప్పించియుందురు.

మాధ: చెప్పించిరి. [స్వగతము] ఈతఁడు సూక్ష్మబుద్ధి. శాంతవర్మగారి లోపమును కనిపెట్టెను.

విజ: మీకు జ్యోతిషమును గుఱించి యేమైన తెలియునా?

మాధ: తెలియదు.

సమ: [స్వగతము] ఏల యీతని నిన్ని ప్రశ్నలడుగుచున్నాఁడు? దేనికో గుఱిపెట్టి నట్లున్నది.

విజ: సాముద్రికశాస్త్రమున పరిచయముగలదా?

సమ: ఈ శాస్త్రములన్నియు మాధవవర్మగారికేల తెలియును?

విజ: తెలిసియుండిన మేలె. శాంతవర్మగారిలాటి శాస్త్రములు చెప్పించియుందురని యూహించితిని. సామాన్యమైన పుట్టుమచ్చల శాస్త్రము కూడ మీకు తెలియదా?

మాధ: తెలియదు. మీకు తెలియునా?

విజ: కొంతవఱకు తెలియును.

మాధ: నా కుడితొడపై అరచేయియంత మచ్చగలదు. దానికి ఫలితమేమి?

విజ: [ఉద్రిక్తచిత్తుఁడై] సత్యముగనా? చెప్పుము!

మాధ: కలదు [స్వగతము] ఏలయిట్లు కలత చెందుచున్నాఁడు?

విజ: మిత్రమా, నీ వదృష్టవంతుఁడవు.

మాధ: పరాశ్రయమున కేమి యదృష్టము?

సమ: [స్వగతము] ఈతనికి ప్రతికూలమైన రహస్యమేదియో బయటఁబడినది. అది అంతముఖ్యమైనదిగాకున్న ఇంతకలవర మెందుకు?

విజ: నాకు ప్రయాణాయాస మింకను తీఱలేదు. కొంచెము విశ్రమించెదను.

మాధ: అట్లే. [స్వగతము] ఈతని చర్య దురూహ్యముగనున్నది. పుట్టుమచ్చ యనినంతనె సంక్షుబ్ధమానసుఁడయ్యెను!

[నిష్క్రమించును]

విజ: [కోపముతో] ఇప్పు డన్ని సందియములు తీఱినవి, నాప్రయోగమింత వ్యర్థమైపోవునా? నా మాయాజాలములో తగుల్కొనిన యొక ఈఁగ ఇట్లు తప్పించుకొని వెడలిపోవునా? [అప్పవాల్పక బయ లవలోకించును]

సమ: మీరేల యిట్లు కలఁత చెందితిరి? ఇందుకు పుట్టుమచ్చయే కారణము కాదుగదా?

విజ: [ఆ మాటలు విననియట్లు] బిడ్డకుఁ దండ్రి ననుసరించెనని నమ్మియుంటివి? ఆ! నే నుద్దేశింపని మూలనుండి హఠాత్తుగ పిట్టపిడుగు నెత్తిపై బాఱెను.

సమ: కడచిన విషయమును జ్ఞప్తికి తెచ్చుచున్నారు.

విజ: ఆవిషయము ఇంకను గడవలేదు. ప్రత్యక్షముగా నగపడుచున్నది. మనము అవివేకులమైతిమి. వంచింపఁబడితిమి. నరేంద్రుఁడు బ్రతికియున్నాఁడు. వాఁడే ఈ మాధవవర్మ.

సమ: [ఆశ్చర్యముతో]అటులనా! మన మొకటి తలఁచిన దైవ మొకటి తలఁచెను. ఇదెట్లు సంభవించెను?

విజ: ఆ వైద్యుఁడే యిందుకు మూలమైయుండును. ఇంతమాత్రమునకే నేనేల యపజయము స్వీకరింపవలయును? ఎట్టి యాభ్యంతరములైనను నా యాశా ప్రదీపము నార్పలేవు. నిరుత్సాహమెట్టిదో నే నెఱుంగను. నా హృదయమునదనుకెట్టినయుక్కువిఘ్నపరంపరలారా, మీతో పంతము వైచెదను. నా భావ్యభ్యున్నతికి మార్గము నరికట్టు మిమ్ము నా యూర్పుగాలిచే పటాపంచలు గావించెదను. భాగధేయమునకు విధేయత శిక్షించెదను.

సమ: ఇంకను మన చేయి దాటలేదు.

విజ: సమరసేనా, పొమ్ము. పొమ్ము. చెల్లాచెదరైన నా భావములను ఏకాంతమున చిక్కబట్టవలయును.

సమ: మరల దర్శించెదను. [నిష్క్రమించును]

విజ: ఉపకరణ సమీకరణమునందు పొరపడితిని. పొరపాటు మానవ సహజము. ఇది విధిచేష్టయేమి?

మానవుఁడైనవాఁడు పదిమాఱులు యత్నము సల్పియున్ జయ
శ్రీని వరింపఁడేని చలచిత్తులు ప్రాప్తమటండ్రు దానినిన్; దం
మానయుతుల్ తదుక్తిని బ్రమాణముగాఁ గయికోరు; చూచె
గాని యదృష్టమే యొకటి గల్గిన, దానికి నాకు యుద్ధమే!

[ఏవగింపుతో] ఆ! తూ—విధి—విధి.

[తెర జాఱును]

స్థలము ౮: అంతఃపురము.

[తెరయెత్తునప్పటికి యశోధర దీనవదనయై పైఁటకొంగుతో కన్నీరు తుడుచుకొనుచుండును. రాజశేఖరుఁడు ప్రవేశించును]

రాజశేఖరు: అమ్మా, యెందుకు రమ్మంటివి?

యశోధర: నాయనా, యిటురమ్మా. కూర్చుండుము.

రాజ: [అమ్మప్రక్కన కూర్చుండును.]

యశో: శేఖరా, యిఁక మనమేమిచేయఁగలము? మీ తండ్రిపట్టిన పట్టు విడువకున్నాఁడు. ముసలితనపు ముక్కోపము; నేనేమి చెప్పఁబోయినను అవిధేయనని శంకించుచుండును. తండ్రినిశ్చయమును విని మనోరమ రేయుంబవలు తనలో తాను కుమిలి కుమిలి పరితపించుచున్నది. రెండుదినముల నుండియు మంచినీరైన త్రావక కృశించుచున్నది. కన్నీరు నించి నించి కనురెప్పలు వాచిపోయియున్నవి. ఆ బిడ్డదురవస్థ చూచినప్పుడు కన్నకడుపెట్లు దరికొనక పోవును? నాయనా, యీఁడువారి మనసుకోఁతలు మీకేమి తెలియును?

రాజ: అమ్మా, మనోరమను విజయవర్మకిచ్చి వివాహము చేయుట నాకును అంత సమ్మతము కాదు. నిన్న ఆయన విడిదికి పోయియుంటిని. నేను పోవునప్పటికి ఏలనో కోపోద్రిక్త మానసుఁడైనటుల నిప్పులు గ్రక్కు నాడిచూపులతో బయలవలోకించుచుండెను. ఆతతాయి క్రూరస్వభావమును ప్రతిబింబించుచుండిన ఆతని ముఖము నన్ను చూచిన తత్క్షణమె దరహాసిత దీప్తమై వింతగొల్పినది.

యశో: నాయనా, ఆయన అంతకోపపడుటకు మనమేమి యగౌరవము చేసితిమి?

రాజ: ఆయన నడవడి యేదో కొంతచిత్రముగ నున్నది!

యశో: అట్టి కపటాత్ముని మీతండ్రి యెట్లు సద్గుణసంపన్నుఁడని నమ్మెను?

కనుపు చమ్మలువాఱఁగఁగాంచి పెంచి,
నేఁడు చేసేతఁ గూఁతురిఁ బాడుకూప
మునఁ బడంగ నెట్టులఁ ద్రోతు? ముప్పదప్ప
సరణి లేదొకో? నీవైన సాయపడవొ?

రాజ: అమ్మా, చింతిల్లకుము. నాయనకు మరల చెప్పిచూచెదము. వినఁడేని ముహూర్తము వేళకు మనోరమ నెచ్చోటికైన దాఁటవేసికొని పోయెదను. ప్రస్తుత మంతకన్న వేఱు ఉపాయములేదు.

యశో: విజయవర్మగారు అవమానింపఁబడినట్లు కోపగించు కొందురుగదా!

రాజ: ఆతనికోపము మనల కేమిసేయును?

[మాధవవర్మ ప్రవేశించును]

మాధవవర్మ: అమ్మా—

రాజ: మాధవా, మేమిప్పుడు నీవు వినఁగూడని కుటుంబ రహస్యములు మాటలాడుకొనుచున్నాము. తరువాత రమ్ము.

మాధ: [కోప మడఁచుకొన్నవానివలె నటించి నిష్క్రమించును.]

యశో: శేఖరా, మాధవునియెడ నీప్రవర్తనము చాల నింద్యముగ నున్నది. నిర్హేతుకముగ వానిని నీ వవమానించుచుందువు. మానమర్యాద లెఱిఁగిన మాధవుఁడు నీ పొగరుబోతుమాటల కెంత నొచ్చుకొనియుండును?

రాజ: వానిని నేను వ్యర్థముగ దూషించుటలేదు. మన కుటుంబమున వాని యంతరమును వాఁడెఱుంగవలయును. మీచనవును వాఁడు

దుర్వినియోగ పెట్టుచున్నాఁడు. నాయెదుటకూడ మనోరమతో స్వేచ్ఛగ మాటలాడుచుండును. వారిరువురు పాచికలాడునప్పుడు నేను కోరినను వారు నన్ను ఆటలోనికి రానియ్యరు. వారియువురి కలుపుగోలుతనము నా కేవము పుట్టించుచున్నది.

యశో: కుమారా, పిన్నటినాఁటనుండియు మీరు ముగ్గురొక్క చోట పెరిగితిరి. ఒక్క కంచమున గుడిచి, యొక్క మంచమున నిదురించితిరి. మొన్నమొన్నటి వఱకు పరమాప్తులుగ నుంటిరి. మాధవుఁడు నీ యసూయకు పాత్రుఁడు కాఁడు. గొప్పబుద్ధివహింపుము. మనోరమ యింకను బాల్యవినోదముల విడనాడదు.

రాజ: అమ్మా, నీ వేమైన ననుకొందువుగాక, నేను మాత్ర మొక మాటచెప్పుచున్నాను: ఇఁకమీఁద మనోరమ మాధవునితో కలసిమెలసి యుండరాదు. నీకుమారిక ప్రవర్తనమునకు నీవు బాధ్యురాలవు. తెలిసికొమ్మా.

[నిష్క్రమించును]

యశో: ఇఁకమీఁద వారిరువురు కలసిమెలసి యుండరు. రాజశేఖరుఁడు తండ్రియంతివాఁడు. పట్టినపట్టు విడువఁడు. అయ్యో, మాధవా, నీ వెప్పుడైన వెడలవలసినవాఁడవే నా! ఏపల్లెతయో పెంచుకొనియున్న నీకిట్టి యిక్కట్టులు వచ్చియుండవుగదా! రాజశేఖరుని యుద్దేశ మటుండనిచ్చి, మనోరమకును మాధవునకుఁగల చనవును కొంతమట్టుకు తగ్గించుటయే యుచితమని నాకును దోఁచుచున్నది. వారియువురికి పరిణయము దుస్సాధ్యము! అట్టియెడ పరస్పరానురాగము హృదయానుతాపమునకు మూలము కాఁగలదు అవ్యాపదేశముగ మాధవునకీ సందర్భములన్నియు తెలియఁజెప్పెదను.

[నిష్క్రమించును.]

[తెర జారును.]

స్థలము ౫: విడిది యిల్లు.

[విజయవర్మ సోఫాపై నానుకొని యొక పుస్తకము చదువుచుండును. తెర యెత్తఁబడును]

విజయవర్మ: చాణక్యుఁ డొక్కఁడే నా మనస్సునకెక్కిన నీతివేత్త! సాంసారిక రాజకీయ ధర్మముల నాతఁడు భేదము నిరూపించెను. కార్యదక్షులు ఫలసిద్ధికొఱకు నెంతటి కార్యములనైన నొనరింతురు.

[సమరసేనుఁడు ప్రవేశించును.]

విజ: ఏమైన క్రొత్త విశేషములు కనుఁగొంటివా?

సమరసేనుఁడు: [కూర్చుండి] తమరి దగ్గఱ విశేషములు వినవచ్చితిని.

విజ: అంతియేనా?—సమరసేనా, చిన్న బహుమానముతో నెట్టి పరిచారకుని నోటితాళమైన నూడిపోవును. ఈకుటుంబ రహస్యములన్నియు గ్రహించితిని. మనోరమ మాధవుని వలచియున్నదఁట! తల్లికిని కుమారునకును నాసంబంధ మంగీకారము కాదఁట.

సమ: అటులనా! ఇంట నందఱును ప్రతికూలురైనపుడు శాంతవర్మమాత్ర మేమి చేయును?

విజ: ఆతని కోఁతిపిడికిలిపై నాకు నమ్మకము గలదు—కాక పోయినను నాకొక యుపాయము తోఁచుచున్నది.

సమ: సూచింపుఁడు! తత్క్షణమె నిర్వహించెదము.

విజ: రాజశేఖరుని రహస్యముగ మన దుర్గమున దాఁచియుంచవలయును. వాని సాహాయ్యములేనిదే రాణి స్వతంత్రముగ నేమియు చేయఁజాలదు.

సమ: అట్లయిన ఎప్పటికిని రాజశేఖరశర్మ మనదుర్గమును ప్రాణముతో వదలరాదు.

విజ: అవును! అది నిశ్చయము.

సమ: మఱియొకటి యాలోచింపుఁడు. పుత్రహీనుఁడైన శాంతవర్మ మాధవు నింటనుంచుకొని మనోరమ నిచ్చి వివాహము చేయవచ్చును; అట్లే అగునేని మన ప్రయత్నములన్నియు విఫలములగును.

విజ: [నవ్వుచు] సమరసేనా, నేనంత మూఢుఁడ ననుకొంటివా? పరస్పర ద్వేషముండుటవలన రాజశేఖరుని మాధవుఁడే చంపెనని రూపింపవచ్చును.

సమ: మీరు ప్రతిభావంతులు; మీయెదుట నేను మందమతిని.

విజ: మనోరమ మాధవునిపై ఆస వదలుకొనకతప్పదు.

సమ: శాంతవర్మకు మీరుతప్ప వేఱుగతి యుండదు.

విజ: ఇట్టిసాదర్శ్యముల వివాహము కొంచెమాలస్యమైనను జరిగి తీరును.

సమ: పెండ్లికూఁతురితోడ అరణముగ రాజ్యమును వాస్తవమగును.

విజ: నా భావిజీవితమును ప్రభాతమువలె స్వర్గమయమై పొడకట్టుచున్నది!

సమ: మీ యనుచరుని జీవితముగూడ నట్లే యొనర్పవలయును.

విజ: సమరసేనా, నిన్ను మఱతు ననుకొంటివా? వసంతపురమున రాజప్రతినిధియగుట కంత తీసిపోవు.

సమ: [సంతోషముతో] మీ చిత్తము, నా భాగ్యము.

విజ: మన మిప్పుడు ఊహ్యమైన యానందము ననుభవించుచు కర్తవ్యమునుమఱవరాదు. నేనిచ్చట కొన్నిదినము లుండవలసివచ్చును. నీవు పరివారమును దీసికొని హేమనగరమునకు వెడలుము. మన మాలతీదేవికి ఇచ్చటి వృత్తాంతము లేవియు తెలియఁగూడదని పరిచారకుల హెచ్చరింపుము.

సమ: అట్లె. [స్వగతము] మాలతితో సంభాషించుటకు తరుణము దొరకినది.

విజ: మాధవుని వేటనేర్పును రాజశేఖరునియొద్ద అగ్గించి వానిలో అసూయ పేరిరేపితిని; రాజశేఖరుఁడు తన నైపుణ్యము నాయెదుట ప్రదర్శింప నువ్విళ్లూరుచున్నాఁడు. ఈనాఁడు సాయంకాలమె మే మిద్దరము అరణ్యమునకు వత్తుము; నన పరివారములోని కొందఱు మాఱు వేషములు ధరించి అచ్చట వేచియుండవలయును. సమయముచూచి ఆతని కాలుసేతులు బంధించి గుఱ్ఱముపై వేసికొని ఈ నాఁటిరాత్రియె పట్టణముజేర్చి పాతాళగృహమున దాఁచవలయును. ఇచ్చటను అచ్చటను ఈ రహస్యము ఎవ్వరికిని తెలియఁగూడదు.

సమ: అట్లే యొనర్చెదను.

విజ: [పుస్తకము చేతికి తీసికొని చూచుచుండును]

సమ: [స్వగతము] ఈతని యొకొక్క రహస్యమును నావాంఛాపూర్తికి ఒకొక్క సోపానమగుచున్నది. మాలతిని నేను పెండ్లిచేసికొని తీఱవలయు. ఆకాంతపై ననురాగము నాకు నానాఁటికి హెచ్చుచున్నది. ఎన్ని దినములు దాఁచఁగలను. ఏల దాఁచవలయును?

విజ: [తలయెత్తిజూచి] సమరసేనా. నీవింకను ఇచ్చటనే యున్నావా? నిదురలేని కలలు గనుట నాసేధిపతులకు తగిన యుద్యోగము కాదు.

సమ: శిలాతురప్రాయమైన మీహృదయమున నామనమున మధుర స్వప్నము సృజించినది.

విజ: అందుకు నాపైన సొద్దు పెట్టెదవా? తీఱికచూచి వాగ్వాద వినోదము ననుభవింతము. నీకప్పగించిన కార్యము కాలయాపనము సేయక నిర్వహింపుము.

సమ: [తలవంచుకొని] నా సేవకు తగిన ప్రతిఫలము ముట్టునని నా కేమి నమ్మకము?

విజ: ఏమీ! నీ సందేహము వింతగొల్పుచున్నది. సమరసేనా, నా మొగముచూచి మాటాడుము. నిన్నెప్పుడైన మోసము చేసియుంటినా?— పొమ్ము, పొమ్ము, బేలవు కాకుము.

సమ: మీకు రాజ్యము చేకూరినది. వివాహమును కాఁబోవుచున్నది—

విజ: ఇదియొక క్రొత్తవిషయము కాదు.

సమ: క్రొత్తవిషయమే చెప్పెదను, నాకును పెండ్లిచేసికొనఁ గోరిక కలదు.

విజ: [నవ్వుచు] ఇందుకా యింత యుపోద్ఘాతము? అటులనే చేసికొమ్ము; నాకును సంతోషమేగదా!

సమ: వసంతపురమున రాజప్రతినిధి కాఁబోవు నాకు వధువు కూడ అనురూపవతిగ నుండవలయును.

విజ: [స్వగతము] చాలదూరము అంగ వేయుచున్నాఁడు. [ప్రకాశముగ] కన్యకను నిర్ణయించుకొంటివా?

సమ: నిర్ణయించుకొంటిని.

విజ: ఎవరు?

సమ: [క్రిందిచూపుతో] మాలతీదేవికి నేనంత తగని వరుఁడనుగాను.

విజ: [పిడుగడఁచినట్లు నిర్విణ్ణుఁడయి] మాలతీదేవికి నేనంత తగని వరుఁడనుగాను! [కోపముతో] తగిన వరుఁడని యెవరు చెప్పిరి?

సమ: నే ననుకొంటిని.

విజ: [కోపముతో] సమరసేనా, నీవు తలక్రిందుగా నడచుట లేదుగదా? నీకు చిత్తచాంచల్యము గలిగినదా? లేక కల గనుచున్నావా? ఇతరుఁడవే యైయున్న ఈ యసంగత ప్రలాపములకు నిన్ను మన్నించి యుండను. హాస్యాస్పదుఁడవు కాకుము.

సమ: మాలతీదేవిపై మీకు ప్రీతిలేదు. ఆకన్యను శిక్షించుటకుగా నాకిచ్చి వివాహము చేయుఁడు.

విజ: నీవు బుద్ధిమంతుఁడవేని ఈవిషయమై మఱొక్కమాటయైన నెత్తకుము. ఇంత తారతమ్య మెఱుంగనివాఁడవని నే నెన్నఁడును తలంప లేదు.

సమ: ఇదియే కడపటి మాటయా?

విజ: ముమ్మాటికి.

సమ: ఏనుఁగు తన నెత్తిపయి తానే మన్నుచల్లుకొనును.

విజ: ఓరీ, నీచుఁడా, నన్ను బెదరించి లోఁగొనఁ జూచెదవా?

సమ: మాధవవర్మకే నేనట్టి సాహాయ్య మొనరించియుందు నేని—

[నిష్క్రమించును.]

విజ: ఈ రహస్యముకూడ వీనికిఁ దెలిసిపోయెను! నా తెలివితక్కువతనము నే నిందించుకొనవలయును. నానాఁటికి వీనికి నాపై నధికారము హెచ్చుచున్నది. ఈ దుర్మార్గుఁడు బ్రతికియున్నంత వఱకు నాగుండెలు కుదుటపడవు—సమరసేనా,

[పలుకఁడు] సమరసేనా, [పలుకఁడు]

[అటు నిటు తిరుగును]

ఇంతలో నెచ్చటికిపోయెను? మాధవుని యొద్దకుపోయి యుండఁడు గదా? సమరసేనా,

[పలుకఁడు] ఎవఁడురా అక్కడ?

పరిచారకుఁడు: స్వామి.

విజ: సేనాధిపతి ఎచ్చటికిపోయెనో త్వరితముగ పిలిచికొనిరమ్ము.

పరి: ఆజ్ఞ. [నిష్క్రమించును]

విజ: [అటునిటుతిరుగుచు] ఆతఁడెక్కడకు పోయియుండును? ఇంత యనాలోచితముగ కార్యముచేయునా? చేయఁడు; చేయఁడు. ఏల యింతవఱకు రాఁడు?—సమరసేనా.

[సమరసేనుఁడు ప్రవేశించును.]

సమరసేనుఁడు: నన్ను పిలిపించితిరా?

విజ: ఆఁడుదానివలె అలిగిపోవుట ఎప్పుడు నేర్చుకొంటివి? కూర్చుండుము.

సమ: [నిలువఁబడి] నాతోడ మీకు పనితీఱినది; నే నిఁక నుండిన నేమి పోయిన నేమి?

విజ: [కూర్చుండి] కూర్చుండుము. మంచిబుద్ధితో ఈవిషయము మరల నాలోచింపుము. నీకోరిక యసంగతమని యిప్పటికే నీకు తోఁచియుండును. మనము లోకదూషణమునకుఁ బాల్పడుదుము; వింత వింత కింవదంతులు పుట్టును.

సమ: కింవదంతులకు క్రొత్తగా భయపడుచున్నామా? ఆసమ్మతి నింత శాఖాచంక్రమణముగ నుపదేశించుట యెందుకు? ఔనా- కాదా, ఒకమాటచెప్పుఁడు. పోయెదను.

విజ: సమరసేనా, నీపై ద్వేషముతో నిట్లు చెప్పుటలేదు. లోకుల యాడికోలుకు వెఱచి సందేహించితిని. నీకంత యావశ్యకమని తోఁచినప్పుడు నీ యభీష్టము నెఱవేర్చియే తీరుదును. నీకింకను సందేహమా?

సమ: నా సందేహము తీఱినది.

విజ: ఇఁక త్వరితముగ వెడలిపొమ్ము. జాగరూకుఁడవై అంతయు నిర్వహింపుము.

సమ: పోయివచ్చెదను. మరణపర్యంతము మీమేలుమఱవను.

[నిష్క్రమించును]

విజ: నన్నావేశించిన పిశాచము తొలఁగినట్లైనది. ప్రతిపదమునందును వీనిదే నాకు చింత; నాజీవితమిా నీచుని మూలమున దుర్భాగ్యమగుచున్నది. ఏలాటి సందేహమున కెడమియ్యని స్నేహముతో ప్రవర్తించి సమయముచూచి మట్టుపెట్టెదను.

[రాజశేఖరుఁడు ప్రవేశించును]

రాజశేఖరుఁడు: వేఁటకు వచ్చెదరా?

విజ: నాకు కొంచెము తలనొప్పిగానున్నది; అయినను నీ వెనువెంటనే వచ్చెదను.

రాజ: ఆలసింపకుఁడు. [నిష్క్రమించును.]

విజ: రాజశేఖరుఁడు తనవేఁటనైపుణ్యము చూపుటకు నువ్విళూరుచున్నాఁడు కాఁబోలు!

[అచ్యుతవర్మ ప్రవేశించును]

అచ్యుతవర్మ: జయము, జయము!

విజ: అచ్యుతవర్మా, సమరసేనుఁడు ప్రయాణ సన్నాహము చేయుచున్నాఁడా?

అచ్యు: మే మిఁక ఆతని అధికారము లెక్కసేయము. నా అధీనములోనుండు పరివారము ముందర ఆతఁడు నన్ను నీచముగ నిందించెను. ఆ గర్వాంధుఁడు ఏలినవారిని సైతము లెక్కసేయుటలేదు.

విజ: అతఁడేమైన నొడలుతప్ప త్రాగియున్నాఁడా?

అచ్యు: ఇదియంతయు దేవరవారి యాదరణమువలన వచ్చిన కండకావరము. లేకయుండిన ఆతని నప్పుడే—

విజ: ఇటురమ్ము [తిన్నగా] వానిపై నా కాదరము పోయినది.

ఆ నీచుఁడు నాదయకు పాత్రుఁడు కాఁడు. వానియుద్యోగమును నీవు నిర్వహింప నభిలషింతువా?

అచ్యు: దేవర కరుణ.

విజ: మిగత విషయము నీ వూహింపఁగలవు. సమయము చూడుము, ఇచ్చటకాదు; తెలిసినదా?

అచ్యు: గ్రహించితిని.

విజ: పొమ్ము నీయదృష్టము నీచేతిలోనున్నది.

అచ్యు: మహాభాగ్యము. [నిష్క్రమించును]

విజ: రాజశేఖరుఁడు నాకొఱకు వేచియుండునేమొ.

[నిష్క్రమించును.]

తెరజాఱును.

స్థలము ౬: అరణ్యము

[మనోరమయు చేటికయు ప్రవేశింతురు.]

చేటిక: అమ్మా, యింక మన మింటికి మళ్ళుదాం, రాణిగారితో గూడ చెప్పిరాలేదు. అన్నయ్యగారు చూస్తే కోపగించుకొంటారు.

మనోరమ: శ్యామలా, నాకు అంతఃపురముకంటె ఈయరణ్యమె పేయింతలు సుఖప్రదముగనున్నది. ఇచ్చట చెట్టుచేమలు పనికిమాలిన బోధలొనరించి ప్రాణము విసిగింపవు.

శ్యామల: తండ్రిగారు పట్టినపట్టు విడువరు; మొన్నవచ్చిన క్రొత్త దొరగారు పెద్దదొరగార్ని మచ్చుమందుసల్లి లోపఱచుకొన్నట్లుంది.

మనో: మా నాయన ఉత్సాహవంతుఁడు, సదుద్దేశముతోనే నా హృదయమును చిందఱవందఱగ త్రొక్కుచున్నాఁడు—ఏమే, మాధవుని ఈవేళ చూచితివా? రెండుదినములనుండియు నాకంటికి కగపడుటలేదు.

శ్యామ: ఆయన్ని ఈనాటి పొద్దున చూచాను. అమ్మా, ముందటి మాదవయ్య దొరగారు కారు- ఆనడుపు ఆచూపులు మాఱిపోయినాయి. పిచ్చివాడిలాగా తిరుగుతుంటాడు.

మనో: నా దుఃఖాగ్ని హృదయదాహకమైనను తల్లి యోదార్పులచే కొంత చల్లపడుచున్నది. పాపము! మాధవుని ఊరడించువారెవరు?— శ్యామలా, మాధవుని గంభీర స్వభావమును నీవెప్పుడైన కనిపెట్టితివా? తన దుఃఖము నెవరితోనైన చెప్పికొనఁడు; భారమును అసహాయుఁడుగ వహించును.

శ్యామ: నిన్న మన శేకరయ్యదొరగారు ఎందుకో కోపగించుకొన్నారు. ఆయన వినిపించుకోకుండా తలవంచుకొని వెళ్ళిపోయినారు.

మనో: మాధవుఁడు నివురుగప్పిన నిప్పు.

[మాధవవర్మ అన్యాయత్త చిత్తుఁడయి క్రింద చూపుతో ప్రవేశించును.]

శ్యామ: అమ్మా, వారుగో! మాధవయ్య దొరగారు. ఇక్కడికే వస్తున్నారు.

మనో: [ఆతురతతో] ఏఁడి?— [చూచి] పాతాళ పర్యంతము నంటుచూపు! మొగ మేదియో ఘోరనిర్ణయమును ప్రకటించుచున్నది!— మాధవా, ఏమి యీ స్వరూపము?

మాధవవర్మ: [మెల్లఁగ తలయెత్తిచూచి] మనోరమా, యదృశ్య శక్తి యాహ్వానము బలవత్తరము. స్వతంత్ర జీవిత యాత్రా మహాసముద్ర వర్తనమున ఏకాకినై దుముకఁబోవుచున్నాను. వీడ్కొలుపుము.

మనో: [కలఁతచెంది] నీమాటలు నాకర్థమగుటలేదు. ఏమి యాత్ర? వీడ్కొలుపుట యేమి?

మాధ: ఇంకొక్క నిమిషమైనను ఈ యవమానకరమైన జీవనమును గడపఁజాలను. ఓర్పునకుఁగూడ నొక మేరయుండును. నే నెవ్వఁడను? మీ యింట నే నేల యదవత్రావుడు త్రాగుచుండవలయును? అజ్ఞాతజన్ముఁడను, పవిత్రమగు మీ కులీనత కేల కళంకము తేవలయును?

మనో: మాధవా, నిన్నెవరైన దూషించిరా? రాజశేఖరుఁ డేమైన కానిమాటలు పల్కెనా? తండ్రితొందరపడి కోపగించుకొనలేదుగదా?

మాధ: ఒక్క రాజశేఖరుఁడే కాఁడు, నేను జూచు ప్రతిపదార్థమును నన్నవమానించుచున్నది. పారతంత్ర్య విషవాయువునందు నాయౌవన కుసుమము వివర్ణమయి శీర్ణించిపోవుచున్నది. కఱకుటమ్ములను నిష్కవచమైన నావక్షఃస్థలముతో నెదుర్కొనఁగలను గాని, మర్మభేదకములగు నెత్తిపోటుపు

లను, అన్యాపదేశ దూషణములను సహింపఁజాలను. ప్రత్యక్షముగ నీవు నాహృదయమును చూడఁగలుగుదువేని, ఒక్కొక్క యణుమాత్రస్థలము నొక్కొక్క క్షతము! ఒకొక్క క్షతమును రక్తస్రావి! ఒకొక్క రక్తబిందువును నాజీవిత సారము!

మనో: అయ్యో! నీవెన్నఁడును నింత కలఁత నొందియుండఁగవు. ఆ పోఁకరుఁబోతు రాజశేఖరుఁడే నిన్ను మితిమీఱ నొప్పించియుండవలయును.

శ్యామ: అనుమానమెందుకమ్మా? నిజాగా నే వుఁడవచ్చును.

మాధ: మనోరమా, నేను బిచ్చకత్తె బిడ్డనని తూలనాడినందుకు నాకేమి యవమానములేదు; లోకమున నందఱును భాగ్యవంతులుగ నుండరు.— నేను జారిణీకుమారుఁడనా? తన యపవిత్రకళంకమును కప్పిపుచ్చుటకు మాతల్లి నన్ను నిశ్చింతముగ పాఱవైచినదా? [సంక్షుబ్ధ చిత్తుఁడయి] మా తల్లిజారిణి! దుస్సహము—ఓరి రాజశేఖరా, నేను మీతండ్రికి మరణ పర్యంతము ఋణపడియుండనియెడల—[కత్తిపైచేయి వేయును.]

మనో: ప్రాణమిత్రమా, నన్ను గుతించియైన ఆబాలిశుని నీచోక్తులు మన్నింపుమని వేడికొనుటకును నోరాడకున్నది.

మాధ: వీడ్కొలుపుము. కాలయాపనమగుచున్నది. నీయనురాగ స్మృతి యను మహాప్రదీపమును చేతనుంచుకొని నాజీవితకాళరాత్రి నంతయు నిర్భయముగఁ గడపెదను. [కదలును.

మనో: [చేయిపట్టుకొని] నీవు నిజముగ వెడలవలయునా? ఇంకొక యుపాయములేదా?

మాధ: నే నింకొక్క నిమిషమైన యీయింట నుండఁజాలను. ఈ బూటకపు జీవనము నాకు నరకము వలెనున్నది. రాజులయింట నునికి- సర్వ సౌఖ్యము లనుభవించుచున్నట్లు లగుపడుట- హృదయముమాత్రము బయటికగపడని అంపకోఁతలతో జర్జరితమగుట! ఇది యేటి బ్రతుకు?

మనో: నీయూరడింపులతో నాహృదయభారమును దేలిక పఱచుకొనఁ దలఁచి యుంటినిగాని, నీదుఃఖమును చూచి నాసాదమిగ్రింగి కొంటిని. మాధవా, అన్న యపరాధమునకు నాపై కసితీర్చుకొందువా?

మాధ: నా మానత్యాగము నీసౌఖ్యమునకు గోరంతయైన నుపకరించు నెడల, అదియేగాదు ప్రాణత్యాగముకూడ నాకిష్టమె.

మనో: మన యనురాగలత నిరాలంబముగ కృశింప వలసినదేనా?

మాధ: మాటిమాటికి పొడిచి చంపెదవు? నేను రాజపుత్రుఁడను కాను.

మనో: నీవు స్మృతిని భగ్నముచేయలేవా?

మాధ: స్మృతిని గాలంబు నశియింపఁ జేయుఁగాదు
నీకడన యున్న దయసేయుమో కులీన,
నీరమైనను విషమైన నీ వొసంగ
నమృతరసమట్లు తనివార నానువాఁడ

మనో: మాధవా, నీసహవాసములేని బ్రతుకు నాకు జీవన్మరణము, నేను నిశ్చయించు కొంటిని.

మాధ: [దుఃఖోద్వేగముతో] ఏమనుచున్నావు? ఈయజ్ఞాత జన్ముఁడు, ఈకులహీనుఁడు, ఈపరాన్న భోక్త,— దుస్సాధ్యము, దుస్సాధ్యము! నీవేడ, నేనేడ? ఏల యీపిచ్చిభ్రమ గొల్పుచున్నావు? దురదృష్టమునకు భ్రాంతి; భ్రాంతికి ఆశాభంగము; ఆశాభంగమునకు అకాలమరణము; చక్కని సంతాన పరంపర!

వనితా, నీవొక ధావమాన మధురస్వప్నంబవై మన్మనో
ఘనమార్గంబునఁ దేలియాడెదవు దక్కన్ రాని దూరంబునన్,
నను నచ్చోటికి రమ్మటంచుఁ గనుసన్నన్ బిల్తువేగాని, నీ
వను మానింపవు నా విపన్నతను; పేరాసల్ వృథా వేదనల్!

మనో: మాధవా, నీకు మరణింప నిచ్ఛకలదా?

అదిగో! యాగిరి శృంగమెక్కుడము సంధ్యారక్తవర్ణాంకితాం బుద రమ్యాంబర భిత్తిపై మన వపుర్మూర్తుల్ మసీచిత్రి సం పదరూపింప, నభుక్తమా వలపుతాపంబుల్ శమింపంగఁ, బే రెద కౌఁగిళ్ళ సుఖించి క్రిందినదిలోనే దూకి నిద్రింతమా?

శ్యామ: అన్నయ్యగా రిక్కడికే వస్తున్నారు!

మనో: ఏఁడీ! విజయవర్మగారు గూడ వచ్చుచున్నారు. నే నిఁక బోయెదను. అన్న కోపగించు కొన్నను సహింపుము.

[విజయవర్మ రాజశేఖరుఁడు ప్రవేశింతురు]

రాజశేఖరుఁడు: [స్వగతము] ఏ దిగంట మాటలాడుచుండి, మమ్ము చూచి మనోరమ చెట్లచాటునకు పోయినది. [ప్రకాశముగ] ఓరి, నీకింకను జ్ఞానములేదా? నీ యంతరమును నీ వెఱుంగవా? మాయమాటలతో ఆ యమాయికను లోఁబఱచుకొన యత్నించుచున్నావా? ఓరి దుర్జాతీ, నిన్నిప్పుడే యీ యావనదేవతలకు బలియిచ్చెదను.

[కత్తిదూసి మాధవునిపైకిపోవును. అంతలో మనోరను రాజశేఖర మాధవుల మధ్యకువచ్చి రాజశేఖరుని పట్టుకొని,]

మనోరమ: అన్నా, తొందరపడకుము. మాధవుఁడేల యింతటి పగ వాఁడాయెను?

మాధ: [గంభీర నిర్లక్ష్యభావముతో] రాజశేఖరా, యా యాట వస్తువును దాఁచియుంచికొనుము.

రాజ: [కోపముతో] ఏమీ, ఈకరవాలము నీహృదయ రక్తమును ద్రావునపుడు విషవ్యాళమని తెలిసికొందువు.

మాధ: [రాజశేఖరుని కరవాలమును పెరికి కొంచెముదూరముగ పడవైచి] మహానాయకుఁడా, అదిగో! నీకరవాలము పట్టిదాఁకి కఱకు మాయును. చక్కఁగ తుడిచి యొరలో దాఁచిపెట్టికొమ్ము.

మనో: మాధవా, నీవుకూడ అన్నకోపమునకు తగునట్లు ఆటలాడుచున్నావు.

రాజ: ఓరి కృతఘ్నుఁడా, నిన్నింతకఱకె చంపకుండినది తప్పు.
[క్రిందపడియున్న కత్తితీసికొని పైకిదూకును]

మనో: అన్నా, మన్నింపుము, మన్నింపుము.

రాజ: వెడలిపొమ్ము! సిగ్గులేనిదానా, మానమర్యాద లెఱుఁగవు. పరపురుషుల యెదుట స్వేచ్ఛంద విహారిణివలె నాట్యమాడెదవు.

మనో: [మాధవుని తట్టు అర్థగర్భితముగ చూచి వెడలిపోవును]

రాజ: ఓరీ, నీవు తిన్నయింటికి ద్రోహము సల్పువాఁడవు. చిన్ననాఁటనుండి మాయింటపెరిగిన దోషమున పాపశంకచే నిన్ను మన్నించితిని. వెడలిపొమ్ము. ఇఁక మా దివాణమున నడుగుపెట్టకుము. [విజయవర్మ దగ్గఱకుపోయి] మన మిఁక పోదము రండు.

విజ: [స్వగతము] అంతయు నా యాలోచన కనుకూలముగనే పరిణమించుచున్నది! ఈయసదృశ లావణ్యవతి కొఱకైన మాధవుని తుదముట్టింపవలయును. [ప్రకాశముగ] మిత్రమా, నాకు తలనొప్పి మరింత హెచ్చుచున్నది; నేను కొంత తడవు విశ్రమింపవలయును [జనాంతికము] నీవు మాధవునిపై కనుపఱచిన శౌర్యము నా కచ్చెరువు గలిగించినది. భేష్! రాజశేఖరా, భేష్! [వీపుతట్టును]

రాజ: [జనాంతికము] కనికరముతో వానిని చంపక వదలితిని; లేకున్న ఇంతకఱకె వాని కళేబరముపై కాకులు గ్రద్దలు గీగావులాడుచుండెడివి. మీరు ఇంటికి పోయెదరా?

విజ: నదుట తైలము రాచికొని కొంత విశ్రమించిననేగాని యుపశమించునట్లులేదు.

రాజ: నేను పోయెదను.

విజ: నీవు ఒంటరిగా వేఁటాడెదవా?

రాజ: ఈ యరణ్యము మాకు చిరపరిచితము.

[నిష్క్రమించును]

విజ: [స్వగతము] వెడలుము. పాతాళగృహముగూడ చిర పరచితము కాఁగలదు. [నిష్క్రమించును.]

మాధ: [అధోముఖుఁడై అటునిటు తిరుగుచు] మనోరథ నాస్థితిని మఱింత ఘోర మొనరించుచున్నది. నేను వెడలి పోవుదునేని ఆసుకుమార హృదయ తప్పక ప్రాణ పరిత్యాగము కావించుకొనును. ఇన్ని దూషణములకు, అవమానములకు నగ్గమయి ఇఁక నేనెట్లు వారి దివాణమున నివసింపఁగలను? ప్రియసఖీ, ఎట్టివిషమ సంఘటనము తెచ్చిపెట్టితివి! ఎట్టి పిచ్చియాస పురికొల్పితివి!

ప్రతి ఫలించిన చంద్ర బింబంబుగాంచి
యురముపై నిదురించుచు నున్నదనెడి
భ్రాంతిని సుఖించుఁ గుముదా కరంబు సరసి;
ఎంతదూరమ్ము, రెంటికి నెంత యెడము!

[నేపథ్యమున:] ఓమాధవా, పఁది, చచ్చితిని—చచ్చితిని—పంది. [అని దూరమునుండి వినఁబడును.]

మాధ: ఏమది? [ఒరనుండి కత్తిలాగికొని పరుగెత్తును]

తెరపడును.

స్థలము ౭: కొలువుకూటము.

[శాంతవర్మయు విజయవర్మయు కూర్చుండి, తెర యెత్తునప్పటికి సంభాషించు వైఖరిలో నుందురు.]

శాంతవర్మ: [దుఃఖముతో] అయ్యో! యింకెక్కడి రాజశేఖరుఁడు! ఇంకను బ్రతికియున్నాఁడా? రాత్రియంతయు దివిటీలు వేయించి యడవి యంతయు వెదకించితిని—మీరేల వాని నొంటరిగ వదలివచ్చితిరి?

విజయవర్మ: నే నెంత బ్రతిమాలినను వినక యుత్తరపు దిక్కునకు పోయెను. నేనుగూడ వెంబడింపఁ దలఁచితిని గాని, గొడ్డటితో చీల్చినట్టు తలనొప్పి పుట్టుచుండెను. విశ్రమింపవలయునని యింటికి వచ్చితిని. మాధవ వర్మగారు మాత్రము అడవియందే యుండిరి.

శాంత: ఏమీ, మాధవుఁడచ్చట నుండెనా? మాధవుఁడేఁడీ?— మాధవా.

[మాధవవర్మ ప్రవేశించును.]

శాంత: నీవుకూడ వేఁటకు పోయియుంటివా?

మాధవవర్మ: లేదు. ఏదూరదేశమైన పరుగెత్తి పోవుటకు పోవుచుంటిని గాని, నావిధి మరల నన్ను వెనుకకు మరలించినది.

శాంత: ఇదియేమి వెఱ్ఱి?

మాధ: ఇంతవఱకు పరగృహ వాసముయొక్క దైన్యమును పారతంత్ర్యమును నేనెఱుంగను. మీ వాత్సల్యముచేత మైమఱచి యుంటిని. ఆ మధురస్వప్నమునుండి రాజశేఖరుఁడు నన్ను మేల్కొలిపెను. పదిజన్మము లెత్తినను మీ ఋణము నేను తీర్చుకొనఁజాలను; లేక యుండిన మాయిరువురిలో నెవరైన నొకరు మరణించియుందురు.

శాంత: [తత్తరముతో] ఏమీ! ఏమిజరిగినది?

మాధ: నేను అరణ్యమున కేఁగునప్పటికి మనోరమయు దాసియు నచ్చట నుండెరి. నే నామె యొద్ద సెలవు పుచ్చుకొనుచుంటిని, అంతలో విజయవర్మ గారును రాజశేఖరుఁడును అచ్చటకు వచ్చిరి. ఆఁత డెట్లు నన్ను నిందించినదియు మీ రెఱుంగుదురు.

విజ: పాపము! మాధవవర్మగారు చాల యోర్పువహించి యుండిరి. [స్వగతము] మూఢుఁడా, నీ సత్యభాషిత్వమె నీమెడకు నరిత్రాడును బిగించును లెమ్ము.

మాధ: నన్ను సాఁకి సంతరించినవారి యెడ కృతఘ్నుఁడనుగనుండఁ జాలను. నావలన మీకుటుంబ శాంతికి భంగమేల కలుగవలయును? నన్ను విడనాడుఁడు. రాజశేఖరుఁడు తిరిగివచ్చునప్పటికి నే నింట నుండునేని అతఁడు నన్నొక మనుష్యునిగ లెక్కింపఁడు.

[ఇరువురు పరిచారకులు ఒక విరిగిన కత్తిముక్కను,
తలపాగను తీసికొని ప్రవేశింతురు]

ఒకపరిచారకుఁడు: [దుఃఖగద్గద స్వరముతో] పొద్దున్నె పోయి, మళ్లీ అడివంతా గాలించి గాలించి వెతికినాం. పుట్టపుట్టా చెట్టుచెట్టూ నూశినాం. ఆరణ్యకుల్యానదికి దగ్గరగా ఈకత్తితునక, యీతలగుడ్డ పడివుండింది.

శాంత: [ఆతురతతో] ఏవి! ఏవి!

[చేతులు చాఁపును. పరిచారకులు తలగుడ్డను కత్తిముక్కను అందింతురు.]

విజ: ఇది నిన్న రాజశేఖరవర్మ చుట్టుకొనిన తలపాగవలెనున్నది.

శాంత: [తలగుడ్డను కౌఁగిలించుకొని దుఃఖించుచు] అయ్యో! నా బిడ్డ నెవరో చంపిరి. కత్తితునుక నెత్తుట తడిసియున్నది. అయ్యో! నాయనా,

నీకేలయిట్టి ఘోరమరణము ప్రాప్తించినది? [దుఃఖించును]

విజ: [నిట్టూర్చుచు] అయ్యో ఎంతకష్టము! నేనెంత దురదృష్టవంతుఁడను! మీయింట నే నతిథినై యుండునప్పుడే యిట్టియిక్కట్టులు వాటిల్లవలయునా?

శాంత: ఇందుకు ఎవరేమి సేయుదురు? దైవము మాయెడ క్రూరము. ముసలి ముప్పున నిట్టి పుత్రశోక మనుభవించుటకు మేమెవరికేమి యెగ్గుచేసితిమి?

మాధ: ఇదియంతయు స్వప్నమువలెనున్నది. నేను నమ్మఁజాలను. రాజశేఖరుఁడు మరణించి యుండఁడు.

శాంత: నీమాటలే సత్యమగుఁగాక!

పరిచారకుఁడు: అక్కడ ముగ్గురు నలుగురు మనుష్యులు పెనగులాడిన లాగా అడుగు గుర్తు లగుపడు తున్నాయి.

మాధ: అచ్చట చచ్చిపడియున్న అడవిపంది కళేబరమును చూచితిరా?

పరి: లేదండి దొరగారు.

మాధ: [ఆలోచించుచుండును.]

శాంత: [ఆతురతతో] మాధవా, నీకేదో కొంత తెలిసినట్లున్నది, దాఁచిపెట్టకుము. అడవిపంది యేమిట్రి— చెప్పుము? రాజశేఖరు నెవరు చంపిరి? ఆక్రూరకర్ముఁడెవ్వఁడైనఁ గాని వానిని కండలు కండలుగ చెక్కించి గ్రద్దలకు వేయించెదను. ఆ హంతకుఁడు నేన యైనను నన్ను మన్నించుకొనను.

విజ: మీరు ఘోరప్రతిజ్ఞ చేయుచున్నారు. ఆడినమాట తప్పరని నాకు తెలియును. తొందర పడకుఁడు.

శాంత: ఇంతకన్న నాకు దుఃఖజనక మేమున్నది? వార్ధక్యమున నాయూఁతకఱ్ఱను విఱచి వైచిరి, నాకు మృత్యుమందిరమునకు దారిచూపించిరి. నాజీవితశేషమును ఘోరదండనముగ నొనరించిరి. మా పితృదేవతలు నీతాపనీరమునకైన నోచుకొనరు కాఁబోలు!—మాధవా, ఆ అడవి పందిని గురించి యేమిచెప్పితివి? [ఆలకించి] ఆఁగుమాఁగుము. రాజశేఖరుని కంఠస్వరమువలెనున్నది. [అందఱును ఆతురతతో చూతురు] రాజశేఖరా,—

[పరిచారకుఁడొకఁడు ప్రవేశించును]

పరిచారకుఁడు: ఇక్కడ ఎవ్వరూ లేరండి దొరగారు.

శాంత: [కోపముతో] ఓరి దున్నపోతా నీవఁటరా, పొమ్ము పొమ్ము. నీపాడుమొగము చూపింపకుము.

పరి: [నిష్క్రమించును]

శాంత: మాధవా, యేమంటివి? [తలపాగ తెచ్చిన పరిచారకుల తట్టుతిరిగి] మీరు పోయి మరల ఆతీర ప్రదేశమునంతయు వెదకుఁడు. రాజశేఖరుఁడు బ్రతికియున్నవార్త తెచ్చినవారికి గొప్పజాగీరు నిప్పించెదను. పొండు!

పరి: చిత్తం. [దణ్ణము పెట్టి, నిష్క్రమింతురు]

శాంత: మాధవా, ఆ అడవిపంది సంగతి యేమి?

మాధ: విజయవర్మగారును రాజశేఖరుఁడును వేఁటకై వెడలిన చాలసేపు వఱకును నాకేమియు తోఁపక యున్మత్తునివలె నచ్చట తిరుగుచుంటిని. 'అడవిపంది-అడవిపంది- చచ్చితిని, చచ్చితిని' అని కేక వినఁబడెను.—

శాంత: [ఆతురతతో] రాజశేఖరుని కేకయా? తరువాత?

మాధ. నే నట్లే యూహించితిని.

శాంత: నాయనా, నీవు తత్క్షణమె పరుగెత్తలేదా?

మాధ: పరుగెత్తితిని. నేను పోవునప్పటికి ఆ పంది రాజశేఖరునిపైకి దుముకుచుండెను. అతఁడు దానిని కత్తితో తప్పించుకొనుచుండెను. నేనొక్కనిమిష మాలసించి యుందునేని బెదరియుండిన ఆ యేనుపంది, పాపము! రాజశేఖరుని చీల్చివేసియుండును.

శాంత: దానిని పొడిచి నీవు రాజశేఖరుని కాపాడితివా? నిన్ను సాఁకిసంతరించిన ఋణమును తీర్చుకొంటివిగదా?

మాధ: గాని డొక్కలో నా కరవాలముతో నొక్కపోటు పొడిచితిని. అది రాజశేఖరుని వదలి నాపైకి దుమికెను. నేను తప్పించుకొని కత్తి నూడబెరుకునంతలో నది యొరఁగఁబడెను. అందువలన నాకరవాలము మొన విరిగిపోయెను, ఆ తునకరోమే యిది.

విజ: అట్లయిన దాని కళేబర మేమైయుండును? ఒకవేళ అడవి మృగములు తిన్నను అస్థిపంజరమైన నుండవలయునుగదా?

మాధ: అదియె దురూహ్యముగనున్నది.

విజ: తరువాత అచ్చటనుండి మీ రిరువురు కలిసికొని వచ్చితిరా?

మాధ: రాజశేఖరుఁడు కలవరమంది కొంతవఱకచ్చటనే నిలిచియుండెను. నాచేత రక్షింపఁబడెనన్న భావము అతనికి లజ్జాకరముగ నుండుటను గ్రహించి నే నచ్చటనుండక ఇంటివంకకు మరలివచ్చితిని. ఇంతవఱకే నాకు తెలియును.

విజ: [స్వగతము] నిన్నురితీయించుటకింతకన్న నెక్కుడవసరము లేదు.

శాంత: అట్లయిన రాజశేఖరుఁడేఁడి?

మాధ: నేనుకూడ ఆ ప్రశ్న అడుగవలయును.—నా కేదియో కొంత సందేహము కలుగుచున్నది. మరల నొకమా ఱాప్రదేశమునకు పోయి చూచివచ్చెదను.

విజ: ఉపయోగమేమి?

కాంత: అయినను పోనిండు. పొమ్ము, పొమ్ము; యథార్థము తెలిసి కొని రమ్ము.

మాధ: [నిష్క్రమించును.]

విజ: [స్వగతము] అచ్చట తలపాగయు కత్తియు నకయుఁ దప్ప నింకనేమియు దొరక నందున చాలమేలయ్యెను. మాధటుల తలగుడ్డలు చిక్కియుండిన!— [ప్రకాశముగ] మాధవవర్మ సుస్వభావముకలవాఁడు. సత్యమె చెప్పినట్లు తోఁచుచున్నది. అయినను రాజశేఖరుని వృత్తాంతము తెలియుటకు ఆయన సాహాయ్యము మన కావశ్యకము. ఆయన పరదేశ మునకు పాఱిపోవ నిర్ణయించుకొన్నవానివలె నగపడుచున్నాఁడు. ఆ యుద్దేశము నిన్ననే యంకురించినట్లున్నది.

కాంత: [స్వగతము] ఈమాటలలో నేదియో కొంత యనుమానము ధ్వనించుచున్నది. సత్యముగ నుండకుండునుగాక! [ప్రకాశముగ] అయ్యా, మీకు మాధవునిపై నేమైన నను మానము తట్టినదా?

విజ: మాధవవర్మ వినయవంతుఁడు. మీయెడ పితృభక్తి చూపు చుండును. నాకును ఆతనిపై సోదర ప్రీతి జనించినది. అయినను—— [కొంచెము నీళ్లు నములును.]

కాంత: ఏదియో చెప్పఁదలఁచి సంకోచించుచున్నారు.

విజ: ఏమియు లేదు. యథార్థము దెలిసికొనునంతవఱకు ఎవరిపైనను నేరము మోపుట న్యాయము కాదు. అందులో మీ యింట నిండు గారాబము నఁబెరుగుచుండి, మీ కెన్నఁడు నపకార మొనరించియుండని గుణవంతునిపై నాకేల సందేహముకలుగును? అయినను మానవస్వభావము స్థిరమైనది కాదు. రాజశేఖరుని హత్యకు కారణ ముండితీరవలయును.

శాంత: ఈ విషయమును మీరు శ్రద్ధతో విచారించుఁడు. ఇఁక మీ కన్న నా కెవరుదిక్కు?

విజ: నిన్న జరిగిన విషయములన్నియు పునరాలోచించిన కొంత వఱకు సత్యము నూహింపఁ గలము. మీరే యాలోచింపుఁడు.

శాంత: నాపుత్రుని హత్యనుగుఱించి నే నాలోచించుటలో ఒకవేళ అకాంక్షితముగ పక్షపాతము వహించిన వహింపవచ్చును; మీరు నిర్మల హృదయులు, న్యాయతత్పరులు, మీరె వివరింపుఁడు.

విజ: మే మరణ్యమునకుఁ బోవునప్పటికి మనోరమయును తానును మాటలాడుచుండిరని మాధవవర్మయె చెప్పియుండెను.

శాంత: అవును!

విజ: వారిని చూచినంతనె మీ కుమారుఁడు 'చంపెద'నని కత్తి దూసి మాధవవర్మపైకి దూఁకెను.

శాంత: రాజశేఖరుఁడు గర్వాంధుఁడు; మాధవుఁడు అవమానము సహించువాఁడు కాఁడు. వారిరువు రెప్పుడైన కలహింతురని నే నెఱుంగుదును.

విజ: మాధవవర్మకూడ కత్తిపై చేయిపెట్టెను.

శాంత: అట్టులనా! ఓరి కృతఘ్నుఁడా.

విజ: కాని, ప్రక్కన నుండిన నన్ను చూచి యూరకుండెను.

శాంత: మీరు లేనిసమయమునకు వేచియుండెను కాఁబోలు!

విజ: తర్వాత నే నింటికి వచ్చితిని. వారిరువురు అరణ్యమందే యుండిరి అట్టిస్థితిలో వారిని వదలి వచ్చుట అపాయకరమె; అయినను వాతల గొడ్డటితో చీల్చినట్లు నొప్పియెత్తుచుండెను; కొంతదూరము వచ్చి, వెనుకకు తిరిగి చూచితిని. మాధవవర్మ ముందుకు వెనుకకు నడచుచుండెను. అతని చర్యలన్నియును చిత్తసంక్షోభమును దెలుపుచుండెను.

శాంత: చక్కగా కనిపెట్టితిరి. చంపుటా వద్దా యను వితర్కముతో వాఁడట్లు తిరుగుచుండెను కాఁబోలు! ఎంతటి దురాత్ముఁడు!

విజ: తరువాత — ఎట్లుఊహింపుటకును తోఁపకున్నది. రాజశేఖరుఁడు ఆత్మహత్యచేసికొని యుండవలయును.

శాంత: ఆత్మహత్య చేసికొనవలసినంత యావసరమేమి కలదు? అంతయుం స్పష్టము! మాధవుఁడే వధించి యుండవలయును.

విజ: అదియును సంభవమే. అయినను నేనంత తొందరగ అభిప్రాయపడను.

శాంత: మీరు వానిపైఁగల యభిమానముచే వెనుకముందులాడుచున్నారు. నాకును వానిపై వాత్సల్యము కలదు. ఎట్టి దురవస్థ!

విజ: మీరట్లు తలఁపకుఁడు. నాకు అతని కన్నను రాజశేఖరుని కన్నను సత్యముపై నెక్కుడభిమానము. నాసోదరుఁడే యిట్టి హత్యగావించి యుండిన నేను వానిని వదలిపెట్టను కాని, మొదట సత్యము తెలియఁగవలయును.

శాంత: ఇప్పటికే యెఱింగితిమి.

విజ: మాధవవర్మ రాజశేఖరు నేల చంపవలయును?

శాంత: ఒడలెఱుఁగని కోపమువచ్చి చంపియుండును.

విజ: అంతమాత్రము చాలదు. మాధవవర్మయే మీ కుమారుని వధించెనని నిర్ణయించుకొందుమేని అందుకు నగాధమైన కారణ ముండవలయును. అతఁడు మనోరమను రహస్యముగ వలచియుండవచ్చును; రాజశేఖరుఁ డది యెఱింగి అతనిని మాటిమాటికి నిందించుచుండవచ్చును. ఆ యాటంకమును తొలఁగించుకొని మనోరమను పరిణయ మాడుటకే వధ గావించి యుండవచ్చును. ఇదియంతయు మన యూహ; సత్యము కాకపోవచ్చును.

శాంత: [చిత్తోద్వేగములో] ఇంకను సందేహమేల? అదురాత్ముఁడే నా కుమారుని వధించెను. వాఁడు కడుపులో కన్నులు గలవాఁడు. ఎంత దూర మాలోచించెను! ఓరి మాధవా, యిందుకా నిన్ను కన్నకొడుకు వలె సాఁకి సంతరించినది? పాముపిల్లకు పాలుపోసి పెంచుచుంటిని; తుట్టతుద కదియే నాకన్నులు పొడిచెను. అట్టి సౌజన్యము-అట్టి మొగము- రాక్షసహృదయమును దాఁచు ముసుఁగులైన యెడల లోకములోని సుజనులందఱిని వధింపుఁడు; అట్టి మొగములను చెక్కి వేయుఁడు. ప్రపంచమంతయు కపటనాటకము! మనసులో చంపునిచ్చ— మాటలలో తేనెతీపు! ఓరీ ఆతతాయి, స్వామిద్రోహి, కృతఘ్నుఁడా, నీవు బ్రతుకఁ దగవు. నిన్ను శిక్షించి లోకమునకు మేలు చేసెదను. నీవు తగిన మరణదండన మనుభవింతువుగాక!

విజ: మీరు తొందర పడుచున్నారు; ఇంకను విచారింతము. రెండు దినము లాలసింపుఁడు.

శాంత: రెండు నిమిష లాలస్యమైన సహింపనోపను. కాలయాపనము నా మనోనిశ్చయమును సడలింపవచ్చును—ఎవఁడురా అక్కడ బంటు?

బంటు: ఆజ్ఞ.

శాంత: మాధవుఁడు వచ్చిన వెంటనే కారాగృహమునకు పంపింపవలయుననియు ఎంతబ్రతిమాలినను నా దర్శన మిప్పింపఁగూడదనియు, నా కుమారు నెచ్చట ఆకూ్రరాత్ముఁడు వధించెనో అచ్చటనే వధ్యశిల నాటి వానిని ఖండింపవలయుననియు మామాటగా దండనాధికారికి తెలియఁ జేయుము. పొమ్ము.

బంటు: చిత్తం [నిష్క్రమించును.]

విజ: ఎంత కష్ట మెంతకష్టము!

శాంత: అయ్యో! రాజశేఖరా, నాకన్నులఁ గట్టుచున్నావు.

[దుఃఖించును.] తెరజారును.

స్థలము ౭: అంతఃపురము

[మనోరమ ముసుఁగుపెట్టుకొని పండుకొనియుండును. తెరయెత్తఁబడును, యశోధర ప్రవేశించును]

యశోధర: [పడక ప్రక్కకుపోయి మనోరమపై చేయివైచి] అమ్మా, లేచి కూర్చుండుము.

మనోరమ: [తల్లి మాటవిని లేచికూర్చుండును]

యశో: [మనోరమ ప్రక్కనకూర్చుండి బుజ్జగించుచు] చిన్నితల్లీ, కొంచెము పాలైనను పుచ్చుకొనుము; శోషవచ్చును.

మనో: అమ్మా, నీవుకూడ మాధవుఁడే వధించియుండు నని నమ్మెదవా?

యశో: అందఱును వాని మీఁదనే యనుమాన పడియున్నారు, ఎట్లు నమ్మవచ్చును? ఎట్లు నమ్మకపోవచ్చును?

మనో: మాధవుఁడింత ఘోరకృత్యమునకు తెగించియుండునని నేను నమ్మఁజాలను. వారొకటను విజయవర్మగారి యెదుటను అన్న నీచముగ పరాభవించినను రోషమునంతయు దిగమ్రింగి గాంభీర్యమూర్తియై నిలుచుండిన శాంతచిత్తుఁడు, 'తండ్రికి మరణ పర్యంతము ఋణపడియున్నా'నని చెప్పిన కృతజ్ఞుఁడు అన్నను వధించియుండునా?—కలలోనివార్త! అమ్మా, నాకదేలనో విజయవర్మగారిపై ననుమానము వొడముచున్నది. వనమున మాధవునిపై విషయపూరితమైన క్రూరదృష్టిని ప్రసరింపఁజేసెను. ఆచూపు ఇప్పటికిని నామనమున నంకితమైయున్నది.

యశో: మాధవునిపై ఆయన కేమి కంటగింపు?

మనో: మాకు పరస్పరానురాగము గలదని గ్రహించియుండును.

యశో: ఆయనంత దుఃస్వభావుఁడుగ నగపడుటలేదు. మాధవునిపై విజయవర్మగారికి మొట్టమొదట అనుమానమె కలుగలేదఁట! కాని, అప్పటి సందర్భములను ఆలోచింపఁగా నిజము మీ తండ్రిగారికే తోఁచినదఁట! ఒక విజయవర్మగారేమి? అందఱును మాధవుని సందేహించుచున్నారు. నిజము దేవుని కెఱుక.—మాధవా, నాకడుపు నిట్లు నేలపాలు చేసితివా!

[దుఃఖించును.]

మనో: అయ్యో! అమ్మకూడ నమ్ముచున్నది! అందఱును నమ్ముచున్నారు. ఇందఱు నమ్మునది సత్యము కాకయుండునా? మాధవా, నీవు నరహంతకుఁడవా? నీచేతులు మాయన్న నెత్తుటిలో తడిసి శీతలసుకుమార స్పర్శను గోల్పోయి రాక్షసము లైనవా?

లలిత పల్లవ పేశలంబైన హృదయంబు
అన్నహత్యకు నెట్టులాసగొనియె?
దీనరక్షా దీక్షనూని చేపట్టిన
కత్తి కీదుర్గతి కామ్యమగునె?
అత్యంతదుఃఖంబు నపనయించి సహించు
ధీరత్వమెయ్యెడ పూరిమేసె?
నిను సాఁకి సంతరించిన వృద్ధజనకుని
కిదియె కృతజ్ఞతాస్పద సమర్చ?
వలపువెన్నెల చిలుకు నీ కలికినుదుట
ఆతతాయి యటన్న రక్తాక్షరములు
ప్రజ్వరిల్లునె? యెంతటి పాతకంబు
నకుఁ గడంగితి వీవు? మన్ననయుఁ గలదె?

ప్రియసఖుఁడా, మనకు మరణపర్యంతము వియోగము!

యశో: అమ్మా, మాధవునకు మరణదండనముకూడ విధింపఁబడి నదఁట!

మనో: [దుఃఖముతో] ఏమీ!—మరణదండనమా? హృదయేశ్వరా, నా హృదయము నాకిచ్చిపొమ్ము. నీతోడ నరకమునకు తీసికొని పోకుము. [తల్లియొడిలో వ్రాలి దుఃఖించును.]

యశో: చిట్టితల్లీ, యూరడిల్లుము. పుత్రశోకముతో వకావకలైన నా హృదయమును మఱింత కలఁచఁబోకుము.

మనో: అమ్మా, మాధవుని వధించుటవలన అన్న బ్రతికివచ్చునా? ఏ పరదేశమునందైన అతనిని ప్రాణముతోనుండనీయరాదా?—మాధవా,

పెండ్లిమంటపమునఁ బ్రియముతో నాచేతి
పూలమాల తొడవు పొందనున్న
నీను కంఠమిపుడు నిర్దయమౌ గండ్ర
గొడ్డటికి బలియయి గోడుపడునె!

అమ్మా, యిఁక నన్నేమిచేసెదవు?

[తల్లి, యొడిలో యొరగి దుఃఖించును.]

యశో: తల్లీ, యూరడిల్లుము. అనివార్యదుఃఖ మనుభవించియే తీరవలయును.

మనో: మాధవా, అమూల్యమైన నీ రక్తము వధ్యశిలను పునీతము చేయనున్నదా?

ఎచ్చట నెత్రులొల్కి ప్రవహించునొ యయ్యెడలన్ గులాబిపూ
ల్విచ్చుత! కమ్మతావులటు వీచుత నీస్మృతి! తోఁటదాసినై
పుచ్చెదఁగాలముం గనులబుంగలఁ బాదుల నీరువోయుచున్;
అచ్చపు నాదు జీవితపు హారతి నెత్తెద నీ సమర్చకున్.

తెరపడును.

స్థలము ౯: కారాగృహము.

[వెలుతురు తక్కువగ నుండును. మాధవుఁడు ఉద్రిక్త చిత్తుఁడై యటునిటు తిరుగుచుండును.]

మాధవుఁడు: నన్నేల వీరీ యంధకార కారాగారమున బంధించిరి? నేనేమి యపరాధ మొనరించితిని? రాజశేఖరుని దుర్మరణమునకు నేను కారకుఁడనని యనుమానపడిరా? ఎంత అన్యాయము? బాల్యమునుండి నా స్వభావము నెఱింగిన శాంతవర్మయు నన్ను సందేహించెనా? పుత్రశోకమున మతిచెడి సత్యాసత్య వివేక శూన్యుఁడయి తన క్రోధమునకు నన్ను బలి యీయ నెంచెనా? లేక యిది యంతయు విజయవర్మ కపట కృత్యమైయుండు నా? అతఁడు నా పుట్టువచ్చ సంగతి విని సంక్షుబ్ధచిత్తుఁడాయెను. నాజన్మ రహస్యము విజయవర్మ యెఱుంగునా?— అదియెట్లు సంభవించును?— శాంతవర్మయె పొరపడియుండును. పాపము నేను నా రెవ్వరు? కృతఘ్నుఁడు ఆతతాయి అను పాపకళంకమును వహించి నిరయసదృశమైన ఈ కారాగారమున మరణపర్యంతము క్రుళ్ళవలయునా? అబ్బా!... మనోరమ యేమనుకొనుచున్నదో! భ్రాతృహంతనని నన్ను దూషించుచున్నది కాబోలు! ఘోరవిధీ, నేను నీ యజ్ఞపశువునా?

[నేపథ్యమున గంటలు వినఁబడును]

[ఆలకించి] నిశ్శబ్దయామినీ గభీరతను భంగించుచు అశుభ సూచక కఠోర కంఠస్వరముతో ఆగంట "అవును అవును" అని మ్రోగుచున్నది! [ఆలకించి] అదిగో! తలుపులో తాళపుచెవి తిరుగుచున్న ఘుర్ఘురధ్వని వినఁబడుచున్నది. నన్ను వధ్యశిలయొద్దకు తీసికొనిపోవ రాజభటులు వచ్చుచున్నారు కాఁబోలు!

[విజయవర్మ ప్రవేశించును]

మాధ: [సంతుష్టచిత్తుఁడయి] నీవా నన్ను వధింపవచ్చినది?
[విజయవర్మ రెండుచేతులు గట్టిగ పట్టుకొనును]

విజయవర్మ: మిత్రమా, శాంతింపుము. నిన్ను బంధవిముక్తుని చేయవచ్చితిని.

మాధ: [చేతులు వదలు జెట్టి] అటులనా? మన్నింపుఁడు. మన్నింపుడు; తప్పదలఁచితిని. మీరొక్కరే నాకు పరమమిత్రులు. ప్రత్యేక పక్షపాతులు. నా నిరపరాధిత్వమును దెలిసికొని నన్ను విడిపింపవచ్చితిరా? శాంతవర్మగారి సందేహము తీఱినదా? నిజమెన్నటికైన దాఁగదు; విడిపింపుఁడు, విడిపింపుఁడు. ఇఁకనొక్క నిమిషమైనను ఆత్మనాశనమైన యీ కారాగార దుర్గంధవాయువును పీల్చుకొనఁజాలను.

విజ: కరుణాపాత్రుఁడా, నీకు మరణదండనముకూడ విధింపఁబడినది.

మాధ: [నిర్విణ్ణుఁడైచూచి మరల నుద్రిక్తచిత్తముతో] ఏమీ? నాకు మరణ దండనమా! నన్ను విచారింపకయె శిక్ష విధించితిరా? ఇది దండనము కాదు; కుట్ర— హత్య— నరబలి. ధర్మశాస్త్రములు బలవంతుల దౌర్జన్యమున కుపపత్తి కల్పించుటకే వ్రాయఁబడెను గాఁబోలు. మానవసంఘమంతయు ప్రహసనము. [ఆలోచనాబద్ధచిత్తుఁడయి క్రిందిచూపుతో అటునిటు తిరుగుచు] నేను ఆతతాయిని!— ప్రళయంకరజ్వాలోద్గారి భూకంపము ఒక్కపెట్టున ఈ దుష్టప్రపంచమును కబళించునుగాక!...

నిశ్చయముగ నేనపరాధనని యూహమైనదా? —నీవాజ్ఞను నిర్వహింపవచ్చితివా?

విజ: మిత్రమా, శాంతిల్లుము. నీకు తోడ్పడవచ్చితిని.

మాధ: శాంతి! శాంతి! ఎక్కడిశాంతి? కటికవాని గండ్రగొడ్డలిని నిరపరాధుని కంఠముపై పెట్టి శాంతి బోధించుచున్నావు.

కఱకుటమ్ముల మేను గాటింపఁబడిన కే
 సరికి శాంతము నేర్పఁజాలుదేని,
జ్వాలాప్రచండమై జ్వలియించు దవవహ్ని
 కోరిమి శిక్షింప నోపుదేని,
భిన్నోన్ముఖంబైన భీకరాగ్ని గిరిండ్ర
 మునకు వాకట్టంగఁబూనుదేని,
ఝంఝామరుద్భిన్న నాగరోర్మికలకు
 నుహిత సంక్షోభంబు మాన్పుదేని

నాకు—నిరపరాధునకు—వినష్టసుఖుర
జీవితాశునకు—వ్యధావిశీర్ణమతికి—
మృత్యుభావనోన్మత్తున— కింక నీవు
శాంతి శాస్త్రంబు బోధింపఁజాలుదేమొ!

విజ: మాధవా, బహుభాషలకు సమయముకాదు. ప్రతినిమిషము నీ ఆయుఘను హరించుచున్నది. నీహితము కోరియుండనియెడల అర్ధరాత్రి మున నేనేల రహస్యముగ-ఈ కారాగృహమునకు వత్తును?

మాధ: [ఆశ్చర్యముతో] రహస్యముగనా!— మీమాటలు నాకర్థమగుటలేదు!

విజ: తెలవు! రేపు నీమరణదండనము నిర్వహింపఁబడును. నేనేమి సాహాయ్య మొనరించినను ఈరాత్రియే యొనర్పవలయును. ఒకఅశ్వమును

కొంత ద్రవ్యమును ఆయత్తపఱచియున్నాను. తప్పించుకొని వెడలిపొమ్ము. ఎచ్చటనైన పరదేశమున బ్రతుకవచ్చును. ఎంతటి అవివేకియైనను ఇట్టి యనుకూల సమయమును వ్యర్థపుచ్చఁడు. రమ్ము, రమ్ము. [చేయిపట్టుకొని లాగికొని పోఁబోవును.]

మాధ: [చేపట్టు వదలించుకొని] ఏమి?—నేను దొంగవలె పాఱి పోవలయునా?

ఆతతాయి యన్న యంక మామరణంబు
చాకివాని ఖరము నాటిమోసి
భారభూతమైన బ్రతుకు సంరక్షింప
యశముకన్నఁ బ్రాణ మంత తీపె?

విజ: తొందరపడుము; కానిమ్ము, కానిమ్ము. వెనుకముందు లాడకుము. నీ ప్రాణము—తరుణము.

మాధ: నా నిరపరాధిత్వమును మీరు శంకించుచున్నారా?

విజ: [విసుఁగుతో] వ్యర్థప్రసంగము—వెడలుము. నీకు జీవితముపైన ఆసయున్నట్లులేదు.

మాధ: నన్ను మీరు కనికరించి తప్పింపవచ్చితిరా? మీ సదుద్దేశమునకు కృతజ్ఞుఁడను కాని, మీ సాహాయ్యము నంగీకరింపఁజాలను. సర్వసాక్షియైన భగవంతుఁడొకఁడు కలఁడు. ఆ కరుణామయుఁడు నన్నిట్లు నిస్సహాయునిగ వదలి పెట్టఁడు.

విజ: ఓరీ బాలకుఁడా!—పరస్పరకబళనోద్యత ప్రాణిసంకులమైన యీప్రపంచము- నిశ్చేతనాంధకారశక్తి ప్రేరిత భూతప్రళయ నాట్యరంగమైన యీప్రపంచము- కరుణామయుని సృష్టియనుట కల్ల, అవివేకము.

మాధ: నీవు కలిపురుషుఁడవు.

విజ: కానిమ్ము, ఆపురాణపురుషుఁడే సామూలమున నీకు తోడ్ప డ నున్నాఁడు. అందు కేమందవు?

మాధ: సర్వశక్తి సంపన్నుఁడైన నియంత యిట్టి నీచకృత్యమునకు పురికొల్పఁడు. ఆకరుణామయుని సందేశ మెప్పుడును వంచనాకృతితో పొడకట్టదు. మీరు హితశత్రువులు; వెడలిపొండు, నా మనోనిశ్చయమును భేదింపకుఁడు.

విజ: [కరుణామయముగ] మాధవా, ఎంత పొరపడుచున్నావు! నూరేండ్లు బ్రతికిన వృద్ధుఁడైనను మరణించుట కిష్టపడఁడు. అయ్యో! నీవు యువకుఁడవు. మధురమైన ప్రాపంచిక సౌఖ్యముల రుచిచూచి యెఱుఁగవు. నీ వెంతకాలము బ్రతుకవలయునో, ఎన్ని సౌఖ్యము లనుభవింపవల యునో ఎంత సంతానమును పడయవలయునో యెవ రెఱుంగుదురు? ఎట్టి నికృష్టుని కైనను బ్రదుకు తీపుగదా! నీకేలయింత వైరాగ్యము?—నీవు నిర పరాధుఁడవు. వెనుక నైనను శాంతవర్మగారు పశ్చాత్తప్తులు కాఁగలరు. నీవు బ్రతికియుండిన పొరపాటు దిద్దికొనవచ్చును. ఎంత పశ్చాత్తాపమైనను మరణించిన నిన్ను పునర్జీవుని కావింప నేరదు. [భుజముపై చేయివేసి] నా మాటవినుము.

మాధ: [స్వగతము] ఇదియు సమంజసముగ నేయున్నది. నిరప రాధుఁడనని తెలిసియు నే నేల బ్రతుకఁగూడదు? ఇతరుల యవివేకమునకు నే నేల బలికావలయును?—ఎట్లయినను లోకము నన్ను సందేహించును. [ప్రకాశముగ] నేను తప్పించుకొని పాఱిపోయిన లోకు లేమందురు? హత్య చేయకుండిన ఇంత రహస్యముగ నేల పలాయనము కావలయు నని సందేహిం పరా? ఇంకను నొక్క దినము కలదు. అంతలో సత్యము తెలియవచ్చును.

విజ: నిన్నాదరింపని లోకులతో నీ కేమిపని? లోకులు కాకులు—

జీవితము నీయది. చేతిలోని నీటిని దిగవిడచి మబ్బులోని నీటి కాసించుచున్నావు. ఒకవేళ మనోరమయె...

మాధ: ఆ పావనహృదయునామము నిచ్చోట వచింపకుము. ఆ పేరునకుఁగూడ కల్మషమంటుకొనును.

విజ: ఆ కాంతయె నిన్ను తప్పించుకొని పొమ్మని చెప్పెనెడల?

మాధ: అట్లెన్నటికిని చెప్పదు. నేను నరహంతకుఁడనని ఆ కాంత నమ్మదు; ముమ్మాటికి నమ్మదు.

విజ: [విషపునవ్వుతో] నమ్మదు, నమ్మదు. ఆఁడువారు చక్కెర పూఁత విషగుటికలు; మూఢులు రసాయనమని నమ్మి సేవింతురు. ప్రేమ యవివేకుల స్వర్గము! కొనుటకును అమ్ముటకును వీలైన అంగడివస్తువు! శృంగారవతులు కాముకుల గంతగాడిదలఁజేసి అనురాగ సంభారము మోయింతురు! భ్రాంతినుండి మేల్కొనుము. ఎన్నిమణుగుల ప్రేమయైనను, ఎందఱు ప్రియురాండ్రయినను నీజీవమునకు సరిరారు. ఇవన్నియుఁజీవితముకొఱకే...

మాధ: [కోపముతో] నీ నిర్హేతుక దూషణము స్త్రీజాతి కంతటికి నాపాదించినను విశేషముగ మనోరమ కన్వయించునట్లు ధ్వనించుచున్నది. నిరూపింపకున్న నిన్ను ప్రాణములతో వదలను. [భుజముపట్టుకొనును]

విజ: [నిర్లక్ష్యముగ] మాధవా, నీవింకను బాలుఁడవు. వేచియుండుము, స్వానుభవమే బోధించుగ.

మాధ: నీవు వంచకుండవు. నాకు దృష్టాంతము కావలయును.

విజ: [చిఱునవ్వుతో] లేనియెడల?

మాధ: నీవు క్రక్కిన విషమును నీ నోటనే తినిపించెదను.

విజ: శెబాష్, మాధవా శెబాష్. [నవ్వును]

మాధ: నీ నవ్వుచాలించి నా కానవాలుచూపుము.

విజ: చూపెదను. ఉండుము. [జేబిలో వెదకుచు కనబడనియట్లు నటించి] ఆహా! యెక్కడనో జాఱిపడిపోయినది!

మాధ: పరనిందాపాత్రుఁడా, నీ టక్కులు కట్టిపెట్టుము. నీమాన ణము నుపసంహరించుకొనుము.

విజ: [మరల వెదకుచు] కొంచెము నిదానించుము.— ఆ! దొర కినది. ఆనవాలు.—

[మాధవుని చేతికి జాబు నిచ్చును.]

మాధ: [ఆతురతతో విప్పిచదువును] మసుగులో అక్షరములు స్పష్టముగ నగపడుటలేదు.‘మహారాజశ్రీ—విజయవర్మగారికి.—మనోరమ విన్నపము— కారణాంతరములచేత...’

విజ: ఆయుత్తరము కాదు. [మాధవునిచేతిలోనుండి తీసికొనఁ బోవును. మాధవుఁడియ్యక దానిని చదువఁబోవును] అది ప్రేమలేఖ సుమా, నీవు చదువ కూడదు.

మాధ: మనోరమ యక్షరములవలె నున్నవి!

విజ: అన్యుల ప్రణయలేఖను చదువుట మర్యాదకాదు. [తీసికొనఁ బోవును.]

మాధ: [ఉత్తరము విజయవర్మ కియ్యక కొంచెము ప్రక్కకు పోయి చదువును] ‘...కారణాంతములచేత నామనసు మాఱినందున మిమ్ముల నే వివాహామాడెదను—’

[చేతిలో జాబును ఉండగ నలుపును. నలుపుచుండఁగా జాబు అజ్ఞాతముగ క్రిందపడును. మాధవుడు కన్నులు పచ్చగ పోవుచున్న వానివలె, చెక్కిళ్లు రెండు చేతులమధ్య ఇరికించుకొని కూర్చుండును.]

విజ: [ఆ జాబుతీసికొని పరిపఠించిచూచుచు] ఇది దొంగజాబు కాదు! అక్షరముల నానవాలు పట్టితివా? స్త్రీలు విశ్వాసపాత్రలు—ప్రాణప్రదములు—వారి వాగ్దానములు శిలాక్షరములు.

మాధ: నేనే మందమతిని.

విప: కాదు, ప్రేమ సంభారము మోయుచున్న గాడిదవు.

మాధ: వంచింపఁబడితిని.

విజ: ఆడింపఁబడితివి.

మాధ: [స్వగతము] ఈజాబు నిక్కమా, కల్పితమా? మనోరమ అక్షరములవలె, నున్నవి. బ్రహ్మహంతకుఁడనని ఆ కాంత నన్ను పరిత్యజించెను కాఁబోలు. [లేచి- ప్రకాశముగ] ఒక్క నిమిషమైన మనోరమతో మాటలాడ సెలవిచ్చెదరా?

విజ: ఆ కాంత నీ మొగము చూచుటకైన నిష్టపడదు.

మాధ: [హఠాత్తుగ పిచ్చివానివలె] నీవు మనోరమను పెండ్లియాడెదవా? [విజయవర్మ పైకిరేగి రెండుచేతులతో గొంతుపట్టుకొని కుదిలించును]

విజ: [కష్టముతో తప్పించుకొని, మెడ తడవుకొనుచు స్వగతము] ఈదరిద్రుని చేతిలో నెంతబలమున్నది!

మాధ: [శక్తి తరగినవానివలె బెంచిపై కూలపడును]

విజ: [స్వగతము] వీడు వెడలునట్లులేదు. నన్నువరైనచూచిన నా యత్నమంతయు నిరుపయుక్తమగును. పాప! మా పిచ్చివాఁడు అది మనోరమ జాబనియే నమ్మెను! [ప్రకాశముగ] కడపటిమాట—వెడలెదవా, లేదా?

మాధ: పొమ్ము, పొమ్ము. నన్నొంటరిగ వదలిపెట్టుము.

విజ: చావుము, చావుము. ప్రజ్వలించుచున్న చితి తేయిනాలుకలతో నీకై నిరీక్షించు చున్నది. [నిష్క్రమించును]

మాధ: ఇంక నే నెవరి కొఱకు బ్రతుక వలయును? తల్లి శీతలకరుణా కటాక్షముల యాదరింపు నే నెఱుఁగను. తండ్రియుత్సంగ సౌఖ్యము కఱవయ్యెను; బంధువులు లేరు; స్నేహితులు లేరు; ఏకాకిని. నన్ను ప్రాణ పదముగ ప్రేమించు మనోరమయు ద్వేషించెను. జీవించుట నరకమైన యెడల చావు తప్పించు కొనుట యవివేకము. మనోరమ యిప్పటికిని నా హృదయముపై అధికారము చేయుచున్నది. ప్రేయసీ, భ్రాతృహంతవని నీవు నన్ను పరిత్యజించినను నేను నిన్ను ద్వేషింపఁజాలను. స్వప్నమందైన మరల నిన్ను చూడఁగలనా? ఎంత మంద భాగ్యుఁడను? నిదుర యుండినఁగదా స్వప్నము!

గున్నమావిచిగుళ్ళ కోమలత్వముగేరు
నంగుళి స్పర్శల యమృతరసము,
అరవిచ్చు సెలవుల నంకురించియు సిగ్గు
తెరగప్పు చిఱునవ్వు తేనె తెరలు,
అత్యంత శోక శుష్కాంతరంగముఁ దేర్చు
క్రేఁగంటి చూపుల ప్రేమ మదిర,
సరస సల్లాప చేష్టా భీష్ట గోష్ఠుల
గొన్నట్టి స్మృతి పాయసాన్న భిక్ష,
అన్నియుంగూడి పరలోక యాత్రయందు
దారి బత్తెంపు కొఱఁతను దలఁగఁజేయు,
నీ మనోహరమూర్తి నిర్నిద్రకాంతి
కాగడా వేయ నిశ్చింతఁ గదలువాఁడ.

[నేపథ్యమున కోడికూఁత వినఁబడును.]

[ఆలకించి] అదిగో! కోడికూఁత వినఁబడుచున్నది. వేగుజామయ్యెఁ గాఁబోలు. కాలమా, యెంతనిర్దయముగ జరిగిపోవుచున్నావు? ఇఁక నొక్క దినము— ఒక్కదినము! [దుఃఖోద్వేగముతో] తరువాత— వధ— వధ— నరబలి— నరబలి—

తెరపడును.

స్థలము ౧౦: విజయవర్మ స్వగృహము.

[మాలతీదేవి కూర్చుండియుండును; చెలికత్తెయగు రజని నెమిలికన్నుల విసనకఱ్ఱతో విసరుచుండఁగా తెరయెత్తఁబడును]

మాలతీదేవి: రజనీ, మా పినతండ్రిగారు పరివారమును పంపివేసిరఁట కదా? వారముదినములలో నింటికి వత్తురని వింటిని.

రజని: వారము దినాలే పడతుందో నెలదినాలే పడతుందో మన కెలా తెలుస్తుంది?

మాల: వారి నడిగి నీవేమైన సంగతులు తెలిసికొంటివా?

రజ: దొరగారు పెండ్లిచేసుకొనిగాని రారఁట!

మాల: [ఆశ్చర్యముతో] ఏమీ? పెండ్లియా? ఎప్పుడు? ఎవరు చెప్పిరి?

రజ: నే విన్నాను.

మాల: పెండ్లికార్యముకూడ నింతరహస్యముగ జరుగవలయునా? ఇంకేమైన సంగతులు గలవా?

రజ: పరివారం వచ్చినతోటే పాతాళగృహం దగ్గర తలుపులు తీసినట్లు సందడైందట.

మాల: ఇంకొక రహస్యము కాఁబోలు! రజనీ, ఆద్వారపాలకుని దగ్గఱ మెల్లఁగా ఆసంగతి తెలిసికొనివచ్చెదవా?

రజ: వాడు జాలి గుండెగలమనిషి. అయినా పోయివస్తా.

మాల: పొమ్ము, ఎట్లయిన తెలిసికొనిరమ్ము.

రజ: [నిష్క్రమించును.]

మాల: నా కనుమానము తట్టుచున్నది. ఎవనినో పట్టితెచ్చి యచ్చట బంధించి యుండవలయును. మా పినతండ్రి యెవ్వని సంసారమున కెసరువెట్టెనో గదా! ఆక్రూరకర్ముని పినతండ్రియనుటకు నాకు సిగ్గగుచున్నది.

తాను పెండ్లియాడినవెంటనే నన్నే పాళెగానికో యిచ్చి యిల్లు వెడలించును. నామేలు కోరు వారెవ్వరు? తల్లిదండ్రులులేని బిడ్డలగతి యిట్టిదేకదా!

రాజ్యతృష్ణచే మాతండ్రిని రహస్యముగ చంపించిన యాపాపాత్ముని చూచినప్పుడు దుఃఖమును దిగమ్రింగికొనుట యసాధ్యముగ నున్నది. ఎప్పుడెప్పు డీహంతకుని మొగము చూడక తప్పించుకొందునా యని వేయి దేవుళ్ళకు మ్రొక్కుచుందును. నాకోర్కె యింకను ఫలింపలేదు.

మాతండ్రి యెక్కుచుండిన గద్దియపై అతఁడు సుఖాసీనుఁడై యుండఁగాంచి నాహృదయము పెనములో వేఁగినట్లు ఆవిళ్ళు గ్రక్కుచుండును. నాతల్లి ఆ దుఃఖముతో మంచముపట్టి నవసినవసి మరణించినది. ఆఁడువారి గోడు తప్పక తగులునందురు! ఆ పరమ పతివ్రత శాపమెప్పుడు ఈ కుటిలాత్ముని ధ్వంసముచేయును; మాయన్నయైన బ్రతికియుండరాదా?

[రజని ప్రవేశించును.]

మాల: తెలిసికొని వచ్చితివా?

రజ: ఎవరో రాజపుత్రుడివలె వున్నాడు.

మాల: [ఆశ్చర్యముతో] రాజపుత్రుఁడా? పాపము! రజనీ, రమ్మ, నీవొకపని చేయవలయును.

[ఇరువురు నిష్క్రమింతురు.]

స్థలము ౧౧: పాతాళగృహము.

[లోన కొంచెము చీఁకటిగనుండును. రాజశేఖరవర్మ బెంచిపై కూర్చుండియుండును. ద్వారపాలకుఁడైన లతీఫ్‌సాహెబు రాజశేఖరునికి కనఁబడక ప్రక్క నుండును.]

రాజశేఖరుఁడు: [అటునిటు తిరుగుచు] ఎవఁడురా, యిక్కడ పరిచారకుఁడు? ఎంత అరచినను ఒక్క తొత్తుకొడుకైన పలుకఁడు.—ఓరీ,—ఎవడురా అక్కడ?—[పలుకరు]. వీరెవ్వరో పశుప్రాయులు. మట్టు మర్యాద తెలియఁగని మూఁకలు.

లతీఫ్‌సాహెబు: అరె! ఎవడ్రా యీమనిషి? చెప్పుకోసిన మేకాలాగా పుకార్ చేస్తాడ్. బందెఖానాలోకూడా పరిచారకుళ్ళు పట్టడిళ్ళా కావాలావుంది.

రాజ: మా దివాణమందేయైన నాకొక్క పరిచారకుని గుఱ్ఱపు కమిచీతో పట్టలు రేఁగఁ గొట్టియుందును.

లతీ: దౌలత్ సూస్కుంటే రాజాకి బేటాలాగానే వుండ్యాడ్.

రాజ: [గాలి యాఘ్రాణించి మొగము చిట్లించుకొని] ఛీ, ఛీ, ఎక్కడపట్టినను దుర్గంధము; దుమ్ము దుమారము; కిచకిచమని గబ్బిలముల వాగ్వాదములు. వీరికిల్లు చిమ్మటకైన నౌకరు లేఁడు కాఁబోలు. మెత్తలు కుట్టిన సోఫా యొక్కటియైనలేదు. తుదకొక్క మేజాబల్లయైనను కుర్చీయైన నుండ కూడదా?

లతీ: [నవ్వుచు] పడకటిల్లు అనుకొన్నాడ్ లాగావుంది.

రాజ: [బెంచిపైన కూర్చుండి మట్టియైన చేతులు చూచుకొని లేచి చొక్కా వెనుకతట్టు పట్టిపఱక చూచుకొని] అబ్బే! నాగుడ్డలన్నియు

మలినమైనవి. నన్నీ యింట దింపిన పెద్దమనుష్యునికి బుద్ధి చెప్పించెదను. నేను రాజపుత్రుఁడనని యెఱుఁగక యిట్టి నికృష్టమైన విడిది యేర్పఱచి యుందురు.

లతీ: అరె తోబా! ఈ యద్మీయింకా అదే లోకంలో వుండ్యాడ్! బందెఖానా అయా, యిది బందెఖానా- పిచ్చివయా.

రాజ: ఎచ్చటనో మాటలులుకుడు వినవచ్చుచున్నది. ఎవడురా అక్కడ? ఈయింటి యజమానుఁడెక్కడకు పోయెను. నన్ను పస్తుపెట్టఁదలంచెనా యేమి? ఏమి మొఱకుదనము! నాకిష్టమైన తినుబండములనైన అడిగి తెలిసికొనుటకు వంటవాఁడింకను రాఁడు.

లతీ: తినుబండాలూ- వంటవాడు వస్తాడ్ వస్తాడ్! సజ్జరొట్టె పప్పుపులుసు తెస్తాడ్! అరె దివానా అద్మి!

రాజ: ఉక్కపుట్టి చెమటకాఱుచున్నది. సురటివేయు నౌకరి యైనఁలేడు. ఈరాత్రి గడచుటయె దుర్భరముగ నున్నది.

లతీ: ఒంటిస్తంబం మేడామె వుండి గాలీ బోజనంచేస్తావుండ్యాడ్ లాగా అనుకొంటుండ్యాడ్! లస్సూ, పట్టె మంచాలు, పరుపు దిండ్లూ, బోగం పిల్లా, బొమ్మాయిపిట్టా కావాల్నా శెప్పండి సర్కార్, తెప్పిస్తాక్. [నవ్వును]

రాజ: ఇచ్చట నెవ్వరును కాపురముండునట్లు కనిపింపదు. నాకేదియో సందేహము పుట్టుచున్నది. దయ్యమునోట్లనుండి బ్రిహ్మరాక్షసుని నోడిలో పడితినా? ఈ మూల మెట్లగపడుచున్నవి. ఎక్కడికి పోవునో చూచెదను. [పోఁబోయి వెనుకకుతగ్గి] అంధకార కూపమువలెనున్నది.

ఎంత వితర్కించినను నాకేమియుఁ దోఁచకున్నది. నన్నుఁగట్టితెచ్చిన వారును వారినుండి తప్పించి నన్నిచ్చటికిఁ గొనివచ్చి రేపుప్రొద్దుననే మా పట్టణమునకు పంపెదమని చెప్పిన కపటాత్ముఁడును ఒక్క గూడెమువారేనై

యుందురా? తలంచుకొలఁది నాస్థితి భయంకరమగుచున్నది. మాతల్లిదండ్రు లెట్లు దుఃఖించుచున్నారోగదా? నన్ను వారెట్లు కనుఁగొని తప్పింపఁగలరు?

[నాలుగుమూలలు తిరిగిచూచి బెంచిపై కూర్చుండును.]

తప్పించుకొని పోవుటకైన దారిలేదు. [ఆలోచనా నిమగ్నుఁడై యుండును]

లతీ: మాకీబలే దాహం చేస్తావుంది. రజనీ పోసిన సారాయి కొంచెం మజాపట్టిస్తాఁ [ప్రక్కన కూర్చుండి కూజాలోని సారాయిఁద్రాగును] జమ్‌జమా మజాబలారే! రజనీకి నామీదా బలే యిష్వాసం వుంది. [కైపెక్కినట్లు నటించుచు] రజనీ! క్యామజా! క్యాతమాషా, స్వర్గం పాతాళం నరకం పాపం, పుణ్యాం, సబ్ దీంట్లోనే వుండాయ్. యిద్యా, బుద్ధి గొడ్డుగోదా, యిల్లూవాకిలి, పిల్లా పిసుగు, అంతా దరోబస్తు దీఁట్లోనే గుటగుటా గుటగుటా మున్గిపోతుందిబే. అరిరే యేక్యారే- నాకళ్ళునట్టిందాని పావడాలాగా గిర్రా గిర్రా— [పడిపోవును.]

రాజ: అన్నియు కఠినశిలానిర్మితములైన కుడ్యములు. నాజీవితాశ శిథిలమగుచున్నది.

[మెట్లపైనుండి అవగుంఠనము వైచికొన్న మాలతియు, దీపముపట్టుకొని రజనియు ప్రవేశింతురు.]

రాజ: [స్వగతము] ఎవ్వతె యీనాతిమణి! నాభాగ్యదేవతవలె ప్రసన్నమైనది!

మాలతి: [స్వగతము] ఎవఁడో సుందరుఁడైన రాజపుత్త్రుఁడు.

రజని: నేను మెట్ల తలుపుదగ్గిఱ వుంటాను.

[నిష్క్రమించును.]

రాజ: కాంతా, నీవు స్వర్గమునుండి నరకలోకమున జాఱిపడిన యచ్చర పూఁబోణివా?

మాల: మీ రెవ్వరు?

రాజ: ఇదియేమి వింత? కాలుసేతులుకట్టి తెప్పించినవారికి నన్నేల తెలియదు?

మాల: మీ దేపట్టణము?

రాజ: ఇదియేమి మాయలాడితనము? కాంతా, యిట్టి స్వయంవరములుకూడ లోకమున నుండునా?

ఓరచూపుల, మాటల, నొప్పిదముల,
నడల, యొయ్యారములఁ, బ్రేమనాటకముల
మగల వలపింతురు మగువలు; మడఁతి, వరునిఁ
జాకకట్టుగఁ దెచ్చిన జాణవీవె!

మాల: [నవ్వుకొని స్వగతము] పాప మీ రాకొమారుఁడు పొరఁబడెను. [ప్రకాశముగ] మిమ్ము తెప్పించిన వా రితరులు; మీకు సాహాయ్యము చేయుతలంపుతోనే నిచ్చటకు వచ్చితిని.

రాజ: [ఆశ్చర్యముతో] అటులనా! కాంతా, నాయధిక ప్రసంగమును మన్నింపుము.

మాల: [చిఱునవ్వుతో] ఒకొకప్పుడు అధికప్రసంగముగూడ నింపుగనే యుండును.

రాజ: నే నెప్పుడును నీవంటి యువతీమణిని చూచి యెఱుఁగను; సౌందర్య సౌజన్యముల కింతటి పొత్తుకుదిరియుండుట యరుదు.

ఆరిపోయెడు దివ్వెకు నాజ్యమటుల
నీ కటాక్షము ప్రాణేచ్ఛ నింపెమదిని;
నీ మనోజ్ఞత యీ పొగగీమెకాదు
నా మనంబును వెలిగించె హేమగాత్రి.

మాల: [స్వగతము] మా పినతండ్రి సుపాత్రు నింకొక విధముగ వరప్రసాదియయ్యెను. ఈసుందరాంగుని చూచి నప్పటినుండియు నామనము నావశము కాకయున్నది. [ప్రకాశముగ] రాజకన్యక లిట్లు పరపురుషులతో మంతనములాడుచుండుట యుచితము కాదు. మీరెవ్వరైనదియు తెలియక నే నెట్లు తోడ్పడఁగలను?

రాజ: లతాంగీ, నేను వసంతపురము నేలు శాంతవర్మగారి కుమారుఁడను.

మాల: [ఆశ్చర్యముతో] శాంతవర్మగారి కుమారుఁడవా?

రాజ: ఏల యిట్లు వెఱఁగుపడితివి? మాతండ్రిని నీవెఱుంగుదువు?

మాల: ఎఱుఁగను. ఎన్నఁడో ఆపేరు వింటిని.

రాజ: [స్వగతము] నేనింతకుమును గమనింపలేను. మాధవుని మొగము పోలికలు ఈకాంత కున్నట్లు తోఁచుచున్నది!

మాల: మీకు సోదరి యున్నదా?

రాజ: ఉన్నది. ఏల?

మాల: ఆమెకు వివాహమైనదా?

రాజ: ఇంకను కాలేదు. విజయవర్మయను నొక జమీందారున కియ్యవలయునని నాయనగారి కోరిక; ఆసంబంధము నాకిష్టము లేదు. మా తల్లికిని నచ్చలేదు.

మాల: [స్వగతము] ఆ దుర్మార్గుని పన్నుగడ ఇప్పు డర్థమయ్యెను. అంతరాయము తొలఁగించుట కొఱకే దౌర్జన్యము కల్పియుండును.

రాజ: మనోహరీ, నన్నెవరు పట్టితెప్పించిరి? నే నెచ్చటనున్నాను? నీ వెవ్వతెవు?

మాల: [ఆలోచనా నిర్మగ్నయై యుండును]

రాజ: నీకు తల్లిదండ్రు లున్నారా?

మాల: మా పినతండ్రి రాజ్యాశకు బలియైరి!

రాజ: ఆ దుశ్చరితుఁడెవ్వఁడు?

మాల: మిమ్ము తెప్పించిన యతఁడు.

రాజ: [ఆశ్చర్యముతో] మీపినతండ్రియా?

మాల: మా పినతండ్రియే కాదు; మీయింటి యల్లుఁడుకూడ!

రాజ: [పిడుగడఁచినట్లు నిలబడి] ఏమీ! విజయవర్మయా? ఓరి దురాత్ముఁడా, అతిజన కలంకుఁడా, గోముఖవ్యాఘ్రమా, ఏమి మాయ నాటకమాడితివి? ఇంకను మాతలిదండ్రులు బ్రతికియుందురా? మాధవుఁడు చాల బుద్ధిశాలి. విజయవర్మ చర్యలను అతఁడు శంకించుచునే యుండెను.

మాల: మాధవుఁ డెవఁడు?

రాజ: సాఁకుడు బిడ్డ?

మాల: ఎవరు సాఁకిరి?

రాజ: మాతల్లిదండ్రులు. కొన్ని సంవత్సరములకు పూర్వము ఒక పసిబాలుఁడు మూర్ఛతగిలి మావాకిట పడియుండెను. మాతల్లిదండ్రుల కప్పటికి సంతానము లేనందువలన వాని నెత్తి పెంచుకొనిరి.

మాల: రాజులు పెంచుకొనఁదగినంతటి బిడ్డయా?

రాజ: రూపవంతుఁడే.

మాల: అప్పటికి వాని వయస్సెంత?

రాజ: రెండుమూఁడు సంవత్సరము లుండవచ్చునని చెప్పిరి.

మాల: మాయన్నకూడ అప్రాయముననే మరణించెనఁట! [స్వగతము] ఆహా! ఎంత పిచ్చిదానవు. మరణించినవారు తిరిగ వత్తురా? [ప్రకాశముగ] అతఁడు క్షత్రియుఁడని అనిపించుకొనఁదగియున్నాఁడా?

రాజ: [సగర్వముగ] సౌందర్యమున నన్ను మించువాఁడు కాఁడు; అయినను కొంచెము బలిష్ఠుఁడాయెను. తల్లి దండ్రులులేని బిడ్డయని యెంద ఱును వానిని ఆదరించుచుందురు. గర్విష్ఠుఁడు. తానొక సార్వభౌముని కుమారునివలె నటించుచుండును. నీ మొగము చూచిన అతఁడు జ్ఞప్తికివచ్చును.

మాల: ఈ సుందరభాగ్య కంతటి యదృష్టమా? అతనితోడపై పెద్ద పుట్టుమచ్చయున్నదా?

రాజ: [ఆశ్చర్యముతో] నీకెట్లు తెలియును?

మాల: [ఆతురతతో] ఉన్నదా? చెప్పుఁడు.

రాజ: ఇది యేమిచిత్రము! ఆ వాఁడు విజయవర్మకూడ మాధవుని పుట్టుమచ్చ విషయము విన్నపుడు సంక్షుబ్ధచిత్తుఁడయి వెలవెలబోయెనఁట!

మాల: మచ్చయున్నదా? మాయన్న బ్రతికియున్నాఁడు! అన్నా —అన్నా— [మూర్ఛిల్లఁబోవును. రాజశేఖరుఁడు పట్టుకొని బెంచిపై కూర్చుండ పెట్టును]

రాజ: మాధవుని జన్మరహస్యము తెలియవచ్చినది.— లతాంగీ, యూరడిల్లుము.

మాల: అన్నా, మగల నీ వా హంతకుని కంటఁబడితివా? [లేచి] ఇంకొక్క నిమిష మాలస్యమైన కార్యముచెడును. ఆ రాక్షసుఁడు మా సోదరిని వివాహమాడఁబోవుచున్నాఁడు. మా అన్నవిషయమై నాకను మానము కలుగుచున్నది. మనము తత్క్షణమె రహస్యముగ వెడలిపోవలయును. వారు గుట్టుపుస్వారి తెలియును. ప్రాణ ప్రయోగమెఱుఁగుదును.

రాజ: కదలుము. [ఇద్దఱు మెట్లపైనుండి పోవుదురు]

తెరపడును.

స్థలము ౧౨ : సమరసేనుని గృహము

[సమరసేనుఁడు అటునిటు తిరుగుచుండఁగా తెర యెత్తఁబడును]

సమరసేనుఁడు: విజయవర్మకు వివాహమయి వచ్చినవెంటనే నా వివాహమును గుఱించి మరల హెచ్చరించెదను. మాలతిపై నానాఁటికి నాకు వలపు హెచ్చుచున్నది! ఆ కాంత నన్నుఁ బరిణయమాడునా? ఎట్లయినను పినతండ్రి యాజ్ఞకు మాఱాడఁజాలను. నేను మాలతినే పెండ్లియాడిన యెడల రాజ్యాధిపత్యము వహించుటకుఁగూడ పి.లుందును. మాధవునికి తన జన్మ రహస్యము నెఱిఁగింతును. నేను సైన్యాధిపతినగుట వలన సేనయంతయు నన్ననుసరించును. మాధవుఁడు నాకు మఱఁదియగుటయే గాక కృతజ్ఞుఁడుగ నుండును. [సగర్వముగ] ఆతని పేరు పెట్టి నేనే రాజ్యమునంతయుఁ బరిపాలింపఁగలను.

[నేపథ్యమున కలకలము]

అర్ధరాత్రిమున కోటలో ఏమి యీ కలకలము! [ఆలకించును]

[నేపథ్యమున- "దొంగలు, దొంగలు, పట్టుకొనుఁడు, కొట్టుఁడు, దివిటీ తెండు, హా, హా" ఇత్యాది]

సమరసేనుఁడు: దొంగలా?

[అచ్యుతవర్మయు కొందఱు సేనకులును ప్రవేశింతురు]

సమ: అచ్యుతవర్మా, ఏమి యీ కలకలము?

అచ్యుతవర్మ: మనము పాతాళగృహమున బంధించియుండిన ఖైదీ తప్పించుకొని పాఱిపోయెను.

సమ: [ఉద్రిక్తుఁడై] ఎట్లు తప్పించుకొనెను?

అచ్యు: బయటి తాళములు వేసినట్లే యుండెను.

సమ: లోపలకూడ మెట్లున్నవి. అచ్చటమాచితిరా? పోండు. పోండు.

[రజని ప్రవేశించును]

రజని: [దుఃఖించుచు] చిన్నదొరసానమ్మకూడ కనఁబడలేదు; గుఱ్ఱాలు పరిగెత్తుండిన శబ్దమైంది.

సమ: [కోపావిష్టుఁడై] ఆ! ఇదియంతయు మాలతీదేవి పన్నాగము పరుగెత్తుఁడు, పరుగెత్తుఁడు. గుఱ్ఱముల నాయత్తపఱచుఁడు. భటులను లేపుఁడు. పోండు.—— మా యాలోచన లన్నియు భగ్నమై పోయినవి. ఇంకను ఇచ్చట నేయున్నారా? పోండు. నా గుఱ్ఱము నాయత్తము చేయుఁడు.

[సేవకులు నిష్క్రమింతురు. అచ్యుతవర్మ అచ్చటనే యుండును]

ఆలసించిన మన ప్రాణములమీఁదికి వచ్చును. అచ్యుతవర్మా, మన మకూడ పోవుదము రమ్ము. [నిష్క్రమించును]

అచ్యు: నేను వేచియుండిన సమయ మిప్పుడు దొరకినది. అడవిలో తప్పువారి తీసి ఈతని నచ్చట తెగటార్చి విజయవర్మగారికి నే నిచ్చినమాట చెల్లించుకొనెదను

[నిష్క్రమించును]

స్థలము ౧౩ : అడవి.

[అంతయు కొంచెము చీఁకటిగనుండును. భటులు కొందఱు పుల్లి దివిటీలు పట్టుకొనియుందురు. కొందఱు విచ్చుకత్తులతో నిలఁబడియుందురు. మాధవవర్మ వధ్యశిలయొద్ద నిలఁబడియుండును. కటికవాఁడు గండ్రగొడ్డలి భుజముపై పెట్టుకొని యుండును;
తెర యెత్తఁబడును]

మాధవవర్మ: ఓదౌర్జన్యరాక్షసీ, ఎందఱు నిరపరాధులు, సత్యవంతులు, ధర్మబద్ధులు నీరథచక్రముల క్రిందపడి నుగ్గునూచయిపోవుచున్నారు? ఎందఱి యస్థిపంజరములతో నీ భోగమందిరము నిర్మింపఁబడుచున్నది? ఎందఱి యమాయకుల రక్తపూరము తీఱరాని నీతృష్ణను తీర్చుచున్నది?— సత్యమా, నీవెల్లప్పటికి దుఃఖభాగవాహినివె!

ఆపద్బాంధవా, దీనసంరక్షకా, జగదీశ్వరా, నేను నిరపరాధుఁడను. నీవు సర్వజ్ఞుఁడవు. నేను దౌర్జన్యమునకు బలిపశువును. నీవు సర్వశక్తిమంతుఁడవు. కరుణామయుఁడవు.—

పాదుచేసి నీరు పాఱించి, మొలకను
నాటి పెంచినావు తోఁటయందు;
పూఁత పిందె కాయ పొడసూపు నదనున
చెట్టుమొదలు నఱుకు చిత్రమేమి?

మహాప్రభూ, నీయుద్దేశమేమి? నీలీల దురూహ్యము!

నేను సంతోషముగ మరణింతును. ప్రేమ సూత్రములతో నిహలోకమునకు నన్ను బలవంతముగ బంధింప నేప్రాణియును లేదు. నా దురదృష్ట జీవిత కావ్యమున కడపటి యాశ్వాసము రక్తాంకితాక్షరములతో పరిసమాప్తమగుచున్నది!

[జోబీలోనుండిన చేతిగుడ్డను తీసికొని దానిని చూచుచు]

సచేతనములకన్న నచేతనములే విశ్వాసపాత్రములు! నీవు నా కన్నీటిధారల మాధుర్యము నెఱిఁగిన, దానిలో నూరవపాలు మీస్వామిని యెఱిఁగి యున్నయెడల?—మనోగమా, నీవు ప్రణయ బహుమానముగ నొసఁగిన యీ రుమాలుగుడ్డయె నాశవమునకు కడపటి యలంకారము!

[భటులు కన్నీరునించుచు; రుమాలుగుడ్డ కన్నులకు కట్టుకొని]

దైవమా, నీయభీష్టము నెఱవేఱుఁగాక! ఓయీ, నీవిధిని నిర్వర్తింపుము. [వధ్యశిలపై తలపెట్టును]

కటికవాఁడు: [స్వగతము] ఇంత నెమ్మదిగా సచ్చిపొయ్యే మారాజును నేనెప్పుడు సూళ్ళేదు. [ప్రకాశముగ]

అన్నము పున్నము ఎఱుగను నేను అంతా మాదొరదే;
ఆకలిబాదకు నౌకరిచేస్తా, అంతే నా యెఱిక.
తప్పుడు నౌకరి కొప్పుకుంటిని తప్పదు నాకింక,
కళ్ళుమూసుకుని పాపముచేస్తే కర్మముంటదంట!
పసుసు దొరోరిని సంపబోయితే గడగడ వణుకును చెయ్యి.

[రాజశేఖరుఁడు, పురుషవేషధారిణియైన మాలతియు ప్రవేశింతురు]

రాజశేఖరుఁడు: ఆ వెలుఁతురేమి? ఆ! వధ్యశిల

మాధ: ఏల ఆలసించెదవు? నిమిషయాపనము దుస్సహముగ నున్నది.

రాజ: మాధవుని కంఠస్వరమువలె నున్నది.

కటి: [తొందరగ చదువును]

గండర గొడ్డలికి సత్తెమువుంటె కాళమ్మవుంటె
వొక్క యేటుకే మొండెమునుంచి వూడిపోవు సిరసు.

[గొడ్డలి నైకెత్తును]

రాజ: ఊడిపోదురా నాపిశాచీ, ఊడిపోదు.

[ఎత్తిన గొడ్డలిని పట్టుకొనును]

కటిక: [తిరిగిచూచి] ఒయ్యో, ఒయ్యో, దెయ్యం దెయ్యం. చిన్న దొరయ్య దెయ్య మయ్యాడు. [కెవ్వుకేక వేయును, భటులు భయపడుదురు]

రాజ: నేను మరణించితిననుకొని యుంటిరా?

మాల: నేను సందేహించినట్లే నైనది. మనము సమయమునకు రాకున్న!

మాధ: [మెల్లగ తలయెత్తి కన్నులకు గట్టుకొన్న రుమాలువిప్పి] ఏమి దయ్యమురా? [రాజశేఖరుని చూచి] ఆ! నన్ను బ్రతికించుటకై స్వర్గమునుండి పరుగెత్తుకొని వచ్చితివా?

రాజ: [మాధవుని కౌగిలించుకొని]మాధవా,యిది యేమి దురవస్థ?

మాధ: నీవు నిజముగ బ్రతికియున్నావా? స్వప్నము కాదుకదా? [రెండు భుజములు పట్టుకొని కుదలించును]

కటిక: [భటులతో జనాంతికము] మణిశిలాగే వుండాడు. సావ లేమరో, అయ్యా.

మాధ: నిన్ను హత్యచేసితినని మీతండ్రి నాకు మరణదండనము విధించెను.

రాజ: అయ్యో! ఎంత ప్రమాదము. ఒక్కనిమిష మాలస్యమై యుండిన తీరరాని దుఃఖము ననుభవించి యుందుము.

మాధ: ఒక్కక్షణములోన నుత్కట దుఃఖంబు
మఱుక్షణంబునందు మాఱుపాటు!
కలలువోలెఁ దోఁచుఁ గలుములు లేములు!
బలు తుపాను కడలి పడవ నరుఁడు.

మాల: [సందేహించుచువచ్చి] అన్నా, మాయదృష్టవశమున బ్రతికితివి. [కౌఁగిలించుకొని కన్నీరునించును]

మాధ: రాజశేఖరా, యీ ప్రియబంధు వెవ్వఁడు?

రాజ: మీ సోదరి.

మాధ: [ఆశ్చర్యముతో] నా సోదరి! నేనెవ్వఁడను?

రాజ: విజయవర్మ అన్నకుమారుఁడవు. మీతండ్రిని అతఁడు వేఁటలో చంపించెను. నిన్నును శిశుప్రాయమున చంపింపఁబోయెను; నన్ను పాతాళగృహమున బంధింపఁజేసినదియు అతఁడే. ఇది యంతయు నిన్ను వధింపించి మనోరమను పెండ్లియాడుటకు చేసిన పన్నాగము.

మాధ. [ఉద్రిక్తచిత్తుఁడై కటికవానిచే గొడ్డలి పెరుకుకొని] ఓరి దురాత్ముఁడా, వచ్చితివి. చచ్చితివి. [పరుగెత్తును]

తెరపడును.

స్థలము ౧౮: వివాహమంటపము.

[తెరయెత్తఁగనే పుష్పమాలాంకృతులైన మనోరమా మాధవులు, మాలతీరాజశేఖరులు; మఱియు రాజ బంధువులు పౌరోహితుఁడు తక్కుంగల ఇతర సభాసదులు అగపడుదురు.]

పౌరోహితుఁడు: [ఆశీర్వదించుచు]

అల యరుంధతియు వసిష్ఠునటుల మీరు
నిత్య మన్యోన్య మధుర దాంపత్యగరిమ
నాయురారోగ్య విభవసౌఖ్యంబు లొంది
పుత్రపౌత్రాభివృద్ధిఁగఁ బొల్తురుగాత!

సంపూర్ణము.

కాంగ్రెస్‌వాలా.

ఏకాంక రూపకము.

౧౯౩౫. ఏప్రిల్



పాత్రలు

వెంకటరెడ్డి	కాంగ్రెసువాలా
నరసింహం	కాంగ్రెసు వాలంటీరు
రంగారావు	రవీంద్రుని శాంతినికేతన విద్యార్థి
కళ్యాణరెడ్డి	పుదుచ్చేరి అరవిందు ఆశ్రమవాసి
లాల్ గుడి వెంకటేశయ్యరు	హోటల్ సొంతదారు
జంగ్లి	ఎంగిలిప్లేట్లు తీయు ఏనాది
గమళ్ళ వెంకటేసు ఆతని భార్య—బిడ్డ; రోగి— ఆమెబిడ్డ	రంగనాయకుల తిరునాళ్ళ చూచుటకు వచ్చిన యాత్రికులు
ఇద్దఱు విద్యార్థులు	
ప్లీడరు—ఆయనభార్య	

కాంగ్రెస్‌వాలా

[ఏకాంకరూపకము]

స్థలము ౧. నెల్లూరు.

[లాల్‌గుడి వెంకటేశయ్యరు కాఫీహోటలు. కాఫీ హోటలులో నాలుగు అంకణముల గది. గోడలకు కాంగ్రెస్ నాయకుల పటములు, రవివర్మా పటములు తగిలించఁబడియున్నవి. వాకిలికి ఎదురుగా నున్న గోడపై గడియారపు స్టాండు అమర్పఁబడి దానిపై వెంకటేశ్వరుల పటము పెట్టఁబడియున్నది. చిన్న యిత్తడి శెమ్మె, సాంబ్రాణి వత్తుల స్టాండు, పటము ప్రక్కన నున్నవి. ఒకమూల చిన్న టేబిలుపై గ్రామో

ఫోను, ప్లేట్లు, ఎలక్ట్రిక్ ఫ్యాన్ (fan) పెట్టబడియుండును. తెర యెత్తునప్పటికి ఎంగిలి ప్లేట్లు- తామరాకులతో నిండిన టేబిలు కనబడును.

రంగారావు ప్రవేశించును. ఈయన వయస్సు షుమారు ఇరువదిరెండు సంవత్సరములుగ నుండును. చెవులమీదికి వ్రేలాడు పొడుగాటి క్రాపు వెండ్రుకలు, కంటికి 'ప్రిన్సునెజ్' సులోచనములు, వేస్టుసిల్కు పక్కజోబీ కుడితిని, సిల్కుకద్దర్ బెంగాలీకప్పు, చేతి గడియారము, కుడిచేత జపానుదేశపు ఎదురుకఱ్ఱ, ఎడమచేత (hand camera) చేతిక్యామర ఇవి రంగారావు అనివార్య బాహ్యలక్షణములు; అలంకారాలు.]

రంగారావు: అయ్యర్. [ఎవ్వరు పలుకరు.] [సులోచనములు సర్దుకొనుచు నలువైపుల చూచి] ఈహోటళ్ళుకూడా మన భాగ్యవంతుల బంగళాలాగే పటాలంగళ్ళుగా తయారయ్యాయి. డెకరేషన్ (decoration) కూడా వొక ఆర్టని, ఆర్డరు-అరేంజిమెంటు-టేస్టు-అనేవి ఈప్రపంచములో వున్నాయని వీళ్ళకు తెలియకపోవడం ఘోరం. [ఈగలు మూగుచున్న ఎంగిలి ప్లేటను తామరాకులనుచూచి] పూర్వకాలంలో తామర పూవుల పైకి తుమ్మెదలు మూగి ఝుంకారం చేస్తూవుండేవని కవులు వర్ణించేవారు. ఇప్పటి కవులు, ఈలాంటి హోటళ్ళలో ఎంగిలి తామరాకులపైకి మూగే ఈగల అవ్యక్తమధుర గానాన్ని అభివర్ణించవలసి వుంటుంది.— అయ్యర్- [కఱ్ఱతో టేబిలు తట్టును.]

అయ్యర్: [ప్రవేశించి] కూసుకోండిమి. ఏం తెచ్చేదండి.

రంగా: ఆ సంగతి తర్వాత, ముందు ఈకవితా సామగ్రిని తీసి వెయ్యించండి.

అయ్యర్: ఆ జంగ్లీగాడికి ఎన్నిమాట్లు చెప్పినా దినం కొత్తేనండి. ఏమిరా జంగ్లీ— ఏమి చేస్తున్నావురా?— ఈ ప్లేట్లు తీసివేయ్.

[ఇంతలో ఏనాడివాడు బక్కెట్టు పట్టుకొని వచ్చి ప్లేట్లను ఆకులను దానిలో వేసికొని ఒక మురికిగుడ్డతో టేబిలును తుడిచిపోవును.]

అయ్యర్: స్వీటు కావలిస్తే— బాదంహల్వా, రవాకేసరి, మైసూర్‌పాక్, లడ్డూ, జాంగ్రీ, పాల్‌కోవా, గులాబ్‌జామ్, గారిజాల్, ఎట్‌సెటెరా. కారం కావలిస్తే— కారాబూంది, పకోడి...

[కళ్యాణరెడ్డి ప్రవేశించును. ఈయన మల్లుచొక్కా తొడిగికొని గోరంచు ఉత్తరీయము వేసికొనియుండును. వయస్సు షుమారు ముప్పది సంవత్సరము లుండును.]

కళ్యాణరెడ్డి: ఓహో! ఎప్పుడొచ్చారండీ, రంగారావుగారూ?

రంగా: వారం రోజులైంది.

కళ్యాణ: చాలరోజులకు దర్శనం.

రంగా: మీరు గ్రామంలోనే వున్నారా?

కళ్యాణ: లేదండి. నేను పుదుచ్చేరి ఆశ్రమంలో వున్నాను.

రంగా: ఓహో!

కళ్యాణ: [అయ్యరు తట్టు తిరిగి] ఏమున్నాయండి.

అయ్యర్: రవాకేసరీ, బాదంహల్వా, మైసూరుపాక్, జాంగ్రీ, గులాబ్‌జాల్...

[వెంకటరెడ్డి ప్రవేశించును. కుడితిని, పంచె, ఉత్తరీయము, టోపీ ఖద్దరువి. చేతికి తగిలించుకొన్న ఖద్దరుసంచిలో ఒక పుస్తకము, ఒక వార్తాపత్రిక, కరపత్రము లుండును.]

అయ్యర్: [వెంకటరెడ్డితట్టు తిరిగి] కారాబూంది, అటుకులు, మైసూరుబోండా...

వెంకటు: [విసుగుతో] ఇంక చదువుచాలిస్తూ. [సీరియస్‌గా] సరోజనీ హల్వా, బజాజ్ వుప్మామా, నెహ్రూ చట్నీ, గాంధీ అటుకులు తెచ్చిపెట్టు.

[రంగారావు కళ్యాణరెడ్డి ఒకరిమొకము నొకరుచూచి నవ్వుకొందురు.]

అయ్యర్: ఆగోడ తట్టుచూడండి. ఇంకా తిలక్, పటేలు, అండ్రూస్, దాస్—పటాలపేళ్లు రాలేదు— తిలక్ పగోడి, పటేలు బజ్జి, అండ్రూస్ సేమియాపాయసం తెమ్మంటారా?

వెంకటు: అయ్యర్, నీఅధికప్రసంగంతోనే మాకు కడుపు నిండింది. తక్కినవాటికి చోటేది?

అయ్యర్: మీరేం తెమ్మన్నారండి?

రంగా: బాదంహల్వా.

కళ్యాణ: అటుకులు.

అయ్యర్: [లోనికిపోవును]

రంగా: [లేచి] ఈగదిలోకి గాలే మారదు. పైగా పొగ ఒక విశేషం. [(fan switch)—ఫ్యాన్ స్విచ్ వేయును— అది తిరగదు] ఇది కూడా ఒక అలంకారంలాగే వుంది. [కూర్చుండును.]

[అయ్యరు రంగారావుకు కళ్యాణరెడ్డికి చెరియొక ప్లేటు పెట్టి వెంకటరెడ్డికి మూడు ప్లేటులు పెట్టును. వెంకటరెడ్డి ఆతురతతో తినుచుండును. కళ్యాణరెడ్డి మెల్లగా చిటికెడు అటుకులు తీసుకొని నోట వేసికొనును. రంగారావు స్పూను

కొనతో సెనగగింజంత హల్వా తీసికొని నోరు మొద
ల్పక చప్పరించుచుండును.]

రంగా: [వెంకటరెడ్డి తలయెత్తక నమలుచుండుట చూచి] మన వాళ్ళకు తినడంకూడా ఒక ఆర్టని ఇంతవఱకు తెలియదు. వాళ్ళు తినడం చూస్తే చాలా బార్బరస్‌గా (barbarous)వుంటుంది.

కళ్యాణ: [ఈ రిమార్కు తనకుకూడా అన్వయించునను అనుమానముతో అటుకులు మెల్లగ నములుచుండును.]

వెంకట: దినానికి ఒక్కపూటకూడా కడుపునిండా అన్నము దొరకనివాళ్ళు లక్షలకొలది మన దేశంలో వున్నారు. అటువంటివాళ్ళకు తినడం ఆవశ్యకంగా యేర్పడుతుందిగాని శిల్పంగా వుండదండి.

రంగా: [న్యాపు కిందపెట్టి చేతి రుమాలుతో మూతి తుడుచుకొని] మీరేమైనా అనండి, ఎక్స్‌క్యూస్‌మి (excuse me,) మీ పేరేమండి?

వెంకట: వెంకటరెడ్డి.

రంగా: మిస్టర్ వెంకటరెడ్డి, గాంధీ ఉద్యమం ప్రబలమైనప్పటి నుండి మన దేశంలో చాలా హల్లకల్లోలం బయలుదేరింది. కవిత్వంపైన ఆర్టుపైన ఉత్సాహం తగ్గింది. మొరటుతనం హెచ్చింది.

కళ్యాణ: శాంతిలోవుండే సౌందర్యం పోయింది.

రంగా: ఇదంతా గాంధీకి (aesthetics) ఈస్తటిక్సు, ఆర్టు, తెలియని లోపం. A thing of beauty is a joy for ever అని అన్నాడు కీట్సు. అసలు స్త్రీ ప్రకృతి చాలా సున్నితమైనది; అలాంటి మల్లెపూలవంటి స్త్రీలకు మొరటుఖద్దరు కట్టబెట్టి, వారిచేతికి జెండాలిచ్చి ఎఱ్ఱటెండలో వీధులు వీధులు తిప్పించి, లాఠీచార్జిలకు గురిచేయించిన

దానికంటే ఘోరం, పాపం, అక్రమం, అన్యాయం ఫిక్షన్ (fiction) లో కూడా వుండవండి. గాంధి ఆర్టును మర్డరు (murder) చేశాడు.

కళ్యాణ: కొంపదీసి పాలిటిక్స్‌లో యాక్షన్ (action) తెచ్చి పెట్టాడు.

వెంకట: [నములుచున్న పదార్థం మ్రింగి] మీ పొరపాటు చాలా శోచనీయంగావుందండి. మీరు తెలుసుకోగలిగిన దానికంటే గాంధీ చాలా గొప్ప ఆర్టిస్టు. ఆయన ఆర్టును తెలుసుకోవలెనంటె మీకు ఇంకా కొంత యథార్థమైన (culture) కల్చర్ కావాలె. ఆయన క్యాన్‌వాస్ (canvas) అయిదారడుగుల చుట్టుకొలత కలదిగాదు; హిందూదేశమంత విశాలమైనది. ఆయన న్యూటన్ కంపెనీ రంగులతో చిత్రింపడు. లోక కళ్యాణానికి ఆత్మార్పణం గావించిన తన నిరాడంబర జీవితం నుండి అపూర్వమైన త్యాగసౌరభం ఈ అనంతభారతీయాకాశాన్నంటి ఇంద్రధనుర్వర్ణములతో ప్రభాతరాగ జ్వాలలను చిత్రిస్తున్నది. ఆ మనోహర దృశ్యం ప్రపంచమంతట అన్నిజాతులవారిని ఆశ్చర్యముగ్ధులను గావిస్తున్నది.

రంగా: కాంగ్రెసు వాళ్ళల్లోకూడా కొంత పోయిటిక్ టచ్ (poetic touch) ఉందన్నమాట! ఎ రెవెలేషన్! (a revelation!)

వెంకట: నామాటల్లో కవిత్వం గాదు ప్రధానం, విషయం.

కళ్యాణ: మా మహర్షి విషయగర్భితంగా కవిత్వము వ్రాస్తారు. చిత్తరంజనుని సాగరసంగీతం ఇంగ్లీషు కవిత్వంలోకి తర్జుమాచేశారు. మీరు చూశారా? అందులో సముద్రఘోష ప్రతిధ్వనిస్తుంటుంది.

వెంకట: ప్రజాఘోష ప్రతిధ్వనిస్తే బాగుండేదేమో.— ఇప్పుడు మీబోటివారంతా A thing of beauty is a joy for ever అని పాఠం వొప్పజెప్పి సంతృప్తిపడుతుంటే, గాంధీ ఆ thing of beauty ని తన దైనందిన జీవితంలో సమ్మేళనంచేసి ఆ ఆనందాన్ని అనుభవిస్తున్నాడు.

మీస్థూలదృష్టికి ఏది వికారంగా కనబడుతుందో, ఆయన అంతశ్చక్షువుకు అది రమణీయంగా కనబడుతుంది. మీ కేది త్యాజ్యమో ఆయన కది పూజ్యము.

కళ్యాణ: [రెండు చిటికెలు అటుకులు నోట్లో వేసుకొని నములుచు] గాంధీ ఆర్టిస్టు కాకపోవడంవల్ల మనకేం బాధలేదు. అయితే పవిత్రమైన ఆధ్యాత్మిక తత్త్వాన్ని పాలిటిక్స్‌తో సాంకర్యం చేసి రచ్చకీడ్చి నానా గోల పెట్టాడు. హిందూదేశం పూర్వం పరమఋషులున్న తపోభూమి. ఇప్పటికికూడా మా మహర్షివంటి మహనీయులు అక్కడక్కడ లేకపోలేదు. ఇటువంటి పవిత్రమైన ఆధ్యాత్మిక వాతావరణంలో రాక్షసమైన (politics) పాలటిక్సును తెచ్చిపెట్టి దేశశాంతికి భంగం కలిగించాడు గాంధి. అందువల్లనే మా మహర్షి పుదుచ్చేరి వదలి రావడం లేదన్నాడు. ప్రపంచాన్నంతా ఆధ్యాత్మికంగా ఒక్కసారి ఉద్ధరించడానికి మాగురుదేవుడు ఆ దివ్యశక్తిని పాపభూయిష్ఠమైన యీ ప్రపంచంలోకి అవతరింప జేస్తున్నాడు. అది సూర్యమండలం దాటింది; చంద్రమండలంలోకి ప్రవేశించింది; ఇక కొన్నిదినాలకు మేఘమండలంగూడా వ్యాపిస్తుంది. అప్పటికి మన హృదయాలన్నీ చాలా (receptive state) రిసెప్టిప్ స్టేట్ లో వుండుకోవాలె. పాలిటిక్స్ దానికి ప్రతిబంధకం.

వెంకటు: అయ్యర్—కాఫీ.

రంగా: ఎందుకండీ.

వెంకటు: తాగడానికి.

రంగా: మిమ్ముమ్మలను గాదండి.

కళ్యాణ: పాలిటిక్సు (politics) యీ లోకానికి సంబంధించిన గోల; మానవశరీరం క్షణికం; ఇక దానికి సంబంధించిన ప్రతిదీ క్షణికమె. ఆ దివ్యశక్తి క్రిందకు అవతరిస్తే ఒక్క హిందూదేశమే గాదు: ప్రపంచానికంతా ముక్తి గలుగుతుంది.

వెంకట: ఆ దివ్యశక్తి బీహారు భూకంపం లాగా నాలుగుచోట్ల వస్తేనేగాని అందరికి ఒక్కసారిగా ముక్తికలుగదు. ఉట్టికెక్కలేనివాళ్ళు స్వర్గానికెక్కుతారట!

రంగా: ఈ కాంగ్రెస్ క్రీడులోనే వుంది యీ తలబిరుసుతనం. నాజూకుగా మాట్లాడేది వీళ్ళకు తెలియనే తెలియదు.

అయ్య: [వెంకటరెడ్డికి కాఫీ తెచ్చి యిచ్చును.]

వెంకట: [రెండుగుక్కలు తాగును.]

కళ్యాణ: గాంధీ లోకాన్ని పట్టుకొని యింకా వ్రాగులాడుతున్నాడు. ఆయన్ను సెయింట్ (saint) అనడం అక్రమం. అందరి కళ్ళకు కనబడుతూ అందరితో మాట్లాడేవాడు సెయింట్ కానేకాడు. సెయింట్ అంటే మా మహర్షికి ఒక్కడికే చెల్లుతుంది. ఒక్క మదర్ (mother) కు తప్ప ఆయన ఇంకొక మానవుడి కంటికి కనబడడు. ఆయన స్పెన్సరు కంపెనీ చుట్టలు తప్ప మరేవి తాగడని అందరూ అనుకొంటూరుగాని ఆయన వుద్దేశం వీళ్ళెవరికి తెలియదు.

వెంకట: మీకు తెలిస్తే చెప్పండి.

కళ్యాణ: గాంధి ద్వేషంతో పరదేశి గుడ్డలను తగులబెట్టించాడు. మా మహర్షి ఏమాత్రం ద్వేషబుద్ధి లేకుండా పరదేశీ వస్తువును ప్రయోజనకరంగా తగులబెడుతున్నాడు. ప్రేమలో వైరాగ్యం సాధిస్తున్నాడు. ప్రకృతి పురుషుల సంయోగమె సృష్టికి మూలమని ఋజువుచేశాడు.—

అయ్య: [టీ తెచ్చి పెట్టును.]

రంగా: మా గురుదేవుడికి మోస్తరే మహర్షికికూడా ఇంటర్నేషనల్ ఔట్ లుక్ (international out-look) వుంది. మహర్షి చాలా గ్రేట్ జీనియస్! (great genius) అందుకు ఏమాత్రం సందేహం

లేదు. Art, poetry భావంలో విశేషంగా వున్నవి. ఇంగ్లీషు వాళ్ళుకూడా ఆయనతోపాటు ఇంగ్లీషు వ్రాయలేరు. ఇంగ్లీషులో కవిత్వం అద్భుతంగా వ్రాస్తాడు, అంతా బాగానే వుంది. అయితే ఆయన రహస్య ప్రవర్తనం వాకు బోధపడటం లేదు.

వెంకట: మీకేగాదండి, ప్రపంచాని కంతటికి గూడా బోధపడడం లేదు.

కళ్యాణ: ప్రాకృతులకు బోధపడదు. పూర్వం మహాత్ములుకొండ గుహలలో తపస్సుచేసి భావతరంగాలతో ప్రపంచం నింపేశేవారు. అలాగే మాగురుదేవుడు కూడా చేస్తున్నాడు. తపస్సు పరిపక్వం కావడంతోటె బుద్ధుడు మోస్తరె ఆయన బయలువెడల్తాడు. ఇప్పుడాయన్ను హేళనచేసేవాళ్ళందరు పటాపంచలైపోతారు.

[వెంకటరెడ్డి మొకముచూచుచు టేబిలు పైగాచేయివిసరును. టీ కప్పు దొరలును.]

కళ్యాణ: [టీ గుడ్డలపైకి కాఱకుండా కుర్చీకొంచెము వెనుకకు జరుపుకొనును.]

రంగా: Many a slip between the cup and the lip!

వెంకట: అప్పుడు జరగబోయే ఉత్పాతం యెట్లుంటుందోగాని, ఇప్పుడుమాత్రం అయ్యర్ కాఫీబొచ్చెకు తలనొప్పి వచ్చింది — ఏజంగ్లీ, వచ్చి యీ టేబిల్ తుడువు.

ఏవాది: [టేబిలు తుడుచును.]

కళ్యాణ: అయ్యర్, ఇంకోకప్పు టీ.

రంగా. మీరు ఆశ్రమంలో ఎన్ని సంవత్సరాలుగా వున్నారండి?

కళ్యాణ: అయిదారు సంవత్సరాలుగా వున్నాను.

అయ్య: [టీ తెచ్చిపెట్టును.]

రంగా: మీ కోర్సు (course) పూర్తయిందా?

కళ్యాణ: [టీ గుక్కెడు త్రాగి] మాకు వేరే కోర్సేమి లేవండి; డెయిలీకోర్సు (daily course) మాత్రం వుంది.

వెంకట: మగవాళ్ళు కాబట్టి—

కళ్యాణ: ప్రొద్దున్నే లోటాడు ఆవుపాలిస్తారు. మధ్యాహ్నం రాత్రి, సాత్త్వికాహారం. వాళ్ళిచ్చే మామూలు చాలనివాళ్ళు సొంతంగా వంట చేయించుకొని ఎక్స్‌ట్రా (extra)గా తినవచ్చును. ఒకరికొకరికి ప్రత్యేకంగా గదులుంటవి. భార్యాభర్తలు ఒకటిగా వుండవచ్చు. ఇష్టముంటే చదువుకోవచ్చు, బీచికి షికారు వెళ్ళవచ్చు.

రంగా: అయితే మీకు ప్రొద్దెట్లా జరుగుతుందండి?

కళ్యాణ: భోంచేసిన తర్వాత పరుపుమీద వెల్లకిల పండుకొంటాము; ఆ దివ్యశక్తిని ఆకర్షించడానికి మనస్సును రిసెప్టివ్ స్టేట్ (receptive state) లో వుంచుకోవడం అభ్యసిస్తాం. ఇది మనిషికి చాలా న్యాచురల్ పొజిషన్. (natural position.)

వెంకట: నిష్కర్మయోగు లన్నమాట!

రంగా: మహర్షి యేం చేస్తుంటాడండి? పుస్తకాలు వ్రాస్తుంటాడేమో!

వెంకట: ఆశ్రమ కులాయంలో సూపర్ మ్యాన్ (super-man) గుడ్లు తయారౌతున్నాయి వాటిని పిల్లలు చేయించడానికి పొదుగుతున్నాడు మహర్షి.

రంగా: O congress, thy name is impertinance!

వెంకట: with apologies to Shakespere!

కళ్యాణ: నే వెళ్ళతానండి.

రంగా: కూర్చోండి. ఆ అటుకులు తీరా తీసుకోండి.— మీకు సాధనాలేమైనా ఉన్నాయా?

కళ్యాణ: ఆ విషయం రహస్యం. మదర్ (mother) ఆజ్ఞ.

రంగా: ఇంత రహస్యం రామకృష్ణ పరమహంసకు కూడా లేదను కొంటాను.—అయ్యర్, one cup tea.

వెంకట: పాపం! పరమహంసకు ఆ రహస్యంలోనే వుంది చిదం బర రహస్యమంటారు. నన్ను విప్పిచెప్పమంటారా?

కళ్యాణ: నిన్నుంచి కాదుగదా మీగురువునుంచీ కాదు.

వెంకట: మహర్షి కాకపూర్వం ఆయన రాజకీయంగా చాలా ప్రక్షోభం కలిగించాడు దేశంలో; ఒప్పుకొంటారా?

అయ్య: [టీ తెచ్చిపెట్టును.]

రంగా: నిజమె! [ఒక గుటక టీ త్రాగును]

వెంకట: తర్వాత కేసులో తప్పించుకొని తన్ను నమ్మివుండిన స్నేహితులని నట్టేటిలో ప్పుట్టెముంచి పుదుచ్చేరిలో మకాం వేశాడు. ప్రజలంతాకూడా ఈమహానుభావుడు మళ్ళీ వస్తాడు, రాజకీయచక్రం తిప్పుతాడు అని ఎదురుచూస్తుండినారు. ప్రజల నిరీక్షణం ఆయనకు గడబద్ధకమైంది. రాజకీయంగా ఏమీ చేయలేమని అనుకొన్నాడు. ఆ ఉద్దేశానికి ముసుగువేశాడు; ఆధ్యాత్మికంగా ముసుగులో తాను కూర్చున్నాడు. ముసుగు అక్కడక్కడా చినిగిపోతున్నది. కొంతకాలానికి యథార్థం బట్టబయలౌతుంది. తుదకు మహర్షే బయట బడతాడో, లేకపోతే కపటవేషమే బయట పడుతుందో దేవుడికే యెఱుక!

కళ్యాణ: [కోపముతో] వారెదురుగా మా మహర్షిని యిట్లు నిందించడం, లేని కాపట్యం ఆరోపించడం నీచం, అసహ్యం, ఇంపెర్టినెన్సు, రూడ్‌నెస్ (impertinance, rudeness)

[అని లేచిపోవును.]

అయ్య: [వాకిలిదగ్గఱకు పోయి] ఏమండో, డబ్బు ఎగనూకి పోతున్నారే!

కళ్యాణ: [తిరిగివచ్చి డబ్బు ఇచ్చును]

రంగా: కాంగ్రెసువాళ్ళ మాటలకు తలా తోకవుండదు లేండి. ఇన్‌ష్యూరెంసు ఏజెంట్లులాగ ఎక్కడచూచినా యీ కాంగ్రెసుగూడెము వారె పోజకొతారు. వీళ్ళమాటలకు కోపపడితే మనిషి బ్రతికడం దుర్ఘటం. కూర్చోండి.

కళ్యాణ: [కూర్చుండును]

రంగా: వీళ్ళకు గాంధీతప్ప మరెవ్వరు పనికిరారు. ఆ గాంధీ వల్లనే స్వరాజ్యం రాకుండాపోయినసంగతి కూడా వీళ్ళకు తెలియదు. మా టాగూరు ఇంగ్లాండుకు పోయినప్పుడు ఆయన్ను చూచి అందరు ఓరియన్‌టల్ క్రైస్ట్ (Oriental Christ) అని ఆరాధించారు. ఆయన flowing silver beard, పట్టుఅంగీ సర్వజన వశీకరణం చేశాయి. చాలమంది ఇంగ్లీషుకన్యలు ఈయన ముసలివాడు కాకుండావుంటే పెండ్లిచేసుకొని వుందుము గదా అని చింతించినారట! ఈలాంట్రి మహానుభావులు పుట్టిన దేశానికి స్వరాజ్యం యివ్వవలసిందని లేబరువాంళ్లు పట్టుబట్టితే అప్పుడు మ్యాగ్నాల్డుకు మెజారిటీలేక ఆ తీర్మానం ఓడిపోయిందట. గాంధీ రౌండుటేబిల్ కాన్ఫరెన్సుకు పోవడమువల్ల మనదేశానికి పరమ అన్యాయం జరిగింది. మోకాళ్ళకుపైగా ఖద్దరుగుడ్డ యెగదీసి కట్టి ఒకపెద్ద మోటు దుప్పటి పైన కప్పుకొని పెద్ద ‘బూర్’ (boor) లాగా తయారై అక్కడికి వెళ్లేటప్పటికి ఆయన్ను చూచినవాళ్ళందరు India is uncivilised; India is unfit for Dominion Status అని అరిచారు. ఇంగ్లీషు కన్యలందరు ఒక కమిటీ గట్టి గాంధీ ఇంతకంటె further ఫర్దరుగా డ్రెస్ రిఫారం (dress-reform) చేయకూడదని వారిదగ్గరికి డెప్యుటేషన్ వెళ్లినారట. కన్‌సర్వెటివ్ పక్షంవాళ్లు ఈ సమయం అనుకూలంగా వుందని గాంధీ ఫోటోను

న్యూస్ పేపర్లలో గుప్పించి "ఇటువంటి అనాగరకులున్న దేశాన్ని రక్షించి ఉద్ధరించడానికి దేవుడు మనలను ధర్మకర్తలనుగా నియమించాడ"ని క్రిశ్చియన్ ఫిలాసఫి (Christian philosophy) బోధించారట. గాంధీవల్ల మన మాతృభూమికి యింత అన్యాయం జరిగితే దాన్నంతా మరుగు పెట్టి, నోరూ వాయీ లేని అమాయికులను మోసం చేస్తున్నారు ఈ నాయకులంతాను. గ్రామస్థుల్లో మొట్టమొదట మానవసేవ ప్రారంభించాల. అర్ట్స్, పాయిట్రీ నేర్పించాల. వాళ్ళకు మందూమాకు యిచ్చి కాపాడాల.

అయ్యర్: టీ చల్లగాపోతున్నదండి.

రంగా: థ్యాంక్యూ (thank you) [టీ త్రాగబోయి టేబిలు పైపెట్టి] ఆహా! ఏమి యీ చిత్రం! [లేచును]

కళ్యాణ: ఏమిటండీ?

రంగా: ఈగ కప్పులో పడ్డది. తన్నుకొంటున్నది స్ట్రగుల్ ఫార్ ఎగ్జిస్టెన్స్ (struggle for existence) ప్రాణికోటికంతా ఎంత సహజంగావుంది! దీంట్లో ట్ర్యాజిక్ బ్యూటీ (tragic beauty) కనిపిస్తుంది. ఇంత చిన్న యీగ ఇన్ని టీ నీళ్ళలో ఈదుటకు ప్రయత్నించడం సబ్లైం! సబ్లైం!! (sublime! sublime!!)

వెంకట: [ముసిముసి నవ్వు నవ్వును]

కళ్యాణ: [ఈగను చూచుటకు లేచును]

అయ్యర్: స్పూనుతో తీసిపారవెయ్యండి

రంగా: ఆ ట్ర్యాజిక్ స్ట్రగుల్ (tragic struggle) లో వుండే స్పిరిచ్యుఅల్ (spritual) భావాన్ని చూడు! ఇటువంటి ప్రకృతి ప్రేరణలు లేకపోతే కవిత్వం రాదు.

కళ్యాణ. [కూర్చుండి] అవును! కవిత్వానికి——

రంగా: ఉండండి. నాకు కవిత్వము దొర్లుతున్నది.——

"కాఫీ కప్పున నీగ తన్నుకొనుచున్ కాన్పించు సంసారమం
దా ఫేన్ లైమున్న,...

[తర్వాత సాగదు; మరల ఆపాదమును ఉచ్చరించును.]

కళ్యాణ: చాలా (natural) గా వుందండి. ఎట్లా వున్నదో అట్లా చెప్పడంలోనే నేచర్ స్టడీ (nature study) వుండేది.

రంగా:

కాఫీ కప్పున నీగ తన్నుకొనుచున్ కాన్పించు సంసారమం
దాఫేన్ లైమున్న—

[తర్వాత సాగదు]

వెంకట: తర్వాత బండిసాగలేదన్నమాట!

" నిరుపహతిస్థలంబు
రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పుర విడెము"

కావలసి వుంటుందేమో!

రంగా: తొందరలో ఫకార ప్రాస వేశాను. దాన్ని పూర్తిచేయడం కొంచము కష్టమె.

వెంకట: అందుకనా ఆ ఫేన్ లైమున్న అని అన్నారు.

రంగా: రాజభాష ఉపయోగించ వచ్చు. పూర్వకవి ప్రయోగా లున్నాయి. మీకు కవిత్వంకూడా తెలుసునా యేంటి?

వెంకట: ఏదో కొద్దిగ.

రంగా: అట్లయితే నాన్ కో ఆపరేటర్లయ్యారేం!

వెంకట: ప్రస్తుతావస్థలో కవిత్వం, ఆర్టు, డ్రామా, సర్వం దాస్య విమోచనం కొఱకే వుపయోగ పడవలెనని నా అభిప్రాయమండి.

రంగా: అయితే మీరు Art for art's sake వాదులు కారన్న

కూటు. You are prostituting Art. కోకిల యేమి ప్రయోజనం ఆశించి గానం చేస్తున్నదంటారు?

వెంకటు: కోకిలకు ప్రయోజనం ఆశించే జ్ఞానము లేదు. మనిషికున్నది.

రంగా: We are poles asunder.

"కాఫీ కప్పున నీగ......

[తర్వాత పద్యము సాగదు]

ప్రపంచమంతా (freedom freedom) ఫ్రీడం ఫ్రీడం అని ఘోషిస్తుంటే తెలుగు కవిత్వం మాత్రం సనాతనంగా మడికట్టుకోవడం, అందువల్ల "కవిశయః పార్థ" అన్న కాళిదాసులు మనదేశంలోపుట్టడానికి అవకాశం లేకుండాపోవడం చాలా అన్యాయం.

వెంకటు: మీరు పొరబడుతున్నారు. తెలుగువారు ఎందులోనూ తీసిపోరు. డెమొక్రసీ అని పేరుపెట్టి పద్యానికి గద్యానికి వుండే భేదం లేకుండా చేశారు. కట్టుదిట్టాలేమి అవసరంలేదు. పాడిందల్లా పాటే, ఆడిందల్లా ఆటే! ఆర్టులో రిస్ట్రెయింట్ (restraint) అక్కర లేదట!

రంగా: మైగాడ్ (my God) నాలుగు సంవత్సరాలుగా కలకత్తాలో వుండడంవల్ల మన వాఙ్మయంలో కలుగుతున్న మార్పులతో నాకు టచ్ (touch) లేదు — అట్లయితే యీపద్యం యిప్పుడే పూర్తి చేస్తాను.

కాఫీ కప్పున నీగ తన్నుకొనుచున్ గాన్పించు సంసారమందా ఫెన్ క్రైమ్ము సమస్త బాధలకు లోనై గట్టుగాన్పించకే—

[తర్వాత పద్యం సాగదు.] ఏమండీ, గణాల్లో కూడ (freedom) వచ్చిందా?

వెంకట: ఓ! సర్వమంగళంగా వచ్చింది.

రంగా: హుర్రా! (hurrah!) అట్లయితే కవిత్వం యింకా సులువే.

'కాఫీ కప్పున నీగ తన్నుకొనుచున్ గాన్పించు సంసారముం
దాఫెన్ రైలుమున్న సమస్త బాధలకులోనై గట్టుగాన్పించకే [చం
కుయ్యో మొఱ్ఱోయటంచు డిప్రెషను కష్టాల్ పొందు గృహస్థు
దానన్; ట్రాజెడి యన్న నిట్టిదె కదా స్పష్టము భావంబులన్!

వెంకట: కవిత్వం చాలా ట్రాజిక్‌గా వుందండి.

[ఇంతలో ఒక కాంగ్రెసు వాలెంటీరు ఆతురతతో పరుగెత్తుకొనివచ్చి "వెంకటరెడ్డి వున్నారాండీ?" అని అటు నిటు చూచును.]

వెంకట: ఏమి నరసింహాం?

నరసింహాం: రంగనాయకుల తిరుణాళ్ళకు గ్రామాంతరాన్నుంచి యెవరో ఒక అమ్మాన్ను చంటిబిడ్డ వచ్చినారు. ఆమెకు కలరా తగిలి పాతచత్రంలో పడిపోయింది. ఆమెను వదలిపెట్టి చత్రంలో వుండిన వాళ్ళందరూ వెళ్ళిపోయినారు. బిడ్డ పాలకేడుస్తుంది. తల్లి కష్టావస్థలో వుంది.

వెంకట: అట్లనా! అయ్యర్. [దబ్బిచ్చి] ఒక కప్పులో పాలు పోసివ్వండి. నరసింహం, నీవు డాక్టరు దగ్గిరికి వెళ్ళి కలరా మిక్స్చరు కలిపించుకొని చత్రందగ్గరకి వాయువేగంతో రావాల. సైకిల్ వుందా?

నర: ఉందండి.

వెంకట: అయితే వెళ్లు.

నర: [నిష్క్రమించును]

అయ్యర్: [కప్పులో పాలు తెచ్చియిచ్చి] కలరా వచ్చిందీమళ్ళా! ఇక ఈ శ్యానిటరీ యిన్‌స్పెక్టర్లతో వేగడం కష్టం. ఇప్పుడు వొక్క ఫూటే ఆరిపెపు కాఫీకి వస్తున్నారు. రేపటినుంచి రెండుఫూటలూ తగులుకొంటా రన్నమాట!

వెంకటు: [నిష్క్రమించును.]

రంగా: ఈ కాంగ్రెసు వాలంటీర్లు కొఅవిదయ్యాలండి. కలరా అంటురోగమని అది ప్రజలలో వ్యాపిస్తుందని వీళ్ళకు కొంచెంకూడా జంకు లేదు. [సిగిరెట్టు ముట్టించి] అయ్యర్, మీవద్ద కర్పూరపు బిళ్ళ లుంటే ఒక పైసా కివ్వండి.

అయ్యర్: లేవండి. ఎందుకు?

రంగా: కర్‌చీఫ్‌లో వేసుకొని మూచూస్తుంటే కలరా రాదండి.—రెడ్డిగారు, మీరుగూడ సిగరెట్ ముట్టించండి. కలరా పురుగులు ఆ పొగలో చూడిపోతవి.

కళ్యాణ: నాకు అభ్యాసం లేదు—మనంగూడా ఆ చర్రింతట్టు వెళ్ళుదామా?

రంగా: ఎందుకు?

కళ్యాణ: ఇది అడ్వర్‌టైజ్‌మెంటు ఎత్తో లేకుంటే యథార్థమో కనుక్కొందాం.

రంగా: ఆః! గ్రేట్ హిట్! (great hit) అవును. మనము ఈ కాంగ్రెసువాళ్ళను మెర్‌సిలెస్ (merciless) గా ఎక్స్‌పోజ్ (expose) చెయ్యాల. నేను కర్పూరం బిళ్ళలు కొనుక్కొని మీతోగూడా వస్తాను.

[అయ్యరుకు డబ్బిచ్చి వెడలిపోవును.]

కళ్యాణ: మా మహాత్మని అపనింద లాడిన వీళ్ళకు............ ఆల్‌రైట్ (alright) [వెడలిపోవును.]

స్థలం: ౨ పాత చత్రం వరండా.

[కలరా తగిలిన స్త్రీ గుడ్డ పఱచుకొని చిన్నమూట తలక్రింద పెట్టుకొని పండుకొని బాధపడుచుండును. వెంకట రెడ్డి ఒక సంవత్సరం వయస్సుగల చంటిబిడ్డను చేతులలో పెట్టుకొని అటునిటు తిప్పుచు లాలించుచుండగా తెరయెత్త బడును.]

రోగి: [అటునిటు పొరలుచు, వొక్కిరమనుచు బాధపడుచు, ఈలగొంతులో) అయ్యా, యీబాధెట్లయ్యా! నేనెందుకీ పాడు తిర నాళ్ళ కొస్తినయ్యా [వొక్కిరమనుచు] రామా—దేవుడా—యెక్క డుండావురా నాయనా—అబ్బా—తండ్రీ—

[ఇంతలో బిడ్డయేడ్చును.]

వెంకటరెడ్డి: నాయన—నాయన—ఏడవబోకు తండ్రీ. పాలు తాగించేదా?

[పాల లోటాను మూతిదగ్గర పెట్టును. బిడ్డ త్రాగడు. లోటా క్రిందపెట్టి జోబీలోనుండి తాళపు గుత్తి తీసుకొని కదలించుచు బిడ్డను లాలించుచుండును.]

రోగి: నాబిడ్డగ్గూడా కల్లర తగిలిందయ్యా?

వెంకట: లేదమ్మా, బిడ్డ బాగున్నాడు. పాలు నోటిదగ్గర బెడితే తాగలేదు.

రోగి: అట్ల తాగడు నాయనా, కాళ్ళమీద వేసుకొని ఉగ్గు పాలతో పోస్తేనేగాని తాగడు.—అబ్బా! మావాళ్ళ కెట్లా తెలుస్తుందయ్యా?

వెంకటు: మీ దేవూరు?

రోగి: ఇక్కడ్నే, ఏటువతల.

వెంకటు: ముందు నీకు మందిచ్చి, తర్వాత ఆసుపత్రికి తీసుకొని పోతాను, నీకేమీ భయంలేదు.

రోగి: నేను బతకతానయ్యా?

వెంకటు: నీకేమాత్రం ప్రాణభయములేదు. నీవు ధైర్యంగా ఉండు. దేవుడున్నాడు రక్షించడానికి.

రోగి: ఆ దేవుణ్ణి చూడడానికి వస్తేనే యిట్లుయుందయ్యా. [బాధతో] ఆ——ఎట్లయ్యా.

[ఇంతలో నరసింహం మందు తీసికొనివచ్చి సైకిల్‌ను గోడకు ఆనించును.]

వెంకటు: ఈ బిడ్డను పట్టుకో; మందిస్తాను.

[అందించునపుడు బిడ్డ యేడ్చును.]

రోగి: అయ్యో, నాబిడ్డ ఆకటికి అల్లాడుతుందయ్యా, కొంచెం గుక్కెడు పాలిస్తాను.

వెంకటు: [ప్రీతిమాలినట్లు] నీవీయగూడదమ్మా, [నరసింహం తట్టు తిరిగి] నరసింహం, చేతిగుడ్డ పాలల్లోముంచి ఒక్కొక్క బొట్టుగా బిడ్డ నోట్లో పిండు, చూస్తాం. [రోగి ప్రక్కకువచ్చి] అమ్మా, నోరు తెరువు ఈమందు కొంచెంతాగు. నీకు తప్పకుండా బాగౌతుంది.

[మిక్స్చరు నోట్లో పోయును. ఆమె గుటక వేయును.]

[ఇంతలో రంగారావు, కళ్యాణరెడ్డి వచ్చి కొంచెం దూరముగా నిలబడి రోగిని చూచుచుందురు.]

రోగి: నీకు చెయ్యెత్తి దణ్ణం పెడ్తానయ్యా. దేవుడు మిమ్మల్ని చూపించకపోతే నాగతి నాబిడ్డగతి యేమైయుండేదో!

వెంకటు: పీవ్రూరుకో అమ్మా., ఊరికే మాట్లాడితే అలిశిపోతావు, నరసింహం, ఏమైనా పాలు తాగిందా బిడ్డ?

నర: కొద్దిగా తాగిందండి.

రోగి: దాహమౌతున్నదయ్యా, పుల్లగంజిలో వుల్లగాయవూట కలిపిస్తే యెంతైనా తాగుతాను.

వెంకట: ఇక్కడ యీసమయంలో పుల్లగంజి దొరకవు. నరసింహం, ఆబిడ్డను నాచేతికిచ్చి సోడాబాటిల్ కొట్టించుకొని తీసుకరా. పరుగెత్తు.

నర: [బిడ్డను వెంకటరెడ్డిచేతికిచ్చి సైకిల్ తీసుకొని వెళ్ళును.]

రంగారావు: మిస్టర్ వెంకటరెడ్డి.

వెంకట: [రెండడుగులు ముందుకు పెట్టి] ఏమండి?

రంగా: [ఒక అడుగు వెనుకకు పెట్టి] మీరక్కడనే వుండండి. పరవాలేదు. [కర్పూరం బిళ్ళ ఒకట్టి విసరివేసి] దీన్ని కర్‌చీఫ్‌లో పెట్టి మూచూస్తుండండి. Prevention is better than cure అని అరిస్టాటల్ చెప్పాడు.

వెంకట: [కర్పూరవు బిళ్ళ తీసుకొని నలిపి రోగిపక్క దగ్గర చల్లును.]

రంగా: ఏమిటి యీ తనకుమాలిన ధర్మం? [సిగరెట్టు ముట్టించును]

కళ్యాణ: వీళ్ళు లో కాన్ని—[హఠాత్తుగా జ్ఞప్తికి వచ్చి మొల తాడు తడవుకొనును.]

రంగా: ఏమిటండీ?

కళ్యాణ: తాయెత్తు లేదండి.

రంగా: [చిఱునవ్వుతో] తలిస్‌మాన్ తాయెత్తా?

కళ్యాణ: కాదండి. [రహస్యముగా చెప్పువానివలె] అదృష్టవశాత్తుగా ఆశ్రమంలో అమ్మగారి వెంట్రుక ఒకటి దొరకింది. దాన్ని బంగారు తాయెత్తులో వేసి మొలకు కట్టుకొన్నాను. ఏ చీడాపీడా ఆశించదు.

వెంకట: ఓ! [నవ్వుచు] అందువల్లనే ధైర్యంచేసి వచ్చారు.

రంగా: Yes! It is faith cure.

కళ్యాణ: వీళ్ళు లోకాన్ని తాము వుద్ధరిస్తూన్నామని అనుకొంటూరు. ఆ దివ్యశక్తి ప్రపంచ చక్రం నడుపుతున్నది. పుట్టించేదెవరు? చంపేదెవరు? రోగాలు భూకంపాలు, విప్లవాలు, యుద్ధాలు నేచరుస్కీమ్ (nature Scheme) లో వుండేవే. ఇవిలేకపోతే నేచరులో ఈక్విలిబ్రియం (equilibrium) వుండదు. ఆత్మకు ఎప్పటికి నాశనం లేదు.

నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతిపావకః,

అనిన్నీ—

వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని
గృహ్ణాతినరోఽపరాణి—

అనిన్నీ గీతాశాస్త్రమే చెబుతున్నది. మామహర్షి అందువల్లనే (social service) వృత్తిమిధ్య—బూటకమని దాన్ని బహిష్కరించాడు.

రంగా: [సిగరెట్టుముక్క క్రిందపడవేయును.]

కళ్యాణ: [అటుపోయి సిగరెట్టుముక్కను త్రొక్కి యెగిరిపడి] అబ్బా! తేలుకుట్టింది. [సిగరెట్టుముక్కను చూచి కోపముతో] ఏమండి, మనుష్యులు తిరిగేచోట ఆర్పకుండా సిగరెట్టుముక్కలు పడవేస్తే కాళ్ళు మండుకపోతవని తెలియదూ?

రంగా: Sorry, excuse me. పరధ్యాన్నంలో క్రింద వేశాను, [తన బూడ్సుకాలితో దానిని రాచివేయును,]

కళ్యాణ: [కాలు చూచుకొని] బొబ్బపోయిందండి.

వెంకటు: నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః!

కళ్యాణ: చురుక్కుమని చస్తుంటె యిప్పుడుకూడా వేళా కోళమేనా!

వెంకటు: తమరు సెలవిచ్చిందే కదండి!

[ఇంతలో నరసింహాం వచ్చి సైకిల్ అచ్చటపెట్టి సోడా ఆమె నోటిలో పోయును.]

రోగి: [సోడాత్రాగి] అబ్బా! తండ్రీ, నాబాధ యెవరు తీరుస్తారయ్యా!

రంగా: ఈ పోజ్ (pose) చాలా అద్భుతంగా వుంది. మొగంలో ట్రాజిక్ బ్యూటీ (tragic beauty) తాండవిస్తూ వుంది. ఇప్పుడుగాన నందలాల్ బోసు వుండి ఈ మాడల్ (model) ప్రకారం ఒక చిత్రం వ్రాస్తే డయింగ్ ప్రిన్సు (dying prince) అనే మైకల్ చిత్రానికంటే బాగుంటుంది.

[హాండ్ క్యామిరా తెరచి ఫోకస్ చేసి ఫోటోయెత్తును.]
మీకుకూడా ఒక కాపీ యిస్తానులెండి.

కళ్యాణ: ఈతూరి సిగరెట్టుముక్క జాగ్రత్తగా పారవేయండి.

రంగా: థాంక్స్ (thanks)

వెంకటు: నరసింహాం, ఇక మనము ఆలస్యం చేయడం బాగులేదు. ఈమెను సెగ్రిగేషన్ హాస్పిటల్ తీసుకొనివెళ్ళాల. మన గ్రహాచారం

మనవూళ్ళో అంబులెన్సుకూడా లేదు. మతి జట్కావాళ్ళను పిలిచాను. కలరా పేషంటంటే ఒక్కడూ రాలేదు.

రంగా: At least they are reasonable.

వెంకట: ఇప్పుడెట్లా మతి?

నర: మనమే తీసుకొని వెళ్ళదాం. ఆమె దుప్పటితో వుయ్యాల కట్టి మధ్యనొక కఱ్ఱదోపి మోసుకొని పోవచ్చు.

వెంకట: బిడ్డ?

నర: ఇంకొక్కరు కావాలనే మతి. [రంగారావు తట్టుచూచును]

రంగా: [గమనించనట్లు ఒకతట్టుకు మరలును]

వెంకట: రంగారావుగారు. ఈబిడ్డని కొంచెం అక్కడిదాకా యెత్తుకొని వస్తారా?

రంగా: మా గురువుగారు పసిబిడ్డలను గురించి అద్భుతంగా కవిత్వం వ్రాశారు. ఆ పద్యాలు ఒరిజినల్ (original) లో చదివితే బిడ్డల్ని ముద్దాడవలెననే కోరిక పుడుతుంది.

పూచిన తమ్మివంటి పసిబిడ్డల మోమున నవ్వు దొంతరల్
కేసర గుచ్ఛమట్లు కను విందొనరింపఁగ చేరదీసి, నా
నాయన, రార యంచు చిరుబుగ్గల ముద్దిడువాని భాగ్యమే
భాగ్యము; కోటులున్న పెఱభాగ్యము భాగ్యమె? రెడ్డిమిత్రమా!

అనే మోస్తరుగా కవిత్వంలో పసిపాపలు చాలా అందంగా వుంటారు. అయితే ప్రాక్టికల్ ప్రాబ్లం సాల్వ్ (practical problem solve) చేయడంలోనే వుండే చిక్కంతా.

(ఇంతలో మూడో ఫారం విద్యార్థు లిద్దరు పుస్తకములు చంక బెట్టుకొని ఆదారిన పోవుచుందురు)

ప్రథమ విద్యార్థి: ఒరే, మనమేష్టరు Student's social league start చేశాడు. మొన్నటి ఆదివారం మేము ఆసుపత్రులన్నీ తిరిగి వచ్చాం; చాలా గమ్మత్తుగా వున్నింది. పేషంటొకడు నిద్రపోతుంటే పక్కన బెంచిమీద రొట్టెముక్కలు పెట్టివుండినాయి నేను మెల్లగా రెండు ముక్కలు జోబీలో వేసుకొన్నాను. ఇంటివద్ద తింటే యెంత టేస్టుఫుల్‌గా (tasteful) గా వుండిందనుకొన్నావు? నీవుకూడా ఒకవాలంటరీగా చేర్రాదు?

ద్వితీయ విద్యార్థి: అది సరేకాని, మనపాఠం రాకపోతే యీవేళ బుగ్గలు నులిమేస్తాడు. అందులో యీవేళ మంగళవారం. తలగొరిగించుకొని వస్తాడు. నీకు జామెట్రీపాఠం వొప్పజెప్పను వచ్చిందీ?

ప్ర. వి: ఓ, వచ్చు; Three angles of a rightangle is equal to two triangles.

ద్వి. వి: నాక్ సెన్సు (nonsense) నీకు జామెట్రీరాదు- వ్యాకరణం రాదు. [వత్తిచెప్పుచు] Three angles of a triangle are equal to two right angles.

ప్ర. వి. ఓహో! ట్రయాంగిల్ (triangle) లో వచ్చిందీ గల్భాఅంత! ఇప్పుడు విను. [ప్రతిపదము ఒత్తి చెప్పుచు] Three angles of a triangle is equal to two right angles.

ద్వి. వి: రైట్ (right). నేను వ్యాకరణ మాత్రలు వొప్పచెబుతాను. అత్తకు ఇత్తు పరంబగు నపుడు—

ప్ర. వి: రాంగ్ (wrong) అత్తునకు.

ది. వి: అత్త గారిఁధికం-అత్తు గారిమ్యం. మీ అత్తను అత్తు అంటావా యేం?

ప్ర. వి: మేనత్తలో అత్తకాదోయ్ ఇది.

ది. వి: కాకపోతే పిల్లనిచ్చిన అత్త. అత్త అత్తుకాదు; ఏం పందెం?—ఇంకొక సూత్రం వొప్ప జెప్పకో—

కొన్ని యెడల మశూచికార్థంబుఁగా భావిఁలో భూతంబు చూపట్టెడి.

ప్ర. వి: మశూచికార్థం కాదురా. తద్ధర్మార్థం.

ద్వి. వి: నా నోట్సులో నేను చెప్పినట్లే వుంది.

రంగా: అబ్బాయీ, భావిలో భూతం కనబడితే భయంపుట్టదూ?

ద్వి. వి: ఒరే! యీయన యెవరో పిల్ల టూకూరో!

ప్ర. వి: ఒరే సర్దారు ఇక్కడ్లో వున్నాడ్రో.

[వెంకటరెడ్డి దగ్గరకు పోయి] ఈవేళ యెంతమంది జైల్లో పడ్డారండి? గాంధీ బైటువున్నాడా? జైల్లో వేశారా?

వెంకటు: బైటే వున్నాడు గాని, ఈమెను కలరా తగిలింది.

ప్ర. వి:
ద్వి. వి: } [అదురుకొని ఒక్కటిగా] ఏంటి, కలారా!

రంగా: ఒణ్-టు-త్రి. (one—two—three.)

[త్రీ చెప్పగానే విద్యార్థులు. "ఓరి బాబో" అంటూ పరుగెత్తినారు. ఒకని చంకలోని పుస్తకములు క్రిందపడును. జవురుకొని పరుగెత్తును.]

Good! they can as well represent India in

the Olymphic running race. [సిగరెట్టు కేసు తెరచి సిగరెట్లు లేకయుండుటను చూచి] సిగరెట్ ప్యాకెట్టు పట్టుకొస్తాను.

కళ్యాణి: నాకుకూడా నొక కిల్లీ పట్టుకరండి.

రంగా: మీరింకా సెల్ఫ హెల్ప్, డిగ్నిటీ ఆఫ్ లేబర్ (self help—dignity of labour) నేర్చుకోవాల. ఫోర్డు వంటి కోటీశ్వరుడు తన బ్యాగ్ తానే తీసుకొని వెళ్ళతాడు. కిల్లీ కొనుక్కోడానికి ఒక మీడియేటర్ (mediator) ఎందుకు? [అని కళ్యాణిరెడ్డి చేయిపట్టుకొని లాగుకొనిపోవును.]

[మోటారు హారన్ వినబడును; ఒక ప్లీడరు ఆయన భార్య ఆ దారిని వత్తురు. ఆయన ఖద్దరు పంట్లాము కోటు వేసుకొని యుండును. ఆమె సిల్కు-చీర కట్టుకొనియుండును.]

భార్య: టై మైందండి. ఇంకకొంచెం ముందుగా కోర్టునుంచి రమ్మంటే వచ్చారుగారు. నేనిప్పుడొక మీటింగులో ప్రెసిడెంటుగా వొప్పుకొన్నాను.

ప్లీడ: ఏమ్మీటింగేంటి?

భార్య: స్త్రీజనోద్ధరణం మీటింగండి. నేనొక పెద్దవ్యాసం వ్రాసుకొచ్చాను.

ప్లీడ: ఏం వ్రాశావు?

భార్య: ఆంధ్రపత్రికలో వస్తే చూస్తురుగాని లెండి. ఇప్పుడు చెబితే స్వారస్యం పోతుంది.

[బిడ్డ యేడ్చును. వెంకటరెడ్డి లాలించును.]

ప్లీడ: ఎవ్వరది? [తిరిగిచూచి] Hallo! goŏd-evenin Mr. Reddy.

భార్య: [కొంచెం ముందుకు వచ్చి] ఆ బిడ్డెవరండి?

వెంకట: [రోగితట్టు చూపించి] పాపం! ఆమెకు కలారా తగిలింది

ప్లీడ: }
భార్య: } [ఒకటిగా] కలరా!

భార్య: ఇక రాండి. మన మీదాశ్నే వెళ్ళవద్దు. కార్ తిప్ప మనండి.— కాసిం, [అంటూ వెళ్లును.]

వెంకట. మీ కారు కొంచెమివ్వండి. ఈ పేషెంటును (patient) సెగ్రిగేషను హౌసుకు (segregation house) తీసుకొని వెళ్ళాలె.

ప్లీడ: [ఆశ్చర్యములో] What? O! No. cholera patient! —new model Buick Sedon- impossible. [వెళ్ళును.]

[ఇంతలో గమళ్ళ వెంకటేసు, ఆతనిభార్య, రెండుసంవత్సరముల బిడ్డ ప్రవేశింతురు. వెంకటేసు దిట్టమైన యెనురు కఱ్ఱకు ఒక కొనన అన్నముమూట, చెంబు, సీసా, ఇంకొక కొనన అరటి పండ్ల చీపు కట్టి భుజముపై పెట్టుకొనియుండును. భార్య చంకబిడ్డను క్రింద దించును.]

వెంకటేసు: ఈ సత్రంలో కూసోని కొంత మెతుకు తేసుకొంటామె. అబ్బబ్బా! ఏంపెజ, ఏంపెజ! ఇశికేస్తే రాలటం లేదు. [కఱ్ఱ దించి పెట్టి క్రిందకూర్చుండును.]

[రోగి బాధపడును. భార్యాభర్తలు ఆమెతట్టు చూతురు. వెంకటరెడ్డి చేతిలోని బిడ్డ యేడ్చును. ఆయన లాలించును]

భార్య: ఆమెకు ఎంజబ్బు పాపం! అట్లా బాధపడుతుండది.

[రంగారావు సిగరెట్టు త్రాగుచు, కళ్యాణరెడ్డి కిళ్ళి నములుచు ప్రవేశింతురు.]

వెంకట: ఈమెకు కలాగ్రి తగిలింది?

వెంకటే: [చివుక్కున అదరిపడి లేచి] ముందుగా చెప్పకూడ దంటయ్యా, మాకాపరం ముంచడానికి చేశావా యీపని? [కత్తి భుజాన పెట్టుకొనును]

భార్య: ఈ బిడ్డకూడా ఆమెదేనా?

వెంకట: అవునమ్మ.

వెంకటే: ఇంక పాలుగాని రావే పెసంగం.

రంగా: అనదర్ రేస్ (Another race.)

భార్య: పాలగ్గామాల యేడుస్తుంది.

వెంకట: మేము లోటాతో తాగిస్తే తాగలేదు.

భార్య: పాపం! నాచేతికిట్టియ్యండి, గుక్కెడు పాలిస్తాను.

రంగా: Ah! Devine Motherhood!

కళ్యాణ: మొరటుతనం.

వెంకటే: నీకేం పిచ్చిపట్టిందా? దెయ్యం పట్టిందా? కుడిచి కూసోని కల్లరతగిలిన మనిషి బిడ్డకు పాలిస్తానంటావేమే? నీకేం చేటుకాలం?

భార్య: వుండవయ్యా, పాపం! పశిబిడ్డ ఏడుస్తుంటేను.

వెంకట: [బిడ్డను అందిచ్చును.]

భార్య: [ఒకతట్టు కూర్చుండి బిడ్డకు పాలిచ్చును]

రంగా: గ్ర్యాండ్, గ్ర్యాండ్, (grand! grand!)

వెంకటే: ఎంత గుండెలు తీసిన ఆడదానివె! మళ్ళీ మనవళ్ళి వూళ్ళోకి రానిస్తారంటె? నువ్వేమి చావాల్నని వుండావంటె?

కళ్యాణ: ఏమంటారు? Instinct of self-preservation!

రంగా: విత్ వెంజన్స్ (with vengeance.)

వెంకటే: ఏం? బెల్లంకొట్టిన రాయిలా ఊరికే కూసోనుండావు పంపున్నాండా? అట్లయితే నువ్వే చావు. నేపోతాను. [తన బిడ్డను చంక పెట్టుకొనును]

రంగా: ఒన్-టూ-త్రీ- (one—two—three.)

భార్య: నా ఊపిరికూడా పోసుకొని నువ్వే నూరేళ్ళు బతుకు.

వెంకటే: నేకేం అంత పనికిమాలినవాణ్ణనుకొన్నావా యేం నీ మతిలో? నీ తప్పేదియ్యా, అట్నే కూసో. నేనూ కూసొంటాను. [బిడ్డను దించి తాను కొంచెము దూరముగా కూర్చుండును.]

కళ్యాణ: ఈ మూరటు ముండాకొడుకు మీకు డిసపాయింట్ మెంట్ (disappointment) కలిగించేలాగుంది.

రంగా: wait and see.

వెంకటు: ఆమెను ఆసుపత్రికి తీసుకొని పోవాలంటే జట్కా వాళ్ళు రాలేరు. మేమిద్దర మున్నాము. బిడ్డ నెత్తుకొని రావడానికి యింకొక్క మనిషి కావాల.

వెంకటే: [వెంకటురెడ్డిగట్టు ఉరిమి చూచును]

భార్య: కల్లర తగిల్నోళ్ళకు ఆసుపత్రిలో మందిస్తారా? ఇస్తే నయమవుతుందియ్యా?

వెంకటు: మందిస్తారు. ఇంజక్షన్ చేస్తారు. తప్పకుండా నయమవుతుంది.

భార్య: అట్లయితే ఆసుపత్రికి తీసుకొని పోండయ్యాపాపం!

వెంకటే: ఈ పట్నవాసాల్లో వాళ్ళ మాటలు గాని, అంకమ్మ తగిలితే ఆసుపత్రిలో బాగవుతుందా? మేకపోతుని మొక్కొండయ్యా.— నీకేం మునిగించిందేమె అపాట్నే కూసోనన్నావు? ఇంతా వచ్చిందానికి అతిర్కం దొరక్కపోయెను. పెసాదంకూడా దొరకనేలేదు. కాళీ ముందుగా పొయ్యి దేవళంలో కూర్చుంటాము రావె. [లేచును]

భార్య: [కోపంతో] పసిబిడ్డకు పాలియ్యవద్దంటావాయేంటి?

వెంకటే: పెసాదమె.

భార్య: [కోపముతో] నీ పెసాదం పెన్నలో గలిసింది. తీర్థం దిగబడ్డది. పాపం! ఆ అమ్మ యెవరో దిక్కులేకుండా పడిపొయ్యింటే వాళ ఆసుపత్తిరికి తీసుకపోతుండాను. మన మేమన్నా రాయికట్టుకోని శిలా శాశిపితంగా వుంటామూ? [వెంకటరెడ్డితట్టు తిరిగి] మీరొకతట్టు ఎత్తుకోండి. మా యింటాయన యింకొకతట్టు ఎత్తుకుంటాడు. బిడ్డను నేను ఎత్తుకోని వస్తాను.

రంగా: That is real worship! Grand!

వెంకట: [ఆనంద పులకితుడై] తల్లీ, దండం పెడ్తున్నాను.

భార్య: మీబోటి గొప్పవాళ్ళు అట్లనవద్దండి. ఇదెంతభాగ్గెం లేండి.

వెంకటే: బయటికొచ్చినప్పుడుగూడా నామీద పెత్తనమేనా? ఈ ఆడోట్లితో యేగేది కనాకష్టం. అయితే కానియ్యండయ్యా.

[వెంకటరెడ్డి వెంకటేసు దుప్పటి ఉయ్యెలగా కట్టి రోగిని దానిలో కూర్చుండబెట్టుచుందురు.]

రంగా: [కళ్యాణ రెడ్డితో] ఈ విలేజర్సు (villagers) కు చదువులేదు. ఆర్టు, పొయిట్రి తెలియదు. అయినప్పటికి హృదయంలో మాత్రిము సింపతి (sympathy) విశేషంగావుంది. గాంధీ టోపీల వాళ్ళుకూడా—— Grand! I feel [మనస్సులో భావ సంఘర్షణము కలిగిన వానివలె అటునిటు తిరుగును.]

[ఉయ్యాలలో మధ్య కఱ్ఱమార్చి ఒకతట్టు వెంకటరెడ్డి యింకొకతట్టు వెంకటేసు ఎత్తుకొందురు. వెంకటేసుభార్య

రోగి బిడ్డనెత్తుకొనును. నరసింహం వెంకటేసు సామానులను తీసుకొని సైకిలుసీటు వెనుకనున్న స్ట్యాండ్ (stand) పై పెట్టి కట్టును. వాళ్ళు బిడ్డను సైకిలుసీటుపైనెక్కించుకొని తాను పట్టుకొని సైకిలు నడిపించును.]

రోగి: [ఉయ్యాల యెత్తుకొన్న వెంటనే] నాయన్లకందరికీ దణ్ణ మయ్యా మీచాలి మోయించుకుంటున్నాను. పాపిష్టురాల్ని. మీయింట్లో కుక్కగానైనా పుట్టి మీ ఋణం తీర్చుంకొంటాను తండ్రి.

రంగా: [గద్గద స్వరముతో, కన్నులనిండ నీళ్ళు క్రమ్ముచుండ] Reddy—I feel—నీ మానవసేవాపరాయణ్యం, ఆ పల్లెటూరి యిల్లా అవ్యాజ కారుణ్యం —నన్ను ముగ్ధుణ్ణి కావించింది. సిగ్గుపరచింది [రోగిని నిర్దేశించి] ఈమె కృతజ్ఞతలో వుండే అవ్యక్తమాధుర్యం నాహృదయాన్ని కరిగించింది. Oh, it is grand.— grander—grandest. Damn my Poetry—damn my art. [వెంకటరెడ్డి వెనుకకువచ్చి భుజము కట్టుకు ఆనించి] ఇప్పుడు నేను కృతార్థుణ్ణి. I feel happy. Hail Congress! Hail! [కదలుదురు]

కళ్యాణి: మా మహన్ని యీదృశ్యం చూస్తే!

[తెరపడును.]

సంపూర్ణము

కవికోకిల గ్రంథావళి

(1) కావ్యసంపుటము:

ఇందు నలజారమ్మ, వనకుమారి, కృషీవలుఁడు, జలదాంగన, యొకస్వప్నము, కడపటివీడ్కోలు, పానశాల అనుకావ్యములు గలవు. రు 2—0—0.

(2) ఖండకావ్యసంపుటము:

ఇందు 1916 మొదలు 1932 వఱకు రామిరెడ్డిగారు రచించిన ఖండకావ్యములన్నియు చేర్పఁబడియున్నవి. నక్షత్రమాల, నైవేద్యము, భగ్నహృదయము, పరిశిష్టము, ప్రథమకవిత్వము అని 5 భాగములుగ విభజింపఁబడియున్నది.

రు 2—0—0.

(3) నాటక సంపుటము:

ఇందు సీతావనవాసము, కుంభరాణా (మీరాబాయి), మాధవ విజయము అను మూడునాటకములును, కాంగ్రెస్‌వాలా అను ఏకాంక నాటకమును చేర్పఁబడియున్నవి.

రు 2—0—0

(4) వ్యాస సంపుటము:

ఇందు రామిరెడ్డిగారు రచించిన సారస్వతవ్యాసములన్నియు గలవు. రు 0—12—0.

విడిప్రతులు

1.	నలజారమ్మ	(కావ్యము)	0—4—0
2,	వనకుమారి	,,	0—12—0
3.	కృషీవలుఁడు	,,	0—6—0
4.	జలదాంగన	,,	0—6—0
5.	పానశాల	,,	0—8—0
6.	నక్షత్రమాల	(ఖండకావ్యములు)	0—12—0
7.	సీతావనవాసము	(నాటకము)	1—2—0

గ్రంథములు దొరకుచోట్లు:

వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండు సన్సు,
ఎస్ప్లనేడు. ఈ, మద్రాసు.

వి వెంకటసుబ్బయ్యా నాయుడు, అండ్ సన్సు,
బుక్కుసెల్లర్స్, చిన్నబజారు, నెల్లూరు

ప్రభాత ముద్రణాలయము,
నెల్లూరు